ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

ANDHRA PRADESH

# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

**గురువారము, ఆగష్టు 13, 2009**

**13 వ శా. స. II స. వాల్యూం -- III నంబరు -- 3**

**శక సంవత్సరము – 1931, శ్రావణం – 22**

**THURSDAY, THE 13th AUGUST, 2009**

13 L.A. II S. VOL-- III No. - 3

*22 - Sravan, 1931 - S.E.*

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు – **500 004.**

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి |
| ఉప సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| కార్యదర్శి | ః | శ్రీ ఎస్. రాజ సదారాం |
| ప్రత్యేక కార్యదర్శి | ః | శ్రీ కె. గోపాలకృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శులు | ః | శ్రీ డి.శివరావు |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ డి. నర్సింహులు<br>శ్రీ పి. సత్యనారాయణ<br>శ్రీ కె. సుభాష్ చంద్రబోసు<br>శ్రీ ఎ. రామిరెడ్డి |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ ఎస్. జయరాం<br>శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ మహ్మద్ జహీరుద్దీన్<br>శ్రీమతి ఎ. సత్య సాయిలక్ష్మి<br>శ్రీ జి. వెంకట కృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీమతి వి. ప్రభ<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీమతి టి. సుశీల |

------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

అధికార నివేదిక

( పదమూడవ శాసనసభ : )

(రెండవ సమావేశము : పదిహేనవరోజు)

గురువారము, ఆగష్టు **13, 2009**

సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది

( గౌ. సభాపతి అధ్యక్షస్థానములో వున్నారు )

----------

విషయ సూచిక

1. సభా కార్యక్రమము

(వాయిదా తీర్మానముల గురించి)

2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు(అనుబంధము -1)

**3.** ప్రభుత్వ బిల్లు

**2009,** ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల (ప్రవేశ క్రమబద్ధీకరణ మరియు క్యాపిటేషను ఫీజు నిషేధ)(సవరణ) బిల్లు (ప్రతిపాదించబడినది)

4. **2009-2010** సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెటు)

2009-2010 సంవత్సరానికి గ్రాంట్ల కొరకు అభ్యర్థనలపై – (ఏడవరోజు ఓటింగు)

అభ్యర్థన నెం. XXVII (27) – వ్యవసాయం

అభ్యర్థన నెం. XXVIII (28) – పశు సంవర్థన, మత్స్యాగారము

అభ్యర్థన నెం. XXX (30) – సహకారం

అభ్యర్థన నెం. XXXVIII (38) – పౌరసరఫరాల నిర్వహణ

(ప్రతిపాదించబడినవి) (అనుబంధము -2)

**5.** లఘు చర్చ

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితితో పాటు విద్యుచ్ఛక్తి సరఫరా గురించి

....

శ్రీ టి. హరీష్ రావు ( సిద్దిపేట): ఈ రోజు కరువు మీద చర్చ వుంది. వాస్తవం ఏమిటి అన్న విషయాలను తమకు చూపేందుకు ఈ విధంగా వున్న పంటలను తీసుకు వచ్చాను. ( ఎండిపోయిన పంటను ప్రదర్శించారు.)

MR.SPEAKER: Harish Rao Garu, it is not proper. If all of you cooperate, we will finish the question hour by 10.00 a.m. and take up the discussion on drought. We will finish the question hour by 10.00 a.m. and take up discussion on drought. Please give it away. It is not proper.

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానముల గురించి

I have received notices of Adjournment Motions.

1. Adjournment Motion given notice of by Smt.Vanga Geetha and others regarding the problems of people due to inadequate facilities and shortage of doctors in Government hospitals is disallowed.
2. Adjournment Motion given notice of by Sri E.Rajender Garu and others regarding the need to declare Telangana district as drought affected and to provide financial assistance to the ryots is disallowed.
3. Adjournment Motion given notice of by Sri G.Mallesh Garu and others regarding lack of staff and permanent buildings for hospitals for BC College going girls is disallowed.
4. Adjournment Motion given notice of by Sri G.Kishan Reddy Garu and others regarding the closure of toddy shops adversely affecting the livelihood of toddy tappers is disallowed.

Let us go into the question hour. After question hour,we will take up discussion on drought.

(అంతరాయం)

శ్రీ ఇ. రాజేందర్ (హుజూరాబాద్): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు వారిచ్చిన స్టేట్మెంట్లో ఈ విషయమ్మై ఒక్క మాట కూడా చెప్పలేదు. ఇది రాజకీయ కరువుగా అంటున్నారు. ఎండిపో తున్న పంటలు మరేవీ మీకు కనపడటం లేదు.

MR.SPEAKER: Please give it away. Please, we have to maintain certain standards. You express yourself in whatever way you want. If all of you cooperate, we will finish the question hour at 10.00 a.m. and then we can take up discussion on drought. Please give them away. It is not proper. Please Rajender Garu, we can understand your concern for the farmers. You have a good debate.

(INTERRUPTIONS)

Let us have a good debate. This is not the way. Let us maintain some standards here. Please hand it over to them.

(అంతరాయం)

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, మొన్న గౌరవ సభ్యులు సి.ఎమ్. గారి దగ్గర నుంచి వారి స్టేట్ మెంట్ విసే వుంటారు అని అనుకుంటున్నాను. ఒక్కసారి తిరగ వేయండి. డ్రౌట్‌కు సంబంధించి సంతవరకూ ప్రభుత్వం తీసుకున్నటువంటి కంటిన్‌జెన్సీ చర్యలే కాకుండా , డ్రౌట్‌గా డిక్లేర్ చేయ డానికి సాంకేతికంగా వున్నటువంటి యిబ్బందులు, అంటే రైతులకు ఋణ సౌకర్యాలు ఆపివేసి నట్లు అవుతుంది, వారు పంట వేసుకున్న తర్వాత ఆ పంటకు ఇన్స్యూరెన్సు రాదు అనేటువంటి ఒక టెక్నికాలిటీ మీద ఆపామనే మాట చెప్పాము. దయచేసి గవర్నమెంటును అర్థం చేసుకోండి. గవర్నమెంటు ఈ విషయమై చాలా సీరియస్‌గా వుంది. మీ అందరికీ ఏ ఆవేదనైతే వుందో,మీ అందరి ఆవేదనా కలిపిన ఆవేదన ఈ ప్రభుత్వానికి వుంది. ఈ విషయమై టేకప్ చేయడంలో ప్రభు త్వానికి అలసత్వం లేదు. క్యాబినెట్ కూడా ఎజెండాను ప్రక్కకు పెట్టి ఇష్యూను టేకప్ చేశామని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఈ రోజు డిస్కషన్ కూడా వుంది. You can give valuable suggestions.

MR.SPEAKER: You give it away to the staff. Then, I will give you an opportunity for you to express. I request you to give that away to the staff. I will give you an opportunity.

(అంతరాయం)

We should follow some rules in the House. I totally agree with your concern for farmers. It is not proper. You have set an example and they (TDPMembers) are coming.

( తెలుగు దేశం సభ్యులందరూ వారి చేతులలో వరి తదితర ఎండిపోయిన పంటలకు సంబంధించిన గడ్డి ని ప్రదర్శిస్తూ సభలోకి వచ్చారు.)

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ : క్వశ్చన్ నెంబర్ 39. హరీష్ రావు గారూ.

శ్రీ టి. హరీష్ రావు : అధ్యక్షా, పెద్దలు రోశయ్య గారు మాట్లాడుతూ , కరువు మీద ముఖ్య మంత్రి గారు స్టేట్‌మెంట్ యిచ్చారని చెప్పారు. అయితే, ప్రభుత్వం రైతులను ఏ విధంగా కాపా డుతుంది , రైతులకు ఒక ఆత్మ స్థైర్యాన్ని కల్పించే విషయం గురించి ఆ స్టేట్‌మెంట్‌లో లేదు సార్. మరి ఈ రోజు రైతులు మొక్క జొన్న, సోయాబీన్, వరి వంటి పంటలను నష్టపోయారు. ఈ పంటలన్నీ ఎండిపోయాయి. ఈ ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి రైతులకు ఈ ప్రభుత్వం నష్ట పరిహారం యిస్తామనే ధైర్యాన్ని యిచ్చినట్లైతే రైతుల ఆత్మహత్యలు ఆగేవి. వారికి ధైర్యం వచ్చి

వుండేది. ముఖ్యంగా ఇప్పటికే తెలంగాణా ప్రాంతంలో 50 మంది రైతులు ఆత్మహత్య చేసుకు న్నారు. వాళ్లకు ఒకొక్కరికీ రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ రైతు కుటుంబాలను ఆదుకోవా లని కోరుతున్నాను.

(తెలుగు దేశం పక్ష సభ్యులు తమ తమ సీట్లలో నిలుచుని ' కరువు కోరల్లో కౌలు రైతు , జలం లేక జనం విలవిల, మేఘమధనంతో ధన వర్షం ' అనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేయసా గారు)

(అంతరాయం )

MR.SPEAKER: Please sit down. With all your cooperation, at 10.00 a.m., we will take up discussion on drought. మీకు మాట్లాడేందుకు అవకాశం యిస్తాను. దయచేసి కూర్చోండి.

(INTERRUPTIONS CONTINUED)

You cannot ask me time like this. When you want to talk in the Assembly, be in your seats and ask. Otherwise, I will not permit you.

(INTERRUPTIONS)

Be in your seats and ask for permission. Then, I will consider. You cannot create pandemonium and ask for time. I will not give time like that. All of you go to your seats and sit down. Ohterwise, I will not give you opportunity.

( గౌరవ సభాపతి గారు వారికి మాట్లాడేందుకు అవకాశం యిస్తామని హామీ యివ్వడంతో తెలుగు దేశం పక్ష సభ్యులంతా వారి వారి స్థానాలలో ఆసీనులయ్యారు. )

ఉ.8.40

MR. SPEAKER: Leader of the Opposition.

శ్రీ నారా చంద్రబాబునాయుడు(కుప్పం): మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను. రాష్ట్రంలో భయంకరమైన కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మనం ఎప్పుడూ చూడని కరువు పరిస్థితులు ఉన్నాయి. ఈనాడు చాలామంది అభిప్రాయం ఏమంటే గత 50 సంవత్సరాల కాలంలో ఇంత పెద్ద కరువు ఎప్పుడూ రాలేదని అభిప్రాయపడుతున్నారు.

(అధికారపక్ష సభ్యులనుండి అంతరాయం)

వారు ఏమైనా చెప్పాలనుకుంటే వారిని చెప్పమనండి, నేను కూర్చుంటాను. అధ్యక్షా, దినానికి 5 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని పిట్టల మాదిరిగా రాలిపోతుంటే మీరు సిగ్గుపడాల్సిందిపోయి ఇక్కడ హౌస్‌లో కూర్చుని మమ్మల్ని ఎగతాళి చేస్తున్నారు. మీరు రాజకీయాలు చేయలేరు. క్రొత్తగా వచ్చిన ఎమ్.ఎల్.ఏ.లకు ముఖ్యమంత్రిగారు చెప్పి

చేయిస్తున్నారు. వారందరికీ దణ్ణంపెట్టి విజ్ఞప్తిచేస్తున్నాను. అనవసరంగా రైతుల జీవితాలతో ఆడుకోవద్దని నమస్కరించి వారిని ప్రార్థిస్తున్నాను. మా నోరు మీరు నొక్కలేరు.

MR. SPEAKER: Please address the Chair. Don't provoke.

శ్రీ నారా చంద్రబాబునాయుడు: ప్రొవోక్‌చేస్తే ఏమి చేయాలి అధ్యక్షా? 50 సంవత్సరాలలో ఎప్పుడూ రాని కరువు వచ్చింది. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పంటలు ఎండిపోయాయి. అంతేకాదు, ఈసారి అసలు పంటలు వేసుకునే ఆశలు కూడా వదులుకున్నారు. దానిపైన మీరు చూస్తే.................

MR. SPEAKER: What is that we have to do now? What is your request?

శ్రీ నారా చంద్రబాబునాయుడు: దీనికంటే ముఖ్యమైన బిజినెస్ ఈ హౌస్‌కు లేదు. ఏ బిజినెస్ లేకుండా దీనిని టేకప్ చేయాలి. అసెంబ్లి ప్రారంభమైనప్పటినుండి మేము అడుగుతూనే వచ్చాము. ముఖ్యమంత్రిగారి ఒకటిన్నరకు ఆకలి వేస్తుంది. నేను ఒకటే మిమ్మల్ని అడుగుతున్నాను.

MR. SPEAKER: Again you are provoking. Don't go into provocation. I have given you an opportunity. Please express as to what exactly you want.

శ్రీ నారా చంద్రబాబునాయుడు: అదే ఎక్స్‌ప్లైన్ చేస్తున్నాను అధ్యక్షా, చెప్పనీయండి. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

MR. SPEAKER: What should we do now?

శ్రీ నారా చంద్రబాబునాయుడు: చెప్పనీయండి అధ్యక్షా. డీవియేషన్స్ ఉంటే చెప్పండి, ఏది కావాలంటే అది చేయండి. రైతులు వర్షాలపైన ఆశలు వదులుకున్నారు. వారు తెచ్చుకున్న విత్తనాలను వెనక్కు ఇచ్చి ఆ డబ్బుతో పురుగులమందులుకొని త్రాగి చనిపోతున్నారు. పశువులు గడ్డిలేకుండా చనిపోతున్నాయి.

MR. SPEAKER: Chandrababu Naidugaru, it is not proper.

శ్రీ నారా చంద్రబాబునాయుడు: త్రాగటానికి మంచినీరు లేవు. ఈనాడు పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. నేను మిమ్మల్ని కోరేది ఒకటే ఈరోజు రూల్స్ అన్నీ ప్రక్కనపెట్టండి. రైతులకు, ప్రజలకు రూల్స్ అవసరం లేదు. వారు కష్టాలలో ఉన్నారు కాబట్టి రూల్స్ అన్నీ ప్రక్కనపెట్టి తక్షణమే కరువుపైన చర్చించవలసినదిగా నేను డిమాండ్ చేస్తున్నాను. రాష్ట్రం అంతా నార్మల్‌గా ఉన్నట్లు

మనం క్వశ్చన్ అవర్‌లో ఆనందంగా ఇక్కడ కూర్చుని మాట్లాడటం సరి కాదు. చాలా సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే రైతులు మనమీద తిరగబడే పరిస్థితి వస్తుంది. ప్రజలే తిరుగబడే పరిస్థితి వస్తుంది. ఆ పరిస్థితి రానీయవద్దని నేను మిమ్మల్ని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: డ్రౌట్‌పైన చర్చ నిన్ననే మొదలుకావలసి ఉంది. మొన్నటినుండి నిన్నటికి వచ్చింది. నిన్నటికి వచ్చేసరికి I think we had 20 or 25 minutes of time. I requested the Telugu Desam to start. ఆ మెంబర్ నావద్దకు వచ్చి టైమ్ సరిపోదు, రేపు స్టార్ట్ చేస్తాము, any other Business తీసుకోమంటే we had a Statement on Swine Flu Virus. దానిని తీసుకున్నాము. యాక్చ్యువల్‌గా నిన్న మధ్యాహ్నమే దీనిపై చర్చ మొదలుకావలసి ఉంది. With all your permission, we will take it up at 10'0 clock.

శ్రీ కె. రోశయ్య: అధ్యక్షా, తమరు హౌస్‌లోకి రాగానే చెప్పారు. For the sake of the Members, I want to reiterate the same. తమరు చెప్పిన మాట ఏమంటే క్వశ్చన్ అవర్ కంప్లీట్ చేసి 10 గంటలకు డ్రౌట్‌మీద డిస్కషన్ తీసుకుందామని చెప్పారు. వారు బయట ఉన్నారు కాబట్టి బహుశా వారు వినలేదేమో! నేను ఒకటే మనవిచేస్తున్నాను. డ్రౌట్‌మీద ప్రభుత్వానికి సీరియస్‌నెస్ లేదనే అపోహ కల్పించటానికి ప్రయత్నించవద్దు.

శ్రీ కె. దయాకరరెడ్డి: అధ్యక్షా,.................(అంతరాయం)

శ్రీ జి. కిషన్‌రెడ్డి: మంత్రిగారూ, మిమ్మల్ని ఏమీ అనలేదు, కొనసాగించండి.

శ్రీ కె. రోశయ్య: ఏమన్నా పడటానికి తయారుగా వచ్చాము. మొన్న కేబినెట్ సమావేశంలో ఎజెండాను ప్రక్కనపెట్టి ఈ విషయంపై డిస్కస్ చేసిన మాట వాస్తవం. ఛీఫ్ మినిస్టర్‌గారు సుదీర్ఘమైన స్టేట్‌మెంట్ ఇస్తూ డ్రౌట్ సిట్యుయేషన్ అంతా ఎక్స్‌ప్లైన్ చేశారు. అంతటితో వదలకుండా ఈరోజు డిస్కషన్ పెట్టారు. మీరు కూడా చెప్పారు, నిన్ననే డిస్కషన్ జరగవలసినది ఈ రోజు టేకప్ చేస్తున్నామని చెప్పారు. నేను ఆ డీటైల్స్‌లోకి వెళ్లదలచుకోలేదు. సర్, నేను ఒక్కటే మనవిచేస్తున్నాను. గవర్నమెంట్ నిద్రావస్థలో ఉండి అసలు వ్యవసాయమే దండగ అనే ప్రభుత్వం ఉంటే మీరు నిద్ర లేపాలి. ప్రభుత్వం మీకంటే ఎలర్ట్‌గా ఉన్నది. వ్యవసాయం అవసరమనే ఉద్దేశ్యంతో వ్యవసాయదారులను ఆదుకోవటానికి ఈ ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం ఇటీవల కాలంలో అనూహ్యమైన చర్యలు తీసుకున్నారు. మన రాష్ట్రానికి ఋణమాఫీక్రింద కేంద్రప్రభుత్వంనుండి రూ.1150 కోట్లు వచ్చింది. రెగ్యులర్‌గా పే చేసినవార్ ఒక్కొక్కరికి అయిదువేలు చొప్పున రూ.1851 కోట్లు ఇచ్చాము. వారి ధర్మం చూడండి. చంద్రబాబునాయుడు గారు ప్రతిపక్ష నాయకుని హోదాలో సభా కార్యక్రమాలను ప్రక్కనపెట్టి మాట్లాడారు. శాసనసభా వ్యవహారాలమంత్రిగా సభలో నేను మాట్లాడటానికి అవకాశం లేదు. ఇదెక్కడి ధర్మమో నాకు అర్థంకావటంలేదు. వారు మాట్లాడినప్పుడు విన్నాము. నేను ఒక్కటే మనవిచేస్తున్నాను. సభను నిబంధనల ప్రకారం నడుపుకుందాము. వారికి తెలియంది కాదు. అయినప్పటికీ మీ దృష్టికి తీసుకురావటానికి ప్రయత్ని

స్తున్నాను. రూల్ 316 (15) క్రింద "Shall not normally leave the House immediately after delivering his Speech." దానిపైన, అనగా 316 (15) రూల్ చూస్తే "shall not display flags, emblems or any exhibits in the House without the permission of the Speaker."

శ్రీ ఎమ్. నర్సింహులు: ఉరితాళ్లు తీసుకురావచ్చా?

శ్రీ కె. రోశయ్య: మీరు పర్మిషన్ ఇచ్చారా చెప్పండి.

MR. SPEAKER: My request is క్వశ్చన్ అవర్ 9.30కి క్లోజ్‌చేసి డ్రాట్‌పైన షార్ట్ డిస్కషన్ స్టార్ట్ చేద్దాము. 9.30 వరకు ఎన్ని క్వశ్చన్స్ అయితే అన్నింటివరకు పూర్తిచేసి 9.30 నుండి షార్ట్ డిస్కషన్ స్టార్ట్ చేద్దాము.

శ్రీ జి. కిషన్‌రెడ్డి(అంబర్‌పేట): వాయిదా తీర్మానంపై మా అభిప్రాయం కూడా చెప్పనీయండి.

మిస్టర్ స్పీకర్: వాయిదా తీర్మానంపై అభిప్రాయాలు అడగలేదు. Let us leave it here. Let us go to the regular Business. Kishan Reddy Garu, you are a positive person who wants the House to function properly. Let us not waste the time of the House. Let us go into the Question Hour. With all your permission, I will close the Question Hour at 9.30 a.m. and start Short Discussion immediately after the Question Hour.

శ్రీ నారా చంద్రబాబునాయుడు: అధ్యక్షా, ఇప్పుడు రోశయ్యగారు మాట్లాడుతూ వారికి సీరియస్‌నెస్ ఉందని చెప్పారు. 50 సంవత్సరాల్లో రాని కరువు వచ్చింది కాబట్టి మిత్రులు ఎడ్‌జర్న్‌మెంట్ మోషన్‌క్రింద టేకప్ చేయమని అడిగారు. దీనికంటే భయంకరమైన, అత్యవసరమైన సమయం ఏదైనా రాష్ట్రంలో ఉన్నదా? 50 సంవత్సరాల కాలంలో రాష్ట్ర చరిత్రలో ఇంత అత్యవసరమైన పరిస్థితి వచ్చిందా? ఆవిధంగా వచ్చినప్పుడు దీనిపై మీకు ఒక సీరియస్‌నెస్ ఉండాలి. సీరియస్‌నెస్ లేకపోతే ప్రజలు అపార్థం చేసుకుంటారు, రైతులు అపార్థం చేసుకుంటారు. రోశయ్యగారు ఒక మాట అన్నారు, ఎగ్జిబిట్స్ తెచ్చామని అన్నారు. రోశయ్యగారూ, మర్చిపోవద్దు. రైతుల కోసం ఇవన్నీ తీసుకువచ్చాము. మీరు ఉరితాళ్లు తీసుకువచ్చి ఈ సభలోనే ఉరి వేసుకుంటామని అన్నారు. అది మీరు గుర్తుచేసుకోవాలి. అటువంటివారిని మంత్రిగా చేశారు.

MR. SPEAKER: Don't waste time of the House. Now, Question Number 131, Minister for Health and Family Welfare.

**ఉ.8.50**

మిస్టర్ స్పీకర్: నౌ లెటజ్ గో టు క్వశ్చనవర్...... క్వశ్చన్ నెంబర్39, మినిస్టర్ ఫార్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్.......

(తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం )

MR.SPEAKER: Please take your seats. We will finish the question hour by 9.30 a.m. Out of sheer respect towards the Leader of the Opposition, I have given an opportunity. There is no Adjournment Motion also. Out of sheer respect towards the Leader of the Opposition I have given an opportunity to express himself and he has expressed. At 9.30 a.m., I will close the question hour. Now, let us not waste the time of the House. Please take your seats. Now, let us take up the question hour. Question No.131.

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

## సాలూరు నియోజకవర్గంలోని మాంఫ్కండ పుట్టిలో పి.హెచ్.సి.

ప్రశ్న నెం.131 (39)

శ్రీ పీడిక రాజన్న దొర (సాలూరు)– గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబసంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ. విజయనగరం జిల్లా, సాలూరు నియోజకవర్గం, మక్కువ మండలంలోని మార్కొండపుట్టి, దుగ్గేరు గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనా?

ఆ. అయితే ఆ గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

ఇ. అయితే ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

**ఆరోగ్య,వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి(శ్రీ దానం నాగేందర్) :**

అ. లేదండీ. సంబార ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్రింద మార్కొండపుట్టి, దుగ్గేరు గ్రామాలు రెండు ఉప కేంద్రాలుగా ఉన్నాయి. వీటిలో కనీస ఆరోగ్యసేవలను కల్పిండమవుతున్నది

ఆ. విజయనగరం జిల్లా మక్కువ మండలం, దుగ్గేరు గ్రామం వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయడం కోసంప్రతిపాదన అందినది.

ఇ. ప్రతి పాదన పరిశీలనలో ఉన్నది.

శ్రీ పీడిక రాజన్న దొర: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రివర్యులు నిన్నా మొన్నా గిరిజనులను ఆదుకొని వారి ప్రాణాలను కాపాడాలని వైద్యాధికారులను ఆదేశించిన విషయం మీ అందరికీ తెలుసు. అంటే గిరిజనుల పరిస్థితి ఎలా ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి తరుణంలో మంంతివర్యులు ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెబుతుంబటే అధికారులు మంత్రివర్యులకు సరియైన సమాచారాన్నివ్వడం లేదని స్పష్టమవుతున్నది. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు వింత జ్వరాలు, విషజ్వరాలతో బాధపడుతూ పెద్ద సంఖ్యలో

మరణిస్తున్నారు. నేను ఎప్పటికప్పుడు వైద్యాధికారులకు తెలియజేస్తున్నాను. గిరిజన ప్రాంతాలలోని పరమ, సోర, సిరియా, కొత్తచింతమాను అనే గిరిజన గ్రామాలలో సుమారు వంద మంది ఈ విష జ్వరాలతో చనిపోయారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి, హైదరాబాదు నుంచి టీమ్స్ వెళ్లి పరిశీలన చేశారు. ఇటువంటి తరుణంలో ఈ దుగ్గేరు అనే ప్రాంతం అటు పార్వతీపురం మండలానికి, ఇటు సాలూరు మండలానికి మధ్యన వుండే మక్కువ మండలానికి చెందిన ప్రాంతాలలో ఎక్కువ గిరిజనులు నివశిస్తుంటారు. గత మూడు సంవత్సరాల నుంచి ఇక్కడ వైద్య సదుపాయాలకోసం నేను ఆరోగ్య శాఖ డైరెక్టర్‌కు కూడా అర్జీ సమర్పించాను. మూడు సంవత్సరాల నుంచి ఈ ప్రతిపాదన పరిశీలనలో వుందని చెప్పడం విచారకరం . ఈ దుగ్గేరు ప్రాంతానికి సంబర ప్రాంతానికి, మార్కొండపుట్టి, ఈ పిహెచ్‌సి లకు పది కిలోమీటర్లు నడచి వెళ్లాలి, ఎలాంటి రవాణా సౌకర్యం లేదు . ఇవి కొండల మీద వున్నాయి. అక్కడ నుంచి పేషంటును తీసుకరావడానికి కనీసం ఐదు గంటలు పడుతుంది. ఈ దుగ్గేరు ప్రాంతంలో ప్రతి గురువారం వారపు సంత జరుగుతుంది, 60 నుంచి 70 మంది గిరిజనులు ఆ సంతకు వస్తారు. సంతకు వచ్చి కావలసిన సరుకులతోబాటు అక్కడ పిహెచ్‌సి కూడా ఉన్నట్లయితే వైద్య సదుపాయం పొందడానికి అవకాశం వుంటుంది. సాధారణంగా గిరిజనులు మూఢనమ్మకాల వల్ల వైద్యుల దగ్గరకు వెళ్లరు. అటువంటి పరిస్థితుల్లో ఎక్కడో పది కిలోమీటర్ల దూరంలో వున్న పిహెచ్‌సి కి వాళ్లు వెళ్లడం కష్టంగా వుంటుంది. అందుకే వారపు సంత జరిగే ఈ దుగ్గేరులో పిహెచ్‌సి ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

శ్రీ టి. బాలరాజు (పోలవరం): అధ్యక్షా, పోలవరం నియోజకవర్గంలో మూడు గిరిజన మండలాలకు వైద్య సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు 2005 లో మూడు పిహెచ్‌సిలను మంజూరు చేశారు. ఆ మూడు కూడా గిరిజన గ్రామాలలోని కాలనీలలో నడుపుతున్నారు. వాటికి సరైన భవన వసతులు లేనందువల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి వాటి భవన నిర్మాణాల విషయం పెండింగులో వుంది. కాబట్టి గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు గాను ఆ మూడు పిహెచ్‌సి లకు భవనాల నిర్మాణం మంజూరు చేయాలని కోరుతున్నాను.

శ్రీ డి. నాగేందర్ : సార్, సంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండు ఉపకేంద్రాలు కూడా వున్నాయి. అవి మార్కొండ కుట్టి మరియు దుగ్గేరు . అక్కడ వున్న ప్రజలకు ఈ ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలను అందించడమవుతోంది. మార్కొండకుట్టి ఉపకేంద్రం జనాభా ఆరువేలు, దుగ్గేరు ఉపకేంద్రం జనాభా 2700 . మామూలుగా కేంద్ర ప్రభుత్వ నార్మ్స్ ప్రకారం మైదాన ప్రాంతాలలో 30 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుండాలి. గిరిజన ప్రాంతాలలో 20వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుండాలి. దానికి అనుగుణంగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రజలకు వైద్య సేవలను అందంచాలనే దృఢ సంకల్పంతో తగిన చర్యలు తీసుకుంటోంది. నేను మంత్రిగా పదవి చేపట్టిన తర్వాత అక్కడ వున్న ఆరోగ్య కేంద్రాలను సందర్శించడం జరిగింది. నాగం జనార్థన్‌రెడ్డిగారు నన్ను మున్నాభాయ్ అన్నారు కాబట్టి నేను ఆయన్ను సర్క్యూట్ అని అంటున్నాను. ఆయన అప్పుడు మంత్రిగా పని చేసినప్పుడు చాలా పని చేశారని అక్కడి వాళ్లు చెప్పడం జరిగింది. గిరిజన ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే దృఢసంకల్పంతో పిహెచ్‌సి లు గానీ, సిహెచ్‌సి లుగానీ అప్‌గ్రేడ్ చేయడానికి శాసనసభ్యుల నుంచి, పార్లమెంటు సభ్యులనుంచి గానీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు రావడం జరిగింది. వాటిని దృష్టిలో పెట్టుకుని ఆయా కేంద్రాలలో మందులను, డాక్టర్లను అందుబాటులో పెట్టడం జరిగింది. అదే విధంగా గౌరవ సభ్యులు నాగం జనార్థన్‌రెడ్డిగారు నిన్న మాట్లాడుతూ కొన్ని విషయాలు చెప్పడం జరిగింది. అప్పుడు నా ఇయర్ ఫోన్

ప్రాపర్‌గా లేదు, ఆయన రెండు విషయాలు చెప్పారు. ఈరోజు పత్రికలలో వచ్చింది కాబట్టి క్లారిఫై చేస్తున్నాను. ఆయన కిట్స్ అన్నారు, నాకేమో కిడ్స్ అని వినపడింది. నేను ఈరోజు పొద్దున్నే ఈ ఇయర్ ఫోన్స్ గురించి కంప్లెయింట్ చేశాను. ఆయన సీనియర్ మెంబర్‌గా, ఒక డాక్టర్‌గా మంచి సలహాలు ఇచ్చి వుంటే బాగుండేది. కానీ నన్ను ఆయన మున్నాభాయ్‌గా సంబోధించారు. మావాళ్లేమో ఆయన నెల్లూరు కాంతారావులాగా కనబడుతున్నాడని అన్నారు. కానీ నేనేమో సర్క్యూట్ అని చెప్పాను. కాబట్టి అలా కామెంట్ చేయకుండా ఒక సీనియర్ డాక్టర్‌గా, ఒక సీనియర్ మెంబర్‌గా మంచి సలహాలు ఇవ్వాలని కోరుతున్నాను. ఏవైనా తప్పులు చేస్తే సవరించుకోవడానికి అవకాశం ఇవ్వమని కోరుతున్నాను. సీనియర్ మెంబర్‌గా ఆయన సలహాలు ఇచ్చినట్లయితే, వాటిని పాటించడానికి మేము సిద్ధంగా వుంటాం . మేము ఏదైనా మంచి పని చేస్తే అప్రిసియేట్ చేయమని కోరుతున్నాం, కానీ అప్రిసియేట్ చేసే అలవాటు ఆయనకు లేదు కాబట్టి we don't expect any appreciation from him also. But at least, మేము మంచి పని చేస్తే మంచి పని చేశారని చెప్పడానికి ప్రయత్నం చేయమని తమరి ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ జి.ముద్దుకృష్ణమ నాయుడు(నగరి): సార్, మొదటిరోజున తమరి అధ్యక్షతన జరిగిన బిఏసిలోనే రాష్ట్రంలోని 22 జిల్లాలలోనూ కరువు పరిస్థితులు చాలా ఎక్కువగా ఉన్నాయని, ప్రజలకు త్రాగడానికి నీరు, రైతులకు సాగు నీరు లేని పరిస్థితులున్నందున కరువుపై చర్చించాల్సిన అవసరముందని చెప్పాము. అట్లాగే మా పార్టీ తరఫున రెండు సార్లు అడ్జర్న్‌మెంట్ మోషన్ కూడా ఇచ్చాము. అదేవిధంగా మిగతా ప్రతిపక్ష పార్టీలు కూడా అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇవ్వడం జరిగింది. మా జనార్థన రెడ్డి గారు కూడా మేము లేనప్పుడు మీరు మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు సమావేశాలు జరిపారు కాబట్టి మీరు మధ్యాహ్నం ఒకటిన్నరకే సమావేశం ముగించకుండా కరువుపై చర్చ చేపట్టమని కూడా గతంలోనే కోరడం జరిగింది. ఈ రోజున రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులున్నాయి. గత 50 సంవత్సరాలలో ఎన్నడూ రానంత తీవ్రమైన పరిస్థితులున్నాయి కాబట్టి కరువు సమస్య ప్రాధాన్యతను బట్టి వెంటనే చర్చించాల్సిన అవసరముంది. కాని మీరేమో తొమ్మిదిన్నరకల్లా క్వశ్చనవర్‌ను పూర్తి చేసి కరువు పై చర్చను చేపడతామంటున్నారు. తొమ్మిదిన్నర కావడానికి ఇంకా అరగంట సమయముంది. ఈ అరగంటలో క్వ శ్చన్స్ అన్నీ పూర్తి చేసుకోవడం కష్టం. కనుకు మీరు మిగతా క్వశ్చన్స్ అన్నీ ఇంకొక రోజుకు పోస్ట్‌పోన్ చేసి కరువు సమస్య ప్రాధాన్యతను బట్టి తొమ్మిది గంటలకే కరువు సమస్యపై చర్చించాల్సిన అవనసరమున్నది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో కరువు పరిస్థితులున్నాయి కాబట్టి దీనిపై వెంటనే చర్చను చేపట్టి మనం రోజంతా చర్చించుకుందాము. ప్రభుత్వానికి భోజనం ఖర్చు కూడా వద్దు. సభ్యులు ఎవరి ఏర్పాట్లు వారే చేసుకుంటారు. ఇంతకంటే మించిన సమస్య ఈ రాష్ట్రంలో లేదు కాబట్టి వెంటనే దీనిపై చర్చిద్దామన్నా తమరు వినటం లేదు కాబట్టి దీనికి మేము నిరసన తెలుపుతూ కూర్చుంటున్నాము.(అని కూర్చున్నారు )

ఉ.9.00

## ప్రతీ మండలంలో న్యాయస్థానాల ఏర్పాటు

ప్రశ్న నెం . 545(132)

డాక్టర్ యన్ .జయప్రకాశ్ నారాయణ(కూకట్‌పల్లి) – గౌరవనీయులైన న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణ సంస్థల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) 2009, గ్రామ న్యాయస్థానాల చట్టాన్ని అమలు చేయడం కోసం ప్రభుత్వం ప్రతి మండలానికి కనీసం ఒక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసిందా?

ఆ) అయితే, ప్రభుత్వం ఈ విషయంలో గౌరవ హైకోర్టును సంప్రదించిందా?

ఇ) ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

**న్యాయ, కోర్టులు, సాంకేతిక విద్య, పారిశ్రామిక శిక్షణ సంస్థల శాఖ మంత్రి ( శ్రీ మోపిదేవి వెంకటరమణారావు):**

అ) పార్లమెంటు, 2008 గ్రామ న్యాయాలయాల చట్టాన్ని మాత్రమే చేసింది. పార్లమెంటు 2009 గ్రామ న్యాయస్థానాల చట్టాన్ని చేయలేదు. ఇప్పటి వరకు 2008 గ్రామ న్యాయాలయాల చట్టాన్ని ప్రభుత్వ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులోకి తీసుకరాలేదు. గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో సంప్రదించి రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడమవుతున్నది.

ఆ) అవునండీ.

ఇ) ప్రభుత్వం, గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సంప్రదించి మండల స్థాయిలో రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయడం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నది.

డాక్టర్ యన్. జయప్రకాశ్‌నారాయణ్ : అధ్యక్షా, సామాన్యుడికి సకాలంలో న్యాయం అందడం ప్రజాస్వామ్య కనీస లక్షణం . ఈవేళ పొరపాటున ఒక సివిల్ కేసులో, ఒక దావాలో కోర్టుకు వెళితే అదృష్టవశాత్తు బతికి వుండగానే కోర్టు తీర్పు వస్తే ఓడినవాడు కోర్టులో ఏడుస్తున్నాడు, గెలిచిన వాడు ఇంటికెళ్లి ఏడుస్తున్నాడు. చాలామంది తుపాకులు పట్టుకుని అడవుల్లోకి పోవడానికి కారణం ఈ సమాజంలో న్యాయం జరుగుతుందనే నమ్మకం లేకపోవడమే. మన రాష్ట్రంలో ఈరోజు పది లక్షల కేసులు ....

MR. SPEAKER : I request you to be little bit restraint when we are talking about courts. Let us not......

డాక్టర్ యన్. జయప్రకాశ్ నారాయణ్ : అధ్యక్షా, నేను కోర్టులు చెప్పిన మాటల్నే చెబుతున్నాను. సుప్రీంకోర్టు న్యాయమూర్తి చెప్పిన మాటల్నే నేను మాట్లాడుతున్నాను. ఏ సమయంలో కూడా నేను కోర్టుల గౌరవాన్ని, సభా గౌరవాన్ని కించపరచను.

MR. SPEAKER : As it is another institution, we should not talk ill of it.

డాక్టర్ యన్. జయప్రకాశ్‌నారాయణ : ఇది కోర్టుల తప్పు కాదు. ఈరోజు మన రాష్ట్రంలో పది లక్షల కేసులు క్రింది కోర్టులలో పెండింగులో వున్నాయి. హైకోర్టులో 1.70 లక్షల కేసులు పెండింగులో వున్నాయి. దేశంలో మూడు కోట్ల కేసులు పెండింగులో వున్నాయి. అందుకే ఇది కీలకమైన అంశం . లక్షలాది మంది కోర్టులకు వెళ్లే సాహసం చేయడం లేదు. జీవితమంతా కష్టపడి పొదుపు చేసిన డబ్బుతో ఇళ్లు కట్టుకుని అద్దెకు ఇస్తే, రిటైర్ అయిన తర్వాత, చనిపోయేదాకా కూడా అద్దెకున్న వ్యక్తి ఆ ఇంటిని ఖాళీ చేయకపోతే కన్నీళ్లతో చనిపోయిన వాళ్లు ఈ రాష్ట్రంలో వేలమంది వున్నారు. ఆస్తి తగాదాలు, భూముల కబ్జాలు, అప్పు ఇస్తే తిరిగి ముట్టకపోవడం, కాలేజీలలో ర్యాగింగ్ జరిగినా, ఈవ్ టీజింగ్ జరిగినపుడు కోర్టులకు వెళితే సకాలంలో న్యాయం అందే పరిస్థితి లేదు కాబట్టి జరిగిన అన్యాయాన్ని, బాధను దిగమింగుకుని మౌనంగా రోదించేవాళ్లు కోకొల్లలున్నారు. అందుకే చాలామంది కండబలంతో బండ న్యాయాన్ని ఆశ్రయిస్తున్నారు. గూండాలకు గిరాకీ

పెరుగుతోంది. మనలో చాలామంది శాసనసభ్యులు కూడా, ఏదైనా కేసు మన దృష్టికి వస్తే కోర్టులో న్యాయం అందే సమయం వుండదు కాబట్టి ఒక పోలీసు ఆఫీసరుకు ఫోను చేసి – అయ్యా, దీన్ని చూడండి, చట్టం మీకు అధికారం ఇవ్వకపోయినా మీరు చూడండని పైరవీలు చేస్తున్నాం . ఈ సభలో అలా పైరవీలు చేయని వాళ్లు చాలా కొద్దిమంది మాత్రమే వుంటారు, నాతో సహా . పదేళ్ల కాలం పోరాటం చేశాక, ఉద్యమాలు చేసి లోక్‌సత్తా ఈ గ్రామ న్యాయాలయ చట్టాన్ని సాధించింది. ఈ చట్టం ప్రపంచంలో చాలా దేశాలలో, గతంలో మన దేశంలో వున్న రీతిన, సులభ పద్ధతిలో సకాలంలో న్యాయం అందించడం కోసం, Small Claims Courts అంటాం, వీటిని ఏర్పాటు చేయడం కోసం వచ్చింది. మంత్రిగారికి అధికారులు చెప్పారేమో ఇది 2008 చట్టమని అన్నారు. అయ్యా, ఇది 07-01 -2009 నాడు రాష్ట్రపతి ఆమోదం పొందింది , 22.12.2008 న లోక్‌సభ ఆమోదం పొందింది, రాజ్యసభ ఆమోదం పొందింది 17.12.2008 నాడు. ఏ చట్టమైనా రాష్ట్రపతి ఆమోదం పొందిన నాడే చట్టం అవుతుంది. అప్పటి వరకు అది బిల్లే . అందుచేత ఇది 2009 చట్టం . సాంకేతిక అంశం కాదు, ఇటువంటి విషయాలలో ఇలాంటి సమాధానాలు చెప్పొద్దు . ఒక కోర్టులో న్యాయం అందడానికి సింగపూర్‌లో 35 రోజులు పడుతుంది, నార్వేలో 90 రోజులు, జపానులో 60 రోజులు పడుతుంది, ఇక మన దేశంలో చెప్పనక్కర్లేదు. సామాన్యులకు ఖర్చు వల్ల, దూరప్రాంతాలకు వెళ్లాల్సిరావడం వల్ల, ఇంగ్లీష్ భాష వల్ల, పద్ధతులు చాలా గందరగోళంగా వుండడం వల్ల, కోర్టుకు వెళితే అబద్ధాలు చాలా అలవోకగా చెప్పడం వల్ల, ఇంటిలో నిజం చెప్పేవాడు, ఊర్లో నిజం చెప్పేవాడు కోర్టుకెళితే అబద్ధాలు చెప్పడం అలవాటైపోయింది కాబట్టి ఆవిధంగా అబద్ధాలు చెప్పడం వల్ల న్యాయ వ్యవస్థపై నమ్మకం పోవడంతో కోర్టులకు వెళ్లడం లేదు. 2009, గ్రామ న్యాయస్థానాల చట్టాన్ని అమలుచేస్తూ, ప్రతి మండలానికి కనీసం ఒక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయడం వల్ల మన రాష్ట్రానికి అన్ని రాష్ట్రాల కంటె ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. కాబట్టి ప్రతి మండలానికి ఒక న్యాయస్థానం ఏర్పాటు చేస్తారా? సులభ పద్ధతుల్లో, మన తెలుగు భాషలో, అవసరమైన చోట ఉర్దూ భాషలో కోర్టు ప్రొసీడింగ్స్ నిర్వహించవచ్చు. అదేవిధంగా అవసరం వున్న చోట అడ్వకేట్స్ వుండవచ్చు, దీంట్లో రాజకీయ ప్రమేయం లేదు, పక్షపాతం లేదు. పూర్తిగా నిష్పక్షపాతంగా హైకోర్టు ఆధీనంలో నడుస్తాయి. అవసరమైన చోట అడ్వకేట్స్ ప్రమేయం వుండవచ్చు. ఒక అప్పీలు వుండవచ్చు. అన్ని రకాలుగా మంచి చట్టం ఇది. రెండేళ్ల క్రిమినల్ శిక్షగానీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన సివిల్ జురిస్‌డిక్షన్ గానీ దీనికి వుంటాయి. వెంటనే ఈ చట్టాన్ని అమలు చేయడానికి ఏర్పాట్లు చేయండి. కేంద్రప్రభుత్వం దీనికోసం మూడేళ్లనుంచి నిధులు ఇవ్వడానికి సిద్ధంగా వుంది. నా నిర్ధిష్టమైన ప్రశ్నలు ఏమంటే : ఒకటి – సెక్షన్-40 క్రింద రాష్ట్ర ప్రభుత్వం రూల్స్ ఫ్రేమ్ చేయాలి, ఇప్పటి వరకు చేశారా, చేయకుంటే ఎప్పుడు చేస్తారు? రెండు – సెక్షన్ -39 క్రింద హైకోర్టు రూల్స్ ఫ్రేమ్ చేయాలి కొన్ని నిర్ధిష్టమైన విషయాలలో . ఆమేరకు మీరు హైకోర్టును కోరారా? మూడు – భారత ప్రభుత్వాన్ని నిధులు కోరారా? నాలుగు – ఫస్ట్ షెడ్యూల్, సెకండ్ షెడ్యూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రిమినల్, సివిల్ జురిస్‌డిక్షన్‌ను నిర్ధేశించాలి, దాన్ని నిర్ధేశించారా? ఐదు – మండల కోర్టులు, పోలీసు స్టేషన్ల జురిస్‌డిక్షన్స్‌కు సంబంధించి ఒకే జురిష్‌డిక్షన్ వుండేటట్లు ఏర్పాటు చేస్తున్నారా? ఆరు– ఎప్పటి వరకు మీరు వీటిని ఏర్పాటు చేస్తారు? నిర్ధిష్టంగా సమాధానాలు చెప్పండి. 2008-09 అంటూ సాంకేతికతను చూపి తప్పించుకోమాకండి.

శ్రీమతి ఎ. ఉమామాధవరెడ్డి (భోన్‌గిర్): అధ్యక్షా, భువనగిరి డివిజనులో కోర్టులో జడ్జి ఒక్కరే ఉండడం వల్ల కేసులన్నీ పెండింగులో వుంటున్నాయి. అంతేగాకుండా భువనగిరి ఇప్పుడు పార్లమెంటు నియోజకవర్గం కూడా అయింది. భువనగిరి నియోజకవర్గం అదే విధంగా ఆలేరు నియోజవర్గంలోగల తుర్కపల్లి మరియు రాజపేట మండలాలను స్కీమా క్రింద తీసుకొచ్చారు. తుర్కపల్లి, రాజపేట మండలాలు

ఇప్పుడు హైమా క్రిందకు వచ్చిన తర్వాత అక్కడి భూముల విలువ పెరిగింది. భువనగిరి కోర్టులో పది లక్షల వ్యాల్యూ వరకే కేసులు తీసుకోవడం జరుగుతోంది. మిగిలిన కేసులన్నీ నల్గొండకు పోవాలి. తుర్కపల్లి, రాజపేటలకు భువనగిరి 60 కిలోమీటర్ల దూరంలో వుంటే, నల్గొండ 150 కిలోమీటర్లు వుంది. అంతేగాకుండా ఇక్కడ 202 హైవే వుంది కాబట్టి మోటార్ వెహికల్ కేసులు కూడా నల్గొండకు పోవలసిన పరిస్థితి ఏర్పడింది కాబట్టి ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వేల కేసులు పెండింగులో వున్నాయి. మిగతా మూడు డివిజన్లలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు గానీ, అదనపు జడ్జిని గానీ ఇవ్వడం జరిగింది. భువనగిరిలో కూడా అదనపు కోర్టు జడ్జిని వేయడానికి ప్రభుత్వం దగ్గర ఫైలు పెండింగులో వుంది. ఎన్ని రోజుల్లో వేస్తారో చెప్పాలని అడుగుతున్నాను.

శ్రీమతి వంగా గీత విశ్వనాథ్(పిఠా.పురం)ః స్పీకర్ సార్, ఇంతకు ముందు జయప్రకాశ్ నారాయణగారు చెప్పినట్లుగా, చాలా వరకు జడ్జీల/మేజిస్ట్రేట్ల పోస్టులు ఖాళీగా వుండడం వల్లే ఈవిధంగా కేసులు పెండింగులో వుండిపోతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసినా సంవత్సరాల తరబడి కేసులు పెండింగులో వుంటున్నాయి. ఈ విధంగా కేసులు సంవత్సరాల తరబడి పెండింగులో ఉంటున్నందున ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యామిలీ కోర్టులు పెట్టినా, విడివిడిగా కోర్టులు పెట్టినా కేసులు సంవత్సరాల తరబడి పెండింగులో ఉంటున్నందున, సివిల్ దావాలలో మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. చాలామంది చెబుతుంటారు, ఓడిన వాళ్లు కోర్టులోనే బాధపడితే, నెగ్గిన వాళ్లు బయటకొచ్చి బాధపడతారని. ఎందుకంటే సంవత్సరాల తరబడి కేసులు నానుతున్నాయి కాబట్టి . మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను, ఎప్పటిలోగా ఈ గ్రామ న్యాయ వ్యవస్థను తీసుకొస్తారు? ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతాలకు సంబంధించి పవర్స్ అన్నీ కూడా ఆర్డీఓల చేతుల్లో వున్నాయి. అందువల్ల ఈ న్యాయస్థానాల పరిధిలోకి వాటిని తీసుకరావడం జరుగుతుందా? చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.
ఉ.9.10

శ్రీ ఇ. రాజేందర్ః దయచేసి మీరు అర్థం చేసుకోండి. మీరు అడ్వకేటు.

మిస్టర్ స్పీకర్ః మరల వేరే సభ్యులు కూడా అడుగుతారు. మరల క్రాస్ టాక్ డైవర్షన్ అవుతుంది.

శ్రీ ఇ. రాజేందర్ః ఒక సత్యమేమిటంటే ఒకప్పుడు వాల్యూస్, ఎథిక్స్ ఉండేవి. అప్పట్లో కుల పెద్దలు సమస్యలను పరిష్కరించే అవకాశం ఉండేది. కాని ఇప్పుడవన్నీ పోయాయి కాబట్టి ఏదైనా సమస్య వచ్చినప్పుడు కోర్టుల మీద డిపెండ్ అయ్యే ఆస్కారం ఉంది. కాబట్టి ఈ రోజు పెరుగుతున్న నేరాలను చూస్తే సరిపోయే పరిస్థితి లేదు. కాబట్టి మనం ఒక ఆలోచన చేయాలి. చట్టం మీద గౌరవం రావాలంటే విక్టిమ్స్‌కు న్యాయం జరగాలంటే సత్వరమే పరిష్కారమవుతుందనే ఆలోచన కలిగించకపోతే రాబోయే కాలంలో కోర్టులేమి చేస్తాయిలే అనే ఆలోచన ప్రజలలో వస్తుంది. కాబట్టి తక్షణమే కోర్టులు ఏర్పాటు చేయాలి. తక్షణం న్యాయం అందించడానికి ఈ చర్యలు చేపట్టాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ మోపిదేవి వెంకట రమణారావు ః అధ్యక్షా, జయప్రకాష్ నారాయణ్ గారు చెప్పినట్లు సమాజంలో పెరుగుతున్న కేసుల సంఖ్య సత్వరం పరిష్కారం చేయాలనే ఆలోచనతో జాతీయస్థాయిలో పార్లమెంటులో దీని మీద సవివరంగా చర్చ జరిగింది. పార్లమెంట్‌లో చట్టం చేయబడి బిల్ ద్వారా 2009లోనే రావడం జరిగింది.

పార్లమెంట్ నిర్దేశించిన నిర్ణయాలకనుగుణంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటు చేసే అవకాశాన్ని వెసులుబాటును ఇవ్వడం ద్వారా న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రిగారు దీనిమీద సంబంధిత అధికారులతో సవివరంగా చర్చిండం జరిగింది.

గ్రామ న్యాయాలకు సంబంధించిన పూర్తి వివరాలు కార్యవిధానపరమైన శాసనాలలో ఇబ్బందికరమైన పద్ధతిని అనుసరించకుండా స్వల్ప వివాదాలను మరియు అపరాధాలను సామరస్యంగా పరిష్కరించడానికి లేదా సాధ్యమైనంత త్వరగా గ్రామాలలో శాంతిని మరియు ప్రశాంతతను నెలకొల్పే సందర్భాన్ని కలుగచేయడానికి వ్యాజ్యములాడే ప్రజల వద్దకు న్యాయాన్ని తీసుకువెళ్లడమే క్రింది స్థాయిలో గ్రామ న్యాయాలయాల ఏర్పాటులోని ఉద్దేశ్యం .

ఈ గ్రామ న్యాయాలయాలు సివిల్ మరియు క్రిమినల్ కేసులు రెండింటిని నిర్వహిస్తాయి. మరియు ఈ న్యాయ స్థానాలలో ఇచ్చే తీర్పులు ఇతర రెగ్యులర్ న్యాయస్థానాలలో ఇవ్వబడే తీర్పులతో సమానంగా ఉంటాయి.

గ్రామ న్యాయాలయాల ఏర్పాటు విషయంలో రు.18లక్షల నాన్ రికరింగ్ ఫండ్‌ను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. కేంద్ర ప్రభుత్వం న్యాయస్థాన భవనమునకు రు.10 లక్షలు, వాహన కొనుగోలుకు రు.5 లక్షలు మరియు కార్యాలయ సామగ్రికి రు.3 లక్షలు ఖర్చు పెడుతుంది. రికరింగ్‌కు సంబంధించినంత వరకు కేంద్ర ప్రభుత్వం దానిని సంవత్సరమునకు రు.6.4 లక్షలుగా అంచనా వేసింది మరియు మొదటి మూడు సంవత్సరములకు వేతనాలు మొదలైన వాటిపై రాష్ట్ర ప్రభుత్వంతో సమాన వాటాను పంచుకోవడానికి కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీనికి సంబంధించి తే.23.7.09న ముఖ్యమంత్రిగారి సమక్షంలో జరిగిన సమావేంలో ప్రతి మండల కేంద్రంలో ఒక గ్రామ న్యాయాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించబడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ న్యాయాలయాల చట్టమును అమలు పరచడానికి మరియు హైకోర్టును సంప్రదించిన మీదట ప్రతి మండల కేంద్రంలో ఒక గ్రామ న్యాయాలయాన్ని ఏర్పాటు చేయడానికి తీసుకోవలసిన చర్యలను గురించి చర్చించడానికి సంబంధిత అధికారులతో సాధ్యమయినంత త్వరలో ఒక చర్చా వేదికను ఏర్పాటు చేస్తాము.

జయప్రకాష్ నారాయణ్‌గారు తెలిపినట్లు రాష్ట్రంలో ఈ చట్టాన్ని చేయడానికి అవసరమైనటువంటి సెక్షన్ -40 క్రింద సుప్రీంకోర్టు అనుమతి, సెక్షన్-39 క్రింద హైకోర్టు అనుమతి , వాటికి సంబంధించి విధానాలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించారా అని అడిగారు. ఈ కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యముతో ఈ మధ్యకాలంలో దీని మీద కొంత చర్చ జరిగింది. కాబట్టి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ చట్టాన్ని గ్రామ స్థాయిలో ముందుకు తీసుకు వెళ్లడానికి ఏవిధమైన చర్యలు తీసుకుంటే బాగుంటుందో చర్చించడం జరుగుతుంది. మార్పులు, చేర్పులు చేసే అవకాశం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది కాబట్టి మార్పులు చేర్పులు చేసి ఆ నిబంధనలకనుగుణంగా సుప్రీంకోర్టు పరిధి, హైకోర్టు పరిధిలో వీటిని అమలు చేసి ఎన్ని మండలాలలో న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలనుకున్నామో , ఎంత అమౌంట్ అవసరమవుతుందో కాలిక్యులేట్ చేసి కేంద్రప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది.

శ్రీమతి ఉమామాధవరెడ్డి భువనగిరికి సంబంధించి సబ్‌కోర్టులో జడ్జిగారి పోస్టు ఖాళీ ఉందని, అక్కడ ఎక్కువ కేసులు పెండింగులో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే చాలా చోట్ల జడ్జి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి వాటిని త్వరగా ఫిలప్ చేయాలని, హైకోర్టు జడ్జిగారు దీనికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి త్వరలోనే సమస్యను పరిష్కారం చేస్తామని తెలియచేస్తున్నాను.

శ్రీమతి వంగా గీత న్యాయస్థాన ఏర్పాటు విషయంలో ఒక సూచన చేశారు. కాబట్టి వాటికనుగుణంగా గ్రామాలలో న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతో కాలంగా పెండింగులో ఉన్న కేసులను సత్వరం పరిష్కారం చేయడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని గౌరవ సభ్యులకు తెలియ చేస్తున్నాను.

శ్రీ ఎన్. జయప్రకాష్ నారాయణ్‌: అధ్యక్షా, క్రింది కోర్టుల మీద పరిపాలనా అజమాయిషీ హైకోర్టులకు మాత్రమే ఉంది. సుప్రీంకోర్టుకు సంబంధం లేదు. మనకు కావలసింది సెక్షన్ 39 ప్రకారం నిబంధనలను రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్-40 ప్రకారం జీతభత్యాలు వగైరా చేస్తుంది. హైకోర్టు ప్రొసీజర్సును చేస్తుంది. వెంటనే ఆ నిబంధనలను చూసి ఏర్పాటు చేయమని చెప్పండి. ఈ చట్టాన్ని మార్చే వెసులుబాటు మనకు లేదు. అమలు చేయడమే మన బాధ్యత. మన దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మండలాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మిగతా రాష్ట్రాలలో పూర్వం ఉన్న బ్లాకు, సమితి విధానం ఉంది. మన రాష్ట్రంలో మండలాలు 1100 పైచిలుకు ఉన్నాయి. ప్రతి మండలంలో ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయి నుండి నిధులు వస్తాయి. ఇప్పటి వరకు 800 మంది మాత్రమే న్యాయమూర్తులున్నారు. అంటే లక్ష మంది జనాభాకు ఒక్కరు కూడా లేరు. ఇదొక గొప్ప అవకాశంగా భావించి చర్చలు లేకుండా , వెంటనే నిబంధనలు రూపొందించాలని కోరుతున్నాను. చట్టంలో చాలా స్పష్టంగా ఉంది. మీరు నిబంధనలను రూపొందించడం, హైకోర్టు నింబంధనలను రూపొందించడం, న్యాయస్థానాలు ఏర్పాటు చేయడం చేయాలి. సుప్రీంకోర్టు ప్రమేయం ఏ మాత్రం లేదు.

శ్రీ మోపిదేవి వెంకట రమణా రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు తెలిపినట్లుగా సెక్షన్ 39, 40 ప్రకారం నిబంధనలు అమలు చేయడం గురించి సమధానంలోనే చెప్పాను. వాటికి సంబంధించిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. స్థానికంగా ఉన్న రాష్ట్రాలలో స్థానిక సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఏదైనా తప్పనిసరి పరిస్థితులలో అవసరాన్ని బట్టి చిన్న చిన్న మార్పులు చేసే వెసులుబాటు ఉంది. కాబట్టి సడన్‌గా క్రింది స్థాయిలో ఏ విధమైన చర్చ జరగకుండా దీని మీద గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేసినప్పుడు కొన్ని రకాల విమర్శలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వాటికి తావులేకుండా పారదర్శకంగా ఉండాలని న్యాయస్థానాలలో ఉన్న న్యాయమూర్తులు , ప్రొఫెషనల్స్, ఎక్స్‌పర్ట్సుతో చర్చించి మన రాష్ట్రంలో న్యాయస్థానాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియ చేస్తున్నాను.

## పశు వైద్యుల కొరత, తగ్గుతున్న పశువుల సంఖ్య

ప్రశ్న నెం.133 (488-ఐ)

సర్వశ్రీ జి. జైపాల్ యాదవ్(కల్వకుర్తి), ఎం .లింగారెడ్డి(ప్రొద్దుటూరు), బి. దుర్గా ప్రసాదరావు(గూడూరు) – గౌరవనీయులైన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా:

అ. గత 5 సంవత్సరాల నుండి పశువుల సంఖ్య గణనీయండా తగ్గిపోతున్న విషయం వాస్తవమేనా?

ఆ. జిల్లా వారీగా వాటి వివరాలు ఏమిటి?

ఇ. పశువుల డాక్టర్ల కొరత కూడా వున్న విషయం వాస్తవమేనా?

ఈ. అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

**పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ కె. పార్థసారధి):**

అ. లేదండీ.

ఆ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ. అవునండీ .

రాష్ట్రంలో మంజూరయిన పశువుల డాక్టర్ల సంఖ్య 2036 ఉండగా, 517 మంది పశువుల డాక్టర్ల కొరత ఉంది.

ఈ. పశువుల డాక్టర్ల పదవుల ఖాళీలు ఏర్పడిన చోట, ఎటువంటి ఆటంకాలు లేకుండా పశుగణానికి వైద్య సేవలను అందించడం కోసం పశువైద్యశాలలను నిర్వహించడానికి పారావెటర్నేరియన్లను నియమించడమయింది.

రిక్రూట్‌మెంట్ కోసం మరింత మంది పశువైద్య డాక్టర్లను అందించడానికి మరో రెండు పశు వైద్య కళాశాలలను ప్రారంభించడమయింది.

పశువైద్య పట్టభద్రులు లభ్యంగా ఉన్నప్పుడు అంతేకాకుండా పదవీ విరమణ చేసిన పశువైద్య పట్టభద్రులను కాంట్రాక్టు ప్రాతిపదికపై తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో పశువైద్య అసిస్టెంటు సర్జన్ పద్ధవులను భర్తీ చేయడానికి అవసరమైన చర్యలన్నింటిని తీసుకోవడమయింది.

ఈ సంవత్సరంలో ఉత్తీర్ణులైన పట్టభద్రుల ద్వారా 2009, అక్టోబర్‌లో 150 డాక్టరు పదవులను భర్తీ చేయడమవుతుంది.

ప్రస్తుతం కాంట్రాక్టు ప్రాతిపదికపై 30 మంది పదవీ విరమణ చేసిన పశువైద్య డాక్టర్లు పని చేస్తున్నారు.

ఉ 9.20

శ్రీ జి. జైపాల్ యాదవ్ ః అధ్యక్షా, మంత్రిగారు సమాధానం ఇస్తూ గత 5 సంవత్సరాల నుండీ పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని అడిగితే లేదండీ అని చెప్పడం జరిగింది. జిల్లాల వారీగా వివరాలు ఏమిటని అడిగితే ఉత్పన్నం కాదని చెప్పడం జరిగింది. పశువుల డాక్టర్ల కొరత వాస్తవమేనా అంటే కొంతవరకూ అవునండి అని ఆన్సర్ ఇవ్వడం జరిగింది. అయితే ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలు ఏమిటని అంటే దానికి కూడా కొంత అస్పష్టమైన సమాధానం ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా మొదటి ప్రశ్నకు పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్న విషయం వాస్తవమేనా అంటే లేదని చెప్పడం జరిగింది. ఈ రోజు చూస్తే రాష్ట్రం మొత్తం కూడా భగ, భగ మండిపోతుంది. కరువు వచ్చింది. ఈ రోజు ఎక్కడ చూసినా పశువులు మొత్తం కూడా బెంగుళూరు హైవే చూసినా, విజయవాడ హైవే చూసినా, రాజీవ్ హైవే చూసినా లారీల పైన వేల కొద్దీ పశువులు కబేళాలకు, కసాయివాడి చేతికి పోవడం జరుగుతుంది. ఈ విషయంలో మీరు 2003 సంవత్సరం నుండి లెక్కలు చూసు కుంటే తెలుస్తుంది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పశువులను కాపాడలేకపోయింది. కేవలం పశు గ్రాసం సరఫరా చేయలేక ఈ రోజు రైతులు మొత్తం కూడా ఆవేదనతో కబేళాలకు తరలిస్తుంటే అరికట్టలేకపో

యింది. ఈరోజున పశు సంపద కూడా తీవ్రంగా నష్టపోయి మన రాష్ట్రం పాడిపంటలకు కరువు అయిపోయిన టువంటి విషయం నేను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈరోజు పశువుల సంఖ్య ఎక్కువ అయితే పాల ఉత్పత్తి ఎందుకు తగ్గిందో ఒకసారి చెప్పవలసిన బాధ్యత వుంది. జిల్లాల వారీగా సమాచారం గురించి అడిగితే ఉత్పన్నం కాదండి అన్నారు. ఏ విధంగా ఈ రోజు జిల్లాలవారీగా సమాచారం లేకపోతే మీశాఖ ఏం పని చేస్తుందో ఒకసారి వివరణ ఇవ్వవలసిందిగా నేను కోరుతున్నాను. పశువుల డాక్టర్ల కొరత వున్న విషయం వాస్తవమేనా అంటే ఈరోజు మాకు వున్న సమాచారం ప్రకారం మొత్తం 1612 పోస్టులు ఖాళీలుగా వున్నాయి. ఇందులో డాక్టర్లు 633, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్స్ 143, లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ 144, వెటర్నరీ పారా అసిస్టెంట్స్ 692 మొత్తం 1612 పోస్టులు ఖాళీగా వున్నాయి. దీని పైన మీరు గోపాల మిత్ర అని పెట్టారు. వెటర్నరీ పారా సిబ్బంది అని పెట్టారు. ఎక్కడా కూడా తక్కువ చేస్తున్నారు గానీ ప్రతి ఆసుపత్రిలో పెంచడం లేదు. ఈ విష యంలో తీసుకుంటున్న చర్యలు ఏమిటంటే మీరేదో పశువుల డాక్టర్లను రిటైరైన వాళ్లను మళ్లీ నియమిస్తు న్నాము, వాళ్లకు రూ 5,500 నుండి 20 వేల రూపాయల వరకూ శాలరీస్ ఇస్తున్నామని కూడా చెప్పడం జరుగు తుంది. 3 విశ్వవిద్యాలయాల నుండి 170 మందికి మన రాష్ట్రంలో సీట్లు వున్నాయి. 150 మందిని మీరు ఫిలప్ చేస్తామని చెబుతున్నారు. ఈ 150 మందిలో కూడా మీరు ఇచ్చే జీతం సరిపోక చాలామంది విదేశాలకు తరలి వెళుతున్నారు. ఇంకా 1692 పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు? పశు సంపద కాపాడడానికి ఈ ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలు ఏమిటి? ఈరోజు కరువు వచ్చింది. కరువులో పంటలను కాపాడడానికి రెండు కిలోల దాణా ఇస్తామని చెబుతున్నారు. రెండు కిలోల దాణా ఇస్తే ఎలా సరిపోతుంది పాడి పశువులకు. మీరు పశు క్రాంతి పథకం పెట్టారు. ఆ పశుక్రాంతి పథకంలో ఎక్కడా కూడా ఈరోజు పశువులు బ్రతికే పరిస్థితి లేదు. 20 వేలకు వచ్చేది 50 వేలకు తీసుకువస్తున్నారు. రెండు పైసలు మాత్రమే ఒక పశువు మీద ఖర్చు పెడుతున్నారు. ఈ రోజు ప్రతి మనిషి, మనుషులకు ప్రైవేటు ఆర్‌యంపి డాక్టర్లు వున్నారు, గవర్నమెంటు డాక్టర్లు వున్నారు, కార్పో రేట్ హాస్పిటల్స్‌లో డాక్టర్లు వున్నారు. పశువుల కొరకు ప్రతి గ్రామంలో ఒక చిన్న హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడా నికి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ రాష్ట్రం మొత్తం కూడా పశువుల మీద ఆధారపడి వుంది. పశు సంపద మీద ఆధారపడి వుంది. ఈరోజు మనమందరమూ కూడా పాలు లేకపోతే జీవించే పరి స్థితి లేదు, పంటలు పండే పరిస్థితి లేదు. కాబట్టి దీని పైన సమగ్రమైనటువంటి సమాచారం ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లుగా నేను భావించడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ ః క్వొశ్చన్ అడగండి.

శ్రీ జి. జైపాల్ యాదవ్ ః క్వొశ్చన్ అడుగుతున్నాను. ఎప్పటివరకూ మొత్తం ఖాళీలు భర్తీ చేస్తారని నేను కోరుతున్నాను. మొత్తం గ్రామ గ్రామాన వెటర్నరీ హాస్పిటల్స్ పెట్టి పశువులను కాపాడతారా? ఇంకా ఎక్కువ నిధులు కేటాయించమని కోరుతున్నాను. పశువుల ట్రీట్‌మెంట్ కోసం గానీ, పశు సంపద కాపాడడం కొరకు గానీ ఏ విధమైన చర్యలు చేపడతారో చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఈ. రాజేందర్ ః అధ్యక్షా, మనం చిన్నప్పుడు సాయంత్రం పూట రేడియో వింటే పాడి, పంట అని వస్తుంది. అంటే పాడి,పంటకు అవినాభావ సంబంధం వుందనేది ఒకటి. రెండవదేమంటే రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నప్పుడు తమరి జిల్లా చిత్తూరు జిల్లాలో కరువు వచ్చినప్పటికీ ఆత్మహత్యలు జరగలేదని చర్చించాము. అంటే దాని ప్రాధాన్యత అంత గుర్తించాము. కాబట్టే ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఇస్తున్నాయి. కాని రిజల్ట్ ఆశించిన స్థాయిలో రావడం లేదు. కారణం ఏమిటో మీకు తెలుసు.

ఈ రోజు డాక్టర్స్ కొరత వుంది. ఇవాళ వెనకటిలా లేదు. నాటు బర్రెలు, నాటు గొర్రెల సిస్టం లేదు. ఈ రోజు సైంటిఫిక్‌గా, సైన్స్ డెవలప్ అయిన తరువాత ఇంత విజ్ఞానాన్ని ఆ రైతులకు, గొర్రెల కాపరులకు అందించే మెకా నిజం మన దగ్గర లేదు. దయచేసి డాక్టర్స్‌ను ఒకేసారి ఇంతమందిని నియమించే సత్తా మనకు లేదు. చాలా మంది బయటి దేశాలకు పోవడం, లేకపోతే హేచరీస్ పెట్టుకోవడం వల్ల కొరత వున్న మాట వాస్తవమే. మేమేమి సూచన చేస్తున్నామంటే బియస్., అగ్రికల్చర్‌కు సంబంధించి బియస్‌సి చదువుకున్న వాళ్లకు ట్రెయినింగ్ ఇస్తే డాక్టర్లు వచ్చేవరకూ కొంత సర్వీస్ చేసే దానికి ఆస్కారం వుంది. ఇక్కడ ఎక్కడ కూడా ఎక్విప్‌మెంట్ గానీ, మందులు గానీ, బిల్డింగ్స్ గానీ లేవు. కన్‌సర్న్‌డ్ వాళ్లు అవన్నీ ప్రొవైడ్ చేయవచ్చు కదా. అవన్నీ ప్రొవైడ్ చేయ మని నేను తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి : అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలలో వున్నటువంటి హాస్పిటల్స్‌కు ఈ రోజున 4,5 హాస్పి టల్స్‌కు కలిపి ఒక్క డాక్టరు చాలా ప్రాంతాలలో వున్నాడు. ఆ రకంగా ఎన్ని ప్రాంతాలు వున్నాయి? ఇన్‌ఛార్జ్ వున్నటువంటి హాస్పిటల్స్ ఎన్ని వున్నాయి? గోవులను చట్ట వ్యతిరేకంగా పెద్దయెత్తున వాటిని చంపుతున్నారు. ప్రభుత్వం వాటి విషయంలో ఏమైనా ప్రయత్నం చేసిందా? గోవులు లేకపోతే పశు సంపద వుండదు. గోవులు వుంటేనే పశు సంపద పెరుగుతుంది. ఆ విషయం మీద కూడా దృష్టి కేంద్రీకరించవలసిందిగా నేను కోరుతు న్నాను.

శ్రీ ఎ. ప్రవీణ్ రెడ్డి (హుస్నాబాద్) : అధ్యక్షా, మన ప్రభుత్వం వచ్చిన తరువాత 2004వ సంవత్సరం నుండి ఈ పశు క్రాంతి పథకం గానీ, గొర్రెలకు టీకాలు మొదలైన సర్వీసెస్‌ను ఇంప్రూవ్ చెయ్యడం జరిగింది. సబ్సిడీ క్రింద కూడా ఇవ్వడం జరుగుతుంది. అయినప్పటికీ దీనికి తోడుగా మెయిన్ సర్వీసెస్ పెంచలేదు, సబ్ సెంటర్స్ పెంచలేదు, డాక్టర్స్ పెంచలేదు. సబ్ సెంటర్స్ కోసం వెటర్నరీ పాలిటెక్నిక్స్ చేస్తున్నాము. వాటిలో స్టూడెంట్స్ స్ట్రెంగ్త్ పెంచవలసి వుంది, వెటర్నరీ డాక్టర్స్ స్ట్రెంగ్త్ పెంచవలసి వుంది. దాదాపుగా సగం డాక్టర్స్ బయటకు వెళుతున్నారు. కనుక రెస్పెక్టివ్ సీట్స్ ఇంక్రీజ్ చేస్తే చాలా మంది డాక్టర్స్ వచ్చే అవకాశం వుంది. గత ఆరు నెలల నుండీ చూస్తే మిల్క్ ప్రొడక్షన్ మన రాష్ట్రంలో దాదాపు 50 శాతం తగ్గింది. దీని మీద ప్రభుత్వం, మంత్రి గారు దృష్టి సారించాలి. ఏ విధంగా అయితే మిల్క్ ప్రొడక్షన్ తగ్గిందో దీని సర్వీసెస్ ఇంక్రీజ్ చెయ్యాలి. బర్రెలు, ఆవులు మూడు,నాలుగు సార్లు కట్టకపోయేసరికి రైతులు వాటిని అమ్ముకోవడం జరుగుతుంది. ఏ విధంగా సర్వీసెస్ ఇంప్రూవ్ చెయ్యాలో దానిమీద కూడా కాన్‌సన్‌ట్రేట్ చెయ్యాలి. ప్రభుత్వం, మంత్రిగారు, అధి కారులు ఆలోచించి దీని సర్వీసెస్ ఇంక్రీజ్ చెయ్యాలి. మండల వైజ్‌గా సబ్ సెంటర్స్ ఇంక్రీజ్ చెయ్యాలి. వెటర్నరీ డాక్టర్స్‌ను కూడా మండల వైజ్‌గా ఇంక్రీజ్ చెయ్యాలని, వున్న సర్వీసెస్‌ను డబుల్ చెయ్యాలని కోరుతున్నాను.

శ్రీ కె. పార్థసారధి : అధ్యక్షా, మన జైపాల్ యాదవ్ గారు చాలా సుదీర్ఘంగా చెప్పారు. బహుశా వారు గత 5 సంవత్సరముల నుండీ సభలో లేరు. 1999-2004 సంవత్సరముల విషయాలను దృష్టిలో పెట్టుకొని మాట్లాడుతున్నట్లున్నారు. 5 సంవత్సరాలలో పశువుల సంఖ్య తగ్గిందని చెప్పారు. జిల్లాలవారీగా నా దగ్గర డీటైల్స్ వున్నాయి. అన్ని జిల్లాలు చదవాలంటే ఇబ్బంది కాబట్టి నేను పంపిస్తున్నాను. కానీ టోటల్‌గా చెబు తాను. ఆవుల శాతం 2003-07 మధ్యలో 19.09 శాతం పెరిగింది. 2003లో 94.24 లక్షల ఆవులు వుంటే 2007లో 112.23 లక్షల ఆవులు పెరిగాయి. బఫెలోస్ 2003లో 107.68 లక్షలు వుంటే 2007కి 132.72 లక్షలు వుంది. దాదాపు 23.25 శాతం పెరిగింది. గొర్రెలు 2003లో 210.15 లక్షలు వుంటే 2007కు 255.39

లక్షలు పెరిగింది. అంటే 21.53 శాతం పెరిగింది. గోట్స్ 64.27 లక్షలు వుంటే 2007కి 96.26 లక్షలకు పెరిగింది, అంటే 47.78 శాతం పెరిగింది. డాక్టర్స్ షార్టేజ్ గురించి చెప్పారు.

ఉ.9.30

డాక్టర్ల షార్టేజ్ సమస్య ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే వచ్చింది కాదు. ఇంతకు ముందు కూడా డాక్టర్ల కొరత ఉన్న మాట వాస్తవం. రాష్ట్రంలో 2189 వెటర్నరీ గ్రాడ్యుయేట్ హాస్పటల్స్, 3110 నాన్ వెటర్నరీ గ్రాడ్యుయేట్ హాస్పటల్స్ ఉన్నాయి. అందులో 517డాక్టర్ల పోస్టులు మాత్రమే ఉన్నాయి. గ్రాడ్యుయేట్ డాక్టర్లు షార్టేజ్ ఉన్నారు. అదే విధంగా పేరా వెటర్నరీ పోస్టులు దాదాపు 1,123 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ డాక్టర్లు అవైలబుల్‌గా ఉంటే వాళ్లను తీసుకునే కార్యక్రమం ప్రభుత్వం చేస్తుంది. ఇంటర్మీడియేట్ లెవల్‌లో ఒకేషనల్ కోర్సులు పెట్టి, ఆరు నెలల నుండి సంవత్సరం కాలం వరకూ ట్రైనింగ్ ఇచ్చి, అపాయింట్ చేసుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంది. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుండి డాక్టర్లను కాంట్రాక్ట్ బేసిస్ మీద అపాయింట్ చేసుకోడానికి ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఈ ప్రయత్నం ఒకసారి చేసినప్పుడు స్టూడెంట్స్ నుండి అదే విధంగా ఇతరుల నుండి కొంత వ్యతిరేకత వచ్చింది అందువల్ల కొంత వల్ల ఆలస్యం అవుతోంది. కేవలం ఇది కాంట్రాక్ట్ బేసిస్ మీద, టెంపరరీ బేసిస్ మీద అపాయింట్ చేసుకోవడం జరుగుతుంది. అదే విధంగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ హాస్పిటల్స్, గ్రాడ్యుయేట్ వెటర్నరీ హాస్పిటల్స్‌లలో పేరా వెటర్నరీ సిబ్బందితో ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుంది. అదే విధంగా సర్వీసులో ఉన్న 203 పేరా మెడికల్ సిబ్బందికి వెటర్నరీ కోర్సులలో శిక్షణ ఇచ్చి, వాళ్లను అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఇంతకు ముందు రిటైర్ అయిన డాక్టర్లను తిరిగి నియమిస్తే కేవలం ఆరు వేల రూపాయల జీతం మాత్రమే ఇచ్చేవారు. ఈ కొరతను తగ్గించడానికి ముఖ్యమంత్రి గారు రెవ్యూ మీటింగ్ పెట్టి రిటైర్డ్ అయిన డాక్టర్లకు పదిహేను వేల రూపాయలిచ్చే ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాము. కరవు ఉందని సభ్యులు మాట్లాడారు. కరవు ఉన్న విషయం వాస్తవం. పశుగ్రాసం కూడా కొంత కొరత ఉన్న మాట వాస్తవం. పశుగ్రాసం రెండు రకాలు. ఒకటి ఎండు గడ్డి, రెండవది గ్రీన్ ఫాడర్. ఎండుగడ్డి వచ్చే రెండు, మూడు నెలలకు సరిపడా ఉంది. కరవు రావడం వల్ల గ్రీన్ ఫాడర్ షార్టేజ్ ఉన్న మాట వాస్తవం. ముఖ్యమంత్రి గారు 15 రోజుల క్రితం రెవ్యూ మీటింగ్ పెట్టి నాలుగు కోట్ల రూపాయలను రిలీజ్ చేయడం జరిగింది. దాని వల్ల 1400 మెట్రిక్ టన్నుల గ్రీన్ ఫాడర్ రైతులకు సప్లై చేసి, దాదాపు రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్ ఫాడర్‌ను రెండు, మూడు నెలలలో డెవలప్ చేయడానికి నిర్ణయం తీసుకున్నాము. దీనితో కొరత తీరుతుంది. క్యాటిల్ క్యాంప్స్ పెట్టడానికి మా డిపార్ట్‌మెంట్ అన్ని చర్యలు తీసుకుంటుంది. పాల ఉత్పత్తి గురించి గౌరవసభ్యులు చెప్పారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి తగ్గలేదు. ఈ అయిదు సంవత్సరాలలో పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దాదాపు తొంభై లక్షల లీటర్ల పాల ఉత్పత్త మన రాష్ట్రంలో జరుగుతుంది. పాల ఉత్పత్తిలో దేశంలోనే మన రాష్ట్రం నాల్గవ స్థానంలో ఉంది. ఇది లీన్ పీరియెడ్. సాధారణంగా జూలై, ఆగస్టు నెలలో కొంత పాల ఉత్పత్తి తగ్గిన మాట వాస్తవం. రాజేందర్ గారు బి.ఎస్.సి (అగ్రికల్చర్) స్టూడెంట్స్‌ని డాక్టర్లుగా తీసుకోవాలని అన్నారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకే ఈ డాక్టర్ల నియామకం ఇరుగుతుంది కాబట్టి ఈ విషయాన్ని పరిశీలిస్తున్నాము. కిషన్ రెడ్డి గారు కూడా మాట్లాడారు. ప్రవీణ్ రెడ్డి గారు డాక్టర్లను, సబ్ సెంటర్లను పెంచాలని చెప్పారు. రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వంలోనే హాస్పిటల్స్‌ను పెంచడం జరిగింది. అవసరాన్ని బట్టి తప్పకుండా యాక్షన్ తీసుకుంటాము.

## రైతులకు సంస్థాగత రుణాలు

ప్రశ్న నెం. 134(364)

శ్రీ జె. రంగారెడ్డి (మిర్యాలగూడ)– గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ. 2009-10 సంవత్సరంలో రైతులకు సంస్థాగత రుణాల మంజూరుకు ఏదైనా లక్ష్యాన్ని నిర్ణయించడమిందా,

ఆ. కౌలుదారి రైతులకు ఏదైనా ప్రత్యేక లక్ష్యాన్ని నిర్ణయించడమయిందా, లేనట్లయితే, కనీసం ఇప్పుడైనా దానిని పరిశీలించడవుతుందా,

ఇ. ఈ విషయంలో 2008-2009 సంవత్సరంలో సాధించిన ఫలితం ఎంత?

**వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ ఎన్. రఘువీరారెడ్డి):**

అ. 2009-10 సంవత్సరంలో వ్యవసాయపరపతి కోసం రూ. 32500 కోట్ల లక్ష్యాన్ని ప్రతిపాదించడవయింది.

ఆ. అవునండీ 2009-10 సంవత్సరంలో 2,50,000 మంది కౌలుదారి రైతులకు వర్తింపు చేయాలని ప్రతిపాదించడమయింది.

ఇ. 2008-09 సంవత్సరంలో వ్యవసాయ పరపతి క్రింద రూ. 23,641.11 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేయడమయింది

పంట రుణాలు ….. రూ. 16,469.41 కోట్లు

కాల పరిమితి రుణాలు ..... రూ. 7,171.70 కోట్లు

శ్రీ జె. రంగారెడ్డి : అధ్యక్షా, మన రాష్ట్రంలో ఒక కోటి ఇరవై లక్షల నలభై నాలుగు వేల కమతాలున్నాయి. వీటి క్రింద మూడు కోట్ల ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగుచేసుకుంటున్నారు. రెండు కోట్ల ఎకరాలలో వర్షాధార పంటలు, కోటి ఎకరాలలో వివిధ ప్రాజెక్టుల క్రింద, నీటి వనరుల క్రింద పంటలు పండించుకుంటున్నారు. ఈ ఉత్పాదక ఖర్చులు పెరిగిన దృష్ట్యా మూడు కోట్ల ఎకరాలకు లక్ష కోట్ల రూపాయలు రుణాలు ఇవ్వవలసిన అవసరం ఉంది. కాని, కేవలం ముప్పై రెండు వేల అయిదు వందల కోట్ల రూపాయల రుణాలు మాత్రమే ఇవ్వడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇరవై అయిదు నుండి ముప్పై శాతం రైతులకు మాత్రమే దీని వల్ల ఉపయోగం జరుగుతుంది. మిగతా డెబ్బై శాతం రైతులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర, ఫైనాన్స్ కంపెనీల దగ్గర, ఎరువుల షాపు ఓనర్ల దగ్గర అదనపు వడ్డీలకు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. అందుకోసం రైతులకు లక్ష కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో గతం కన్నా తక్కువ రుణాలు ఇస్తున్నారు. ఇవ్వాళ సహకార బ్యాంకులలో 4,282 కోట్ల రూపాయలు పాత అప్పులను తిరగరాస్తూ వడ్డీతో కలిపి లెక్కపెట్టి అవే ఇస్తున్నట్లుగా రాసుకుంటున్నారు. ఇది చాలా అన్యాయం. ఇరవై అయిదు లక్షల మంది కౌలుదారులున్నట్లు బ్యాంకులు చెబుతున్నాయి. 8,238 మందికి మాత్రమే రుణాలు ఇచ్చారు. వీరికి ఎనభై రెండు కోట్ల రూపాయలు మాత్రమే రుణాల క్రింద నిధులు మంజూరు చేశారు. ఇంకొక నష్టం కూడా జరుగుతుంది. స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ రిపోర్ట్‌లోని పేజి నెం. 238లో చూస్తే, కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ప్రభుత్వం ఇస్తేనే అప్పులు ఇస్తామని

ఉంది. దీని వల్ల కౌలు రైతులు చాలా నష్టపోవడం జరుగుతుంది. అందువల్ల ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంది. రైతులు ఇప్పటికే చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారు నష్టాలలో ఉన్నారు. కాబట్టి కౌలు రైతులను ప్రత్యేకంగా ఆదుకోడానికి సరైన పద్ధతులు అవలంభించవలసిన అవసరం ఉంది. మంత్రి గారి సమాధానం రైతులకు న్యాయం చేసే పద్ధతిలో లేదు. రైతులను ఆదుకోడానికి, రైతులకు ఎక్కువగా రుణాలు ఇవ్వడానికి, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర నుండి రుణాలు తీసుకోకుండా, వారిని కాపాడడానికి బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించే ఏర్పాట్లుచేయాలి. ఎవరికైతే మొన్న రుణాలు మాఫీ అయ్యాయో వారికి బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు. వాళ్లకు ఇవ్వకుండా పేచీ పెడుతున్నారు. వారికి కూడా తిరిగి లోన్లు ఇప్పించే ఏర్పాటు చేయాలి. ఇది రైతు ప్రభుత్వం అని చెబుతున్నారు కాబట్టి, రైతుల ఇబ్బందులను, రైతులకు కావలసిన రుణాలు తగిన సమయంలో అందించడానికి ఏర్పాటు చేయాలని, అది ఒక లక్ష్యంగా పెట్టుకోవాలని మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ కె. కన్నబాబు (కాకినాడ-రూరల్): అధ్యక్షా, కౌలురైతులకు సంబంధించింది ఇది. చాలా ముఖ్యమైన విషయం. కౌలు రైతులకు రుణాలు ఇస్తామని ప్రభుత్వం ఈ మధ్యనే ప్రకటించి గ్రూపుల వారీగా కౌలు రైతులను ఏర్పాటు చేసి, వారికి రుణాలు ఇవ్వడానికి సిద్ధం అయ్యింది. దీనికి సంబంధించి కౌలు రైతులతో గ్రూపులను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అసలు సమస్య ప్రారంభం అయ్యింది. కౌలు రైతులకు రుణాలు ఇస్తారన్న వెంటనే వ్యవసాయాధికారులు ఎప్పుడైతే నమోదు చేసుకుంటున్నారో, పెద్ద సంఖ్యలో ప్రతి గ్రామంలో ఈ గ్రూపులు ఏర్పాటవుతున్నాయి. ఎప్పుడైతే రుణాలు ఇస్తారన్నారో, కౌలురైతులు కాని వాళ్లు, వేరే వృత్తులలో ఉన్న వాళ్లు ఈ గ్రూపులలో సభ్యులుగా చేరుతున్నారు.
ఉ.9.40

ప్రతి గ్రామంలోనూ కనీసం యాభై గ్రూపులు, పెద్ద గ్రామంలో అయితే వందల సంఖ్యలో గ్రూపులు ఏర్పడ్డాయి. బ్యాంకర్లను అప్పులకోసం అడిగితే మాకు ఇంకా ఉత్తర్వులు రాలేదని, టార్గెట్లు నిర్ణయించలేదని అంటున్నారు. మీరు కౌలు రైతులను ఎలా గుర్తిస్తారు? వారి గ్రూపులను ఎలా సర్టిఫై చేస్తారు? ఈ విషయమై గ్రామాలలో రుణాలు వస్తాయని ఆశలు పెరిగి పైరవీలకోసం వారు ప్రయత్నిస్తున్న పరిస్థితి ఉంది. దయచేసి కౌలు రైతుల గ్రూపులలో ఎన్ని గ్రూపులకు రుణాలిస్తారు? మండలానికి ఎంత మొత్తాన్ని టార్గెట్‌గా నిర్ణయించారు? నిజమైన గ్రూపులను ఎలా గుర్తిస్తారో కూడా మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ ఎన్.రఘువీరారెడ్డి : అధ్యక్షా, గౌరవ మిత్రులు రంగారెడ్డిగారు ప్రతి రైతుకు, ప్రతి కౌలు రైతుకు రుణాలు అందాలని చెప్పారు. ఆ ప్రయత్నం మేం చాలా సిన్సియర్‌గా చేస్తున్నాం . 2003-04 సంవత్సరంలో 59 లక్షల మంది రైతులకు తొమ్మిది వేల కోట్ల రూపాయలు మంజూరు చేయగా గత సంవత్సరం 92 లక్షల మంది రైతులకు 23, 641 కోట్ల రూపాయలు రుణంగా మంజూరు చేయడం జరిగింది. కానీ ఈ సంవత్సరం మరింత పెంచుతున్నాం. ఇదివరకు నేను చెప్పినట్లు 32,500 కోట్ల రూపాయలు రుణంగా అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. వారు చెప్పినట్లు మన రాష్ట్రంలో కోటీ ఇరవై లక్షల రైతు కుటుంబాలున్నాయి. ప్రతి రైతు కుటుంబానికి రుణం ఇప్పించేందుకు మేం ప్రయత్నం చేస్తున్నాం కాబట్టే మేం దాదాపు వంద శాతం రైతులను పెంచడం జరిగింది. దాదాపు మూడు వందల శాతం రుణాలు కూడా ఎక్కువగా ఇప్పించడం జరిగింది. వచ్చే

రెండు, మూడు సంవత్సరాలలో ఈ రాష్ట్రంలోని ప్రతి రైతుకు కూడా బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించాలనే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందనే విషయాన్ని నేను గౌరవసభ్యులకు మనవిచేస్తున్నాను. ఈ విషయంలో బ్యాంకర్లు కూడా బాగా సహకరిస్తున్నారు.

కౌలు రైతులకు రుణాల గురించి కూడా సభ్యులు అడిగారు. 200304 వరకు కౌలు రైతులకు రుణాలు ఇచ్చిన సందర్భాలు లేవు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాతనే సిన్సియర్‌గా రుణాలిప్పించడం ప్రారంభించాం. మొదటి సంవత్సరం 7200 మంది రుణాలిస్తే, మరుసటి సంవత్సరం 42,000 మందికి, తరువాతి సంవత్సరం 27,000 మందికి, ఆ తరువాత సంవత్సరం 35,000 మందికి ఇప్పించాం. గత సంవత్సరం రుణ మాఫీ ఫథకం తీసుకరావడంవల్ల కేవలం 8200 మందికే రుణాలిప్పించాం. ఈ సంవత్సర దాదాపు 2.5 లక్షల మందికి రుణాలిచ్చేందుకు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది. అందుకోసం ఇప్పటికే 3,65,000 మందిని ఎన్‌రోల్ చేశాం. ఇవి కూడా ఏ విధంగా ఇస్తారని గౌరవసభ్యులు అడిగారు. జాయింట్ లయబిలిటీ గ్రూప్స్‌ను మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో ఏర్పరచి ఆయా గ్రూపులలో నిజమైన కౌలు రైతులు ఎంత మంది ఉన్నారు, ఎంత మంది బినామీ రైతులన్నారో తెలుసుకొని నిజమైన గ్రూపులకే రుణాలివ్వడం జరుగుతుంది. బినామీ గ్రూపులకు రుణాు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 47,613 గ్రూపులు ఏర్పాటుచేయడం జరిగింది. ఇందాక మిత్రులు రంగారెడ్డిగారు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల మంది కౌలు రైతులున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కౌలు రైతులు చాలా ఎక్స్‌ప్లాయిటేషన్‌ను గురికావలసి ఉంటుంది. పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ విషయంలో గానీ విత్తనాలు కావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆ విషయాలను కూడా మేం దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతుకు రుణం ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం .

రైతులకిచ్చే రుణాలపై వడ్డీ రేటు కూడా బాగా తగ్గించడం జరిగింది. గతంలో 13 శాతం, 14 శాతం ఉండగా మేం అధికారంలోకి వచ్చిన తరువాత 9 శాతానికి, 7 శాతానికి, ఆ తరువాత 3 శాతానికి వడ్డీ తగ్గించడం జరిగింది. అతి తక్కువ వడ్డీతో రైతులకు రుణాలిస్తున్నది భారతదేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమనే విషయాన్ని గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో మాత్రం ప్రభుత్వానికి పూర్తి ఆసక్తి ఉంది. రుణ మాఫీ పథకంవలన రుణాలు మాఫీ అయిన రైతులకు మరలా కొత్త రుణాలివ్వడంలేదని గౌరవసభ్యులు అన్నారు. ఆ విషయాన్ని నేను మరొకసారి పరిశీలిస్తాను. గౌరవ ముఖ్యమంత్రిగారి అధ్యక్షతన, ఆర్థిక శాఖమంత్రిగారి అధ్యక్షతన ఎన్నోసార్లు సమావేశం కావడం జరిగింది. ప్రతి వారం సమీక్షించి ప్రతి రైతుకు రుణ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్నాం.

MR.SPEAKER : Ranga Reddy garu, We will finish it now, please.

శ్రీ జూలకంటి రంగారెడ్డి : అధ్యక్షా, మంత్రిగారు కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పారు. అయితే రుణాలకోసం రైతులు బ్యాంకుల వద్దకు రుణంకోసం వెళితే, ప్రభుత్వం జారీచేసిన గుర్తింపు కార్డులు తీసుకవస్తేనే రుణం ఇస్తామని, లేకపోతే ఇవ్వమని పేచీ పెడుతున్నారు. కావున దయచేసి రైతులందరికీ గుర్తింపు కార్డులు జారీచేయాలని కోరుతున్నాను. ఎప్పటిలోగా వారికి గుర్తింపు కార్డులు అందజేస్తారు? రుణాలు అందకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా కానీ బ్యాంకులు రుణాలివ్వకపోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటిలోగా వారికి గుర్తింపు కార్డులు ఇస్తారో తెలియజేయాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎన్.రఘువీరారెడ్డి : అధ్యక్షా, కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో ఉన్న ఇబ్బందులు మిత్రులు రంగారెడ్డిగారికి తెలియనివి కావు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తామంటే భూ ఆసామి అభద్రతాభావానికి లోనవుతాడు. అందుకవసరమైన అవగాహన, చట్టాలు లేవు. ఇపుడు రైతులకు, కౌలు రైతులకు మధ్య సఖ్యత ఉంది. దానిని మనం డిస్టర్బ్ చేయడం ఏమాత్రం భావ్యం కాదు. ఏదేమైనా కానీ ముఖ్యమంత్రిగారు ఆదేశించినది కౌలు రైతులకు రుణం ఇప్పించడం కాబట్టి ఆ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోమని ప్రత్యేకమైన ఆదేశాలు విడుదుల చేశారు కాబట్టి అందుకు అనుగుణంగా కౌలు రైతులకు రుణాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం . కౌలు రైతులకు రుణాలిప్పించే విధానం గతంలో లేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇస్తున్నాం . ఎంతమందికి రుణాలిచ్చేది చెప్పలేం కానీ వయా మీడియాగా జాయింట్ లయబిలిటీ గ్రూప్స్ ఏర్పాటుచేసి, that itself is a certificate issued by the Agriculture Officer. మండల వ్యవసాయాధికారి సర్టిఫై చేసిన గ్రూపులన్నింటికీ తప్పనిసరిగా రుణం ఇప్పిస్తామని మీద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

MR.SPEAKER : Remaining questions are deeded to have been answered(అనుబంధము -1). Short Notice questions and matters under Rule 344 are postponed.

## ప్రభుత్వ బిల్లు

## 2009, ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల (ప్రవేశ క్రమబద్ధీకరణ మరియు క్యాపిటేషను ఫీజు నిషేధ)(సవరణ) బిల్లు (ప్రతిపాదించబడినది)

*****

MR. SPEAKER: Now, the Minister for Law and Courts, Technical Education and Industrial Training Institutes will move for leave to introduce the Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions and Prohibition of Capitation Fee) (Amendment) Bill, 2009.

HON'BLE MINISTER FOR LAW AND COURTS (Sri M.Venkata Ramana Rao): Sir, I beg to move--.

"That leave be granted to introduce the Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions and Prohibition of Capitation Fee) Amendment) Bill, 2009".

MR. SPEAKER:- Motion moved. The question is--

"That leave be granted to introduce the Andhra Pradesh Educational Institutions (Regulation of Admissions and Prohibition of Capitation Fee) Amendment) Bill, 2009".

(PAUSE)

The Motion was adopted and the Bill was introduced.

**2009-2010 సంవత్సరానికి వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెటు)**

2009-2010 సంవత్సరానికి గ్రాంట్ల కొరకు అభ్యర్థనలపై - (ఏడవరోజు ఓటింగు)

అభ్యర్థన నెం. XXVII (27) - వ్యవసాయం

అభ్యర్థన నెం. XXVIII (28) - పశు సంవర్ధన, మత్స్యాగారము

అభ్యర్థన నెం. XXX (30) - సహకారం

అభ్యర్థన నెం. XXXVIII (38) - పౌరసరఫరాల నిర్వహణ

(ప్రతిపాదించబడినవి) (అనుబంధము -2)

MR. SPEAKER: Ministers for Agriculture, Animal Husbandry, Cooperation, and Civil Supplies will move their demands.

HON'BLE MINISTER FOR AGRICULTURE (Sri N.Raghuveera Reddy) Sir, I beg to move—

"That the Government be granted a sum not exceeding Rs.1476,88,87,000/- under Demand No. XXVII (27) – Agriculture."

HON'BLE MINISTER FOR ANIMAL HUSBANDRY(Sri K.Parthasarathy): Sir, I beg to move –

"That the Government be granted a sum not exceeding Rs.63584,73,000/- under Demand No. XXVIII (28) – Animal Husbandry and Fisheries."

HON'BLE MINISTER FOR COOPERATION AND LABOUR & EMPLOYMENT.( Sri R.Venkata Reddy): Sir, I beg to move –

" That the Government be granted a sum not exceeding Rs. 196, 75, 02, 000/- under Demand No. XXX (30) – Cooperation."

5) MINISTER FOR FOOD CIVIL SUPPLIES AND CONSUMER AFAIRS (Sri Jupalli Krishna Rao): Sir, I beg to move –

"That the Government be granted a sum not exceeding Rs. 3710, 49, 33,000/- under Demand No. XXXVIII (38) – Civil Supplies Administration."

MR. SPEAKER : Demands moved.

CUT MOTIONS.

MR.SPEAKER : Cut motions nos. from 163 TO 190 are deemed to have been moved.

We will go into Short Discussion. వాస్తవంగా లఘు చర్చ అంటే two hours is allocated for all the parties for discussion. But we made it three and half hours for discussion. Do you want four hours?

శ్రీ నారా చంద్రబాబు నాయుడు : కనీసం అయిదు గంటలు కావాలి. మా బాధలు చెప్పుకోవాలి.

MR.SPEAKER : I think, మీకు అభ్యంతరం లేదు కదా.

శ్రీ ధర్మాన ప్రస్తాదరావు : అధ్యక్షా, ప్రభుత్వంనుంచి సమాధానమివ్వడానికి కనీసం గంటన్నర సమయం కావాలి.

MR.SPEAKER : This is for discussion.

శ్రీ ధర్మాన ప్రస్తాదరావు : లఘు చర్చ ఎంత సేపు జరిగినా మాకు అభ్యంతరం లేదు. ఈవేళ సమాధానం ఇవ్వాలంటే కనీసం మ.12.30 గంటలలోపు చర్చ పూర్తి అయితే ప్రభుత్వంనుంచి సమాధానం ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

శ్రీ ఈటెల రాజేందర్ : (మైక్ లేకుండా) అధ్యక్షా, వర్కింగ్ లంచ్ పెట్టి కంప్లీట్ చేద్దాం .

ఉ.9.50

## లఘు చర్చ

## రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితితో పాటు విద్యుచ్ఛక్తి సరఫరా గురించి

శ్రీ పి.కేశవ్ (ఉరవకొండ) : స్పీకర్ సార్, సంతోషపడాలో, బాధ పడాలో తెలియని పరిస్థితి. సభ ప్రారంభమై దాదాపు సగం రోజులు అయిపోయాయి. మొదటి రోజు నుంచి కూడా ఈ కరువు మీద చర్చకు తీసుకుని రావాలనే ప్రయత్నాన్ని పలు రూపాల్లో మేము చేశాం. రాష్ట్రంలో కరువు తీవ్రత చాలా ఉంది. ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ చర్చను ఈ సభలో తీసుకుని రావాలన్న మా ప్రయత్నం "ఒకవైపు తిండి గింజలు దొరక్క, ఉపాధి దొరక్క, పని దొరక్క రైతులు కష్టపడుతున్నారు" కాబట్టే తేవాలనుకున్నాం. ఒకరకంగా ఆలోచించాం, "ప్రభుత్వమే ముందుకు వచ్చి ఈ చర్చను పెట్టి అన్ని పార్టీలను కలుపుకుని కేంద్రం ముందుకు తీసుకుని వెళ్లి వత్తిడి తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తుందేమోనని" కూడా మేము ఆశించాం. కానీ అటువంటి ప్రయత్నం చేయకపోగా ఈ చర్చను తీసుకు రావడానికి కూడా ఇష్టం లేదన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహారం నడిచింది. మాకు అనిపించిందేమంటే రాష్ట్రంలో కరువు లేదు అని చెప్పే ప్రయత్నం చేస్తున్నారేమో ఈ ప్రభుత్వం అని మాకు అర్థమవుతున్నది. ఒక విషయం, ఈ కరువులో ఈరోజు ప్రభుత్వం స్పందన కరువు, దాని గురించిన నిధులు కరువు, ఆఖరుకు అసెంబ్లీలో చర్చిద్దామంటే సమయం కూడా కరువు అయిన పరిస్థితి ఉంది. ప్రజలకు సహాయం కూడా కరువైంది. నిజంగా ఇది చాలా దురదృష్టకరం. సార్, దీని మీద ఈరోజు నేను మాట్లాడే ఈ ప్రయత్నం రాజకీయాల కోసం అసలే కాదు. కేవలం అందులో బ్లేమ్ గేమ్ కూడా చేసే ప్రయత్నం లేదు. హృదయవిదారకంగా ఉన్న కరువును, రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని తాకిన కరువును ఈరోజు సభ దృష్టికి తీసుకు వచ్చే ప్రయత్నం మాత్రమే చేస్తున్నాను. దీంట్లో ప్రభుత్వం కూడా నాలుగు అడుగులు ముందుకు వేసి భేషజాలకు పోకుండా ఉన్న పరిస్థితిని విసైనా కనీసం స్పందించే దిశగా వాళ్ల ఆలోచనలు ఉండాలని కోరుకుంటున్నాను.

ఒకసారి చర్చలోకిపోతే "రైతే రాజు ఒకప్పటి మాట, రైతే ఉపాధి కూలి నేటి నగ్న సత్యం"
"40 రోజుల్లో 70 మంది రైతుల ఆత్మహత్యలు"

"20 ఎకరాలున్న రైతులు కూడా ఉపాధి కూలీగా మారిన తరుణం"
"రాష్ట్రంలో కరువు నీడలు, కరువు కోరల్లో రాష్ట్రం",
"కరువు కరాళ నృత్యం, రాళ్ల నిచ్చెనకు సాగని ఏరువాక"
" కరువు కాటేస్తోంది" "కరువు పీడిస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్రే"
"కరెంటుకూ కరువే, ఇంత దుర్భిక్షమా? ఇంత నిర్లక్షమా? "

ఇది ప్రతి రోజూ మనం పత్రికల్లో పతాక శీర్షికల్లో చూస్తున్నాం.

(ఆ సందర్భంలో "ఈనాడు, ఆంధ్రజ్యోతి " అని అధికార పక్ష సభ్యులు అన్నారు)

ఆ రెండు పత్రికలు కాదు సార్. మన పత్రికలో కూడా చూశాం. ఆ రెండు పత్రికలు కాదు. మన పత్రికలో కూడా విధిలేని పరిస్థితిలో......

మిస్టర్ స్పీకర్ : కేశవ్ గారూ, ప్లీజ్, ప్లీజ్ don't criticise.

SRI P.KESHAV : Sir, you have to tell to the Members. Other wise I am compelled to ask.

MR.SPEAKER : I will tell the Members.

శ్రీ పి.కేశవ్ : సార్, ఇది మన పత్రికే అనుకుంటాను (సాక్షి పత్రికను చూపిస్తూ). "కరవుపై మౌనం" మన పత్రికే. ఆశించాము సార్ ఇట్లాంటి స్పందన ఏదో వస్తుందని.

(అధికార పక్షం నుంచి అభ్యంతరాలు)

అంటే కరువు మీద మాట్లాడటానికి కూడా సభ్యులను అడ్డుకునే ప్రయత్నం చేయమని ట్రైనింగ్ ఇచ్చారంటే ఇంత కంటే దారుణం లేదు.

మిస్టర్ స్పీకర్ : ప్లీజ్ కేశవ్ గారూ,

శ్రీ పి.కేశవ్ : ఈ సభలో ఇకనైనా కూడా ఎటువంటి భేషజాలకు పోకుండా......

(అధికార పక్షం నుంచి అంతరాయం)

ఈ చర్చను ప్రారంభిస్తూనే నేను ముందుగా చెప్పాను.

MR.SPEAKER : Please sit down. Please take your seats. Chief Whip garu, please take your seat. Ramana Reddy garu please take your seat. Keshav garu one minute, listen to me. I request you this is a very serious subject. Let us not provoke each other and divert the subject. It is a very serious subject. We will go on into the subject. I don't expect any comments. This is a very serious subject. Let us go as per the procedure.. Drought is a serious subject. Let us have the seriousness.

శ్రీ పి.కేశవ్ : సార్, నేను నా స్పీచ్‌ను ప్రారంభిస్తూనే, నా స్పీచ్‌ను మొదలు పెట్టక ముందే ఈ సభ దృష్టికి తీసుకు వచ్చాను. నేను రాజకీయాల కోసం మాట్లాడటం లేదు. బ్లేమ్ గేమ్ అసలే కాదు. కాకపోతే హృదయవిదారకంగా ఉన్న ఈ కరువును ఈ సభ దృష్టికి తేవడమే నా ప్రధాన లక్ష్యమని చెప్పాను. అందులోను సభ్యులకు ఆవేదన ఉండాల్సిన తరుణంలో ప్రభుత్వాన్ని వెనకేసుకు రావలసిన పని లేదు. ప్రభుత్వం అంటే ఎవరు, ఈ ప్రజల కోసం పనిచేయాల్సిన వాళ్లు. వాళ్ల లోటుపాట్లు ఎత్తి చూపడం నా బాధ్యత. ఆ కరువు పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని ఎత్తి చూపితే వాళ్ల వెనకాల ఉన్న సభ్యులు దాన్ని వెనకేసుకు రావడం నిజంగా బాధాకరమైన విషయం. ఈ రోజు పత్రికల్లో ఇన్ని పతాక శీర్షికల్లో చూస్తున్నాం. కరువు పీడిస్తున్నా కూడా ప్రభుత్వం మొద్దు నిద్రే అనేటువంటిది, ఇంత దుర్భిక్షమా? ఇంత నిర్లక్షమా? అని పతాక శీర్షికల్లో ఒక వైపు.

ఇక జిల్లాల పరిస్థితికి వెళదాం సార్. "ఎన్నో కరువులు చూశాం, ఇంతటి దారుణ పరిస్థితులు ఎన్నడూ చూడలేదు. చినుకు జాడలేదు, వేరుశెనగ విత్తే అవకాశమే లేదు. త్రాగడానికి నీళ్లు లేవు, పశువులకు గ్రాసం లేదు. దీనితో వాటిని అమ్ముకోక తప్పడం లేదు. కరువు పనులు పెడితే ఉంటాం, లేదంటే వలస పోతాం" ఇది మా అనంత రైతు ఆవేదన సార్. "అరకొర వానలకు పత్తి విత్తనాలు వేశాం, లక్షల ఎకరాలలో విత్తనాలు మొలకెత్తక పోవడంతో ఆందోళనలో ఉన్నాం. రెండోసారి విత్తనాలు వేయాలనుకున్నా కురవని వానలు" ఇది వరంగల్ జిల్లా పత్తి రైతుల వెతలు. "బాబ్లీ పుణ్యమా అని ఎస్ఆర్ఎస్పీలో నీళ్లు రాకపోవడంతో పాటు ఈ వర్షాభావంతో నెలకొన్న పరిస్థితుల వల్ల మాతోపాటు మరో 5 జిల్లాల గొంతెండుతోంది" ఇది కరీంనగర్ రైతుల ఆక్రందన. వరిధాన్యాగారంగా ఉన్న గోదావరి జిల్లాలో నీరందని దుస్థితి. "నారుమళ్లు పోసాం, నాట్లు ఎప్పుడు వేస్తామో" అంటూ ఎదురుచూస్తున్న సాగర్ డెల్టా రైతుల పరిస్థితి సార్. కళ కళలాడాల్సిన పంట పొలాలు కళ్లముందే ఎండి పోతుంటే గుంటూరు రైతుల కన్నీరు. మరోసారి కరువుకు చెరగని చిరునామాగా మిగిలిపోయిన పాలమూరు. గ్రాసం లేక కబేళాకు తరలుతున్న పశువులు. రాష్ట్ర వ్యాప్తంగా తీరని దప్పిక. గొంతెండుతున్న జిల్లాలు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకునే దయనీయమైన పరిస్థితి మనం చూస్తున్నాం.

వర్షం కరువై ఈరోజు అన్నదాతను నిలువునా ముంచెత్తుతోంది. పెట్టుబడులను మింగేసింది. జనం గొంతు ఎండబెడుతోంది. మూగజీవాలను కూడా వేదనకు గురిచేస్తోంది. ఏ జిల్లా చూసినా ఏమున్నది. ఇదే పరిస్థితి ఈరోజు మన కళ్లముందు కనిపిస్తున్నది. ఒక్కసారి మనం చూడాల్సిన అవసరముంది. ఈరోజు కరువు కాలం దాపురించింది. మళ్లీ దాదాపు రైతుల ఉసురు తీస్తోంది. ఒకరు కాదు, ఇద్దరు కాదు దాదాపు 70 మంది రైతులు ఇప్పటికే కేవలం ఈ 40 రోజుల్లోనే చనిపోయారు. ఇంకా వర్షాకాలం ముగియనే లేదు. కరువు తీవ్రత అనేటువంటిది ఇంకా పూర్తిగా తెలియనే లేదు. ఇంత మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే బయట ఎంత హృదయవిదారకరమైన పరిస్థితులు నెలకొన్నాయో, ఎంత దారుణమైన పరిస్థితి ఉందో ఒక్కసారి మనం ఆలోచించాల్సిన అవసరముంది. వర్షాలు ఆలస్యమై ఉండవచ్చు. పంటలపై ఆశ లేకపోవచ్చు. రైతులకు నిజంగా ఈ సంవత్సరం కాలం కలిసిరాక పోయి ఉండవచ్చు. అయితేనేమి ఎన్ని కష్టాలు చూశాం, ఎన్ని కరువులు చూశాం, మరెన్నో కరువులను, కష్టాలను తట్టుకొని ఈ ఆంధ్ర రాష్ట్ర రైతాంగం నిలబడింది. మరి ఈరోజు ఎందుకీ ఆత్మహత్యల పరంపర? 5800 మంది రైతులు ఈ ఆరేళ్ల పాలనలో ఆత్మహత్యలు చేసుకుంటే కేవలం ఈ 40 రోజుల్లోనే దాదాపు 70 మందికి పైగానే ప్రాణాలు తీసుకున్నారు. ఎందుకు ఈ ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది? ఒక్కసారి మనతోపాటు ప్రభుత్వం కూడా పరిశీలించుకోవలసిన అవసరముంది. "ఒక్క ఆకలి కేక కూడా వినపడకుండా కేంద్రం ఆదుకుంటుంది" అని ప్రధాని హామీ ఇచ్చారు. "ఇక ఆత్మహత్యలు ఈ ఆంధ్ర

రాష్ట్రంలో ఉండవు" అని 2004వ సంవత్సరం మే, 14వ తారీఖున ముఖ్యమంత్రి గారు ప్రకటన చేశారు. అయినా ఈ ఆత్మహత్యలు కొనసాగుతున్నాయంటే అర్థం ఏమిటి? ఈ ప్రభుత్వ హామీల పట్ల రైతులకు ఇప్పుడు నమ్మకం లేదు. ఈ భరోసానే ఉంటే ఈ ఆత్మహత్యలు జరిగేవి కాదు, కొనసాగేవి కాదనేటువంటిది ఈ సభ దృష్టికి తీసుకు వస్తున్నాను.

ఈరోజు కేంద్రం గానీ, రాష్ట్రం గానీ, ఈ శాసనసభ గానీ తక్షణం చేయవలసిన పని ఏమిటి? ఒక్కసారి ఆ రైతులందరికీ ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని కలుగచేయవలసిన అవసరముంది. 20 రోజుల నుంచి శాసనసభ జరుగుతుంటే, కరువుపై చర్చకు రాకుండా పోతే ఏరకమైన స్పందన మనం చూపిస్తున్నాం? నిన్నటి దాకా, మొన్నటి దాకా రైతులు ఆకాశం కేసి చూస్తున్నారు. దురదృష్టవశాత్తు ఈ ప్రభుత్వం కూడా అదే దిశగా ఉంది. కానీ కింద ఈ ప్రభుత్వం వైపు కళ్లు తెరచుకుని చూస్తున్నారు ఆశగా. అది చూడమని నేను కోరుతున్నాను. ప్రభుత్వం ఆకాశం వైపు చూడ్డాన్ని నేను తప్పు పట్టడం లేదు. రైతులు ఆశగా చూస్తూ దృష్టి మీ వైపు మరల్చారు. కాబట్టి మీ దృష్టిని కూడా ఈరోజు రైతుల వైపు మరల్చుమని నేను ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే ఒకవైపు ప్రకృతి శాపం ఉన్నప్పుడు ప్రభుత్వం కోపం కూడా వాళ్ల మీద పడకూడదు. ప్రభుత్వాలు ముందుకు వచ్చి మేమున్నాం అంటూ అండగా నిలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ శాసనసభలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా రైతు కుటుంబాల నుంచి, అంతో ఇంతో దగ్గర సంబంధాలనుంచి వచ్చినవారే. మనం ఆ రైతాంగానికి అండగా, బాసటగా నిలచి ఒక ధైర్యాన్ని, స్థైర్యాన్ని నింపడం ప్రథమ కర్తవ్యం. దాని తరువాతనే వారిని మనం ఇతర రూపాల్లో ఆదుకోవాలసిన పరిస్థితి కానీ ఈ ప్రభుత్వ పనితీరును ఒక్కసారి విశ్లేషిస్తే ఈ రకమైన ఆందోళనకరమైన పరిస్థితి బయట ఉంటే ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరేమిటి? నిలువెత్తు నిర్లక్ష్యం ఈరోజు కనిపిస్తోంది. సాక్షాత్తూ ఈ ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే సారధిగా ఉన్నటువంటి చీఫ్ సెక్రటరీ గారు పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లి వెంటనే కరువు మండలాలుగా 900 మండలాలను ప్రకటించే అవకాశం ఉంది, వెంటనే ప్రకటిస్తామంటే అదే రోజు రెవెన్యూ శాఖా మంత్రి గారు ఏలూరు నుంచి ఇప్పట్లో అటువంటి ఆలోచనే ఈ ప్రభుత్వానికి లేదని ప్రకటించారు.

ఉ. 10.00

అంటే స్పష్టత లేదు. చాలా అంటే.. కరువులో సమన్వయంతో, మనలో సమన్వయం ఏర్పాటు చేసుకుని, మీ ఆలోచన ఏదైనా వుండొచ్చు. కరువు ప్రకటించాలా, లేదా అనేటునంటి దాని మీద మీకూ, మీ క్రింద పనిచేసే యంత్రాంగానికి కూడా సమన్వయం లేని స్థితిలో ఈ రోజు వున్నారంటే, కరువు పట్ల మీరు ఎంతటి శ్రద్ధ వహిస్తున్నారు? ఎంతటి శ్రద్ధతోటి మీరూ, మీ అధికార యంత్రాంగం సాగుతోంది అనడానికి ఇదొక ప్రత్యక్ష తార్కాణం సార్. ఈ అస్పష్ట వైఖరిని ఇకనైనా తొలగించుకోండి. ఆ కరువు మీద, కరువు రైతుల మీద, కరువు కన్నీళ్లను తుడిచే పరిస్థితుల మీద దృష్టి పెట్టమని కోరుకుంటున్నాము. ఈ రోజు మీరు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారమే చూస్తున్నాము. ఒక్క శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు మినహా, దాదాపు 20 జిల్లాల్లో ఈ రోజు వర్షాభావ పరిస్థితులు నెలకొని వున్నాయి. అంటే దాదాపు 1128 మండలాలు మనకుంటే, దాంట్లో 1020 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొని వున్నాయి. అంటే అది, ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇచ్చేనాటికి వున్నటువంటి పరిస్థితి. ఈ ప్రభుత్వానికి నేను చెప్పేది... ఈ రోజు ప్రభుత్వం ఇచ్చిన స్టేట్‌మెంట్ కన్నా కూడా బయట పరిస్థితి ఇంకా హృదయవిదారకంగా వుంది. ఆ మిగిలినటువంటి మండలాల్లో కూడా మెరుగైన పరిస్థితి వుంటుందని నేను అనుకోవడం లేదు. ఈ రోజు మీ శాఖలు ఇచ్చిన నివేదికలలో కళ్లుపెట్టి కాదు సార్. బావురుమంటున్న బడుగుల బ్రతుకుల్ని ఒక్కసారి చూస్తే, ఎంత భీకర పరిస్థితి వుందో ఈ రోజు ఈ

ప్రభుత్వానికి అర్థమవుతుంది సార్. ఈ నివేదికలు, ఈ అంకెల గారడీలు, కాకి లెక్కలతో మీరు మోసపోతూ, ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేయవద్దని ఈ ప్రభుత్వానికి చెబుతున్నాను. ఏదో తేలికగా కరువుంది, వర్షం మాత్రమే తక్కువుంది అని చెప్పే ప్రయత్నాన్ని నేను ..

(ఈ దశలో గౌ. సభ్యులు శ్రీ ధర్మాన ప్రసాదరావు గారు మాట్లాడేందుకు ప్రయత్నించసాగారు)

I am not yielding Sir. మంత్రి గారికి చాలా సమయం వుంది. ఇప్పుడే అడిగారు. గంటన్నర కాకపోతే, వారికి కావలసినంత టైం ఇవ్వండి. Let him talk.... కానీ ఈ రోజు కరువు పరిస్థితి ఇంత తీవ్రంగా వుంటే...

(ఈ దశలో శ్రీ పి. కేశవ్ గారికి మైకు కట్ చేయబడింది)

MR. SPEAKER : One minute. You want a suggestion.

(ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీ గౌ. సభ్యులు డా. నాగం జనార్థన రెడ్డి మరియు శ్రీ ఎం. నర్సింహులు గార్లు తమ స్థానం వద్ద నిలబడి "సార్, మధ్యలో అట్లా ఇంటరప్ట్ చేయడమేమిటి సార్.." అంటూ గౌరవ సభాపతి గారితో వాగ్వివాదానికి దిగారు)

MR. SPEAKER : No.. No.. He is the person who has to answer. He wants to give an answer.

(ఈ సందర్భంలో గౌ. సభ్యులు శ్రీ ధర్మాన ప్రసాదరావుకు మైకు ఇవ్వబడింది)

శ్రీ ధర్మాన ప్రసాదరావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు కేశవ్ గారు చాలా బాగా మాట్లాడుతున్నారు. కరువు గురించి వారు చెబుతున్నటువంటి మాటలన్నీ నేను వింటున్నాను. అయితే, వారిని నేను కోరేదేమంటే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. గతంలో కూడా జరిగాయని చెప్పారు, ఇప్పుడు కూడా జరుగుతున్నాయని చెప్పారు. నేను ప్రధానమైన ప్రతిపక్షం గనుక వారిని అడుగుతున్నాను. మీరు వదిలేస్తున్నారు... రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని చెప్పి వదిలేస్తున్నారు. వారిని ఆదుకొనే కార్యక్రమం చేయాలన్నారు. ఏం కార్యక్రమాలు చేయాలో కూడా మీరు సజెస్ట్ చేస్తే, నా రిప్లైలో కూడా మరింత బాగా చెప్పడానికి అవకాశం వుంటుంది. గతంలో ఆత్మహత్యలు జరిగాయి, మీరెలా ట్యాకిల్ చేసారు? ఈ ప్రభుత్వం వచ్చింది, ఎలా ట్యాకిల్ చేసింది. ఇంకెలా ట్యాకిల్ చేయాలనుకుంటున్నారు. మీరు అధికారంలో వున్నప్పుడు ఆత్మహత్యలను ఎలా ట్యాకిల్ చేసారు? మీరు కొద్దిగా వివరిస్తే... నాకు మళ్లీ రిప్లై ఇవ్వడానికి మరింత సాధ్యమవుతుంది, మరింత క్లారిటీ వుంటుంది.

MR. SPEAKER : He is requesting you to give a suggestion.

శ్రీ పి. కేశవ్ : స్పీకర్ సార్.. చాలా సంతోష పడుతున్నాను. నా ప్రయత్నంలో నేను తొలి అడుగు విజయం సాధించాను సార్. ఇన్ని సంవత్సరాలు మొద్దు నిద్ర పోయిన ప్రభుత్వం, ఇప్పుడు ఏం చేయాలో కూడా అడిగే స్థాయికి వచ్చిందంటే, నేను నిజంగా కనీసం ఈ ప్రభుత్వాన్ని ఒక కొరడా పట్టో, ములుగోరు పట్టో గుచ్చి నిద్ర లేపినందుకు నేను నిజంగా సంతోషపడుతున్నాను. ఖచ్చితంగా మీకు సలహాలను, సూచనలను మేము చేయగలిగిన స్థాయిలో చేస్తాము. మీరు ఇంకా ఆలోచనలు చేసి, ఢిల్లీ దాకా కాలి నడకన రమ్మన్నా కూడా రావడానికి సిద్ధంగా వున్నాం. మీరు గాలి మోటార్లలో తిరగొచ్చు. ఈ రైతాంగం కోసం కాలినడకలు మర్చిపోయి వుండొచ్చు కానీ, మీ వెనక రావడానికి సిద్ధంగా వున్నామని చెబుతున్నాను. ఈ రోజు, ఈ

నివేదికల్లో మీరు కళ్లు పెట్టి చూడటం కాదు, క్షేత్ర స్థాయిలో కళ్లుబెట్టి చూడమని అంటున్నాను. ఈ పరిస్థితుల్లో వీళ్లేం చేస్తున్నారు సార్? నిమ్మకు నీరెత్తినట్లు ఈ రోజు ప్రభుత్వ యంత్రాంగం గాని, మంత్రి వర్గం గాని వుంది. ఒక్కసారి చూస్తే.. విత్తనం వేయక కొందరు, వేసిన విత్తనం మొలకెత్తక కొందరు, మొలకెత్తిన విత్తనం ఎండిపోయి కొందరు, నారు ఎండి కొందరు, నాట్లు ఎండి కొందరు, ఎండిన పంటలను తగులబెడుతూ కొందరు ఈ రాష్ట్రంలో రైతాంగం ఉన్న పరిస్థితిని ఒక్క రోజైనా మీరు గాని, మీ మంత్రులు గాని, మీ అధికారులు గాని క్షేత్రస్థాయికి వెళ్లి పర్యటించారా, పరామర్శించారా, పలకరించారా, లేదా కనీసం వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేసారా అని నేను అడుగుతున్నాను. కానీ సార్, అనంతపురం జిల్లాలో వేరుశెనగ విత్తనాలను ఎంతో ఖర్చుపెట్టి తెచ్చుకుని, ఒక ఎకరా వెయ్యడానికి అయ్యే ఖర్చులో పెట్టుబడి అంతా కూడా విత్తనాల్లో వుంటుంది. ఆ విత్తనాలను తెచ్చుకుని, ఈ రోజు వాటిని తెగనమ్ముకుని, వాటితో పురుగుమందులు కొని తాగి చనిపోయేటువంటి హృదయవిదారక సంఘటనలు జరుగుతూ వుంటే, ఇంకా ఈ ప్రభుత్వం తమను తాము కాపాడుకునే ప్రయత్నం చేసే పరిస్థితుల్లో ఈ భేషజాలు ఎందుకు సార్? ఈ అహంకారం ఎందుకు సార్? ఎవరికోసం సార్? పాలనలో వీళ్లు శాశ్వతంగా వుంటారా? నిచ్చెన ఎక్కిన తరువాత ఏదో ఒక రోజు దిగిరాక తప్పదు. ఆ రోజు కూడా సామాన్యుడి పక్కన మనమందరం కూడా నిలబడాల్సినటువంటిదే అన్న విషయాన్ని కూడా మర్చిపోయి, ఆ సామాన్యుడిని నెగ్లెక్ట్ చేసే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తోంది, అది తప్పు అనేటువంటిది ఈ ప్రభుత్వానికి చెబుతున్నాను. మీరు భేషజాలకు పోవద్దు, అహంకారాలకు పోవద్దు, పట్టువిడుపులకు పోవద్దు, కనీసం మనమందరం కలిసి ప్రయత్నం చేయడానికి మీరే ముందుండి నడవండి, మీ చేతనైన సహాయం చేస్తే మీ వెనుక రావడానికి సిద్ధంగా వున్నామనేది చెబుతున్నాను సార్..

(గౌ. సభ్యులు శ్రీ పి. కేశవ్ గారు చేసిన ప్రసంగంలో 'పట్టువిడుపులకు పోవద్దు' అన్న మాటపై అధికార పక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు)

మిస్టర్ స్పీకర్ : పట్టువిడుపులకు పోండి అనేది.

శ్రీ పి. కేశవ్ : సార్, నేను అడుగుతున్నాను.

(అంతరాయం)

వస్తున్నా బ్రదరూ.. సార్, వీళ్లు రావడం కాదు. ఒక్కసారి.. ఇది అప్రస్తుతం కాదు, ప్రస్తుతం గానే ఒక సందర్భాన్ని గుర్తు చేస్తున్నాను. రాష్ట్రంలో గతంలో వీళ్ల వ్యవహార శైలి ఎట్లా వుంది, ఇప్పుడు ఎట్లా వుంది? ఈ రోజు ఇంతమంది చనిపోతే వీళ్లలో ఏ ఒక్క మంత్రి అయినా వెళ్లాడా? ఇది మీ బాధ్యత కాదా? మీకు గుర్తు లేదా? లేక గుర్తు వుండి కూడా వెళ్లాలన్న కోరిక గాని, తీరిక గాని, ఆలోచన గాని మీకు రావడం లేదా? ఔనులే... ఎట్లా గుర్తుంటుంది? కలలు నిజమయ్యాయి, లక్ష్యాలు సాకారమయ్యాయని అడ్వర్టయిజ్‌మెంట్లలో చూసాము. మీ కలలు నిజమయ్యాయి, మీ లక్ష్యం చేరుకున్నారు. కానీ, ఆ లక్ష్యాన్ని అందించినటువంటి ఆ రైతాంగాన్ని మీరు మర్చిపోతున్నటువంటి విషయాన్ని ఈ సందర్భంగా ఈ రోజు గుర్తు చేస్తున్నాను. సార్.. ఆ సభ్యులకు నేను మాట్లాడే దాని పట్ల ఆవేదన వుంటే, వాళ్లు మైకు తీసుకుని రాష్ట్రంలో కరువు లేదనే విషయాన్ని గాని, రైతులు కష్టాల్లో లేరనే విషయాన్ని గాని వారు చెప్పుకోవచ్చు. నేను ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాను. ప్రభుత్వం చేసినటువంటి తప్పులను, లోటుపాట్లను ఎత్తి చూపిస్తున్నాను. ఈ పాలకులే గతంలో వున్నారు. పాలనలోకి రాకముందు వాళ్లు చేసినటువంటి వైఖరి, అవలంభించిన విధానాల్ని, ఈ రోజు అవలంభించిన విధానాల్ని

ఎత్తిచూపాల్సిన బాధ్యత నా మీద వుందని గుర్తు చేస్తున్నాను. సార్, ఒక్కసారి 2004కు ముందుకు వెళదాము. 2004కు ముందు ఎన్నికలకు రావడానికి ముందు ఇదే రైతాంగం మీద ఎంత ప్రేమ ఒలకబోసారు. అనంతపురం జిల్లాలో రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఎంత చేసారు సార్! ఆఖరుకి సోనియాగాంధీ గారిని పిలిపించారు. పిలిపించి ఎంతటి దుష్ప్రచారం చేసారు. భారతదేశం మొత్తం మీద కూడా ఎక్కడా ఆత్మహత్యలు జరగనట్లు, ఒక్క ఆంధ్రదేశంలో మాత్రమే జరిగినట్టు, దానికేదో ఆనాటి పాలకులే బాధ్యులైనట్టు ఎంత ప్రచారం చేసారు. 9 సంవత్సరాల్లో మూడు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కాలికి బలపం కట్టుకుని ఆ చివర నుంచి ఈ చివర వరకు నడిచి చెబితే, ఈ ఆరేళ్ల పాలనలో 6 వేల మంది రైతుల ఆత్మహత్యలు జరిగితే, ఇది మీ గొప్పతనంగా మీరు భావిస్తున్నారా అని నేను ప్రశ్నిస్తున్నాను. ఈ రోజు ఈ నలభై రోజుల్లో డెబ్బై మంది చనిపోతే, నిజంగా బాధ కలగదా సార్? ఆలోచన రాదా సార్? మనస్సు లేదా? ఇంకా రాజకీయాలే కావాలి, రాజకీయాల్లో దుమ్మెత్తిపోసుకోవడాలే కావాలా సార్? ఒక్కసారి.. ఈ రోజు ఏం చేస్తున్నారు? అనంతపురం జిల్లా రైతుల చితిమంటలతో ఆ రోజు చలికాచుకునే ప్రయత్నం చేసారు. రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేసారు. ఈ రోజు సోనియాగాంధీని తీసుకురాలేకపోయారా? రాష్ట్రంలో వున్నటువంటి కరువు పరిస్థితిని వినిపించలేకపోయారా? తీరిక లేదా? ఆ అమ్మగారికి తీరిక లేదా, కోరిక లేదా? లేకపోతే మీరు రావద్దన్నారా? ఏదో ఒకటి రాష్ట్ర ప్రజానీకానికి స్పష్టంగా చెప్పాల్సిన అవసరముంది. లేక అవసరం తీరిపోయిందా?

(అధికార పక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయసాగారు)

సార్.. ఈ రోజు.. అవసరం తీరిపోయిందనే ఆలోచనతో మనము ఆమెను వదిలేసామా సార్? తీసుకురండి సార్.. సోనియా గాంధీ గారిని, మన్మోహన్ సింగ్ గారిని ఈ రాష్ట్రం మొత్తం పర్యటించి ఈ రాష్ట్ర రైతాంగం పడుతున్న కష్టాలను, కన్నీళ్లను వాళ్లకు చూపిస్తే కనీసం వాళ్లైనా కొంత సహాయాన్ని అందిస్తారనేది చూస్తున్నాం. ఎందుకంటే ప్రధానమంత్రిగారు చేసిన ప్రకటనల్లో మేము చూస్తున్నటువంటిది – మేం సిద్ధంగా వున్నా, రాష్ట్రాలు ఈ రోజు సాయం కోరడానికి ముందుకు రావడం లేదని. అందులో ఇప్పటివరకు 5 రాష్ట్రాలు సాయం కోరాయి. 5 రాష్ట్రాలు కరువు జిల్లాలుగా ప్రకటిస్తే, కనీసం కరువు జిల్లాలుగా ప్రకటించుకోకుండా ప్రయత్నం చేస్తున్నారు. వారి కారణాలు వారికి వుండవచ్చు. అయితే కరువు ప్రకటించినా, ప్రకటించకపోయినా కేంద్రం నుంచి సహాయాన్ని రాబట్టుకోవడానికి మీరు చేస్తున్నటువంటి ప్రయత్నాలేమిటి? సార్, ఈ రోజు కేంద్రం ఎట్లా వుంది? మనం పంపించినటువంటి, మీరు పంపించినటువంటి పార్లమెంటు సభ్యుల వైపు నుంచి ఈ రోజు కేంద్రం నడుస్తోంది? మీ వైపు చూడదా సార్? ఈ రాష్ట్రం వైపు కేంద్రం తలతిప్పి చూడదా? మన కష్టాలను, కన్నీళ్లను, బాధలనూ ఆదుకునే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేయదా అని ఈ రోజు అడుగుతున్నాను. మీకు గాని, మీ పార్లమెంటు సభ్యులకు గాని నిజంగా ఈ కరువు రైతులపట్ల ఆలోచన వుంటే, చిత్తశుద్ధి వుంటే ఆ కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి ఈ రోజు తీసుకువచ్చేటువంటి ధైర్యం, స్థైర్యం మనకుంది, శక్తి మనకుంది. కానీ, మీరు ఆలోచన చేయలేదు. ఆ రోజు ప్రతిపక్షాలను దుమ్మెత్తిపోయడానికి మాత్రం మీరు ఉపయోగించుకున్నారు. ఈ రోజు నిజమైన అవసరాల్లో, ఆపదల్లో, కష్టాల్లో వున్నటువంటి రైతులను పట్టించుకునే ప్రయత్నం చేయడంలేదు. సార్.. ఒక్కసారి జిల్లాల్లో నెలకొన్నటువంటి, పత్రికల్లో వచ్చిన విషయాలను గాని, మేము స్వయంగా తిరిగి తెలుసుకున్న విషయాలను గాని, ఒక్కసారి సభ దృష్టికి తేవాలనుకుంటున్నాను.

(అధికార పక్ష సభ్యుల నుంచి అంతరాయం)

సార్.. నిజంగా బాధాకరం. రైతు కుటుంబాల నుంచి వచ్చి, ఆ రైతుల ఆవేదనను నేను సభకు చెప్పే ప్రయత్నం చేస్తుంటే, దీన్లోనూ రాజకీయ ప్రయత్నం చేసుకునే ప్రయత్నంతో సభ్యులు నన్ను అడ్డుకునే ప్రయత్నం చేయడం నిజంగా బాధాకరం. ఈ సభలో శాసన సభ్యుడిగా మనకు ఎన్నో సమస్యలున్నాయి. ఎన్నో సమస్యల మీద మనకంటూ స్పష్టమైన అభిప్రాయాలున్నాయి, అభిప్రాయబేధాలూ వున్నాయి. ఎన్నో వాగ్వివాదాలు జరిగాయి. కానీ, ఈ ఒక్క విషయంలో మనకందరికీ కూడా ఒకే లక్ష్యం వుంటుందని నేను ప్రగాఢంగా నమ్ముతున్నాను. వాళ్లకేదో వేరే ఆలోచన వుందని నేను అనుకోను. కొద్ది కాలం పాటు ఆ కాంగ్రెస్ పార్టీ సభ్యులనో, లేక ఈ ప్రభుత్వాన్ని వెనకేసుకు రావాలనేటువంటి మీ ఆలోచనను పక్కన పెట్టండి. కళ్లు తెరిచి బయట జరుగుతున్న పరిస్థితులను చూడండి. చెవులు తెరిచి వినండి. లేక జరుగుతున్న పరిస్థితులను అధ్యయనం చేసి వాటికి ఒక పరిష్కారాన్ని చూపే ప్రయత్నం చేయమని నేను కోరుకుంటున్నాను.
ఉ.10.10

ఈ రోజు అనంతపురం జిల్లాలో వచ్చినటువంటిది సార్ – 'ఉత్తర చూసి ఎత్తర గంప అంటే హస్తను చూసి అందరం పోదాములే' అనేటువంటి సామెత. ఇదెప్పుడు వస్తుంది సార్? పంట చేతికి ఒడుపుకునే టైంలో మధ్యలో వర్షాలు పడితే అప్పుడు హస్త నక్షత్రం వరకు చూసి అప్పుడు అందరం పోదాములే.. అనేటువంటిది రైతులు చెప్పుకునే మాట. ఈ రోజు పరిస్థితి.. ఇంక అట్లాటి మాటలు ముంగిట్లోకి వచ్చినాయి. ఈరోజు రైతు రచ్చబండల మీద కూర్చొని మాట్లాడే మాటలను చూస్తే, మన భవిష్యత్తు ఏమిటని ఆలోచించుకునే పరిస్థితి, ఒక పిల్ల పెళ్లి ఆగిపోయో.. కొడుకు చదువు ఆగిపోయో.. వైద్యం కొరకు ఆసుపత్రికి తీసుకుపోలేకో.. మంగళసూత్రాలు అమ్మేటువంటి పరిస్థితులు ఈ రాష్ట్రంలో నెలకొని ఉన్నాయి. ఎందుకు వీళ్లకు ఇంత బాధవుతుందో నాకర్థం కావడంలేదు. రెండవది చదువుతున్నాను.

(అధికార పక్ష సభ్యులచే అంతరాయం)

సార్.. ఈరోజు చేయడానికి పనులు లేవు, పనులు చేయకపోతే పూటగడవదూ అంటూ దీనంగా జనాలు బిక్కమొకాలేస్తున్నారు. ఇంకేముంది, పల్లెవాసుల బ్రతుకులు మొదలయ్యాయి. గ్రామాలన్నీ ఒక్కొక్కటి ఖాళీ అవుతున్నాయి. పచ్చని పంటపొలాల మధ్య క్షణం తీరికలేకుండా గడపాల్సిన రైతులు, రచ్చబండ దగ్గర కరువు గాథలు చెప్పుకుంటున్నారు. బడిలో మధ్యాహ్న భోజనంతో పిల్లలు సరిపెట్టుకునే పరిస్థితి, సార్.. ఈరోజు...

(గౌరవ సభ్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారు తమ వద్ద ఉన్న ప్రతులను పరిశీలిస్తుండగా, ట్రెజరీ బెంచీల నుండి సభకు అంతరాయం)

స్క్రిప్టులు చదువుకునేటువంటి నాయకత్వం క్రింద మేము లేము. మీకు ఉన్నటువంటి, ఢిల్లీలో ఉన్న లీడరొక రీడరనే విషయాన్ని మీరు మర్చిపోవద్దు.

MR.SPEAKER: Keshav Garu, again you are diverting. Don't divert yourself.

(అంతరాయం)

శ్రీ పయ్యావుల కేశవ్: రీడర్‌ని పెట్టుకొని, రీడర్‌ని నాయకత్వంగా పెట్టుకున్న మీరూ.. నా గురించి మాట్లాడే సహాసం చేయొద్దని చెబుతున్నాను.

సార్, ఒక ప్రత్యేకమైన హృదయవిదారకమైన సంఘటన వస్తే.. దాని కోసం నేను వెతుక్కుంటున్నాను సార్.. ఉన్న పశువులను అమ్ముకొని, కన్న కొడుకునీ తోడబుట్టిన వాడినీ కాడెద్దులుగా చేసుకొని, వ్యవసాయం చేసిన పరిస్థితి ఈరోజు అనంతపురం జిల్లాలో వస్తే, దానిని ఈరోజు సభ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుంటే, దానిని కూడా సహించే ఓర్పు, ఓపిక వీళ్లకు లేదా సార్? ఇది నిజం కాదు అనుకుంటే, వీరుగాని, వీళ్ల మంత్రులుగాని, రండి సార్.. మా జిల్లాలో ఉన్న పరిస్థితులు చూపిస్తాం.

సార్.. కలలు కల్లలు.. వాన రాదు విత్తనం పడదు, వేసిన పంట ఎండు ముఖం.. బిడ్డల పెళ్లిళ్లు వాయిదా.. చదువులకు కష్టాలు.. కూలిగతిలేదు, పని లేదూ.. వేరు శెనగ రైతులవి ఎన్ని వెతలు.. కరువంటే ముందు గుర్తుకొచ్చేది మా జిల్లానే సార్.. మేం దానికి సంతోషంగా లేము సార్.. ఇన్ని సంవత్సరాలు, ఇంతమంది పాలకులు మారినా కూడా.. మా కరువు పేరు చెప్పుకొని ఢిల్లీ నుండి నిధులు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు తప్ప.. నిజంగా మా తలరాతలు మార్చేటువంటి ప్రయత్నాలు ఈ పాలకులు ఎవరూ కూడా చేయడం లేదు. నిజంగా దానికి బాధపడాల్సిన పరిస్థితి వచ్చింది. కరువని చెప్పుకుంటూ మేం నిజంగా సంతోషంగా లేము. ఆ కరువులో మా బాధల్ని, కనీసం ఇకనైనా కళ్లు తెరిచి చూసే ప్రయత్నాలు చేయండని చెబుతున్నాను. ఈరోజు 8.5 లక్షల హెక్టార్లలో వేరు శెనగ రైతులు ఈపాటికే విత్తనం వేయాలి. కాని కేవలం లక్ష హెక్టార్లకే పరిమితమైపోయింది. అది కూడా ఎండిందెంతా, మిగిలిందెంతా అని కనీసం ఈరోజైనా ప్రభుత్వం నష్టం అంచనా వేసే ప్రయత్నం కూడా చేయలేదు అనంతపురం జిల్లాలో.

సార్.. పంట చేతికొస్తే, బిడ్డకు పెళ్లిచేద్దామనుకున్నా... కొడుకు చదువులు పూర్తి చేయించి ప్రయోజకుడిగా చూడాలనుకున్నాడు మరొక రైతు, ఎన్నో ఆశలు, ఎందరో రైతులు సార్.. పంట చేతికొస్తుంది బిడ్డ పెళ్లి చేద్దామనుకున్న రైతు, పంట చూసి ఇక పెళ్లి మాట ఎత్తలేకపోతున్నా.. ఈ ఏడు మా ఇంట శుభకార్యం జరిగే పరిస్థితి లేదు, ఇది తీరని ఆశగానే మిగిలిపోయింది అనే పరిస్థితి సార్. ఇది రేగాటిపల్లికి సంబంధించి పుల్లారెడ్డి అనే రైతు..

(ఈ సందర్భంలో అధికార పక్ష గౌ. సభ్యులు శ్రీ కె. రామచంద్రా రెడ్డి మరియు కొందరు గౌ. సభ్యులు తమ స్థానాల వద్ద లేచి నిలబడి అంతరాయం)

ఒకసారి వారికి మైక్ ఇవ్వండి సార్.. ఆ సభ్యులను నేను చెప్పినదాంట్లో విభేదించే ప్రయత్నం చేస్తే, ఈరోజు సస్పెండ్ చేయరా సార్? ఈరోజు సభ్యుల్ని సస్పెండ్ చేయరా సార్?

MR.SPEAKER: Please sit down. ఇప్పుడూ.. తెలుగుదేశం తరువాత కాంగ్రెస్ will get an opportunity. One of you will be speaking. We don't want running commentary here. Let him finish. Afterwards, I will give an opportunity to one of the Members of the Congress Party. Then you can speak. Please, Keshav Garu..

(ఈ సందర్భంలో సభ్యులు శ్రీ ఎం. నర్సింహులు గారు తమ స్థానంలో కూర్చొని " ప్రతిపక్షాలకు ఒక రూలు.. పాలక పక్షానికి ఒక రూలా.. వారిని సస్పెండ్ చేయండి " అని గౌరవ సభాపతి గారితో అనసాగారు)

శ్రీ పయ్యావుల కేశవ్: అధ్యక్షా, ఈ టైం డిడక్ట్ చేయండి.

మిస్టర్ స్పీకర్: ఆటోమేటిక్‌గా డిడక్ట్ అవుతుంది.

శ్రీ పయ్యావుల కేశవ్: అనంతపురం శాసన సభ్యుడు మాట్లాడుతున్నాడు సార్, ఆయనకు సమయం ఇవ్వండి. ఆయన ఒకవేళ అనంతపురం జిల్లాలో ఆ పరిస్థితి లేదనంటే .. మైకులో మీ ముందు చెప్పమనండి సార్.. ఆ మంత్రిగారు చెప్పినట్లు.. ఎవరి గుడ్డలు ఎప్పుడు ★★ ©ప్రజలు నిర్ణయిస్తారు.

(అంతరాయం)

సార్.. రేగాటిపల్లికి చెందిన పుల్లారెడ్డి అనే రైతు చెప్పినది సార్.. నా బిడ్డ పెళ్లి చేసేటువంటి పరిస్థితి లేదు అనేటువంటిది. చిన్నవెంకటరెడ్డి అనే రైతు చెబుతున్నాడు.. ఈ కరువును నేనెప్పుడు చూడలేదు. 40 ఏళ్ల క్రిందట ఇట్లాంటి కరువు వచ్చింది, కొట్టాల మీద బోదను తీసి పశువులకు వేశాం. అప్పుడు పంటలు సాగు చేశాక వానలు ఎత్తిపెట్టాయి. ఇప్పుడేమో.. విత్తనం వేయకనే వానదేవుడు కావచ్చు.. ఇప్పుడు ఈ పరిస్థితి ఉంది. నా కొడుకు బిటెక్ చదువుతున్నాడూ.. అతనికి డబ్బు పంపలేక చదువు అవుతున్నాను.. అని అతను వాపోయాడు సార్ ..

(ట్రేజరీ బెంచీల నుండి సభకు అంతరాయం)

సార్.. ఈరోజు.. నిజంగా బాధాకరం సార్, ఇట్లాంటి సమయంలో.. మీరు కఠినంగా.. ఇప్పుడు ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నారు సార్.. సస్పెండ్ చేయమని, ఇంతకంటే ఘోరమైనది ఈ రాష్ట్ర ప్రజానీకానికి ఇంకేమైనా ఉందా సార్ ? ఈ సమయంలో చర్చను కూడా అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే, మీరు.. కనీసం ఆపే ప్రయత్నమైనా చేయాలని నేను కోరుతున్నాను.

MR.SPEAKER: Please take your seats (Addressing the Treasury Benches.) Keshav Garu, please, confine to the subject.

శ్రీ పయ్యావుల కేశవ్ : అధ్యక్షా, ఒక ఫకృద్దీన్ అనే రైతు సార్.. నేనెప్పుడు ఇంతవరకూ ఈ కూలి పనులకు వెళ్లలేదు. ఉన్న పొలం సాగుచేసుకొని ఇంటిల్లిపాది కష్టజీవనం చేసుకొని జీవనంసాగించాం. ఇప్పుడు పరిస్థితిని చూస్తే, కూలికి వెళ్లక తప్పడం లేదు, అనేటువంటిది అతను మాట్లాడాడు సార్. 25 ఎకరాలున్న రైతు కూడా ఈరోజు సేద్యానికి పోతున్నాడు అని పేపర్లో వచ్చింది. మా ఉపాధి హామీ ఎంతగా ఉపయోగపడుతుందో చూడండీ.. అనే కోణంలో ముఖ్యమంత్రిగారు చూస్తే, ఇది సరైన కోణం కాదు సార్.. 25 ఎకరాలు ఉన్న రైతు, 5 ఏళ్ల మీ పాలనలో, మరో 5 సంవత్సరాలు కరువొచ్చిన తట్టుకునే శక్తిని నింపుకునే దిశగా ఆలోచించాలి గాని, ఒక్క నెల రోజులు కరువు బారిన పడితేనే విలవిలలాడిపోయే పరిస్థితులలో ఉన్నారంటే, ఆ రైతులకు మీరు ఎంత పరిపుష్టి చేకూర్చారో అర్థమవుతుంది. ఆ దిశగా మీ ఆలోచనలు ఉండాలి తప్ప, ఆ రకంగా అంటే రైతుని కూలీగా చేసి ఈ రోజు సంతోషపడుతున్నామా సార్? రైతులు కూలీలు కలిసి రైతు కూలీలుగా ఉంటే, ఈరోజు ఇద్దరూ కలిసి ఉపాధి కూలీలుగా మారిపోయిన పరిస్థితి వచ్చింది. దానిని కూడా ప్రభుత్వం గొప్పతనంగా తీసుకునే ప్రయత్నం చేస్తే, ఇది దృష్టిలోపమని భావించక తప్పదు.

ఈరోజు భోరు మన్న రైతు సార్.. గంగ కోసం భగీరథయత్నం, 26 బోర్లు వేసినా నీటి జాడ లేదు, రూ.9 లక్షలకు చేరుకున్న అప్పు. వ్యవసాయం కోసం పిల్లల చదువులు, పెళ్లిళ్ల వాయిదా.. బ్యాంక్ రుణమిస్తేనే

© Expunged as ordered by the Chair

కూతురు పెళ్లి, ఓ కరువు రైతు దీనగాథ. మన మంత్రిగారి నియోజకవర్గంలో, కోనయ్య అనే రైతు, ఒకటికాదు, రెండు కాదు 26 బోర్లు వేసినటువంటి పరిస్థితి ఉంది. అది కూడా ఎంత సార్.. ఎండిపోతున్నటువంటి మూడెకరాల పంటను కాపాడుకోవడం కోసం. మూడెకరాల పంటను కాపాడుకోవడం కోసం 26 బోర్లు వేసి, రూ.9 లక్షలు అప్పుచేస్తే, ఈరోజు ఆయన పరిస్థితి ఏంటి? ఎక్కడ నుంచి తెచ్చి ఆ అప్పులు తీర్చుకోవాలి? ఇక్కడ, డబ్బున్న వాళ్ల గురించి, పరిపుష్టిగా ఉన్న వాళ్ల గురించి నేను మాట్లాడటం లేదు. మా జిల్లాలో ఉన్న పేదవాళ్ల గురించి నేను మాట్లాడుతున్నాను. వినడానికి ఎవరికైనా అభ్యంతరముంటే, మీ ఆదేశాలతో వాళ్లు బయటకైనా పోవచ్చు లేకపోతే పంపాచ్చు సార్.

(ట్రెజరీ బెంచీల నుండి సభకు అంతరాయం)

అంటే.. మా బాధలు చెప్పుకునే సమయం, సౌకర్యం కూడా ఈ సభలో లేకపోవడమంటే దురదృష్టకరం. 150 అడుగులకు నీళ్లు పడేటువంటి పరిస్థితులలో.. ఈరోజు ఎక్కడికి పోయింది. 5 వందలు, 6 వందలు అడుగులేస్తే కూడా నీళ్లుపడని దుస్థితి, ఈరోజు ఆ రూ.9 లక్షల అప్పు పెట్టుకున్న రైతును ఏ రకంగా కాపాడే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుందనేది నేను ప్రశ్నిస్తున్నాను.

సార్.. పల్లె కన్నీరు సార్.. ఇది నేను చూస్తే ఒక్కసారి గుర్తుకొచ్చింది. ఈ పల్లె కన్నీరు అనేది, అది ఎప్పుడు 2004 ఎన్నికల ముందు సార్.. గోరంటి వెంకన్న గారి పాటను, పల్లె కన్నీరు పెడుతోంది అనే పాటను ఆరోజు గ్రామగ్రామాన, వీధివీధిన వినిపించి, ఈ స్థాయికొచ్చాం సార్. ఈ 5 ఏళ్ల పాలనలో ఎన్ని పల్లెల కన్నీరు తుడిచారని అడుగుతున్నాను? పల్లె కన్నీరు కాదు సార్, ఓ తల్లి కన్నీరైనా.. ఓ చెల్లి కన్నీరైనా మీరు తుడిచారా అని నేనడుగుతున్నాను. మరి ఇంకా ఎందుకు పల్లెలు కన్నీరు పెడుతున్నాయని నేను అడుగుతున్నాను. ఈరోజు రాష్ట్రంలో మీరెంచుకున్న గ్రామానికేపోదాం, ఆ పల్లె కన్నీరు పెడుతుందా లేదా చూసే ప్రయత్నం చేద్దామని నేనడుగుతున్నాను. ఈరోజు ఎంతటి ఆవేదనతో, ఎంతటి ఆవేశంతో ముందుకొస్తున్నారు సార్.. ప్రభుత్వానికి ఈ సమయంలో ఉండాల్సిందీ.. ఓ మంత్రిగారు నటిస్తున్నారు సార్.. నటించడమే వృత్తిగా తయారైపోయింది ప్రభుత్వానికి, ఈరోజు ఈ పరిస్థితులలో ఇంత ధారణంగా, ఇంతటి సీరియస్ ఇష్యూని నేను మాట్లాడుతుంటే, ఎగతాళిచేసే ప్రయత్నం చేస్తే, వీళ్లకు ఎంతటి చిత్తశుద్ధి అని నేను అడుగుతున్నాను.

సార్.. హృదయవిదారకమైన సంఘటన సార్ ఒక మహిళ ప్రకృతికి ఎగినెస్ట్‌గా చేస్తున్నటువంటి పోరాటం ఈరోజు ఈ పల్లె కన్నీరు సార్.. ఈ చిత్రంలో నిజంగా తన కూతురికి పెళ్లి చేయడం కోసం తండ్రి వలసవెళ్లిపోయాడు, వలసెళ్లి సంపాధించుకునే ప్రయత్నం చేస్తున్నాడు, ఈ అప్పుల బాధ తాళలేక ఉన్న కొడుకేమో, ఆమెను వదిలి వెళ్లిపోయాడు, ఆమె శివమ్మ అనే మహిళ. ఈమె కూడా గరుడాపురం అనే గ్రామానికి చెందినది. 8 ఎకరాల పొలం ఉంటే, ఆమె కష్టపడి ఏరకంగానైనా ఉన్న అప్పులు తీర్చుకోవాలని మరో 20 ఎకరాల భూముల్ని కౌలుకు తీసుకొని సాగు చేసింది. మొత్తం పెట్టుబడి మునిగిపోయింది, భర్త ఎక్కడో ఉన్నాడు, కొడుకు లేడు, వంటరి జీవితంతో ఈరోజు లక్షల అప్పుతో ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తోంది. ఏ రకంగా మనం వీళ్లను ఆదుకోవాలనేది మీరు ఆలోచించాలి. ఏదో నాలుగు పప్పుబెల్లాలు పెట్టాము, అరచేతిలో బెల్లం పెట్టాం మీరు మా మోచేతిని నాకండి అనే ఆలోచనలు, ప్రయత్నాలు ఇక మానుకోవాలి.
ఉ.10.20

రైతు కుటుంబంలోని ఏ ఒక్క చెల్లి, తల్లి బాధ పడినా నేను అండగా ఉంటానన్న ముఖ్యమంత్రి గారు నిజంగా ఇటువంటి సమయంలో వారిని ఆదుకోవడానికి ముందుకు రావాలి. నేను ఏ రకమైన విమర్శల జోలికి వెళ్లకుండా సహృదయంతో చెబుతున్నాను. ప్రభుత్వం రైతులను కరవు నుండి ఆదుకునే ప్రయత్నం చేస్తే నేనే మీకు చేతులెత్తి జోహారులు చెబుతాను.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

భావ దారిద్ర్యం కాని, భాషా దారిద్ర్యం కాని మాకు పట్టలేదు. మీరు చేస్తున్న అల్లర్లలో కొన్ని పొరపాట్లు జరుగుతాయన్న విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నాను.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

అధ్యక్షా, రైతుల కరవు బాధలు చెబుతుంటే కూడా అధికార పక్ష సభ్యులు ఇంతగా అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? అధికార పక్షానికి గంటల కొలది సమయం వున్నది. వారికి కేటాయించిన సమయంలో వాళ్లు చెప్పాలనుకున్నవి చెప్పమనండి. లేదంటే గత తొమ్మిది సంవత్సరాల తెలుగు దేశం పార్టీ పరిపాలన గురించే మాట్లాడతామంటే, మాట్లాడుకోమనండి. కాంగ్రెస్ పార్టీ గడచిన అయిదు సంవత్సరాల పాలనలో, లేక గత నెల రోజుల నుంచి రైతులు ఎదుర్కొంటున్న కరవు పరిస్థితిని గురించి మాట్లాడకపోయినా మాకు అభ్యంతరం లేదు. కాని ఈ సమస్యకు మాత్రం పరిష్కారం చూపించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. వారికి కేటాయించిన సమయంలో వారికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుకోమని కోరుతున్నాను.

పాపంపల్లి గ్రామం కల్యాణ దుర్గం మండలంలో రామన్న అనే రైతుకు రెండు బోర్లు ఉన్నాయి, అందులో నీరు కూడా పుష్కలంగా వుంది. వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్‌కు బదులు కేవలం నాలుగు గంటల విద్యుత్ సరఫరా చేయడమే కాక అనధికారిక కోత కారణంగా ఆ రైతు తనకున్న రెండెకరాల పంటను కూడా ఎండబెట్టుకునే పరిస్థితి వచ్చింది, ఒకవేళ మీరు నమ్మకపోతే మనందరం క్షేత్రానికి వెడదాం. ప్రస్తుతం మన రాష్ట్రంలో కరెంటు సరఫరా రైతులను కన్నీటి కష్టాలు పెట్టిస్తున్నది.

నల్గొండ జిల్లాకు చెందిన ప్రతాపరెడ్డి అనే రైతు రూ.యాభై వేలు అప్పు చేసి ఉల్లి పంటను సాగు చేశాడు. సరైన సమయంలో వర్షాలు పడక అతని ఉల్లి పంట పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం పంటల పరిస్థితి ఏ విధంగా వుందంటే ఎండిపోయిన పంటలను భూమి నుండి పీకి తెచ్చుకోవడం కూడా కూలి నష్టమని పశువులకు వదిలేసిన పరిస్థితులున్నాయి.

ఇక నెల రోజుల క్రితం విత్తనం వేసిన వేరుశనగ పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉంది. రెండు, మూడు, నాలుగు సంవత్సరాల నుండి కష్టపడి పెంచుకున్న చీనీ చెట్లు, ఎనిమిది పది నెలల క్రితం నుంచి పెంచిన అరటి చెట్లను కూడా రైతులు నరికి వేస్తున్నారు. దాదాపు వెయ్యి ఎకరాలలో చెట్లను నరికి వేసిన సంఘటనలు అనంతపురం జిల్లా శాసన సభ్యులకు తెలుసు. జీవితాంతం సంపాదించి ఆ చెట్లను పెంచడానికి పెట్టుబడి పెట్టి ఫలితం రాక నరికివేశారు. ఈ నష్టాన్ని ప్రభుత్వం ఎంత వరకు అంచనా వేసింది? ఎన్ని అరటి చెట్లు, చీనీ చెట్లు ఎండిపోయాయో ప్రభుత్వం ఏమైనా అంచనా వేయించిందా? ప్రభుత్వ స్టేట్‌మెంటులో ఆ విషయం గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. కంటి తుడుపు చర్యగా గ్రామాలలో కరవు నివారణకు పది కోట్ల

రూపాయలు, పట్టణాలలో త్రాగు నీటి కొరతను తీర్చడానికి పది కోట్ల రూపాయలను కేటాయించినట్లు ప్రభుత్వం చెప్పుకుంటోంది.

గడచిన పది సంవత్సరాలలో నాలుగు ఎకరాలలో నాలుగు వందల చీనీ చెట్లను పోషిస్తే అయిదు సంవత్సరాలలో పది లక్షల రూపాయలు చెట్లను కాపాడుకోవడానికి ఖర్చు పెడితే దాని మీద వచ్చిన ఆదాయం నాలుగు లక్షల రూపాయలు మాత్రమే. కంటి ముందు చెట్లు నీరు లేక ఎండిపోతుంటే వాటిని నరికేసే పరిస్థితి. పది లక్షల రూపాయలు ఖర్చు పెట్టి దాని మీద కేవలం నాలుగు లక్షల రూపాయల ఆదాయం తీసుకుని మరో ఆరు లక్షల రూపాయల అప్పు పెట్టుకుని భవిష్యత్ మీద ఆశ లేని బాల వెంకట్ రెడ్డి వంటి రైతులకు ఈ ప్రభుత్వం ఏ రకమైన చేయూతనిస్తుందో ప్రభుత్వాన్ని చెప్పమనండి, సంతోషిస్తాం. అప్పు చేసి పంటలకు నీరు అందించినా లాభం లేకపోయింది.

వెంగన్న పల్లికి చెందిన వెంకట నారాయణ అనే రైతు తనకున్న అయిదున్నర ఎకరాలలో 550 చీనీ చెట్లను పెంచడానికిధైర్యం చేసి ఈరోజు కాకపోయినా మున్ముందైనా వరుణ దేవుడు కరుణించకపోతాడా, వర్షం రాకపోతుందా అని ట్యాంకర్లు పెట్టి ఎక్కడో ఇతర గ్రామాల్లో వాళ్ల బంధువుల దగ్గర నీటి వసతి వుంటే వాటిని తెచ్చుకోవడానికి కేవలం రవాణా ఖర్చు క్రింద రూ.1,50,000/- వెచ్చించాడు.

జయ శంకర్ రెడ్డి అనే రైతు రోజుకు అయిదు వేల రూపాయలు ఖర్చు చేస్తే తప్ప చెట్లు బ్రతికే పరిస్థితి కానరావడం లేదు. ఇంకెన్ని నెలలు ఈ విధంగా ఖర్చు చేయాలని, అందుకే చెట్లను నరికి వేశానని చెప్పాడు.

రైతుల బాధలు ఎన్ని రకాలున్నాయంటే వేసిన విత్తనం మొలకెత్తలేదని, మొలకెత్తిన మొలకలు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంకా హృదయ విదారకమైన విషయం ఏమిటంటే ఈరోజు రైతు కుటుంబాలకు చెందిన మహిళలు వారి నగలను కూడా తాకట్టు పెట్టుకుని, ఆఖరికి మంగళ సూత్రాలను కూడా తాకట్టు పెట్టుకుని డబ్బులు వ్యవసాయానికి ఖర్చు చేయడం మూలంగా వారు శుభకార్యాలకు కూడా హాజరుకాలేక దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతోంది.

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

అధికార పక్ష సభ్యులు రాష్ట్రంలో ఇంత కరవు నెలకొంటున్నా వారు ఏమీ పట్టించుకోకపోగా చాలా సంతోషంగా, సంతృప్తిగా, సంతుష్టిగా ఉన్నారనడంలో నాకెటువంటి సందేహం లేదు. వాళ్లు అల్లరి మానకపోతే నేను ఇదే చెప్పాల్సి వస్తుంది. అధికార పక్ష సభ్యులకు ఈ రైతుల కష్టాలన్ని సినిమా కష్టాల్లాగా అనిపిస్తాయేమో గాని ఇవి వాస్తవంగా ప్రజల కష్టాలన్న సంగతి మర్చిపోతున్నారు.

వెంకట్రాముడు అనే డెబ్భై ఎకరాల రైతు గురించి పత్రికలలో హృదయవిదారకంగా రాశారు. అతని పరిస్థితి ఏ విధంగా ఉందంటే అతని కుటుంబ సభ్యులను శుభకార్యాలకు తీసుకువెళ్లలేకపోతున్నాడు. దానితోపాటు పది మందికి ఉపాధిని ఇచ్చిన రైతు, 40, 50 పశువులను పోషించిన రైతు ఈరోజు తాను కూలీకి వెళ్లలేక, తన కుటుంబ సభ్యులను కూలీకి తీసుకువెళ్లలేక, కనీసం శుభకార్యాలకు కూడా తీసుకువెళ్లడానికి మొఖం చెల్లక బాధపడుతున్నారు. రాయలసీమలో డెబ్భై ఎకరాల భూస్వామి అంటే చాలా పెద్ద రైతు. మరి అటువంటి

రైతులు కూడా ఈరోజు విలవిలలాడుతుంటే వాళ్ల కష్టాలను గురించి మనం ప్రస్తావించకపోవడం చాలా బాధాకరం.

ఇక పశువుల విషయానికొస్తే, నోరున్న మనుషులైతే కరవు ఏర్పడినప్పుడు ఎక్కడికో ఇతర ప్రదేశాలకు వెళ్లి బ్రతకడానికి ప్రయత్నం చేస్తారు. మరి మూగ జీవాలు మాత్రం ఈ విధంగా వెళ్లలేవు. పశువులను ఇక్కడి నుండి అనంతపురం తీసుకెళ్లినా లేదంటే అనంతపురం నుండి ఇక్కడికి తీసుకు వచ్చినా లారీలకు లారీలు కబేళాలకు తరలిపోతున్న పరిస్థితిని చూస్తుంటే ఎంత హృదయ విదారకమో మీరు ఆలోచించండి. కన్న బిడ్డల్లాగా పోషించుకునే పశువులకు పశుగ్రాసాన్ని అందించలేని పరిస్థితులలో రైతు ఎంతో బాధగా వాటిని అమ్ముకుంటాడు. ప్రభుత్వం వాటిని పశువుల్లాగానే చూస్తుందేమో గాని నేను మాత్రం వాటిని ప్రాణులుగా చూడమని కోరుతున్నాను. గడ్డిని తరలించాల్సిన అవసరం లేదని ఎవరో మంత్రి గారు వారి ప్రకటననో లేక ఈ ప్రభుత్వం ప్రకటననో నేను చూశాను. అందువల్ల పశువులును పశువుల్లాగా కాకుండా ప్రాణులుగా చూడాలని నేను కోరుతున్నాను.

మా ఇంట్లోకి వెళ్లగానే ముందుగా పశువుల పాక కనిపిస్తుంది. దాన్ని దాటుకుని వెళితేనే ఇంట్లో యజమానులు కనిపిస్తారు. నా ఇల్లే కాదు, ఏ ఇల్లయినా, ఎవరి ఇల్లయినా, అనంతపురం జిల్లాలో ఉన్న రైతులు పశువులకు ఇచ్చే ఆప్యాయత, అనురాగం ఎటువంటిదని గమనిస్తే ఏ రైతైనా ఇంట్లోకి అడుగు పెట్టగానే ముందుగా పశువులకు గడ్డి వేసిన తర్వాతనే ఇంట్లోకి వెళ్లి కాళ్లు కడుక్కుని భోజనం చేస్తాడు. పశువులను ప్రత్యేకంగా చూడవలసిన అవసరం లేదు. ఒక కుటుంబ సభ్యుడిని ఏ విధంగా చూస్తారో ఆ విధంగా పోషించుకునే పశువులు ఈరోజు కరవు మూలంగా వాటికి తిండి పెట్టలేని పరిస్థితులలో రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. అవి కబేళాలకు పోతాయని తెలిసినా వాటిని సగం ధరకే అమ్ముకుంటున్న ఈ రైతులను ఏ రకంగా ఆదుకుంటాం? ఇరవై వేల రూపాయలు పెట్టి కొన్న పశువులను కేవలం పన్నెండు వేల రూపాయలకు అమ్ముకుంటుంటే, ఇంతటి దయనీయమైన పరిస్థితులుంటే వీటిని వాస్తవాలుగా అంగీకరించే మనసు మనకు లేకపోతే చాలా కష్టం. రాష్ట్రంలో ఏర్పడిన కరవును దృష్టిలో పెట్టుకుని ప్రజల ఇబ్బందులను తెలుసుకుని, వీటి నుంచి ఏ రకంగా బయటికి తేవాలనే ప్రయత్నం చేయాలి కాని ఇవేమీ వాస్తవాలు కాదని మనం దాచేసుకోవడానికి ప్రయత్నం చేయడం చాలా తప్పు.

రైతులు వారి పంటలు ఎండిపోతుంటే చూడలేక తపనతో బడికి వెళ్లే పిల్లలు కూడా బడి మానేసి, కుటుంబ సభ్యులంతా పొలం దగ్గరకు వెళ్లి బిందెలతో ఎక్కడో దూరంగా ఉన్న బోర్ల నుంచి నీళ్లు తెచ్చి సాలు, సాలుకు నీరు పోసి వేరుశనగ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంటే ఈ ప్రకృతి మీద వారు చేస్తున్న పోరాటానికి కనీసం ఈ ప్రభుత్వం కొంతైనా చేయూతనివ్వాల్సిన అవసమున్నది. రైతుల కుటుంబాలు పడుతున్న ఆవేదనలో ఈ ప్రభుత్వానికి కొంతైనా మనసుంటే వాళ్లను ఆదుకునే ప్రయత్నం చేస్తుంది. కనీసం ఆ దిశగానైనా ప్రభుత్వాన్ని ఆలోచించమని నేను కోరుతున్నానే తప్ప ఇవి నిజాలు కావు, వాస్తవాలు కావని దాచేసే ప్రయత్నం మాత్రం దయచేసి చేయొద్దని చెబుతున్నాను.

ఇక కరవు రక్కసి మరణ శాసనం గురించి చెప్పాలంటే ఒక్కొక్క జిల్లాలో ఎంత మంది రైతులు చనిపోయారనేది గమనించాలని నేను కోరుతున్నాను.

సుబ్బారెడ్డి అనే రైతు పురుగు మందు తాగి చనిపోతూ ఆయన భార్య, ముగ్గురు కొడుకులుంటే వారికి చెప్పిన విషయం ఏమిటంటే నాకు ఈ విధంగా అప్పులున్నాయి, తనకున్న భూములను అమ్మి అప్పులు

తీర్చమని మరణ వాంగ్మూలం ఇచ్చే పరిస్థితి. అంటే రైతు చనిపోతూ కూడా ఎంత నిజాయితీగా బ్రతుకుతాడనే దానికి ఇది నిదర్శనం. రాష్ట్రంలో పరిస్థితులు ఈ విధంగా ఉంటే ఇటువంటి పరిస్థితులు ఏం లేవు, వీటిని మేం చూడకూదని అనుకుంటామా. ఈ రోజు సభలో వ్యవసాయ మంత్రిగారు మాట్లాడుతూ మీరు రైతులకు సంబంధించి కేవలం సూచనలివ్వమని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ అయిదున్నర సంవత్సరాల పాలనలో ఏరోజైనా రైతుల కష్టాలు వినే ప్రయత్నం చేసిందా? కనీసం మా పార్టీ సభ్యులం కరవు గురించి మాట్లాడే ప్రయత్నం చేస్తే దానికి సానుకూలంగా స్పందన కూడా ఈ ప్రభుత్వానికి కరువైనది. ప్రభుత్వానికి మేం కరవు బాధలు, కష్టాలు చెప్పే ప్రయత్నం చేస్తుంటే మంత్రిగారేమో ముందు ఇవన్నీ ప్రక్కన బెట్టి సూచనలు చేయమని మాకు చెబుతున్నారంటే రైతుల బాధలు వినడానికి కూడా ఓపిక, సమయం లేదా అని నేను అడుగుతున్నాను.

ఒకే జిల్లాలో, ఒకే సమయంలో అయిదుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వరంగల్లు జిల్లాలోనే ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో శ్రీనివాస్ రెడ్డి అనే రైతు పొలంగట్టుకెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడనే విషయం రెండవ రోజు కూడా అతని కుటుంబ సభ్యులకు తెలియని పరిస్థితి.

ఉ. 10.30

ఎందుకంటే, ఆయనకు వున్నటువంటి సంబంధీకులు ఎవరంటే, వృద్ధురాలైనటువంటి తల్లి, భార్యకు పనిచేసుకునే ప్రయత్నంలో కొడుకు అమాయకుడు, ఆయన పొలం గట్టుకు పోయి ఆత్మహత్య చేసుకుంటే, మూడు రోజుల తరువాత తెలిసినటువంటి పరిస్థితి. ఎంత హృదయవిధారకం సార్, ఈరోజు. అంటే, చనిపో యినటువంటి పరిస్థితుల్లో వాళ్లు ఎట్లా చేసుకుంటున్నారో ఒకసారి చూడండి. భీమయ్యగారి వెంకటరెడ్డి సార్, మెదక్ జిల్లా సిద్ధిపేట. మా మిత్రుడు ఇంకా బాగా చెబుతాడు. ''వాన లేదు, నీరు లేదు, పంట లేదు, బ్రతుకు మీద ఆశలేదు, పగ్గం ఉరితాడైంది, పంట పొలంలోనే బలవన్మరణానికి వేదికైంది'' అని సార్. ఈరోజు ఆ రైతు చనిపోయిన తరువాత, ఆయన పరిస్థితి ఏందంటే, ఆయనకున్నటువంటి నీరుమడి, వరిమడికి నీరంద క........వరిమడికి నీరందక......

(సభలో అధికారపార్టీ సభ్యులు అందరూ నీరు మడి కాదు, నారుమడి అంటు కామెంట్స్)

(అంతరాయం)

అయ్యా, నారుమళ్లకు, నీరు మళ్లకు తేడా మీకు తెలియకపోవచ్చు గానీ, చాలా స్పష్టంగా నాకు తెలుసు. రైతుల కష్టాలను గురించి నేను చెబుతూ వుంటే, మీకు ఇంత ఆవహేళన చేయాల్సినటువంటి పరి స్థితి లేదు అని నేను చెబుతున్నాను.

మిస్టర్ స్పీకర్: కేశవ్ గారు, మీరు నావైపు చూడండి.

శ్రీ పయ్యావుల కేశవ్: సార్, మీరు నాకు కాదు సార్, ఆ సభ్యులకు చెబితే సంతోషిస్తాను.

మిస్టర్ స్పీకర్: వాళ్లకు కూడా చెబుతాను. You have taken forty minutes time Keshav garu. Still there are lot of speakers from Telugu Desam Party.

శ్రీ పయ్యావుల కేశవ్: సార్, ఆ సభ్యులకు ఒకసారి సూచన చేయండి తమరు, నేను సంతోషిస్తాను. అవసరమైతే తమరు వారిని సస్పెండ్ చేయండి.

(అంతరాయం)

ఇంతకన్న, ఈ శాసన సభ ముందు చర్చించడానికి వేరే అంశాలు లేవు. అంటే ఈ బాధలు కూడా నేను చెబుతుంటే వినడానికి కూడా వాళ్లకు ఓపిక లేకపోతే ఎట్లా సార్? నేను చెప్పేటటువంటి అంశాలు, Tip of an Iceberg Sir.

MR. SPEAKER: Please, please......

శ్రీ పయ్యావుల కేశవ్: ఒక్క జిల్లాలో, ఒక్క మండలంలో, ఒక్క గ్రామంలో, ఒక్క రైతు పరిస్థితిని నేను చెబితేనే, వాళ్లు విల విలలాడిపోతున్నారే, ఈరోజు గ్రామాలకు గ్రామాలు, మండలాలకు మండలాలు, జిల్లాలకు జిల్లాలు కరువుతో విలవిల్లాడుతుంటే, ఎట్లా వీళ్లు ఎగతాళి చేయగల్గుతున్నారు. మనసు లేదా, మానవత్వం లేదా, కనీసం ఆ దిశగా ఆలోచన కూడా చేయరా వీళ్లు. ఇంకా అడ్డుకునే ప్రయత్నం చేసేటటువంటి ప్రయత్నాన్ని నేను నిజంగా విచారిస్తున్నాను.

సార్, కరువు పరిస్థితిపై ఇప్పుడే మా, మహబూబ్‌నగర్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గం శాసన సభ్యుడు గారు చెప్పారు. వంగూరు మండలంలో యస్.సి. రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అంటే, శాసన సభ జరుగుతుండగానే కూడా మనకు రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వార్తలు వస్తే, వాటిని కూడా వినేటటువంటి పరిస్థితి మనకు లేదు. ఈరోజు ఇంత హృదయవిదారకంగా పరిస్థితి వుంది. ఈరోజు నేను చెప్పినటువంటి విషయాలు కేవలం వన్ పర్సంట్ కూడా కావు. ఒక శాతం కూడా కాదు. ఇంకా మా అనంతపురం జిల్లాకు వెళితే, ఎంత భయానకంగా వుంది పరిస్థితి? రైతులు ఈరోజున పంటలు వేసుకున్నారు.

మొత్తం చెబుతున్నాను. అంటే రాష్ట్రం మొత్తం కూడా ఈరోజు నేను ఉదాహరణకు అనంతపురం జిల్లాను ఇచ్చినా, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నెలకొన్న పరిస్థితి ఇది. నేను నా ప్రసంగాన్ని మొదలుపెట్టడమే గుంటూరు జిల్లాతో ప్రారంభించాను. కృష్ణా డెల్టా రైతుల గురించి మాట్లాడాను. వరంగల్ జిల్లా ప్రత్తి పంట రైతుల గురించి మాట్లాడాను. ఈరోజు ఒకసారి పరిస్థితి చూస్తే, రైతులు విత్తనాలు కొని తెచ్చుకున్నారు. రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందల రూపాయల దాక వడ్డీకి అప్పు తెచ్చి, విత్తనాల కొనుగోలుకు ఖర్చు చేసినటువంటి పరిస్థితి రైతుకు కల్గింది. అప్పులు చేశారు రైతులు. ఆ అప్పు ఖర్చు అయిపోయింది. ప్రభుత్వం ఈరోజు ప్రత్యామ్నాయ పంటలంటే, మళ్లీ రైతులు క్రొత్త అప్పుకొరకు ప్రయత్నం చేసేటటువంటి పరిస్థితి. దాన్ని ఏ విధంగా ఈరోజు ఆదుకోబోతున్నదనేటటువంటి పరిస్థితిని గురించి ప్రభుత్వం చెప్పాలి. వున్న ఋణాలను మాఫీ చేయాలి. ఆ తరువాత మళ్లీ క్రొత్త ఋణాలను ఏ విధంగా ఇస్తున్నాం. ఈరోజు ప్రైవేట్ ఋణంపై వడ్డీల రేటు భారం పెరిగిపోయింది. ప్రభుత్వం ఇచ్చేటటువంటి అప్పు, రైతుకు ఇచ్చే దాంట్లో ముప్లై శాతమే. డెభ్లై శాతం అప్పులను ఈరోజున రైతులు బయటినుండి ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్థుల వద్ద నుండి తెచ్చుకుంటున్నారనేటటువంటి విషయాన్ని ప్రభుత్వం కూడా అంగీకరించినటువంటి విషయమే. ఈ పరిస్థితులో ఆ రైతాంగాన్ని మనం ఏ విధంగా ఆదుకోబోతున్నాం? ఋణాలు మాఫి చేయడం. మంత్రి గారు వినాలి సార్. ఇది ఒక సూచనే. ఋణాలు మాఫి చేయాలి, అదనంగా ఋణాలు మంజూరు చేయాలి, లేదంటే రైతుకు వెంటనే పంట నష్టపరి

హారం అందజేయాలి. ఇంకా, ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించినటువంటి ఇన్సూరెన్స్, ఒక్క అనంతపురం జిల్లాకే రూ.600.00 కోట్లు అని ప్రకటించారు.

సార్, కేవలం ఈ ప్రభుత్వం ప్రకటనలతోటే రైతులను మభ్యపెట్టడానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. ఈరోజు రైతులు ఇంత తీవ్రమైన కష్టాల్లో వుంటే, వీళ్లు చెబుతున్న సమాధానమేమిటంటే, కేంద్ర ప్రభుత్వం రూ.300.00 కోట్లు ఇవ్వాలి, రాష్ట్ర ప్రభుత్వం రూ.300.00 కోట్లు ఇవ్వాలనేటటువంటి మాటను ప్రభుత్వం చెబుతుంది. ఏమి, మీ లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌లో అనంతపురం జిల్లాలోని రైతులకు అడ్వాన్స్‌గా రూ.300.00 కోట్లు ఇవ్వడానికి మీ మనసు ఒప్పడం లేదా? ఆ మూడు వందల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నుండి తెచ్చుకుని, సర్దుబాట్లు చేసుకోవడానికి మీకు నిబంధనలు అంగీకరించవా? ఏ కారణాలు చెప్పి మీరు ఇట్లా వాయిదాలు వేస్తున్నారని చెప్పి నేను అడుగుతున్నాను. ఈరోజు ఈ కల్లిబొల్లి మాటలతో మోసం చేసేటటువంటి ప్రక్రియను మానుకోమంటున్నాను. ఈరోజు ఆ రైతును ఏ రకంగా ఆదుకోవాలి. దీంట్లో నామోషి పడాల్సినటువంటి అవసరం లేదు.

సార్, ఈరోజు రాష్ట్రంలోని రైతుల పరిస్థితి ఎట్లా వుంది. తానేమో రైతు. నిన్నటిదాక పది మంది కూలీ వాళ్లను పెట్టుకున్నాడు. ఈరోజు ఆ కూలీ వాడితో పనికి పోవాలంటే అతనికి నామోషి వచ్చినటువంటి పరిస్థితి. ఆ రైతుకు ఇంట్లోనేమో తినడానికి తిండి లేదు, బయటకు వెళ్లి పని చేసుకోలేడు. అటువంటి రైతుకు పరిష్కారం చూపమని ప్రభుత్వాన్ని ఈరోజున నేను కోరుతున్నాను. ఈరోజు ప్రభుత్వం చెప్పాల్సింది, గత సంవత్సరం ఒక్క అనంతపురం జిల్లానే ఉదాహరణకు తీసుకుంటే, రూ.3000.00 కోట్ల పంట నష్టం వచ్చింది. మీరిచ్చే ఆరు వందల కోట్ల రూపాయలు ఇంకా రాలేదు. ఆ వచ్చే ఆరు వందల కోట్ల రూపాయలు ఏ మూలకు సరిపోవు. మళ్లీ రైతుకు ఇప్పుడు కష్టం వచ్చింది. రైతుకు కరువు వచ్చింది. ఏ రకంగా ఆదుకోబోతున్నారనేటటువంటిది నేను ఇప్పుడు చెబుతున్నాను. మీరు వెంటనే రైతుకు పంటనష్ట పరిహారాన్ని ఇచ్చే ప్రయత్నమైనా చేయండి, ఆలోచనైనా చేయండి అని చెబుతూ, ఈరోజున ప్రభుత్వం మాత్రం తన బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం అడుగడుగునా చేస్తోంది. కరువు మీద చర్చ దగ్గర నుంచే మొదలై, బాధ్యతను తప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఈరోజు బోర్లు అన్ని ఇంకిపోయినాయి. నీరు అడుగంటిపోయినాయి. పూర్తిగా ఎండిపోయినాయి. త్రాగునీటి అవసరాలు విపరీతంగా పెరిగిపోయినాయి. ప్రభుత్వం ఈ స్టేట్‌మెంట్‌లో ఇచ్చింది ఎంత? త్రాగునీటి అవసరాల కోసం గ్రామీణ వ్యవస్థకు పది కోట్ల రూపాయలు, అర్బన్‌కు పది కోట్ల రూపాయలు. ఏ రకంగా ప్రభుత్వం దీన్ని సమర్థించుకుంటుంది? నిన్న గాక మొన్న జరిగినటువంటి ఒక్క అనంతపురం జిల్లా డి.డి.ఆర్.సి. సమావేశంలోనే, అన్ని పార్టీలకు చెందినటువంటి సభ్యులు కలిసి ఏకగ్రీవంగా ఒక్క జిల్లాకే తక్షణ అవసరాలకే పది కోట్ల రూపాయలు అవసరమని తీర్మానించారు. అంటే, ఒక్క జిల్లా పరిషత్ సమావేశంలో ఇచ్చినటువంటి తీర్మానం. ఒక్క జిల్లాకు తక్షణ అవసరాలకు సరిపోయే పది కోట్ల రూపాయలు రాష్ట్రం మొత్తానికి మీరిచ్చి, రాష్ట్రం మొత్తాన్ని కూడా ఉద్ధరిస్తున్నాం, మీరు చూసుకోపోండని చెబితే, దాన్ని సమర్థించే స్థితిలో ఈ శాసన సభ్యులుంటే, దీన్ని ఏరకంగా భావిస్తారో వాళ్లు ఆలోచించుకోవాలనేటటువంటిది నేను చెబుతున్నాను.

ఈరోజున కనీసం ముందు నష్టం అంచనావేసే పరిస్థితిలోకి, ప్రభుత్వం బయలుదేరాలని చెప్పి నేను చెబుతున్నాను. ఈ సంవత్సరం కూడా మా రైతులకు ఇప్పటికే వెయ్యి కోట్ల రూపాయల నష్టం జరిగింది. పెట్టుబడుల రూపంలో ఒక్క జిల్లా రైతులకే నష్టం జరిగింది. నష్టం జరిగిన ఈ రైతులను ఏ రకంగా ప్రభుత్వం ఆదుకోబోతుందనేటటువంటిది మనం ఆలోచించాలి. ఇప్పుడు ప్రభుత్వం, 50% ఏరియాల్లో మేం విత్తనాలు వేసా

మనేది ఏదైతే చెబుతున్నారో, ఆ వేసిన పంట ఎంత నిలిచింది అనేటటువంటిది కూడా ఈ నివేదికలో ఇచ్చి వుంటే నేను ఎంతో సంతోషించి వుండేవాడిని. ఎందుకంటే, ఆ పంట కూడా దాదాపు ఎండిపోయే పరిస్థితిలో వుంది. ఆ నష్టానికి మూల్యం చెల్లించమని చెబుతూ, ఆ నష్టానికి ఖరీదు కట్టి రైతుకు నష్టపరిహారాన్ని చెల్లించ మని చెబుతూ, నేను ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

అట్లాగే, ఈరోజు ప్రభుత్వం నివేదికలో ఇచ్చిన లెక్కలను చూస్తే, 70 లక్షల హెక్టార్లకు గానూ 38 లక్షల హెక్టార్లల్లో మాత్రమే సాగు చేయగల్గిందంటే, సగం భూమిని కూడా ఈసారి మనం సాగులోకి తేలేకపోయాం. అంత దుర్భిక్షపరిస్థితులు రాష్ట్రంలో ఈరోజున వున్నాయి. ఆ సగం భూమిలో కూడా మనం కనీసం ఇంత వరకు ఏమి చేశాము, ఎంత మేరకు వుందనేటటువంటి ప్రయత్నం చేయలేదు. అది, వ్యవసాయం మీద వీళ్లకు ఎంత మమకారం వుందో ఆ బడ్జెట్ కేటాయింపులు చూస్తేనే అర్థమైపోతుంది. ముఖ్యమంత్రి గారు చెప్పే మాటలకు, బడ్జెట్‌లోని కేటాయింపులకు ఏ రకంగా పొంతన లేదు. ఈరోజున ప్రభుత్వం ఇచ్చిన కరువు సాయం ఏమూ లకు సరిపోదు. ఎంతసార్, మొత్తం వీళ్లిచ్చిన స్టేట్‌మెంట్‌లో ఒకసారి చూస్తే, మొత్తం రూ.80.00 కోట్లు కేటా యిస్తే, దాదాపు వెయ్యి మండలాలకు పైగా, పదకొండు వందల మండలాలు ఈరోజున కరువుకు విలవిల్లాడు తుంటే, మండలానికి ఐదు లక్షలో, ఆరు లక్షల రూపాయల వంతున వస్తే, ఏ మూలకు సరిపోతుంది సార్ ఈ సాయం? ఏ రకంగా మీరు ఈరోజున రైతుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కోసం విత్తనాలు కొనడానికి ఇస్తారా, లేకపోతే, సాగుచేసుకోవడానికి ఇస్తారా, లేదా మళ్లీ పొలం దుక్కి దున్నడానికి ఖర్చుల నిమిత్తం ఇస్తారా? త్రాగునీటి అవసరాలు తీర్చడానికి ఇస్తారా? ఆరు లక్షల రూపాయలు ఎన్ని గ్రామాలకు ఇస్తారు? గ్రామానికి ఇచ్చే పది, ఇరవై వేల రూపాయలతో ఏమి చేయబోతోందని ప్రభుత్వాన్ని ఈరోజున నేను అడుగుతున్నాను. ఈ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత వ్యవసాయంపై మాటలు పెరిగినాయి. '' రైతులకేమో వ్యయం పెరి గింది, సాయం తగ్గింది'' ఇది ప్రభుత్వం తెలుసుకోవాల్సినటువంటి డెఫినిషన్ వ్యవసాయంలో ఈరోజున.

మంత్రి గారు, ఇక్కడ లేరు. unfortunate Sir.

(అంతరాయం)

Most unfortunate Sir. ఎందుకంటే, ఆయనకున్న అలవాటేమిటంటే, ఆయన శాఖ గురించి తక్కువ మాట్లాడతాడు, ఇతర శాఖల గురించి ఎక్కువ మాట్లాడతాడు. ఈరోజు కూడా అదే జరిగింది. ఆయన శాఖ గురించి అంతో, ఇంతో, ఆయనకు సంబంధించినటువంటి శాఖపై చర్చ వస్తే, దానికి సమాధానం చెప్పడు.

మిస్టర్ స్పీకర్: ప్లీజ్, కేశవ్ గారు,

శ్రీ పయ్యావుల కేశవ్: సార్, అర్థాకలితో అర్థ నగ్నంగా వున్న వారి కష్టాల గురించి మాట్లాడమంటే, మా గుడ్డలిప్పుతామంటాడు సార్. ఆ అర్థాకలితో వున్నటువంటి దాన్ని ఏ రకంగా మాట్లాడారు? ఒక మంత్రిగా కాదు, కనీసం ఒక మనిషిగా మాట్లాడమని కోరుతున్నాను. దాన్ని ఎట్లా మీరు విని ఊరుకున్నారు సార్. మీరు అంత ఉదారహృదయులైపోయినారా సార్? అట్లాంటి మాటలు ఆయన ద్వారా ఆరోజున సభలో వస్తుంటే.

MR. SPEAKER: Keshav garu, please conclude.

శ్రీ పయ్యావుల కేశవ్: నిన్న ఆయన ఇంకా సభలో లేచి ఏమి చెబుతున్నాడంటే, ''అన్నాను, అన్నాను, అన్నాను'' అంటారు. అదేదో గొప్ప విషయమైనట్టు. సిగ్గుపడాల్సిన అంశాన్ని అంత చెబుతూవుంటే, ఈరోజు ఎందుకన్నావు, నీవు అన్నా, మేం ఎందుకు ఊరుకున్నామో, ఈ సభలో చెప్పాల్సిన అవసరం వుంది. ఆరోజు ఎంతో కీలకమైన చర్చ జరుగుతుంది. ఓబుళాపురం గనుల గురించి చర్చ జరుగుతూ వుంటే............

MR. SPEAKER: Mr. Keshav, concentrate on 'drought situation' subject please.

శ్రీ పయ్యావుల కేశవ్: పోవడం లేదు. It's only passing reference. ఓబుళాపురం గనుల గురించి చర్చ జరుగుతూ వుంటే, మధ్యలో మంత్రి గారు లేచి ఇలా అన్నారు. అంటే, మేము, ఈ మంత్రి గారి వ్యాఖ్యలను పట్టుకుంటే.............

(అంతరాయం)

MR. SPEAKER: Please sit down.

శ్రీ పయ్యావుల కేశవ్: మేము, ఈ మంత్రి గారి వాఖ్యలను పట్టుకుంటే, అసలు సమస్య గాలిలోకి పోతుంది. కాబట్టి మా నాయకుడు పదే,పదే చెప్పాడు. మీరు ఎన్ని అవమానాలు చేసినా, మీరు ఎంత అస భ్యంగా మాట్లాడినా, అసలు సమస్యలకోసం పట్టుబడతామని. అందుకే మేం ఆ రోజున ఎత్తలేదనేటటువంటిది మీద్వారా, మంత్రిగారికి, సభ దృష్టికి పరిచయం చేస్తున్నాను సార్.

(వ్యవసాయశాఖ మంత్రి, శ్రీ ఎన్. రఘువీరారెడ్డి గారు సభలో తన స్థానంలో ఆసీనులైనారు.)

మంత్రి గారు వచ్చారు సార్, ఈరోజున, మళ్లీ రిపీట్ చేయడానికి కూడా నేను చెబుతున్నాను. ఈయన, వాటాల గురించి, అకౌంట్స్ సెటిల్‌మెంట్ గురించి మీరు పోరాడుతున్నారా? అని అన్నాడు.

MR. SPEAKER: Concentrate on the subject only.

శ్రీ పయ్యావుల కేశవ్: అది మంత్రిగారి స్వీయ అనుభవంతో చెబుతున్నారని మేము అనుకోవాలా సార్?

ఉ.10.40

మంత్రిగారు వచ్చారు మళ్లీ రిపీట్ చేయడానికి నేను చెబుతున్నాను. ఈయన వాటాల గురించి ఎకౌంట్సు సెటిల్‌మెంటు గురించి మీరు పోరాడుతున్నారు అన్నారు. అది మంత్రిగారు స్వీయ అనుభవంతో చెబుతున్నారని మేము అనుకోవాలి. ఈ రోజు పల్లె కన్నీరు తుడిచే ప్రయత్నం చేయమంటున్నాము.

మిస్టర్ స్పీకర్: కేశవ్‌గారు, యాక్టువల్‌గా టు అవర్సు. మీ నాయకుడు 5 గంటలు అడిగినారు. We have allotted 5 hours.

శ్రీ పి. కేశవ్: అధ్యక్షా, ఓ కుమ్మరి, ఓ కమ్మరి, చేనేత కార్మికులు, వీళ్ల పుణ్యమా అని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టివేశారు. నెట్టడమే ప్రవృత్తిగా పెట్టుకొన్నది ఈ ప్రభుత్వం . ఈ రోజు మా ఉరవకొండ, ధర్మవరం వస్తే చూపిస్తాను. చేనేత కార్మికుల బ్రతుకులు ఎంత చితికిపోయాయో అటువంటి వాళ్లకి మామూలు రోజుల్లోనే పూటగడవడం కష్టంగా వుంది. వారం రోజులు కష్టపడితేనే గాని ఒక చీర తయారు కాదు.

చీరకు 40 రూపాయలు రోజు కూలీ కూడా రాదు. ఇక కరువులో వారు పడుతున్న కష్టం, బాధ, ఆవేదన ఈ ప్రభుత్వానికి ఎలా తెలుస్తుంది? కనీసం ఆ ప్రయత్నం చేయమంటున్నాను. మీరు ఇచ్చిన స్టేట్‌మెంటు ఏమిటి సర్? కనీసం చేనేత కార్మికుల, చేతి వృత్తుల గురించి ఒక్క మాట మాత్రము అయినా దాంట్లో మీరు మాట్లాడే ప్రయత్నం చేయలేదే, మీకు మనస్సు వుందని అనుకోవాలా, మనస్సు లేదని అనుకోవాలా? మీకు ఆలోచన కూడా లేదని అనుకోవాలా? ఈ రోజు ప్రకృతి వైపరీత్యాలు కూడా రాజకీయాలకు వాడుకున్నారు. ఇవాళ వర్షాలు వస్తే మా గొప్ప తనం , వర్షాలు రాకపోతే ప్రపంచ వ్యాప్తం అంటున్నారు. మా ఖజానా గలగలా అడితే మా గొప్పతనం, ఖజానా ఎండిపోతే ఆర్థిక మాంధ్యం. ఇది ఆర్థిక మాంద్యమో బుద్ధి మాంద్యమో నేను అనలేను సర్, గతంలో ఇట్లాంటి కరువులపై మీరు ఎంత దుష్ప్రచారం చేశారు? తెలుగుదేశం హయాంలో కరువు అన్నారు. ఈ రోజు దేశ వ్యాప్తంగా కరువు వుంది, ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా కరువు వుంది. కరువు వున్నా, కష్టాల్లో వున్నా, ఆ రోజు చంద్రబాబునాయుడు ఎంతో సమర్ధవంతగా ప్రజలను ఆదుకున్నాడు అనేటటువంటిది మేము చెబుతున్నాము. రైతులకు 40 లక్షల మందికి కరువు పెన్షన్లు ఇచ్చారు. కరువుని స్వల్పకాలికంగా, దీర్ఘకాలికంగా ట్యాకిల్ చేయవలసిన అవసరం ఈ ప్రభుత్వానికి వుంది. ఆ రోజు వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చరులు తెలిసిందే ఏమిటి సర్, ఆ రోజు చెక్‌డ్యామ్స్ నిర్మించుకున్నాము, కాంటూరు ట్రెంచెస్ వేశాము, పొలం గట్లు వేశాము, ఇంకుడు గుంతలు వేశాము. అప్పుడు ఎంత అవహేళన చేశారు? ఈ 5 సంవత్సరాల పాలనలో కొత్తవి ఏమైనా కనిపెట్టారా? భూమిలోకి నీళ్లు ఇంకేలా చేయడానికి ఇంకా మంచి మార్గాలు కనిపెట్టారా? వాటిని అమలు చేశారా? మీరు కాని, కేంద్రం కాని ఇంతకన్నా గొప్ప ఆలోచన ఏమైనా తెచ్చారా? అవి చేయకపోవడం మూలానే ఈ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్సు ఈ ప్రభుత్వం నెగ్లెక్ట్ చేయడం మూలనా ఈ రోజు కరువు తీవ్రత ఇన్ని రెట్లు పెరుగుతుంది అందుకనే ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఇకనైనా కళ్లు తెరవండి. ఈ వాటాల గురించి వేటి గురించే ప్రాజెక్టులు కాదు. ప్రాజెక్టులతోబాటు మెట్ట ప్రాంతాల గురించి, గ్రౌండ్ వాటర్ గురించి, ఆలోచించవలసియున్నది. ఈ ప్రభుత్వం ఆ రోజు ఎగతాళి చేసి నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ఈ రోజు ఈ స్థితికి వచ్చింది. ఈ రోజు వర్షాల గురించి రోశయ్యగారు మాట్లాడారు. వర్షాలు పడకపోతే ఎవరో సంతోషిస్తారని చాణిక్యుడు ఒకటి చెప్పారు. దానిని చెబితే మళ్లీ వక్రీకరిస్తారు అందుకని నేను చెప్పడం లేదు. వర్షాలు వస్తే రైతులు సంతోషిస్తారు కాని ఒకరు బాధపడతారని ఒక వర్గం అంటున్నారు. ఇక్కడ కొని అక్కడ అమ్ముకొనే వాళ్లు అక్కడ ఎక్కువ వున్నారు. ఈ రోజు మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ఈ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకొనే పరిస్థితి లేదు. వరుణ దేవుడా ఇకనైనా కరుణించాలని చెప్పి పదే పదే మేము కోరుకుంటున్నాము. రైతుల కష్టాలు తీరాలి, కన్నీళ్లు తుడవడం కోసం వర్షాలు కురవాలని మేము కోరుకుంటున్నాము. ఈ ప్రభుత్వం మేఘ మథనం పేరుతో రానప్పుడు అవి ఎట్లా వున్నాయి సర్? వర్షాలు రానప్పుడు అవి గాలిలో ఎగురుతాయి కాని పేపర్లో మాత్రం వర్షాలు పడుతాయి. ఆ రిపోర్టు సకాలంలో చేతికి అందలేదు అది చదివి వినిపిస్తే , ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షాలు పడినట్లుగా నమోదు అయినది. ఇంత అన్యాయం బ్లేటెంటుగా పేపర్లో వర్షాలు కురిపించి ఒకటి కాదు, రెండు కాదు, వంద కోట్లు రూపాయలు దాటి పోయింది. ఏమి అయినాయి. వర్షాలు వచ్చినప్పుడే విమానాలు గాలిలో ఎగురుతాయి వర్షాలు రాకపోతే ఆ విమానాలు ఎగరవా? ఇంకొక ప్రాజెక్టు పెట్టండి. ప్రభుత్వం ఏమి చెబుతున్నారు అంటే మేఘాలు లేవని, ఇంకో ప్రాజెక్టు ఆ మేఘాలు లాకొచ్చేదానికి ఏదన్నా ఒక ప్రయత్నం చేయమని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. దాని పేరుతో సంవత్సరానికి 200, 400 కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయి మనం ఏమైనా చేయించామా అనేటటువంటిది, ఇంత దారుణమా? ఈ దేశంలో 2 ప్రాంతాల్లో ఆత్మహత్యలు ఎక్కువ జరుగుతున్నాయి. విదర్భలోను, ఆంధ్రప్రదేశ్‌లోను , ఈ ప్రభుత్వం, సభ కూడా

గుర్తించవలసిన అంశం . ఈ రోజు గొర్రెల కాపరులు వున్నారు ఇవాళ జిల్లాలకు జిల్లాలే వదిలిపోతున్నారు. అనంతపురం వదిలివేసి తుంగభద్ర డ్యామ్ వరకు పోయే టువంటి పరిస్థితి.

MR.SPEAKER : Concentrate on drought.

శ్రీ పి.కేశవ్: అధ్యక్షా, సభాపతిగా నేను మీకు 5 సంవత్సరాలలో చేతులు ఎత్తి నమస్కరించాను. కరువు బాధలు కనీసం కొన్ని అయినా ప్రభుత్వ దృష్టికి తీసుకురానీయండి.

MR.SPEAKER : Lot of other speakers from TDP have also given their names. If you adjust among yourselves it's O.K.

శ్రీ పి.కేశవ్: అధ్యక్షా, ఈ ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికి మేము అప్పుడప్పుడు చురకలు వేయవలసిన అవసరం వున్నది. రెండు సంవత్సరాల క్రితం ఏ టి.వి.పెట్టినా ఒకే ఒక ప్రకటన పదే పదే వచ్చేది. ముందు రాజశేఖరరెడ్డిగారు నడుస్తు వుంటే నేలంతా పచ్చగడ్డి వెనుక గంగమ్మ తల్లి నాట్యం అయింది. ఈ రోజు కరువు రైతుల ఆక్రందన వినపడడం లేదా? ఆ మూగ జీవుల ఆవేదనలు వినపడడం లేదా? నడవమనండి రాజశేఖరరెడ్డిగారిని ఆ పశువులకు ఇంత మేతైనా దొరుకుతుంది. ఎప్పుడో మర్చిపోయారు, పదవుల కోసం పాదయాత్రలు అయిపోయినాయి ఆ తరువాత గాల్లో తిరుగుళ్లు మొదలు అయినాయి, రోజు గాలిలో తిరిగే హెలికాప్టర్లు అలసి పోయినాయి, అరిగి పోయినాయి. ఇకనైనా నేలకు దిగి ప్రజల కోసం నడవండి. ఎంత మేరకు నేల పచ్చగా అవుతుందో, ఆ పశువులకు గడ్డి అయినా దొరుకుతుంది. ఎంత కాలం అవాస్తవిక ప్రకటలు చేస్తారు? ఈ రోజు పత్రికల్లో చూశాము డబ్బులు లేవు కాబట్టి పర్యటనలకు పోవడం లేదని గదులకే పరిమితం అవుతున్నామని, ప్రజాప్రతినిధులుగా, ప్రభుత్వంగా మన బాధ్యత ఏమి? ప్రజలు కష్టాల్లో వున్నప్పుడు, ఆవేదనలో వున్నప్పుడు కొండ అంత అండగా మేము వున్నాము అన్న స్థైర్యం నింపాల్సినటువంటి ప్రభుత్వం . ఈరోజు పర్యటనలు మానుకొని గదులకే పరిమితం అవడాన్ని ఏ రకంగా మనం సమర్థిస్తాము. సాగునీరు లేదు, త్రాగునీరు లేదు, రైతులు, రైతుకూలీలు, చేతి వృత్తుల వాళ్లు, చేనేత కార్మికులు ఇన్ని వర్గాలు కష్టాలు పడుతున్నారు. ఈ రోజు ముఖ్యమంత్రిగారి తనయుడు ఒక ప్రకటన చేశారు, చాలా మంచి మాట చెప్పారు. రాత్రి మానాన్నకు కల్లో వస్తే ఉదయాన్నే జి.ఒ. వస్తుందని.

MR.SPEAKER : Please conclude. Keshav garu, you are taking the whole time allotted to your party. I will not be responsible for that. Again don't ask for extra time.

శ్రీ పి.కేశవ్: ఈ రోజు ప్రభుత్వాన్ని కోరేది మీ కలలు మీ కోసం రంగుల కలలు కనండి, మాకోసం బ్లాక్ అండ్ వైట్ కలలన్నా కనండి మా రైతుల బ్రతుకులు బ్లాక్ అండ్ వైట్ బ్రతుకులు, బ్లాక్ అండ్ వైట్ బ్రతుకులకు ఇంత డబ్బు ఇచ్చే ఇంకోటి చేసో మీరు సాయం చేయండి కనీసం ఆ రకంగా అయినా ఆదుకొనే ప్రయత్నం చేయండి. ముఖ్యమంత్రిగారికి కలలు రావడం మానివేశాయా? లేక మా బ్రతుకులు మార్చడానికి పూనుకున్నారా? అన్నిటికి జిందాతిలిస్మాత్ లాగా ప్రభుత్వం మాట్లాడుతుంది రాష్ట్రంలో వున్న ప్రతి ఒక్కరిని ఉపాధి కూలీలుగా మార్చాలనే ప్రయత్నం, రైతులను రైతు కూలీలుగా చేయాలని చేస్తున్నారు. మొన్న మీ మంత్రిగారు అన్నారు. ఆ రోజు ఏదో తెలుగుదేశం పందికొక్కులు అనేటటువంటిది. ఉపాధి హామీలో వచ్చినటువంటి పది కాదు, వంద కాదు, కోట్ల రూపాయల దోపిడి జరిగింది. దానిని ఏమనాలి? నాకు సభ్యత అడ్డు వస్తుంది, సంస్కారం అడ్డు వస్తుంది ఊరపందులని నేను అనలేను సర్, ఈ రోజు ఊరపందుల్లాపడి

దోచుకుతింటుంటే, ఆ రకంగా ఇప్పుడు అట్లా చేయవద్దు . నిజంగా కరువు రైతులకు ఆ డబ్బులు అందాలని నేను కోరుకుంటున్నాను. ఈ రోజు రైతాంగం కష్టాలు గురించి ఇంకా గంట సమయం సరిపోయే కష్టాలు నా దగ్గర వున్నాయి. కాని మీరు సభా సమయం పేరుతో చెబుతున్నారు. కాబట్టి నేను కన్‌క్లూడ్ చేస్తున్నాను. ఈ సభలో సమయం కరువు చేయవద్దు, ఇంతకన్నా సమస్యలు మన ముందు లేవు, ఐదు గంటలో, ఆరు గంటలో, ఏడు గంటలో సమయం పెట్టండి.

MR.SPEAKER : Actual time allotted is 2 ½ hours. We have made it 5 hours at the request of the Leader of the Opposition and the Government. You have already finished one hour. Now please conclude.

ఉ.10.50

అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర రైతాంగం మొత్తం కన్నీళ్లతో వుంది. రైతులు రకరకాల బాధలలో వున్నారు. వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావల్సినటువంటి అవసరం వుంది. ఇక్కడ వున్న ప్రతిపక్షాలన్నింటిని కూడా కాన్ఫిడెన్స్‌లోకి తీసుకోవాల్సిన అవసరం వుంది. బయట వున్న రైతాంగానికి విశ్వాసాన్ని కల్పించవల్సిన అవసరం వుంది. తద్వారా కోల్పోయిన మీ విశ్వసనీయతను పెంచుకోవాల్సినటువంటి ఒక అవకాశంగా మీరు తీసుకొని ముందుకు రమ్మంటున్నాను. ఈ రోజు నేను చాలా ప్రధానమైన డిమాండ్సు చేయబోతున్నాను. గ్రామాలలోకి పోతే కరెంటు కష్టాల గురించి సంక్షిప్తంగా ఒకటే చెబుతున్నారు. 9 గంటల ఉచిత కరెంటు అన్నారు, 7 గంటల ఉచిత కరెంటు అన్నారు, 4 గంటల ఉచిత కరెంటు కూడా రావడం లేదు. 4 గంటల ఉచిత కరెంటులో 40 యంత్రాలు, ఈ 40 యంత్రాలతో వచ్చే కరెంట్‌తో, పోయే కరెంటుతో ఈ రోజు పరిస్థితి ఎట్లా వుందంటే మొగుడు మోటర్‌తో, పెళ్లాం స్టార్టర్‌తో కూర్చుంటే గాని వ్యవసాయం సాగడం లేదు. ఇంకా కాలువల పరిస్థితి ఏమైనా బాగుందా అంటే మా కాలువ షట్టర్లు మేము ఎత్తుకుంటే, నీళ్ల లస్కర్లు వచ్చి దించిపోతే మళ్లీ మొగుడు షట్టర్‌ల దగ్గర, పెళ్లాం కాలువల దగ్గర కావలి కాయావల్సిన పరిస్థితి వుంది. ఇంత దయనీయమైన స్థితిలో ఈ ప్రభుత్వం నడుస్తుంది. ఈ రోజు ప్రకృతి శాపం పెడితే ఈ ప్రభుత్వానికి ఎందుకు రైతుల మీద, ప్రజల మీద ప్రభుత్వం ముందుకు రావల్సినటువంటి తరుణంలో రైతు, రైతు కూలీలను, చేనేత కార్మికులను, చేతి వృత్తులను ఆదుకోవల్సినటువంటి ప్రభుత్వం ఎందుకు మొండిగా, బేషజాలకు పోయి పట్టింపులకు పోతుంది? వీళ్ల మాటలను వింటుంటే అప్పుడప్పుడు బాధ వేస్తుంది. అధికారం వస్తే ఇంత అహంకారము వస్తుందా? వాళ్లు మాట్లాడిన మాటలలో, అధికారాన్ని పక్కనబెట్టండి. మంత్రి గారు ఈ రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాల్సినటువంటి అవసరం వుందని మేము ఈ రోజు డిమాండ్ చేస్తున్నాము. ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు సహాయాన్ని రాబట్టడానికి తీవ్ర ప్రయత్నం చేయవల్సినటువంటి అవసరం వుంది. అవసరమైతే అందరిని తీసుకపోవల్సిన అవసరం వుంది. ఈ కరువు సహాయంతో, కరువు ప్రకటనలతో మా కన్నీళ్లు చెదిరిపోవు. ఈ కేంద్రం ఇచ్చే కోటా ఇంత, దానిలో మన వాటా ఇంత, దానిలో జిల్లాలకు వచ్చేది ఇంత అంటే ఇది కుదరదు సార్. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్యాకేజీ 10 వేల కోట్ల రూపాయలతో అంటే ఈ రోజు మండలానికి 10 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు ఈ రోజు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్యాకేజీ 10 వేల కోట్ల రూపాయలు కావాలి. ఉద్యోగం అయినా ఇవ్వాలి, ఉపాధి అయినా కల్పించాలి. లేదా చదువుకున్న వారికి 1,000 రూపాయల నిరుద్యోగ భృతినైనా వెంటనే ఇవ్వాలి. చదువుకునే ఎస్సి, ఎస్టీ, బీసీ కులాలకు తేడా లేకుండా ప్రతిఒకరికి ఫీజులన్నింటిని రద్దు చేయాలి. ఈ రోజు రుణాల గురించి చెబుతున్నాను. ఈ రోజు లోన్ ఇవ్వడం కాదు, క్రాప్ ఇన్సురెన్స్‌గా చేయాలని నేను కోరుతున్నాను. ప్రతి రైతుకు భీమా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను సార్. ఇప్పుడు ఇస్తున్నటువంటి పెన్షన్లను 5 వందల రూపాయలకు వెంటనే పెంచాలి. దానితో పాటు ప్రతి రైతుకు,

చేతి వృత్తుల వారికి కూడా 500 రూపాయల పేరుతో కరువు ఫించన్‌లను ఇవ్వాలని నేను కోరుకుంటున్నాను. ప్రతి మండలములో రెండు లేక మూడు పశుగ్రాస కేంద్రాలను మంజూరు చేయాలి. దానికి త్రాగు నీటి సౌకర్యం కల్పించాలి. అక్కడ వున్న రైతుకు భోజనాలు కల్పించాలి. రైతులకు 9 గంటల పవర్ సప్లయ్ ఇవ్వాల్సినటువంటి అవసరం వుంది. కాలిపోతున్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్‌లకు గతంలో మూడు సంవత్సరాలు కరువు బారిన పడితే ఏ ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా 12 గంటలలో రిప్లేస్‌మెంట్ చేశాము. ఈ రోజు ప్రభుత్వం రోలింగ్ స్టాక్ పెట్టవల్సిన అవసరం వుంది. చేనేత కార్మికులకు, చేతి వృత్తుల వారికి 500 రూపాయలు పెన్షన్‌లను ఇవ్వాలి. ఇప్పుడు 50 శాతం ఏరియాలో ఎండిన పంటకు వెంటనే పంట నష్టపరిహారాన్ని అందించాలి. త్రాగునీటి అవసరం కోసం మండలానికి కోటి రూపాయలు ఇవ్వాలి. ఇప్పుడు తీసుకున్నటువంటి రుణాల మాఫీని ప్రభుత్వం ప్రకటించాలి. పంట నష్టపరిహారాన్ని అందించాలి. అదనంగా మళ్లీ ప్రత్యామ్నాయ ప్రణాళికకు వెళ్లడానికి రుణాలు ఇవ్వాలని కోరుకుంటున్నాను. నేను ఒకటే కోరుకుంటున్నాను, ప్రభుత్వం బేషజాలలకు, పట్టింపులకు పోకుండా కరువు రైతుల కన్నీళ్లను తుడిచే ప్రయత్నంలో ఆ పల్లె కన్నీరు తుడిచే ప్రయత్నంలో ఒక చెల్లి కన్నీరు, ఒక తల్లి కన్నీరు, ఒక రైతు ఆవేదన తుడిచే ప్రయత్నంలో మనస్ఫూర్తిగా ప్రయత్నం చేయాలని చెప్పి నేను కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి.హెచ్. ముత్యం రెడ్డి(దుబ్బాక): అధ్యక్షా, కరువు మీద రాష్ట్రములో కరువు లేదని ఏనాడు ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని ఎవరు అనలేదు. గోరంతలు కొండంతలు చేయకుండా కరువును అందరము ఒప్పుకోవాలి. ఇక్కడ వున్న శాసన సభ్యులందరు వ్యవసాయానికి సంబంధించిన శాసన సభ్యులే వున్నారు. మనం ప్రభుత్వంలో ఇంతకు ముందు వున్నాము. నేను కూడా అక్కడనే వున్నా, మీ తోనే వున్నా ఆనాడు నేను ఏమి తప్పు చేయలేదు. మీరు తప్పు చేసిన దానికి మీరు మాట్లాడితే, నేను మాట్లాడుతా. నేను ఏమి బాధ పడడం లేదు. ఆనాడు వచ్చినందుకు గాని, ఈనాడు వచ్చినందుకు గాని, నిజమైన రైతును, నిజమైన రైతుగా మాట్లాడుతున్నాను. నిజమైన విషయాలు మాట్లాడాలి.

(అంతరాయం )

మీరు మాట్లాడితే అదరిపోయే వాణ్ని కాను, బెదిరిపోయే వాణ్ని కాదు. నాకు కూడా మాట్లాడే శక్తి వున్నది. మాట్లాడే శక్తి యుక్తులు వున్నాయి. నేను రైతుగా వచ్చాను. రైతుగా మాట్లాడుతున్నాను. పల్లె కన్నీరు కార్చిందని అంటాడు గౌరవ సభ్యులు. 2 రూపాయలకు కిలో బియ్యం ఇచ్చినందుకా? వృద్ధాప్య ఫించన్లు ఇచ్చినందుకా? రైతుకు 7 గంటల కరెంట్ ఇచ్చినందుకా? ఉపాధి హామీ పథకంలో 80 రూపాయలు అనాడు బియ్యం మనం తిన లేదా అని అడుగుతున్నాను. మంత్రులకు కోట పెట్టుకోలేదా అని అడుగుతున్నాను. ఈ రోజు ఉపాధి హామీ పథకంలో తింటే ఎవరైనా ఆఫీసర్లు తిన వచ్చు. కాని, రాజకీయ నాయకులు, మంత్రులు తిన లేదు. ఈ రోజు మాట్లాడే నైతిక హక్కు వారికి లేదు. నన్ను శాసన సభ్యుడినిగా 15 సంవత్సరాలు వాడుకొని విడిచి పెడితే, ఈ రోజు రాజశేఖర రెడ్డి గారి పేరుతో మరల అసెంబ్లీలో కాలు పెట్టగలిగాను. టిఆర్ఎస్, తెలుగు దేశం వదిలి వేస్తే, ఈ రోజు రాజశేఖర రెడ్డి గారి పేరుతో ఈ అసెంబ్లీలోకి వచ్చి నా గళం ఎత్తు తున్నాను.

(అంతరాయం )

మీరు ప్రభుత్వంలో వున్నారు. ప్రభుత్వంలో వుండి ఏమి చేశారు? 2004వ సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాలు కరువు వస్తే ఎన్ని ఉద్యోగాలు, ఫించన్లు ఇచ్చినారు? ఆనాడు 1,000 రూపాయల నుంచి 1100 రూపాయలకు ఎఫ్‌సిఏ బియ్యం కొంటే అయిదు రూపాయల పావలాకు ఇచ్చినారు. ఈ రోజు బియ్యం కిలో రెండు రూపాయలకు ఇచ్చినారు. ఆనాడు అన్న గారి పథకం ఏమి అయిందని అడుగుతున్నాను. కన్నీరు కార్చి అన్న గారికి దండలు వేసినట్లు మీరు అనుకుంటున్నారా అని నేను అడుగుతున్నాను. ఈ రోజు రాజుశేఖర రెడ్డి గారి

ప్రభుత్వం అయిదు సంవత్సరాలు పరిపాలించింది. ఒక ఖరీఫ్ పంట పోతే ఇంత గర్జన ఎందుకని అడుగుతున్నాను. ఈ రోజు వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు కరువు లేదని చెప్పలేదు. దీనికి గగ్గోలు ఎందుకని అడుగుతున్నాను. గగ్గోలు పెట్టవలసిన అవసరమేమి అని అడుగుతున్నాను. దానికి ఈ రోజు ఒకటి చూడండి ఆనాడు ఎఫ్‌సీఐలో 11, 10 నుంచి 11 రూపాయలకు ఎఫ్‌సీఐ కంట్రోల్ బియ్యం కొంటే, ఆనాడు 590 రూపాయలకు మద్దతు ధర వుంటే, కేంద్ర ప్రభుత్వమును కాకుండా, ఈవాళ ఎఫ్‌సీఐ 1500 రూపాయలకు బియ్యం కొనుగోలు చేస్తే మనం ఇచ్చింది, నేను కూడా పౌరసరఫరా శాఖ మంత్రిగా పని చేశాను. పని చేసిన 9 సంవత్సర కాలంలో ఎన్ని కార్డులు ఇచ్చినామో ఒకసారి మిమ్మల్ని ఆలోచించమని అంటున్నాను. ఒక కార్డు ఇవ్వలేకుండా కాలం గడిపి ఈవాళ రాజశేఖర రెడ్డి గారు మా ఊరులో చెబుతున్నారు. ముఖ్యమంత్రి గారు మా ఊరిలో నేను ఒకని తప్ప, తెల్లకార్డు లేనోళ్లు ఎవరూ లేరని చెబుతున్నారు. 95 శాతం నుంచి 99 శాతం వరకు తెల్లకార్డులు ఇస్తే, ఆనాడు 15 రూపాయలకు ఇవాళ ఎఫ్‌సీఐ బియ్యం కొనుగోలు చేస్తే, రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తే పల్లె కన్నీరు కారుస్తుందా అని గౌరవ అధ్యక్షుల వారిని నేను అడుగుతున్నాను. ఎలా కన్నీరు కారుస్తుంది? ఆకలి మంటలు, ఆర్తనాలు ఎక్కడ వున్నాయండీ? పేపర్లో వ్రాసే వార్తలను పట్టుకుంటే .....

(అంతరాయం )

మీరు మాట్లాడినప్పుడు ఊరికే వున్నప్పుడు, నేను మాట్లాడేటప్పుడు మీరు నిశ్శబ్దంగా వుండాలి. లేకపోతే సంతకాలు పెట్టి పక్కకు వెళ్లిపోండి.

(అంతరాయం )

నీకు ఏమి హక్కు వుందని మాట్లాడుతున్నావు? అయిదు సంవత్సరాల తర్వాత ప్రజల దగ్గరికి వెళ్లుదాం. నేను చెబుతున్నాను, అడిగిన దానికి జవాబు చెప్పమని అంటున్నాను. అన్న గారు ఎన్‌టి రామారావు గారు పెట్టిన స్కీమ్. ఆయనకు దండలు వేసి ఈనాడు మనం మాట్లాడుతున్నామే రు.11, రు.10 బియ్యాన్ని ఈవాళ రు.15 చేసి గిట్టుబాటు ధర ఇవ్వడం జరిగింది. పల్లె కన్నీరు కార్చిందా అని నేను అడుగుతున్నాను. ఎట్లా కన్నీరు కార్చింది? ఆర్తనాదాలు చేస్తున్నారు. దానికి అది కాకుండా 7 గంటల ఉచిత కరెంట్ ఇవ్వమంటే మీరు ప్రభుత్వము నుంచి పోయిన సరే 7 గంటల ఉచిత కరెంట్ ఇస్తే ఈవాళ గౌరవ సభ్యుడు అంటున్నాడు ట్రాన్స్‌ఫార్మర్‌లకు రిపేర్ సెంటర్స్ లేవని అన్నారు. ఎక్కడ లేవని అడుగుతున్నాను.

(అంతరాయం )

అగ్రికల్చర్‌కు పవర్ లేక తక్కువ వుంటే, కొంచెం తక్కువ వుంది వాస్తవమే దానిలో హైడల్ పవర్ లేదు. థర్మల్ పవర్ ఒకటే రోజు మిగతా ఇట్లా చేయలేము. చేయలేక పోతే ఇండస్ట్రీస్‌కు వారానికి వన్ డే హాలీడే ఇచ్చాం. అవసరమైతే వారానికి టూ డేస్ హాలీడే ఇస్తాం.

ఉ.11.00

రైతుకు రోజుకు ఏడు గంటలు కరెంటు ఇచ్చేందుకు ఖచ్చితంగా వెనకాడము. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు వెంటనే వాటిని రీప్లేస్ చేసి, 24 గంటల లోపు కరెంటు ఇస్తున్నాం. మా ప్రభుత్వం ఈ విధంగా పనులు చేస్తుంటే, వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే మంచి పనులు చేసిందని, వారు అనుకుంటే పొరపాటు. ప్రజలందరికీ మా ప్రభుత్వం గురించి తెలుసు. మా ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరిగింది.

ఉపాధి హామీ పథకాల విషయానికి వస్తే, వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఒక్క ఉపాధి హామీ పథకం కూడా ఇవ్వలేదు. వారు అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డుల క్రింద ఇవ్వవలసిన బియ్యం మంత్రుల చేతిలో పెట్టుకొని, ఆ మంత్రులు కోటా ఇస్తే, కూలీలు పనులు చేస్తే ఆ కూలి పనులను నెలకు రికార్డు చేసేవారు. కాని, ఇప్పుడు ఉపాధి హామి పథకం క్రింద, శనివారం వచ్చిన చెక్కులను సోమవారం రోజున డైరెక్టుగా పోస్టాఫీసులో చెక్కులు ఇవ్వడం జరుగుతోంది. ఉపాధి హామి పథకంలో ఇంత కంటే గొప్ప ఏమైనా ఉంటుందా? నేను మాట్లాడిన కరెంటు, ఉపాధి, బియ్యం మొదలగు అంశాలలో ప్రతిపక్ష సభ్యులకు సందేహాలు ఉంటే అడగమనండి.

వర్షాల విషయానికి వస్తే, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు సంవత్సరాల తర్వాత ఒక్క ఖరీఫ్ సీజన్‌లో పండే పంట మాత్రమే పండలేదు. ప్రతిపక్ష నాయకులు రోశయ్య గారి గురించి , కందిపప్పు గురించి తప్ప మరొక అంశం గురించి మాట్లాడటం లేదు. వారు మాట్లాడడానికి కందిపప్పు తప్ప మరొక అంశం లేదా? ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ, ఒక రైతు అతని పిల్లవాడు ఇంజనీరింగ్ చదువుకుంటానంటే, భూమి అమ్ముకోవలసి వచ్చిందని చెప్పారు. వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రుణాల మాఫీ ఎప్పుడైనా చేసిందా? 63 లక్షల రుణాలు రైతులకు మాఫీ చేస్తే, దేశంలో 7,000 కోట్ల రుణాలు మాఫీ చేస్తే, 11,000 కోట్ల రుణాలు మన ఆంధ్రప్రదేశ్‌లో రుణ మాఫీలు చేశాం . గతంలో వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీలు చేసిందా అనే అంశానికి వారిని జవాబు చెప్పమనండి. రుణాలు మాఫీ కాని రైతులకు, రు.5,000 ప్రోత్సాహక రుణాలు మాఫీ చేసింది.

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రు. 3 లక్షల రుణాలను పావలా వడ్డీకి ఇచ్చింది. గతంలో వారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చిందా అని అడుగుతున్నాను. వారు పల్లె కన్నీరు కార్చిందంటున్నారు. పల్లె ఎలా కన్నీరు కార్చిందో వారిని చెప్పమనండి. పంట పండక మూడు నెలలైతే, అప్పుడే పల్లె కన్నీరు కార్చిందా? పద్మసాలీలకు, చేతి వృత్తుల వారికి, చేనేత కార్మికులకు రుణాలు ఇవ్వడం ద్వారా మా ప్రభుత్వం సహాయం చేస్తోంది. ముందు ముందు కూడా రుణాలు ఇవ్వడం ద్వారా చేతి వృత్తుల వారికి సహాయం చేస్తుంది. చేనేత కార్మికులకు, చేతి వృత్తుల వారికి సరైన కేటాయింపులు జరగలేదని వారు అంటున్నారు. వాటన్నింటిని సరిదిద్దుకొని వారికి సరైన కేటాయింపులు ప్రభుత్వం చేస్తుంది. అనంతపురం జిల్లాలో మొక్కజొన్నకు, సంచికి రు.125 సబ్సిడీ ఇస్తున్నారు. అంటే కిలో 6

రూపాయల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. పల్లీలు కిలో విత్తనాలు 20 రూపాయలు ఉంటే, ఉన్న సబ్సిడీ అంతా రఘువీరారెడ్డిగారు తీసుకువెళ్లి అనంతపురం జిల్లాలో పెట్టారు. 23 జిల్లాల డబ్బులన్నీ తీసుకువెళ్లి అక్కడ పెట్టినా ఆయనకు ఇంకా తృప్తి లేదు. వారు ఉన్న విషయం మాట్లాడాలి కాని, పద్యాలు కట్టి, కవితలు కట్టి మాట్లాడకూడదు.

శ్రీ పి. కేశవ్ : సబ్సిడీ రైతులకు రాలేదు. మరి ఎక్కడికి పోయింది?

శ్రీ సి. ముత్యం రెడ్డి : అధ్యక్షా, నేను ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతుంటే వారికి ఉలుకెందుకు? నేను ఏమైనా తప్పు మాట్లాడితే చెప్పమనండి. నేను మాట్లాడిన దానిలో ఏమైనా తప్పు ఉంటే, నేను ఇప్పుడే సభలో నుండి వెళ్లిపోతాను.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యుల నుండి అంతరాయం)

రైతుల ఆత్మహత్యల విషయానికి వస్తే, రైతుల ఆత్మహత్యలు ఒకటో, రెండో జరగవచ్చు. రైతుల ఆత్మహత్యలు జరగడంలేదని నేను అనడం లేదు. రైతుల ఆత్మహత్యలను అరికట్టడానికి, గౌరవ ముఖ్యమంత్రి గారు కేంద్రప్రభుత్వం నుండి ప్యాకేజీలు తీసుకువచ్చి రైతులను ఆదుకుంటున్నారు. అయినా, ప్రతిపక్ష సభ్యులు వక్రీకరించి మాట్లాడటం సబబు కాదు. ప్యాకేజీలు పెట్టి పనులు చేసినప్పటికీ, నైరుతీ రుతుపవనాలు రాక, వర్షాలు పడకపోతే రాబోయే రబీ సీజన్‌లో రైతులకు విత్తనాలు ఇచ్చే ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వానికి ప్రజల మన్ననే కావాలి. అందుకే జిల్లాల వారీగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం జరిగింది. జిల్లాల వారీగా స్టేట్‌మెంట్ ఇచ్చినప్పుడు, ఈ స్టేట్‌మెంట్‌లో వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాలను రెండు భాగాలుగా విభజించడం జరిగింది. అందులో 10 జిల్లాలను ఒక భాగంగా, 11 జిల్లాలను ఒక భాగంగా విభజించడం జరిగింది. రైతులకు రుణాలిస్తామని ముఖ్యమంత్రి గారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. రైతులకు రుణాలు ఇచ్చేందుకు, అఖిల పక్షాల వారందరూ కూర్చొని రుణాలను డిక్లేర్ చేయడానికి ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలో కరవు లేదని, కరవు వల్ల ఎవరూ బాధ పడటం లేదని మేము చెప్పడం లేదు. ఉపాధి హామి పథకం క్రింద రు. 80 నుంచి, రు.125 పెంచి, 150 రోజులకు ఉపాధిని కల్పించడానికి కేంద్రప్రభుత్వం నుండి అనుమతి తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం నుండి మన్మోహన్‌సింగ్ గారిని కాని లేక కేంద్ర మంత్రులనెవరినైనా తీసుకురమ్మనండి. రాష్ట్రంలో కరవు లేదని అనడం లేదు. ముఖ్యమంత్రి గారు సమర్థులు కాదా? కేంద్రాన్ని అడిగే శక్తి లేదా? కేంద్రంలో 42 సీట్లలో 33 సీట్లు దక్కి గల్లంతులు లేకుండా మా ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది.

ప్రతిపక్ష సభ్యులందరూ వ్యవసాయ కుటుబాలకు చెందిన వారే కనుక, వ్యవసాయానికి కావలసిన సబ్సిడీ విత్తనాల రకంలో వారిని సలహా ఇవ్వమనండి. నేను కూడా వ్యవసాయ కుటుంబానికి చెందిన వాడినే. వారి సలహాలను నేను స్వీకరించి, నేను నేర్చుకోవలసిన పాఠాలు ఏమైనా ఉంటే, నేర్చుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను. రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల గురించి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లాం. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు సివిల్ సప్లైస్ నుండి, మార్క్‌ఫెడ్ నుంచి పప్పుదినుసులు కొనుగోలు చేసి మార్కెట్‌ను కంట్రోల్‌లో పెట్టుకోవాలని ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లాం. భగవంతుడు కరుణించి, వర్షాలు పడితే రబీ సీజన్‌లో పంటలు పండితే, శనగపప్పు, కందిపప్పు ధరలు తగ్గుతాయి. కేంద్రప్రభుత్వం మద్దతు ధర రు. 900 పెడితే, మద్దతు ధర రు.1,500కు పెంచి, రబీ సీజన్‌లో పంటలు పండించి కందిపప్పు ధర తగ్గించే ప్రయత్నం జరుగుతోంది.

ఉద్యానవన శాఖలో కూరగాయల ధరలు పెరిగాయని అంటున్నారు. ప్రభుత్వం తరపు నుండి అందరికి టి.ఎలు, డి.ఎలు పెరగాలి కాని, రైతులు మాత్రం కూరగాయల ధరలు పెంచకూడదు అంటున్నారు. కూరగాయల ధరలు నాలుగు సంవత్సరాల క్రితం ఉన్నట్లుగానే ఉన్నాయి. టమాట రెండు రూపాయలకు కూడా అమ్ముతున్నారు. కోల్డ్ స్టోరేజ్ పెడితే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయి. గౌరవ అగ్రికల్చరల్ మంత్రిగారు 77 శాతం సబ్సిడీ ఉద్యానవన శాఖకు ఇవ్వడం జరిగింది. సేంద్రియ ఎరువులకు, పందిరి కూరగాయలకు 75 శాతం సబ్సిడీ ఇవ్వడం జరిగింది. ఒకటి, రెండు కూరగాయల ధరలు రు.20 ఉన్నాయి తప్ప, మిగిలిన అన్ని కూరగాయల ధరలు అందుబాటులోనే ఉన్నాయి. కూరగాయల ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయి కనుక కూరగాయల ధరలు కూడా కొంచెం పెరుగుతాయి. పశుగ్రాసం లేదని రైతులు గొగ్గోలు పెడుతున్నారని వారు అన్నారు. పశుగ్రాసం ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే వస్తుంది. ఐదు సంవత్సరాలు సస్యశ్యామలంగా ఇంకుడు గుంటల అవసరం లేకుండా, ప్రాజెక్టులు కట్టడం ద్వారా నీటిని తీసుకురావడం జరిగింది. చేవెళ్ల, ప్రాణహిత ప్రాజెక్టులను చేపట్టి, తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు పథకాలను చేపట్టాం. వర్షాలు పడి బాగా పండిన పంటల నుండి పశుగ్రాసాన్ని తీసుకొని, రైతులకు కావలసినంత పశుగ్రాసాన్ని ఇస్తాం. వారు పొరపాట్లను చిత్రీకరించడమే కాక, రైతును కాపాడడానికి మంచి సలహాలు ఇస్తే మేము సంతోషించి వాటిని పాటిస్తాం. మొన్నటి వరకూ వర్షాలు పడి అన్ని బాగానే ఉన్నాయి కాని, ఎరువుల షార్టేజ్ ఉందన్నారు. వర్షాలు పడినప్పుడు వాటి గురించి మాట్లాడలేదు.
ఉ.11.10

ఎప్పుడు మాట్లాడినా ప్రకృతి సహకరించాలి మానవుడికి. ఏ ప్రభుత్వానికైనా ప్రకృతి సహకరించాలి. ఒక్కొక్కసారి ప్రకృతి సహకరించదు. అందువల్ల కొన్ని ఇబ్బందులుంటాయి. వాటిని అధిగమించడానికి మంచి సజెషన్సు ఇవ్వండి. విమర్శలు బంద్ చేసుకోండి. లాస్ట్ ఇయర్‌లో విమర్శించండి, నాలుగేళ్లు అయినాక, ఐదో ఏడులో విమర్శించండి. అప్పుడు ప్రజలు హర్షిస్తారు. మళ్లీ రేపు వర్షాలు పడితే రాజశేఖర రెడ్డి ప్రభుత్వం మంచిదంటారు. ఉరవకొండ పోయినపుడు అయ్యా, ఉపాధి హామీ పథకం మాకు రోజూ ఇవ్వమని అడిగేరు. కరువు ఉన్నపుడు దానికి ప్రత్యామ్నాయంగా జిల్లా ఆఫీసర్లను తెచ్చి, మండలానికో ఆఫీసరును వేసి, ఆర్‌డివో ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకాన్ని ఇచ్చి, పశువులను, రైతులను ఏ విధంగా కాపాడాలనేదానిలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని చెప్పడం జరుగుతోంది.

సాగునీరు అంటున్నారు. ఇప్పటికే బోర్లను చెక్ చేయడం జరుగుతోంది. ఎక్కడెక్కడైతే నీళ్లు లేవో, అక్కడ స్టాక్ కొటేషన్సు పెట్టి, ఎక్కడెక్కడైతే మోటర్లు కాలిపోయాయో, వాటిని అక్కడ చేయకపోతే, ట్రాన్స్‌పోర్టే షను పెట్టి, ఈ పథకాన్ని ముమ్మరంగా చేయడానికి కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దానికి 10 కోట్లో 20 కోట్లో కాంట్రాక్టర్సు ఎవరైతే పని చేస్తారో, వారు పని చేశాక బిల్లు ఇవ్వకపోతే అడగాలి గానీ, అసలు పని మొదలు కాకుండానే ఇది అట్లున్నది, అది ఇట్లున్నది, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు, రైతులు వెళ్లిపోతు న్నారు అంటున్నారు. కొన్ని మానవ సహజంగా అందరికీ జరిగే పనే. ఆవేశాలు పనికి రావు. మీరు ఆవేశపడితే మేమిక్కడ నుంచి మాట్లాడవలసి వస్తుంది. అందరి తరపున నేను ఒక్కడినే మాట్లాడే శక్తి నాకున్నది. ఆవే శాలు పనికిరావు దయచేసి. గవర్నమెంటుకు మనమందరం పెరమనెంటు సజెషన్సు ఇద్దాం. మళ్లీ ప్రజలు తీర్పు ఇచ్చినపుడు అక్కడి వాళ్లు ఇక్కడవుతారో, ఇక్కడి వాళ్లు అక్కడవుతారో ప్రజలు చెబుతారు. అక్కడోళ్లు అందరూ కలిసి ఇక్కడకు వస్తారని అనుకుంటే కూటమి ఫెయిలయిపోయింది. ఒక్కరే మిగిలేరు. దానిని

గురించి మరొకసారి మాట్లాడుకుందాం. కరువు మీద మాట్లాడేటప్పుడు అది మాట్లాడితే బాగుండదు. ఐదు సంవత్సరాల ఛాన్సున్నది. అప్పుడు మాట్లాడదాం. సాగునీరు, తాగునీరు ఇవన్నీ సమస్యలు. ఎవరేమన్నా తప్పు చేయాల్సిన అవసరం లేదు.

విద్యుత్ సరఫరా గురించి మళ్లీ ఒకసారి చెబుతున్నారు. మనకు హైడల్ పవర్ లేదు. థర్మల్ పవర్ ఉంది. ఇప్పటికైనా ఒక రోజో రెండు రోజులో హాలిడే ఇచ్చి అయినా, ఇండస్ట్రీస్‌కు ఇచ్చి అయినా, వేరే రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి అయినా, ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోతే 24 గంటలలో ఇచ్చి; ఉపాధి హామీ పథకం ఇచ్చి; ముఖ్యమంత్రి గారు ఏ రంగంలో అయినా సమర్థవంతంగా పని చేసి, రైతులను కాపాడి, రైతు కూలీలను కాపాడి, గ్రామీణ ప్రాంతాలలో చేతివృత్తులను కాపాడి, అందరినీ కాపాడి ఈ ప్రభుత్వం ముందుకు వెళ్లడానికి సిద్ధంగా వుంది. దయచేసి, మంచి సజెషన్సు ఇచ్చి, అన్నీ మంచిగా చెప్పాలని కోరుకుంటూ, నాకీ అవకాశం ఇచ్చి నందుకు ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్ : పీఆర్‌పీ పార్టీ వారు మాట్లాడండి. మీ పార్టీకి 30 నిముషాల సమయం.

శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ : అధ్యక్షా, ఈ రోజు రాష్ట్రంలో రైతాంగం యొక్క పరిస్థితిని, ముఖ్యంగా ఈ కరువు పరిస్థితులలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వివరించడానికి గత కొన్ని రోజులుగా ఈ హౌసులో ప్రయత్నం జరుగుతూనే వుంది. కాని ఇది చర్చకు రావడానికి ఇంత సమయం పట్టింది. బయట రైతుల పరిస్థితి చూస్తే చాలా దీనావస్థలో ఉంది. సభ్యులు కూడా చాలా మంది ఆవేదన చెందుతున్నారు. రైతుల దీనావస్థను ప్రభుత్వానికి నివేదించడానికి, తమ నియోజకవర్గంలో గాని, రాష్ట్రంలో గాని ఉన్న పరిస్థితిని, వాస్తవ పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఎదురు చూడటం జరుగుతోంది.

అధ్యక్షా, పొలాలలో ఉన్న మొక్కలకి జీవం లేదు. జీవం ఉన్న పశువులకి తిండి లేదు. రైతుల చేతుల్లో పైసా లేదు. అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చి, విత్తనాలు చల్లితే, కరువు తాండవించి, వర్షాలు లేక అవి విత్తినా ఎండి పోయి రైతు దీనావస్థలో ఉన్నాడు. ఈ పరిస్థితిలో రైతును ఆదుకునే చర్యలు వెంటనే చేపట్టవలసిన ప్రభుత్వం తాత్సారం చేస్తే మాత్రం చాలా బాధని కలిగిస్తుంది. ఈనాడు వర్షాలు కురవక, రిజర్వాయర్లలో నీరు లేక, రైతు లకు నీరు అందక ఒక పక్క పంట ఎండుతూ వుంటే రైతుకు సహాయపడాల్సిన శాఖలు రైతుకు సహాయపడక పోతే రైతు పరిస్థితిని ఎవరు పట్టించుకుంటారు అధ్యక్షా? అధ్యక్షా, రైతుల యొక్క పరిస్థితి చూస్తే అన్నం పెట్టే అన్నదాత ఈ రోజు సహాయం కోసం ఎదురు చూసే పరిస్థితి వచ్చింది. వ్యవసాయదారుడు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూసే పరిస్థితి ఈనాడు ఏర్పడింది. గత కొంతకాలంగా కరువు పరిస్థితి లేనప్పటికీ ఈనాడు ఎన్నడూ లేని విధంగా ఈ కరువు సీజన్‌లో, ఈ ఆగస్టులో, ఈ విధంగా ఇబ్బంది కలగడం చాలా బాధను కలిగి స్తోంది.

గోదావరి జిల్లాల వారు కరువు గురించి మాట్లాడట మేమిటని చాలా మంది సభ్యులు అంటున్నారు. ఇదే దురదృష్టం. గోదావరిలో కొంత వర్షం పడి జలకళ వచ్చినా ఆ ఆశ కొద్ది రోజులలోనే ఆవిరి అయిపోయే పరి స్థితి ఉంది. సగటు ఉష్ణోగ్రతలు బాగా పెరగడం వల్ల, సరైన నీరు చేరకపోవడం వల్ల సుమారు 11 లక్షల హెక్టా ర్లకు కేవలం ఒక్క టిఎంసి నీటిని ఇస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా వుందో మనం అర్థం చేసుకోవచ్చు. మెట్ట

ప్రాంతం అయిన మా నియోజకవర్గంలో రైతుల పరిస్థితి మరీ దీనంగా వుంది. ఆయకట్టు చివర ఉన్న భూముల పరిస్థితి మరీ ఘోరంగా వుంది.

ఈ రోజు ప్రభుత్వం ఒక స్టేట్మెంట్ ఇవ్వడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు గాని, రెవెన్యూ మంత్రి గారు గాని వివిధ శాఖల యొక్క కరువు పరిస్థితులను ఇవ్వడం జరిగింది. ఈ యొక్క పరిస్థితి చూసి నా లేదా నియోజకవర్గాలలో పరిస్థితి చూసినా వాస్తవానికి దూరంగా ఈ స్టేట్మెంట్ ఉందని నా అభిప్రాయాన్ని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. కేవలం ఎంత వర్షం పడాలి, ఎంత వర్షం పడలేదు, జలాశయాలలో ఎంత నీరు ఉండాలి, ప్రస్తుతం ఎంత లేదు అనే దాని మీదనే ఎక్కువ దృష్టి పెట్టారు. విత్తనాల సరఫరా విషయంలో, గడ్డి సరఫరా విషయంలో, విద్యుత్ సరఫరా విషయంలో, పట్టణ మంచినీటి సరఫరా విషయంలో మొక్కుబడిగానే చెప్పారు తప్ప, అందరికీ సంతృప్తి కలిగించే విధంగా కరువు పరిస్థితులలో రాష్ట్ర ప్రజల్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందనే విధంగా ఈ స్టేట్మెంటు లేదని నా అభిప్రాయం అధ్యక్షా.

గోదావరి జిల్లాల రైతాంగానికి కూడా కరువు పరిస్థితి చాలా తీవ్రంగా వుంది కాబట్టి రాష్ట్రం అంతా ఈ పరిస్థితి ఏ విధంగా వుందో మనం అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ఈ రెండు స్టేట్మెంట్స్ చూస్తే, గౌరవ ముఖ్యమంత్రి గారిచ్చిన స్టేట్మెంటు, రెవెన్యూ మినిస్టరు గారు ఇచ్చిన స్టేట్మెంటు చూస్తే, ముఖ్యంగా రెవిన్యూ మినిస్టరు గారు ఇచ్చిన స్టేట్మెంటులో విద్యుత్ సరఫరాతో బాటు, రాష్ట్రంలో కరువు పరిస్థితిపై స్వల్ప చర్చ అని ఇవ్వడం జరిగింది. కాని ఈ స్టేట్మెంటులో విద్యుత్ సరఫరా గురించి ఒక్క మాట కూడా పెట్టకపోవడం చాలా శోచనీయం అధ్యక్షా. రైతులకు ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎక్కువగా లిఫ్ట్ ఇరిగేషన్ మీద, బావుల మీద, మోటార్ల మీద ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ వుంటే, మరి విద్యుత్ విషయమై ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం బాధాకరం అధ్యక్షా. అంతేకాకుండా, ఈ యొక్క నీటిసరఫరా విషయంలో ప్రధానమైనది విద్యుత్ సరఫరా. ముఖ్యమంత్రి గారిచ్చిన స్టేట్మెంటులో కేంద్రప్రభుత్వం కోటా నుంచి 24 గంటలూ 500 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందని చెప్పి సరి పెట్టడం జరిగింది అధ్యక్షా. అసలు ఈ కరువు పరిస్థితులలో రాష్ట్రంలో ఉన్న అన్ని పంటలకు కూడా, అది ఏ రక మైన పంట అయినప్పటికీ లిఫ్ట్ ఇరిగేషను ద్వారా గాని, ప్రజల అవసరాలకు గాని, సాగు నీటికి గాని, తాగు నీటికి గాని నీటిని అందించాలంటే ఎంత విద్యుత్ అవసరం అవుతుంది, ఎంత రాష్ట్ర ప్రభుత్వం చేయగలుగుతుంది, ఎంత కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు కావాలి?

ఉ.11.20

అదే విధంగా, రైతాంగానికి నిజంగా విద్యుత్ సరఫరాని, నీటి సరఫరాని చేయగల్గుతామా అని ప్రశ్నిస్తున్నాను. ఏ విధంగా నీటి సరఫరా చేస్తాము. ఎంత సమయం చేస్తామన్న విషయాలపై స్పష్టత లేదు. ఈ విషయమై ప్రభుత్వానికి స్పష్టత ఉండాలని మా పార్టీ తరపున తెలియజేస్తున్నాను. ఇప్పటికే తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం రైతులకు చెప్పింది. కానీ, కనీసం ఏడుగంటల పాటైనా నిరంతరాయంగా విధ్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి రాష్ట్రంలో ఉంది. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోత అమలౌతోంది. అర్థ రాత్రి పూట రైతులు మోటార్లు వేసుకోడానికి వెళ్లిన సందర్భాల్లో పాము కాట్లకు గురయ్యే పరిస్థితులు గ్రామాల్లో ఉన్నాయని తెలియజేస్తున్నాను. కరువుని ఎదుర్కొనే విషయంలో, విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోతే ఉన్న పంటలు గానీ, ప్రత్యామ్నాయ పంటలు గానీ రైతులకు అందే పరిస్థితి ఉండదని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

త్రాగునీటి విషయంలో అనేక రకాలైన పథకాలు అమల్లో ఉన్నాయి. ఎక్కువ పథకాలు విద్యుత్‌పై ఆధారపడి ఉన్నాయి. వేసవి కాలంలో త్రాగు నీరు అందించేప్పుడు, ట్యాంకుల ద్వారా నీటిని సప్లై చేయడం కానీ, కొత్త బోర్లు త్రవ్వడం కానీ చేస్తున్నాము. గత వేసవి కాలంలో మంచి నీటి సరఫరా విషయంలో పూర్తిగా ఫెయిల్ అవడం జరిగింది. గ్రామాల్లో మంచినీరు లేదు. మా గ్రామాలకు మంచి నీరు కావాలని ప్రజలు కోరితే, 12వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఖర్చు చేసుకోమని చెప్పారు. కానీ, 12వ ఆర్థిక సంఘం నుండి నిధులు అడిగితే అవి రోడ్లు తదితర కార్యక్రమాలకు ఖర్చు చేయడం జరుగుతున్నందు వల్ల, త్రాగునీటిని సరఫరా చేసే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు. గ్రామాల్లో అడిగితే పంచాయితీలు మాకు సంబంధం లేదని అంటాయి, మండలాల్లో అడిగితే మాకు సంబంధం లేదని అంటారు. జిల్లా పరిషత్ వార్ని అడిగితే, వారు మాకు సంబంధం లేదని అంటారు. ఒకరికొకరికి సంబంధం లేకపోవడం వల్ల, వేసవి కాలంలో మంచి నీటిని సక్రమంగా సరఫరా చేయలేని పరిస్థితులు ఉన్నాయి. మరి, ఈ కరువు పరిస్థితుల్లో మనం ఏ విధంగా మంచినీటిని సరఫరా చేయాలా అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అందించే త్రాగునీటి విషయంలో ప్రభుత్వం స్పష్టంగా ఉండాలని కోరుతున్నాను. అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా చేయాలని తప్పనిసరిగా కోరుతున్నాను. పట్టణ ప్రాంతాల్లో చూస్తే, మునిసిపాలిటీల్లో గ్రామీణ నీటి సరఫరాకు పెట్టిన నిధులు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నిధులను ఉపయోగించి నీటిని ఏ విధంగా, అన్ని పట్టణాలకు, అన్ని వార్డులకు, రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాలకు సప్లై చేయగల్గుతామో ప్రభుత్వం చెప్పాలని కోరుతున్నాను. అంతేకాకుండా, వాటర్ ట్యాంకుల ద్వారా నీరు అందించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు, ఒక బోరు నుండి మరో బోరుకి, మరో బోరు నుండి ఇంకో బోర్‌కి కంటిన్యువస్‌గా కనెక్షన్ ఉంటుంది. ఒక బోర్ దగ్గర కరెంటు ఉండి, మరో బోర్ వద్ద లేకపోయినా, మరో బోర్ దగ్గర కరెంటు ఉండి ఇంకోచోట లేకపోయినా నిరుపయోగమౌతుంది. కాబట్టి, కరెంటు అన్ని ప్రాంతాలకు ఒకే సారి ఉండే విధంగా మనం విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకొకపోతే, చాలా ఇబ్బందికి గురయ్యే పరిస్థితులు ఉంటాయని తెలియజేస్తున్నాను. కాబట్టి, విద్యుత్ శాఖ చాలా కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంది. విద్యుత్ విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి. పట్టణాల్లో అయితే విద్యుత్ కోత కొంత మటుకే ఉంటుంది. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి అయితే, పిల్లలు చదువుకోడానికి ఇబ్బందికరమైన లో ఓల్టేజీ సమస్యలు ఉంటాయి. లో ఓల్టేజీ సమస్యను తీర్చి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేట్లు చూడాలి. నేడున్న కరువు పరిస్థితుల్లో ఇంకా ఏ విధంగా ఉండాల్సి వస్తుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యానవన శాఖ గురించి చెప్పాలి. రైతులకు, ఉద్యానవన శాఖకు చాలా తక్కువ సంబంధాలు ఉంటున్నాయి. కాయగూరల పెంపకంలో గానీ, విత్తనాల సరఫరా విషయంలో కానీ, వారికి సబ్సిడీ ఇచ్చే విషయంలో కొద్ది మంది రైతులతోనో, కొన్ని సంఘాలతోనో వారికి సత్‌సంబంధాలు ఉంటాయే తప్ప, రైతాంగం అంతటికీ ఈ శాఖ నుండి ఉపయోగపడే విధంగా విత్తనాలు, తదితర సహకారం అందని పరిస్థితి ఈనాడు ఉంది. ఉద్యానవన శాఖ నుండి తప్పనిసరిగా రైతాంగానికి ఈ కాయగూరలు, ఇతర పంటలు గానీ, పండ్ల తోటలకు సంబంధించిన సౌకర్యాలు అందేట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేస్తున్నాను.

కరువు ప్రాంతాల ప్రకటన పై కూడా వివిధ రకాలుగా మాట్లాడడం జరుగుతోంది. పెద్దలు రోశయ్య గారు మాట్లాడుతూ, ప్రభుత్వం కరువు ప్రకటన చేస్తే, బ్యాంకులు లింకేజీ రుణాలు ఇవ్వవని అందుకే కరువు ప్రాంతాలను ప్రకటించడంలో తాత్సారం చేయడం జరుగుతోందని అన్నారు. జూలై మాసం అయిపోయింది.

ఆగస్టు 13వ తేదీ వచ్చినా వర్షాలు పడని పరిస్థితి రాష్ట్రంలో ఉంది. ఉన్న నీరు అడుగంటి పోయే పరిస్థితి ఉంది. ఆయకట్టు చివరన ఉన్న వారి పంట ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోడానికి, వెంటనే తక్ష ణ చర్యలు చేపట్టకపోతే ఇబ్బందులెదురౌతాయి. ఆలోచించి, ఆచితూచి ఎక్కడెక్కడో ఉన్న పరిస్థితులన్నింటిని చూసి చేస్తామంటే ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి వస్తుంది. మనకన్నా ఎక్కువ వర్షపాతం ఉన్న రాష్ట్రాలు, జార్ఖండ్, అస్సాం, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, నాగాల్యాండ్ వంటి రాష్ట్రాలు 'ఇప్పటికే మా ప్రాంతాల్లో కరువు ఉందని, మా ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించమని, కరువు నివేదికలు పంపిన విషయం తెలుస్తోంది. మొన్న గౌరవ ప్రధాన మంత్రి గారు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ఇప్పటికే కరువు విషయంలో, రైతుల పరిస్థితి విషయంలో, కేంద్రానికి నివేదిక అందించడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆయన తన బాధను వ్యక్తం చేయడం జరిగింది. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లోని రాష్ట్ర ప్రభుత్వాల స్పందన ఈవిధంగా ఉండడం చాలా గర్హనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా 60 లక్షల హెక్టార్లలో ఇంకా వరి నారు పడలేదని, అన్ని రకాల పైర్లకి నష్టం వాటిల్లిందని, ప్రధాన మంత్రి గారు మన ప్రాంత పరిస్థితులను వారే స్వయంగా వివరించారు. గత రెండు సంవత్సరాల్లో పంట సమృద్ధిగా ఉన్నందున, ఆహార నిల్వలు ఉన్నందువల్ల, ఎక్కడైతే కరువు ప్రాంతాలు ఉన్నాయో, ఆ ప్రాంతాలన్నిటికీ కూడా ఆహార ధాన్యాల సరఫరా చేయడానికి, తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగింది.

రుతుపవనాల పరిస్థితి బాగా లేదు. కరువు సంభవిస్తోంది. కాబట్టి, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పడం జరిగింది. పంటల గురించి, త్రాగునీటి గురించి, ప్రజారోగ్యం గురించి, పశు వైద్యం గురించి, దాణా, ఎరువుల గురించి, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు తదిరతాలన్నింటికి తక్షణమే అమల్లోకి తీసుకొని, ఆయా శాఖాధికారులందర్ని అప్రమత్తం చేసి, వెంటనే ఆయా శాఖల ద్వారా రైతులకు సహాయం అందించాలని చెప్పడం జరిగింది. ఆహారపదార్థాల లభ్యత, నిత్యవసర వస్తువుల సరఫరాపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కరువు ప్రాంతాల్లోని రైతులకు, ముఖ్యంగా, 50శాతం సబ్సిడీ ఇవ్వాలని, హెక్టారుకి డీజిల్‌లో ఐదు వందల రూపాయల సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. వర్షాభావ ప్రాంత రైతులకు కేంద్రం సహాయం చేయాలని చెప్పడం జరిగింది. అంతేకాకుండా, 50శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో, ఈ డీజిల్ సబ్సిడీ ఇవ్వాలని చెప్పడమే కాకుండా, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకొని, ముందుగా వారికి డీజిల్ సబ్సిడీ ఇచ్చి, తరువాత కేంద్రం నుండి తీసుకోవాలని ప్రధాన మంత్రి గారు చెప్పారు. మన ప్రభుత్వం ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఈ విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని తెలియజేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి గారు ప్రకటించిన డీజిల్ సబ్సిడీని ఇవ్వబోతున్నారా? లేదా? చెప్పాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలు, అనేక ఇన్‌స్టిట్యూషన్స్ ఈ వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేయడం జరుగుతోంది. ముందుగానే, వాతావరణ పరిస్థితులను అంచనా వేసి, రైతులకు దశ, దిశ నిర్దేశించాల్సిన పరిస్థితిని ఈ శాఖ చేయడం లేదు.

ఉ.11.30

ఆ శాఖ ద్వారా రైతులకేమీ ఉపయోగం లేదు. ప్రజలందరికీ ఆ శాఖపట్ల చాలా చులకన భావం వుంది. వారంతా కూడా చులకనగా మాట్లాడుతున్నారు. ఈ రోజు రేడియోలోగాని, టి.వి.

లలో గాని వర్షం వస్తుందని వాతావరణ శాఖ వారు చెబితే, చాలా మంది ' వాతావరణ శాఖ వారు వర్షం వస్తుందని చెప్పినట్లయితే వర్షం రాదు, అది వర్షం రాదని చెబితేనే వర్షం వస్తుందని' అంటు న్నారు. కాబట్టి మనకి వర్షం కావాలంటే వాతావరణ శాఖ వారు వర్షం రాదని చెప్పాలి అనుకునే టువంటి పరిస్థితులు ఈ రోజు వున్నాయి.

కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం మేఘ మధనం చేయడం జరుగుతోందని చెబుతున్నారు. సుమారు 5 సంవత్సరాలుగా ఈ మేఘమధనం నిమిత్తం రూ. 100 కోట్లు ఖర్చు పెట్టినట్లుగా ప్రభుత్వం లెక్కలు చెబుతున్నట్లు కూడా వార్తా పత్రికలలో నేను చదివాను. మరి యింత ప్రజా ధనం, యిన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ కనీసం ఒక్క వర్షం కూడా కురిపించని ఈ మేఘ మధనం ఎందుకు, ఎవరికోసం, దేనికోసం అని నేను అడుగుతున్నాను. ఈ విధంగా వర్షాలు కురి పించకుండా, యింత ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం రైతుల పక్షాన ఆలోచించినట్లైతే అది అందరినీ చాలా బాధకు గురిచేస్తున్నది. కాబట్టి యిటువంటి ఈ పథకాలు ఏమాత్రం రైతులకు, ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చడం లేదని మనవి చేస్తున్నాను. కాబట్టి, రైతులకు ఉపయో గంగా వుండే విధంగా , వారికి మేలు కలిగే విధంగా పథకాలను చేయవలసిందిగా నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నిజంగా మీరు ఏదైనా కార్యక్రమం చేయాలంటే అది రైతులకు ఉపయోగపడే విధంగా చేయాలి తప్ప, వేరే వారికి ఉపయోగపడని విధంగా చేయకూడ దని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

రైతుల ఆత్మహత్యల గురించి చాలామంది వివరించడం జరిగింది. సోదరుడు ఇంతకు ముందే చెప్పారు. ఈ ప్రాంతం, ఈ జిల్లా , ఈ మండలం అని లేకుండా రాష్ట్రం అంతటా కూడా రైతాంగం చాలా ఆందోళనలో వున్నారు. ఈ విషయంలో గతంలోనూ, యిప్పుడూ కూడా ఎన్నో పథకాలను ప్రభుత్వం వారు అమలు చేస్తున్నారు. అయినప్పటికీ, అవి ఏవీ రైతాంగానికి ఉపయోగ పడటం లేదు. అలాంటప్పుడు, ఈ పథకాలు పెట్టిన లక్ష్యం నెరవేరినట్లు ఎలాగవుంతుంది అధ్యక్షా? అనుకున్న లక్ష్యాన్ని మనం ఏవిధంగా చేరుకున్నట్లు అవుతుంద్లి? నిజంగా అది రైతుకు ఉపయోగ పడినట్లు ఎలా అవుతుంది? రైతు బంధు పథకం, రైతు బీమా సౌకర్యం , రైతుకు పావులా వడ్డీ పథకం అంటున్నాం . కానీ యివేవీ కూడా రైతులకు ఉపయోగంలోకి రావడం లేదు.

రైతులకు సంబంధించి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ శాఖ, ఇంకా అనేక శాఖలు ఈ రోజు వున్నాయి. కాని ఈ శాఖలేవీ రైతులకు ఉపయోగంలోకి రావడం లేదు. ప్రభు త్వాలు రైతులను రక్షించడంలో ఉపయోగపడటం లేదు. మరి అలాంటప్పుడు, రైతులకు ఈ ప్రభుత్వాలు పెట్టే పథకాలు ఉపయోగపడనప్పుడు, రైతులు నిర్వేదానికి గురై, ఏమీ చేయలేని పరి స్థితులలో, కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో, చేసిన అప్పులను తీర్చలేని పరిస్థితిలో, యింక జీవితంపై ఏ ఆశా లేక చివరికి ప్రాణం తీసుకుంటున్నారు. అందుకే ఆత్మ హత్యలు చేసుకుంటు

న్నారు. నిజానికి రైతు ఆత్మ హత్య చేసుకునే పరిస్థితి ఎందుకువస్తుంది? ఎప్పుడు వస్తుంది అధ్యక్షా? ఏమీ చేయలేని స్థితి, ఏ ఆశా లేక, ఏ దిక్కూతోచని పరిస్థితులలో రైతులు ఈ విధంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఈ పథకాలు పెట్టినప్పటికీ, అవి వారికి ఉప యోగదాయకం కానప్పుడుప్పుడు వాటిని పెట్టి ప్రయోజనం ఏముంది అధ్యక్షా? కాబట్టి ఈ పరి స్థితులు ఎందుకు కలుగుతున్నాయని, రైతుల గురించి ప్రభుత్వం ఒకసారి ఆలో చన చేయాలి. వారి మీద వీరు, వీరి మీద వారు చెబుతూ, చరిత్రను పునరావృతం చేస్తూ , చరి త్రను తోడుతూ, త్రవ్వుతూ, రైతుల భవిష్యత్తును నాశనం చేయవద్దని ఈ సందర్భంగా నేను కోరు తున్నాను.

నేను శాసన సభకు కొత్త సభ్యురాలిగా ఈ కరువుకు సంబంధించి సభలో చర్చ వస్తున్న దని,

దానిని గురించి తెలుసుకునేందుకు గాను లైబ్రరీకి వెళ్లాను. గతంలో కరువు గురించి జరిగిన చర్చలను చదవడం జరిగింది. 2001-02-03సంవత్సరాలకు సంబంధించిన చర్చను నేను చదివాను. అదృష్టవశాత్తూ, 2003 వ సంవత్సరం నుంచి మళ్లీ యిప్పుడే కరువు రావడం జరి గింది. నేను లైబ్రరీలో 2003 సంవత్సరం తర్వాత ఎప్పుడైనా కరువు వచ్చిందా అని అడిగాను. అక్కడి వారు వారు రాలేదని చెప్పారు. నేను ఆ డిబేట్స్ అన్నీ కూడ చదివాను. అయితే, వాటిని చదివినపుడు నాకు అనిపించింది, పాత్రలు మారాయి తప్ప, పదాలన్నీ అవేనని. ఇప్పుడు వీరు చెప్పేది వారు చెప్పారు. అప్పుడు వారు చెప్పింది వీరు చెబుతున్నారు. రెండింటినీ మనం చూసినప్పుడు రైతుల పరిస్థితులలోనే మార్పు తీసుకు రావాలి తప్ప మరోటి కాదు.

అధ్యక్షా, నేడు ముఖ్యమంత్రి గారు యిక్కడే వున్నారు. వారిని నేను కోరుతున్నాను. ఆదర్శ రైతులని ఒక వ్యవస్థను పెట్టారు. ప్రతి గ్రామంలో, ప్రతి జిల్లాలో రాష్ట్రమంతా ఈ ఆదర్శ రైతులున్నారు. ఒకొక్క గ్రామంలో ముగ్గురు, నలుగురు, ఐదుగురు ఆదర్శ రైతులున్నారు. అసలు ఇప్పుడు ఈ ఆదర్శ రైతుల వ్యవస్థను ఎందుకు పెట్టారు? ఎవరిని పెట్టారని అడగడం అప్ర స్తుతం . ఆ జోలికి నేను పోను. కాని, సంవత్సరానికి సుమారు రూ. 60 కోట్లు ప్రజాధనం ఈ ఆదర్శ రైతు పేరు మీద ప్రభుత్వం ఖర్చు పెడుతున్నది. నిజానికి రైతుకు అతి దగ్గరగా వుండేది ఎవ రంటే లక్ష్య సాధనతో పని చేసే ఆదర్శ రైతు మాత్రమే. కాబట్టి లక్ష్యంతో, రైతులకు ఉపయోగపడే విధంగా ప్రజాధనాన్ని తీసుకుంటున్న ఈ ఆదర్శ రైతు ప్రజల, రైతుల బాగుకై పని చేసినట్లైతే, ఆత్యహత్యలను ఆపు చేసే విధంగా వుంటుంది. అందుకోసం, ఆ రైతుల కుటుంబ నేపథ్యాన్ని, పరి స్థితులను గురించి ఈ ఆదర్శ రైతు వ్యవస్థ తెలుసుకుని వారికి ఉపయోగపడే విధంగా చూడాల్సిన బాధ్యత కలిగి వుంది. వుండాలి కూడా. రైతు పంట సరిగా పండక కుటుంబాన్ని పోషించలేక పోతున్నాడా? పంటలను వేసేందుకై తీసుకున్న ఋణాలను తీర్చలేకపోతున్నాడా? అసలు అతని పరిస్థితులు ఏమిటి? ఎందుకు అతను ఆత్మహత్యలు చేసుకునే స్థితికి రావడం జరిగిందో కూడా

ఈ వ్యవస్థ రైతు తెలుసుకోవాలి.  అలా చేసినప్పుడే ప్రజా ధనం ప్రజలకోసం ఉపయోగ పడినట్లు , సద్వినియోగం అయినట్లు అవుతుంది అధ్యక్షా.

అధ్యక్షా, ఇందాక రెవిన్యూ మంత్రి గారు రైతుల ఆత్మహత్యల గురించి చెప్పిన సంఖ్యలో తేడా వున్నప్పటికీ, వారు రైతుల ఆత్మహత్యలను ఆపడంలో మాకు సలహాలు చెప్పండి, సూచనలు చేయండని కూడా అడగడం జరిగింది. కొందరు 3500 అని, మరొకరు 5,800 అని, ఇంకోరు 6000 అనీ, 7 వేలనీ అన్నప్పటికీ మొత్తం మీద రైతులలో ఆత్మహత్యలు జరగడం మాత్రం నిజం .

అధ్యక్షా, ఇన్ని కోట్ల రూపాయలు, ఇన్ని పథకాలు , సొసైటీల నుంచి, బ్యాంకుల నుంచి, నాబార్డ్ వరకూ వివిధ రకాల ఋణాలు వారికి యిస్తున్నప్పటికీ, మనం ఉపయోగిస్తున్నప్పటికీ కూడా రైతులను ఆత్మహత్యల దిశ నుంచి ఎందుకు ఆపుచేయలేకపోతున్నామని ఒకసారి మన మంతా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా వుంది. రైతుల ఆత్మ హత్యలను ఆపేందుకు గాను ఈ ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా మా ప్రజా రాజ్యం పార్టీ తరఫున ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఈ రోజు ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాలు, యిచ్చే ఋణాలూ అన్నీ కూడా రైతుల జీవితాలను కాపాడేందుకే ఉపయోగపడాలి తప్ప , వారి నాశనానికి కాదని నేను తెలియజేస్తున్నాను.

ఇక ఉపాధి హామీ పథకం గురించి మనం చూసినట్లైతే, యిది ఎంతో మంది రైతు కూలీలకు ఉపాధి కల్పించే విధంగా, ఉపయోగపడే విధంగా వున్నమాట వాస్తవం. 25 ఎకరాలు, 30 ఎకరాలు, 40 ఎకరాలు లేక 50 ఎకరాల భూమిని కలిగి పంటలు పండించుకునే రైతు కూడా ఈ రోజు తవ కుటుంబాన్ని పోషించుకునేందుకు, పంటలు పండించుకునేందుకు గాను తప్పని సరిగా రైతు కూలీగా మారాల్సిన పరిస్థితులు ఈ నాడు దాపురించాయి. ఇటువంటి పరిస్థితులలో రైతును తక్షణమే ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా , ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, నీటి సౌకర్యాలు, విత్తనాలను అందించడానికి ,విత్తనాలకు సబ్సిడీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

అధ్యక్షా, వ్యవసాయ శాఖను రైతులకు విత్తనాలను యిచ్చేందుకు రెడీ చేయమని చెప్పామని మంత్రి గారు చెప్పారు. అందుకు గాను యిన్ని కోట్లను కేటాయించడం జరిగిందని, దాని ప్రకారం జొన్న, మొక్క జొన్న, ప్రత్తి వంటి వివిధ రకాల విత్తనాలు రెడీ చేశామని కూడా వారు చెప్పారు. కాని యిక్కడ మీరు చెప్పే పరిస్థితికి అక్కడున్న వాస్తవ పరిస్థితి చాలా భిన్నంగా వుంది. మొన్న మా పిఠాపురంలో నియోజక వర్గంలో కొన్ని గ్రామాలలో విత్తనాలు అందని పరిస్థితిని మేం గమనించాము.

అంతేకాదు, విత్తనాలు, ఎరువులు తీసుకునేందుకు వెళ్లిన రైతును అక్కడ విత్తనాలు అడి గితే, వాటితోబాటు గుళికలు తీసుకుంటావా? జింకు తీసుకుంటావా? సల్ఫేటు తీసుకుంటావా అని , ఎరువులు అడిగితే మరోటి తీసుకుంటావా లేదా అని అడుగుతున్నారు. మరో రెండు మూడు వందల రూపాయలు వారు ఖర్చు పెట్టవలసిన పరిస్థితులన్నాయి. అవి తీసుకుంటేనే మీరు అడిగిన వస్తువులు యిస్తామని అంటున్న పరిస్థితులున్నాయి. ఆ విధంగా రైతులను నిర్బంధించి కొను గోలు చేయిస్తున్న పరిస్థితులున్నాయి. కాబట్టి యిక్కడ చెప్పే పరిస్థితులు, వాస్తవాలకీ రెంటికీ పొంతన లేక నష్టపోతున్నది రైతులేనని తమ ద్వారా తెలియజేస్తున్నాను అధ్యక్షా.

కరువు పరిస్థితులు వచ్చినప్పుడు సాధారణంగా నిత్యావసర వస్తువుల అమ్మకాలలో కూడా యిబ్బందులు ఎదురవుతాయి. ఉదాహరణకు కందిపప్పు ధర పెరుగుదలపై మొన్న చర్చ జరి గింది. ఈ చర్చలో రాష్ట్ర ప్రభుత్వం వారు ఫెయిర్ ప్రైజ్ షాప్స్ ద్వారా వైటు కార్డు వున్న వారికి ఒక కేజీ కందిపప్పును రూ. 30 కి యివ్వాలన్న నిర్ణయం చేయడం జరిగింది. కాని ఈ రోజు ఆ షాపుల్లో ఒక కార్డుకు అర కేజీ కంది పప్పును మాత్రమే, అది కూడా రూ. 45 కి యిస్తాము, తీసుకుంటే తీసుకోండి లేకపోతే లేదు అంటున్నారు. అంతే కాకుండా ఆ షాప్పుకి నలుగురు విని యోగ దారులు వెళితే, నలుగురికీ కందిపప్పు దొరకడం లేదు, కారణం పంట లేకపోవడమూ, రాష్ట్ర ప్రభుత్వం కోత విధించడం మూలంగా ఒకొక్క షాపుకు 100 కేజీల కందిపప్పు యివ్వాల్సి వుండగా ,దానికి బదులు 25 కేజీలు మాత్రమే రావడం యిస్తున్నారు. దానితో ఆ షాప్పు యజమానులు కొంతమందికే వస్తువును యివ్వడం జరుగుతోంది. దీనిని సాకుగా తీసుకుని ఎంతో మంది బ్లాక్ మార్కెట్ చేస్తున్నారు. కాబట్టి వీటిని మనం అరికట్టవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఈ కరువును ఆసరాగా తీసుకుని , విద్యుత్, త్రాగు నీరు, నిత్యావసర వస్తువుల సరఫరా , ఎఱువులు, విత్తనాల విషయాలలో మధ్య దళారీలు వచ్చి డబ్బు చేసుకుంటున్నారు. అలాంటి వారు చాలా మంది తయారయ్యారు. ఇటువంటి దానిని ప్రభుత్వం నిరోధించక పోయినట్లైతే కరు వు నుండే కాక యితరంగా కూడా అన్ని విధాలా రైతులు యిబ్బందులు పడే పరిస్థితులు వస్తాయి. కాబట్టి కరువు సహాయం చేస్తామనో, కరువు ప్రకటన చేస్తామనో చెప్పి, ఆ ప్రకటన చేసి వదిలేస్తే కాదు, కరువు పర్యవేక్షణ కూడా తప్పకుండా ప్రభుత్వం చేయాల్సి వుందని నేను తమ ద్వారా తెలియజేస్తున్నాను. కాబట్టి పర్యవేక్షణ వుండాలి, డిపార్ట్‌మెంట్స్ మధ్య కో ఆర్డినేషన్ వుండా లని అలా లేనట్లైతే నష్టపోయేది రైతే అధ్యక్షా.

కాబట్టి తక్షణం కరువు ప్రాంతాలను ప్రకటించాలని మా పార్టీ ద్వారా కోరుతున్నాము. కరువు పెన్షన్సు యివ్వాలి, పంటలపై తీసుకున్న అన్ని రకాల ఋణాలను మాఫీ చేయాలి. అంతే గాకుండా ఈ రోజు కరువు అంచనా యిన్ని లక్షల రూపాయలు , యిన్ని కోట్ల రూపాయలని చెప్పి , దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి శాంక్షన్ రావాలని, కేంద్ర ప్రభుత్వం నిధులు యివ్వాలని చెబు

తారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వానికి కాగితాలు పంపుతారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు తిరగడం చేస్తారు. అంతేకాదు, మనం వారిని ఒక లక్ష కోట్ల రూపాయలు కరువు నిమిత్తం యివ్వమని అడిగితే వారు రూ. 10 వేల కోట్లు యివ్వడం జరుగుతుంది. అది ఇక్కడకు వచ్చిన తర్వాత రూ. వేయి కోట్లు కూడా ఖర్చు కాకపోవడం యిదెప్పుడూ జరుగుతున్నదే అధ్యక్షా. నిజానికి ఎప్పుడూ నష్టపోతున్నది రైతులే అధ్యక్షా.

ఉ.11.40

ఇవన్నీ కాగితాలపై జరుగుతున్నాయి తప్ప ఫీల్డ్ లెవెల్లో రైతులకు న్యాయం జరగటంలేదు. ముఖ్యమంత్రిగారిని ఈ సందర్భంగా కోరుతున్నాను. కరువు ప్రాంతాలలో ఉన్న రైతాంగ కుటుంబాలను వ్యవసాయపరంగా, విద్యుత్‌పరంగా, త్రాగునీటిపరంగా, సాగునీటిపరంగా ఆదుకోవటమేకాకుండా, విత్తనాలను సరఫరాచేసి ఊరుకోకుండా, పంట నష్టపరిహారం మరియు ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు ఇవ్వటమేకాకుండా ఎరువులు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లన్నింటిని ప్రభుత్వం తరపున చేయాలని కోరుతున్నాను. అన్ని రైతు కుటుంబాలలో ఉన్న పిల్లలకు ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వర్తించని రైతు కుటుంబాలకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని కోరుతున్నాను. 2003 తరువాత ఇంత తీవ్రంగా ఈనాడే ఈ ఆగస్ట్‌లో కరువు వచ్చింది. ఖరీఫ్‌లో ఈనాటివరకు ఉన్న పరిస్థితి చూస్తే ఇప్పటికే రైతులకు గడ్డుకాలం ఉన్నది. ఒకప్రక్క పశువులకు మేతలేక, పచ్చగడ్డిలేక చాలా ఇబ్బందులుపడుతున్నాము. ఇంకొక నెల గడిస్తే ఎండుగడ్డి లభించని పరిస్థితి ఉన్నది. పశుసంపద విషయం కూడా మనం జాగ్రత్తగా పర్యవేక్షణ చేయవలసిన అవసరం ఉన్నది. ఈ పశుసంపదను కాపాడుకోవలసిన అవసరం ఉన్నది. వ్యవసాయాధికారులు, పశుసంవర్ధకశాఖాధికారులు జాగ్రత్తగా పర్యవేక్షణ చేయవలసిన అవసరం ఉన్నది. ఇటువంటి కరువు పరిస్థితుల్లో ఎక్కడ ఏమి దొరికితే అది తినటంవలన పశువులకు రోగాలు వచ్చే పరిస్థితి ఉండటమేకాకుండా పాడి కూడా గణనీయంగా తగ్గిపోయే పరిస్థితి ఉన్నది. కృష్ణా డెయిరీగాని, ఎ.పి. డెయిరీగాని, గుంటూరులోని సంగం డెయిరీగాని, రాష్ట్రంలో ఏ డెయిరీ తీసుకున్నప్పటికీ ఒక్కొక్క డెయిరీకి సుమారు లక్ష లీటర్ల దిగుబడి తగ్గిపోయింది. అందువల్ల పశు సంరక్షణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి కరువు వచ్చింది. వర్షాలు బాగా పడనప్పుడు, వాతావరణం అనుకూలించనప్పుడు ప్రభుత్వం నడక నల్లేరుపై నడకలాగానే ఉంటుంది. పరిస్థితులు అనుకూలించనప్పుడు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు, వాతావరణం కలసిరానప్పుడు వారిని ఏవిధంగా ఆదుకుంటామనేది మనం ఆలోచించవలసిన అవసరం ఉన్నది. అప్పుడు మీరు ఇట్లా చేశారు, అట్లా చేశారు, కరువు బారినుండి ప్రజలను ఆదుకోలేకపోయారు కాబట్టి మీకు అడిగే హక్కు లేదని అనటం భావ్యం కాదు. ఎప్పుడు ఎవరు ఏమి చేసినప్పటికీ వర్తమానంలో కావలసినది రైతులకు రక్షణ కావాలి, ఆదరణ కావాలి, సహకారం కావాలి, విత్తనాలు కావాలి, త్రాగునీరు కావాలి,

సాగునీరు కావాలి, పంట పండించే సహకారం కావాలి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కావాలి, రైతు ఋణాలు మాఫీ కావాలి, అదే ఏర్పడాలి, అదే చేయాలి. ఆవిధంగా చేసి ఈ ప్రభుత్వం తన సత్తా చూపించుకోండని చెబుతున్నాము, డిమాండ్ చేస్తున్నాము. రైతులను మీరు ఆదుకోండి. పరనింద చేయటం, విమర్శ చేయటం మానుకోండి.

కరువును దృష్టిలో పెట్టుకుని రైతులకు కరువు భత్యాన్ని ప్రకటించాలి. వ్యవసాయ కూలీలకు పెన్షన్ ఇస్తున్నారు. కాని చాలామందికి కార్డులో ఉన్న ఏజ్‌కు, ఒరిజినల్‌గా ఉన్న ఏజ్‌కు పొంతనలేకపోవటంవలన ఎంతోమంది అర్హులైన పేదవారు ఈరోజు పెన్షన్స్ పొందటంలేదు. తక్షణమే మండలాలవారీగా, గ్రామాలవారీగా కరువు పరిస్థితిని అంచనావేసి ఆయా గ్రామాలలో కరువు పెన్షన్స్‌తో ఎవరెవరు లింకప్ కాలేదో వారికి కూడా కరువు పెన్షన్స్ ఇవ్వాలని, అదేవిధంగా వారి పిల్లల ఫీజు రీఇంబర్స్ చేయాలని, ఋణాలను మాఫీచేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాను. కేంద్రప్రభుత్వ సహాయం, రాష్ట్ర ప్రభుత్వ సహాయం అందేట్లు చేయటంతోపాటు వివిధ శాఖలమధ్య పరస్పర సమన్వయం, సహకారం ఉండేట్లుచూసి రైతాంగాన్ని ఆదుకోవటమే లక్ష్యంగా, కరువును ఎదుర్కోవటమే కర్తవ్యంగా చూడాలని మీద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

శ్రీ కె. మురళీమోహన్(రాజాం): అధ్యక్షా, ఈరోజు కరువుగురించి మనం మాట్లాడుకుంటున్నాము. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను చూస్తే తీవ్ర ఆందోళన చెందటం సహజంగా అందరికీ ఉంటుంది. వర్షాలు సకాలంలో పడకపోవటంవల్ల పంట పొలాలు చాలావరకు బీడులుగా మారిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు తోడు అటవీ విస్తీర్ణం తగ్గిపోవటం కూడా వర్షాలు పడకపోవటానికి ఒక ప్రధానమైన కారణం. మనం ఒక ప్రక్క ఇష్టం వచ్చినట్లు చెట్లు నరికివేయటంవల్ల ఫారెస్ట్ ఏరియా తగ్గిపోయి వర్షాలు పడకపోవటం కూడా కరువుకు కారణం. ఈనాడు ఫారెస్ట్ ఏరియా 33% ఉండవలసి ఉండగా నేడు అది కేవలం 25%, 26%కు మాత్రమే పరిమితమైనది. ఈనాడు రైతుకు తీవ్రమైన నష్టం జరుగుతోంది. బోర్లు ఎండిపోతున్నాయి. పశు సంపద అల్లాడిపోతోంది. పశుగ్రాసం కొరత రాబోయే రోజుల్లో వస్తుందని ఊహించటం జరుగుతోంది. ఇవన్నీ ధైర్యంగా ఎదుర్కోవటానికి మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు చాలా చర్యలు తీసుకుంటున్నారు. మొన్న మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు ఒక స్టేట్‌మెంట్ ఇవ్వటం జరిగింది. ఈనాడు ఖరీఫ్ సీజన్‌లో 82.15 లక్షల హెక్టార్లు సాగుచేయవలసి ఉండగా కేవలం 35 లక్షల హెక్టార్లు మాత్రమే సాగుచేయటం జరుగుతోంది. 43% వరకు వెళ్లాము. ఇంకా రానున్న నెల వరకు ఖరీఫ్ సీజన్ ఉన్నది. అందువల్ల తీవ్రంగా బాధపడవలసిన necessity లేదు. గత 5 సంవత్సరాలు వరుణదేవుడు సహకరించాడు. రైతుబాంధవుడైన మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు గతంలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని మంచి నిర్ణయాలు వ్యవసాయం కోసం, రైతులకోసం తీసుకున్నారు. ఆ ఘనత మన ప్రియతమ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారికే దక్కుతుందని గర్వంగా తెలియచేస్తున్నాను. అదేవిధంగా కరువును

ఎదుర్కోవటానికి కూడా చాలా మెజర్స్ తీసుకోవటం జరిగుతోంది. టెంపరరీగా, పర్మనెంట్‌గా చాలా మెజర్స్ తీసుకోవటం జరుగుతోంది. 2004కు ముందు ఈ రాష్ట్రం కరువు కాటకాలతో ఎంత ఇబ్బందిపడిందో మనందరకు తెలుసు. ఆరోజు 1500 కిలోమీటర్లు నడచి రైతుల బాధలు తెలుసుకున్నారు. వ్యవసాయం అంటేనే భయపడే పరిస్థితులు ఆ రోజుల్లో ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు ఆరోజుల్లో వ్యవసాయం దండగ అని చెప్పిన విషయం అందరకు తెలుసు, దండగ అనేదానిని పండుగగా చేయటానికి మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు చాలా మెజర్స్ తీసుకోవటం జరిగింది.

కరువు రావటం అనేది సహజంగానే జరుగుతుంది. అయిదారు సంవత్సరాలకు ఒకమారు కరువు వస్తుంది. రాజశేఖరరెడ్డిగారు పర్మనెంట్‌గా ఆలోచించారు. మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు చాలాసార్లు ఈ సభలో కూడా చెప్పటం జరిగింది. కరువేమిటో నాకు తెలుసు, రాయలుసీమలో కరువు ఎట్లా ఉంటుందో నేను చూశాను, పంటపొలాలలో వ్యవసాయదారుడు ఎంత ఇబ్బందిపడతాడో నాకు తెలుసు అని ప్రియతమ ముఖ్యమంత్రిగారు ఎన్నోసార్లు ఈ సభలో చెప్పటం జరిగింది. 9 సంవత్సరాలు పనిచేసిన చంద్రబాబునాయుడుగారికి కూడా ఒకసారి సలహా ఇవ్వటం జరిగింది. పర్మనెంట్‌గా ప్రాజెక్ట్‌లు కట్టండి, అప్పుడు వ్యవసాయదారుల ఉసురు మీకు తగలదని చాలాసార్లు చెప్పటం జరిగింది. ఆనాడు ఈ సభలో ఉన్న మనకు, ఆంధ్ర ప్రజానీకానికి ఈ విషయం తెలుసని ఈ సభద్వారా తెలియచేస్తున్నాను. కరువు వస్తే రైతులు బాధపడతారు. రైతులతోసహా రైతుకూలీలు, అసంఘటిత కార్మికులు బాధపడే పరిస్థితిని అధిగమించటానికి రాష్ట్ర స్థాయిలో మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు, జాతీయ స్థాయిలో యు.పి.ఎ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీగారు జవహర్ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారు. సుమారు 50 లక్షలమంది రోజుకు వందనుండి నూట యాభై రూపాయలు సంపాదించి పొలాలలోకి కూలికి కూడా వెళ్లే పరిస్థితి లేదు. పల్లెటూర్లలో ఆకలితో బాధపడుతున్నామనిగాని, ఆకలి చావులు జరుగుతున్నాయనే ప్రశ్నగాని ఈ రోజు ఉత్పన్నమే కావటంలేదని ఈరోజు గర్వంగా తెలియచేస్తున్నాను. ప్రతి ఒక్కరికీ ఈరోజు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. క్రింద పని దొరుకుతోంది. వారంతా చాలా సంతోషంగా ఉన్నారు. నా కాన్‌స్టిట్యుయెన్సీలోని ఊర్లలోని చాలామంది రైతులు ఈరోజు స్వయంగా చెబుతున్నారు. రైతు కూలీలు దొరకటంలేదు, ఇబ్బందుల్లో ఉన్నాము, ఈ విషయాన్ని కూడా సి.ఎమ్.గారి దృష్టికి తీసుకెళ్లండని చెబుతున్నారు.

**ఉ. 11.50**

ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఈ రెండు, మూడు జిల్లాలలో వర్షపాతం బాగుంది తప్ప మిగతా జిల్లాలలో చాలా తక్కువ వర్షపాతముందని ప్రభుత్వం తన స్టేట్‌మెంటులో పేర్కొన్నది. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించిన ప్రభుత్వం అన్ని డిపార్టుమెంటులను ఒక దగ్గర కూర్చోబెట్టి ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు ఇబ్బందౌతుందని, దానికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రు. 30 కోట్లు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఒక్క ఎన్‌ఆర్‌ఇజిపి చూసుకుంటే జూన్,జూలైలలో రు. 500 కోట్లు ఖర్చు

పెట్టడం జరిగింది. అదే కాకుండా ఈ సంవత్సరం ఏడు వేల కోట్ల రూపాయలు కూడా ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాజశేఖర రెడ్డి గార్ని రైతు బాంధవుడు అనడానికి చాలా కారణాలున్నాయి. ఏ రోజు కూడా రైతుల గురించి ఆలోచించని గత ప్రభుత్వం పోయి ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతుల ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకొని రు. 1200 కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేసిన ఘనత మా ప్రియతమ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారిదే. వాళ్ల పరిపాలనలో రైతుల గురించి మాట్లాడని వ్యక్తులు అనాడు 11 నుంచి 15 శాతం వరకున్న సహకార బ్యాంకురుణాల వడ్డీ శాతాన్ని తగ్గించే ప్రయత్నం చేయలేదు. ఆనాడు రైతుల కష్టాల్ని గురించి ఆలోచించని వాళ్లు ఇవ్వాళ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ కోసం రు. 6,500 కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని గురించి మాట్లాడే పరిస్థితి లేదు. కాని రాజశేఖర రెడ్డిగారి మీద, ఆయన ప్రభుత్వం మీద మాత్రం నిందలు వేయడం తప్పించి వారు రైతులకు చేసింది ఏమిటని అడుగుతున్నాను. ఈ ప్రభుత్వం తనకున్న ప్లాన్ నిధులను ఎక్కువగా రైతుల కోసం, రైతుల భద్రత కోసం ఖర్చుపెడుతున్నది. ఈ రోజున పావలా వడ్డీ రుణాల కోసం రమారమి అందరు రైతులు కూడా సహకార బ్యాంకుల నుండి తీసుకోవడం జరిగింది. 2004కి ముందు మన రాష్ట్రంలో మండలానికొక యూనిట్‌గా ఉండేది. కాని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మన ప్రియతమ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు రైతుల బాధల్ని గమనించి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరిగింది. ఇవన్నీ ఎందుకు తెలియజేస్తున్నానంటే కరువు వర్షాభావం అనేవి మనిషి కల్పించేవి కావు. అవి ప్రకృతికి సంబంధించిన వైపరీత్యాలు. అలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొని రైతులను ఆదుకోవడానికి శాశ్వతమైన పనులు చేపట్టే విధంగా, ఆహార భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఈ పరిస్థితుల వల్ల ప్రతిపక్ష నాయకులు చెప్పినట్లు రైతులు చనిపోయే అవసరం లే దు. రెండు కోట్ల కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చి రెండు రూపాయలకు కిలో బియ్యం చొప్పున సంవత్సరానికి రూ. 3500 కోట్లు ఖర్చు పెడుతున్న ఘనత మా ప్రియతమ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారిదే. అదే విధంగా ఈ రాష్ట్రంలో 72 లక్షల మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వీళ్లందరికీ సంవత్సరానికి రూ. 1500 కోట్ల నుంచి రూ. 2000 కోట్ల వరకు ఖర్చు చేసి వారికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతోంది. ఇది కూడా కరవు పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలలో ఒక భాగమే. ఈరోజు రాష్ట్రంలో మొత్తం 80 లక్షల ఇళ్లను గృహ నిర్మాణ శాఖ ద్వారా కట్టించాలని లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి వరకు 40 నుంచి 45 లక్షల ఇళ్ల వరకు పూర్తి చేసి అసంఘటిత కార్మికులకు పని కల్పించడం జరిగింది. అంటే ఎవరికీ పని లేదనే పరిస్థితి లేకుండా ఈ ప్రభుత్వం 2004 నుంచి ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, మిగతా వాటిని త్వరలోనే పూర్తి చేయడం జరుగుతోంది. అంతేగాకుండా మహిళలకు దేశంలో ఎక్కడా లేని విధంగా, ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇంత రిస్క్ తీసుకోని విధంగా , మహిళలకు పావలా వడ్డీకే రుణాలు రూ. 20వేల కోట్లు అందించే కార్యక్రమం ఈ ప్రభుత్వం చేపట్టింది. అందుకు గాను బ్యాంకు వాళ్లకు రమారమి రూ. 600 కోట్ల మేరకు పావలా ప్రభుత్వం చెల్లించడం జరిగింది. ఇవన్నీ కూడా కరువు పరిస్థితిని ఎదుర్కోవడంలో ప్రభుత్వం చేస్తున్న శాశ్వత కార్యక్రమాలు . రేపు వర్షం రాకపోయినా పేద ప్రజలు, రైతులు సుఖంగా వుండాలని, వారి జీవన పరిస్థితులు మెరుగుపడాలని ఈ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. ఇంతకు ముందు వంగా గీత గారు కొన్ని విషయాలు చెప్పారు. ఈరోజు రాష్ట్రంలో నూటికి 98 మంది రైతులు తెల్లకార్డులను తీసుకోవడం జరిగింది. వారి పిల్లలందరికీ ఎల్‌కెజీ నుండి పి.జి. వరకు చదువుల కోసం అన్ని కులాలలో అర్హులైన వారికి ఈ సంవత్సరం రూ. 3500 కోట్లు ఇచ్చిన ఘనత మా ప్రియతమ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారిదే. ఈరోజు ఇరిగేషన్ ప్రాజెక్టులనేవి పర్మనెంట్ సొల్యూషన్‌గా తీసుకోవడం జరిగింది. వర్షం ఈరోజు రావచ్చు, రాకపోవచ్చు . ఈ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి మీ ప్రభుత్వంలో ఏరోజు కూడా ఆలోచించలేదు. కానీ ఈ ప్రభుత్వం లో మాత్రం వాటిని ఎదుర్కోవడానికి శాశ్వత

ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరిగింది. 50 సంవత్సరాల క్రితం మన రాష్ట్రంలో డొక్కల కరవు రావడం జరిగింది. ఆరోజు కొన్ని కోట్ల మంది చనిపోతే సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం వద్ద ఒక బ్యారేజీని కట్టించడం జరిగింది. దాని వల్ల కొన్ని లక్షల కుటుంబాల జీవితాలలో వెలుగు వచ్చింది. ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని చూసి మా ప్రియతమ ముఖ్యమంత్రి ఏ ప్రకృతి వైపరీత్యమైనా వచ్చినపుడు ప్రజలను ఆదుకోవడానికి వీలుగా ఈరోజు ఆ ప్రాజక్టుల నిర్మాణాన్ని ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఒక కోటి ఇరవై లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు గాను ఐదు సంవత్సరాలలో ఈ ప్రాజెక్టులను కట్టాలని నిర్ణయించడం జరిగింది. ఆ ప్రాజక్టుల నిర్మాణం పూర్తయితే రెండు, మూడు సంవత్సరాలు కరవు వచ్చినా వాటిని ఎదుర్కొనే విధంగా ఆ ప్రాజెక్టులు ఆదుకుంటాయని మనవి చేస్తున్నాను. అదే విధంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కనీసం వారిని ఆదుకోవడానికి ఆ ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. మా ప్రియతమ ముఖ్యమంత్రిగారు వచ్చిన వెంటనే 1994 నుంచి 2004 వరకు ఎంతమంది రైతులు చనిపోయారో వారందరికీ లక్షన్నర రూపాయల చొప్పున పరిహారం చెల్లించిన విషయం మీకు గుర్తు లేదా? దీనిపై తెలుగుదేశం పార్టీ వాళ్లకు మాట్లాడే హక్కు లేదని మనవి చేస్తున్నాను. మంచి సలహాలు ఇస్తే తీసుకోవడానికి మాప్రభుత్వం సిద్ధంగా వుంది. మా ప్రియతమ ముఖ్యమంత్రి ప్రతి విషయాన్ని పాజిటివ్‌గా తీసుకునే మనస్తత్వం వున్న వ్యక్తి. సమాజంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుకు చలించి వెంటనే చర్య తీసుకునే మనస్తత్వం ఆయనది. మంచి సలహాలు ఇవ్వండి, మీరు మంచి సలహాలు ఇస్తే తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా వుంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి సభలో ప్రభుత్వం అందజేసిన నోట్‌ను ఒకసారి గౌరవ సభ్యులందరూ గమనించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

శ్రీ కె. టి. రామారావు (సిరిసిల్ల): అధ్యక్షా, రాష్ట్రంలోని కరవు పరిస్థితుల మీద చాలా విస్తృతమైన చర్చ జరిగింది. తెలంగాణా రాష్ట్ర సమితి తరపున ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో నెలకొని వున్న దుర్భిక్ష పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చే అవకాశం నాకు కల్పించినందుకు మీకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. నేను అనుకున్నదేమంటే, కరవు మీద చర్చ జరుగుతున్నపుడు అటు అధికార పక్షం గానీ, ఇటు ప్రధాన ప్రతిపక్షం గానీ, అలాగే మిగతా పక్షాలు కలసికట్టుగా మాట్లాడి అందరూ ఏకత్రాటిమీదకు వచ్చి రైతులకు ఆత్మస్థైర్యం, మనోధైర్యం కల్పించే అవకాశం ఉంటుందని. కానీ దురదృష్టవశాత్తు రోజూ మాదిరిగానే ఈరోజు కూడా ఇక్కడ రాజకీయ విమర్శలు చేసుకోవడం, గతాన్ని తవ్వుకోవడం జరుగుతోంది. ప్రతిరోజూ ఎవరు ఎన్ని మార్కులు సాధించామని చూసుకోవడం తప్ప ఈ కరవు పరిస్థితి ఎదుర్కోవడానికి ఎవరిలో కూడా ఏమాత్రం సిన్సియారిటీ కనబడడం లేదు. ఈరోజు రాష్ట్రంలో విలయతాండవం చేస్తున్న కరవు ఒకవైపు, ఆకాశాన్నంటుతున్న ధరలు మరొక వైపు, మూడో వైపు కరెంటు కటకట వుందని అందరూ అంగీరిస్తారు. కరెంటుకు సంబంధించి తీవ్రమైన ఇబంది వుందని ఏ ఊరికెళ్లినా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ రకంగా సామాన్యుని జీవితంపై ముప్పేట దాడి జరుగుతోంది. ప్రభుత్వం శాసనసభకు సమర్పించిన నోటు ప్రకారం మనకు ఈసంవత్సరం 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఇది దాదాపు 50 సంవత్సరాల తర్వాత అతి పెద్ద కరవు అని చెబుతున్నారు. ఇందాక సోదరులు కేశవ్‌గారు కరువాంధ్రప్రదేశ్ అన్నారు. ఈరోజు రాష్ట్రంలోని కరవు పరిస్థితుల గురించి పత్రికలు విస్తారంగా, విపులంగా పతాక శీర్షికలలో రాస్తున్నాయి. కరువాంధ్రప్రదేశ్ అని ఒకరు రాస్తే, పల్లె కన్నీరు పెడుతోందని మరొకరు రాశారు. ఈరోజు Fourth Estate గా పరిగణించే పత్రికలన్నీ కూడా కరవు పరిస్థితుల గురించి ఘోషిస్తున్నాయి. ఈ కరవు పరిస్థితులను చాలా సీరియస్‌గా తీసుకోవాలని అందరికీ చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోట్ ప్రకారం మొత్తం 1128 మండలాలకు గాను 1028 మండలాలలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వమే అంగీకరించింది.

రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర రాక ఇప్పటికీ ఐకెపి సెంటర్ల ద్వారా అమ్మినా పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగలేదు, ఇంకా 50 శాతం చెల్లించాల్సిన పరిస్థితి వుంది.
మ.12.00

అలాంటి పరిస్థితుల్లో రైతులు అల్లాడుతుంటే మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లుగా ఈరోజు కరవు రావడం, దుర్భిక్ష పరిస్థితులు తీవ్రాతితీవ్రం కావడం నిజంగా మనమందరమూ కూడా బాధపడవలసిన విషయం . రాష్ట్రంలో ఈరోజు ఏప్రాంతానికి వెళ్లినా, ఏ మండలానికి, ఏజిల్లాకు పోయినా కూడా రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి కళావిహీనంగా మారిపోయింది. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఎక్కడైనా నీళ్లుంటే అక్కడ కరెంటు సరఫరా లేదు. ఏడు గంటల కరెంటని చెబుతున్నారు, ఏడు గంటల కరెంటు నిజమే కానీ దాన్ని మూడు, నాలుగు స్పెల్స్‌లో ఇవ్వడం, సంబంధిత ఆర్‌డబ్ల్యుయస్, ఎలక్ట్రిసిటీ అధికారుల మధ్య సమన్వయం లోపించడం వల్ల కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో పరిస్థితులు దారుణంగా వున్నాయి. తాగునీటికి సంబంధించి తీవ్ర ఎద్దడి వుంది. ఈరోజు రాష్ట్రంలో సాగునీటి గురించి మాట్లాడే పరిస్థితుల్లో మనం లేము. సాగునీటికి, త్రాగునీటికి ఈరోజు కటకటలాడే పరిస్థితి వుంది.

రాష్ట్రంలో చాలా జిల్లాలలో వలసలు మొదలైన విషయాలను మనం పత్రికలలో చూస్తున్నాం . వలసలంటే ఇంతకు ముందు కేవలం పాలమూరు జిల్లా గురించే మాట్లాడే వాళ్లు . ప్రతి సంవత్సరమూ 13, 14 లక్షల మంది వలసలు పోతున్నారని, పాలమూరంటేనే కరవు, వలసలకు పర్యాయపదంగా ఒకనాడుండేది. కాని ఈరోజు చూస్తే, పాలమూరు జిల్లా మాత్రమే కాదు, సియం గారి సొంత జిల్లా అయిన కడప జిల్లాలో కూడా వలసలు జరుగుతున్నాయనే విషయం పత్రికలలో వస్తోంది. ఈరోజు వలసలు పోతున్నది కేవలం మనుష్యులు మాత్రమే కాదు, పశువులు కూడా వలసలు పోతున్నాయి. ఒక వారం క్రితం మా మెదక్ జిల్లా, నారాయణ్‌ఖేడ్ శాసనసభ్యులు, పెద్ద మనిషి కిష్టారెడ్డిగారు చెప్పడం జరిగింది పశువులు కూడా వలస పోతున్నాయని. పశువులు ఈరోజు పెద్ద సంఖ్యలో కబేళాలకు తరలిపోతున్నాయి.

సార్, పశువులకు పశుగ్రాసం అందని దుర్భిక్ష పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొనివున్నాయి. ఇంతకు ముందు మంత్రిగారు తన సమాధానంలో చెప్పారు, ఎండుగడ్డి అవైలబుల్‌గా వుంది, పశువులకు గ్రీన్ ఫాడర్ మాత్రం అవైలబుల్‌గా లేదనే మాట చెప్పారు. ఈరోజు గ్రీన్ ఫాడర్ పరిస్థితి ఎలా వుందంటే, ఐదు రూపాయలకు చిన్న కట్ట, యాభై రూపాయలకు పెద్ద వరి మోపు కొనుక్కుని రైతు బతకవలసిన పరిస్థితి వుంది. అంతా సుభిక్షంగా వున్నపుడు, వర్షాలు బాగా పడినప్పుడు గవర్నమెంటు నుంచి చాలా ప్రకటనలు చూస్తున్నాం . ప్రత్యామ్నాయ పంటలని, వరుణ యాగాలని, మేఘమథనాలని రకరకాలుగా ఊరించే ప్రకటనలు చేస్తుంటారు. కానీ అసలు సమస్య వచ్చినపుడు ఈ ప్రకటనలు పనికిరాకుండా పోతున్నాయి, కొరగాకుండా పోతున్నాయి. ఈరోజు ఎన్ని విమానాలు ఎగిరినా, ఎన్ని వరుణ యాగాలు చేసినా కూడా వరుణ దేవుడికి మన మీద కరుణ రావడం లేదు.

అధ్యక్షా, రైతుల ఆత్మహత్యల గురించి గౌరవ సభ్యులు కేశవ్‌గారు చాలా వివరంగా మాట్లాడారు. గత 40 రోజుల్లోనే దాదాపు 70 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని కేశవ్‌గారు చాలా డీటెయిల్డ్‌గా చెప్పారు. దురదృష్టమేమంటే, ఆ 70 మందిలో 40 మంది మా తెలంగాణాకు చెందిన వాళ్లే వున్నారు. వర్షాభావ ప్రాంతాలకు సంబంధించి లెక్కలు తీస్తే, అందులో కూడా తెలంగాణాలో అత్యంత దుర్భిక్ష

పరిస్థితులు నెలకొని వున్నాయి. దాదాపు 57, 58 శాతం లోటు వర్షపాతం తెలంగాణాలోనే వుంది, రాష్ట్రంలోనే అత్యధికంగా లోటు వర్షపాతం తెలంగాణాలోనే వుంది. ఈరోజు తెలంగాణా ప్రాంతం గురించి ప్రధానంగా మాట్లాడవలసివస్తే – తెలంగాణా వర్షాధార ప్రాంతం, మెట్ట ప్రాంతమని మనకందరికీ తెలిసిందే. ఈరోజు పరిస్థితేమంటే – రాష్ట్ర వ్యాప్తంగా నేడు 24లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుంటే, అందులో 15లక్షల కనెక్షన్స్ ఒక్క తెలంగాణా ప్రాంతంలోనే వున్నాయనే విషయాన్ని మీద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నాను. ఇంతకు ముందు గౌరవ సభ్యులు కేశవ్‌గారు ఒక ఉదాహరణ చెప్పారు. వాళ్ల అనంతపూర్ జిల్లాలో ఒక రైతు పేరు చెబుతూ సదరు ఒక్క రైతే 26 బోర్లు వేశాడని చెప్పారు. కానీ అంతకంటె దుర్భిక్షకరమైన, ఇబ్బందికరమైన పరిస్థితులు తెలంగాణాలో వున్నాయి. ఎలాంటి పరిస్థితి అంటే ఈరోజు తెలంగాణా ప్రాంతంలో రైతులు పాతాళ గంగ కోసం ప్రార్థిస్తున్నారు. మహాకవి శ్రీనాథుడు ఆనాడు గంగ కోసం ప్రార్థించాడట . ఆ సందర్భంలో ఆయనొక పద్యం చెప్పాడట . "సిరిగలవానికి జెల్లున్ తరుణులు పదహారువేలు తగ పెండ్లాడన్, తిరుపమునకు ఇద్దరాండ్రా పరమేశా! గంగను విడువుము పార్వతి జాలున్ ! " గంగను వదలిపెట్టయ్యా, నీకు పార్వతి చాలు అని ఆనాడు గంగ కోసం శ్రీనాథ మహాకవి పరమేశ్వరుడిని వేడుకున్నాడట . ఈరోజు తెలంగాణా ప్రాంతంలో వున్న రైతుల పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. వాళ్లు కూడా పాతాళ గంగ కోసం ప్రార్థిస్తున్నారు, భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదాహరణకు మా నల్గొండ జిల్లాలో మూశంపల్లి అనే ఒక ఊరు వుంది. ఆ ఊరి జనాభా ఐదువేలైతే అక్కడ వున్న బోర్ల సంఖ్య ఆరు వేలు . ఆ ఊరిలో రామిరెడ్డిగారు అనే పేరున్న ఒక్క రైతే దాదాపూగా 60 బోర్లు వేశారు. కేశవ్‌గారు చెప్పిన 26 బోర్లతో పోల్చుకుంటే, అందులో కూడా మా తెలంగాణా రైతులే రికార్డు నమోదు చేశారు. ఈరోజు 60 బోర్లు వేసినా మూశంపల్లిలో రైతులు ఇంకా నీటికోసం వెదుకులాడుతున్నారు.

సార్, ఈరోజు తెలంగాణాలో ప్రధానంగా పండించే వరి కావచ్చు, మొక్కజొన్న కావచ్చు, సోయా కావచ్చు, కాటన్ కావచ్చు, ఏ పంట తీసుకున్నా చాలా ఇబ్బందికరమైన పరిస్థితులున్నాయి. ఉదాహరణకు పత్తి సాగును తీసుకుంటే దాదాపు మూడు లక్షల ఎకరాలలో సాగు కావలసివుండె ఈ సీజనులో . నాకున్న సమాచారం ప్రకారం ఇప్పటికి రెండు లక్షల ఎకరాలలో మాత్రమే విత్తనాలు వేయడం జరిగింది. అందులో ఒక లక్ష ఎకరాలలో విత్తనం మొలకెత్తకముందే పోయింది. ఇంకొక లక్ష ఎకరాలలో విత్తనం మొలకెత్తి, పైకి వచ్చిన తర్వాత ఎండిపోయిన పరిస్థితి వుంది. రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం ఈనాడు సమస్య కాదు. కాకపోతే దాన్ని ఎదుర్కోవడానికి దశాబ్దాల కాలంగా ఏ మేరకు చర్యలు తీసుకున్నామన్నది ఆలోచించవలసిన ప్రశ్న . వర్షాభావం వల్ల సంక్షోభం వస్తే, మన రాష్ట్రానికి సంక్షోభం కొత్త కాదు, కరవు కొత్తకాదు. ఇలాంటి సమస్య వచ్చినపుడు ఏ రకమైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం, ప్రభుత్వం ఏమేరకు సంసిద్ధంగా వుందన్నదే చర్చించవలసిన విషయం . మనం చర్చించుకోవడానికి కారణమైన కరవుకు ప్రధాన కారణం 57 శాతం లోటు వర్షపాతం ఉండడమే. వర్షాభావ పరిస్థితి తీవ్రంగా ఉండడం వల్ల ఈరోజు ప్రజల జీవన ప్రమాణాలు క్షీణించే ప్రమాదం ఏర్పడింది. వర్షం రాకపోతే ఎన్ని ఎఫెక్ట్స్ వుంటాయి, ఎంత ఇంప్యాక్ట్ వుంటుందో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. తాగునీరు, సాగునీరు వుండదు, వ్యవసాయం కుంటుపడి దిగుబడులు తగ్గే పరిస్థితి ఏర్పడుతుంది. ఆహార కొరత ఏర్పడే పరిస్థితి వస్తుంది. నిన్న సివిల్ సప్లైస్ మినిస్టర్‌గారు నిత్యావసర వస్తువుల ధరల మీద స్టేటుమెంటు ఇస్తున్నపుడు మాకొక అనుమానం వచ్చింది. కరవు వచ్చింది ఈ సంవత్సరమా లేక పోయిన సంవత్సరమా అనే అనుమానం వచ్చింది. ఎందుకంటే పోయిన సీజన్లో ఆహారోత్పత్తి బ్రహ్మాండంగా వున్నపుడే

అంత పెద్ద మొత్తంలో రేట్లుంటే, ఈసారి కరవు వచ్చింది కాబట్టి రాబోయే రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

అధ్యక్షా, జలాశయాల విషయానికి వస్తే అవి మొత్తానికి మొత్తంగా అడుగంటిపోయాయి. 90 టియంసి ల సామర్థ్యం వున్న శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు ఈరోజు 4.19 టియంసి ల సామర్థ్యం మాత్రమే వుంది. కరీంనగర్ జిల్లా మొత్తానికి మొత్తం సాగునీటికి, తాగునీటికి కటకటలాడే పరిస్థితి వచ్చింది. ఈ రకమైన దుర్భిక్షమైన పరిస్థితుల్లో అన్ని రకాల సమస్యలు రాష్ట్రాన్ని చుట్టిముట్టే ప్రమాదం ఏర్పడుతుంది. కరవుతో నిరుద్యోగం, దారిద్ర్యం, వలసలు, నేరాలు అనేక రకాలు విజృంభించే అవకాశం వుంది. మా పరిస్థితి ఏమంటే – కొత్తగా ఎమ్మెల్యేలయ్యాం . ఎన్నికై అసెంబ్లీకి వచ్చిన తర్వాత ఇక్కడ అర్థవంతమైన చర్చ జరుగుతుంది, నేర్చుకోవడానికి అవకాశం వుంటుంది, కొన్ని విషయాలు అటు ప్రభుత్వం నుంచి, మరి కొన్ని విషయాలు ప్రతిపక్షాల నుంచి నేర్చుకోవడానికి అవకాశం వుంటుందని ఒక గొప్ప ఆశ పెట్టుకుని ఇక్కడికి వస్తే, ఇక్కడ పరిస్థితి మాత్రం అంత గొప్పగా లేదు. వర్షం పడనప్పుడు తెలంగాణా ప్రాంతంలో కప్పతల్లి అనే ఒక ఆట ఆడతారు. పెళ్లి కాని ఇద్దరు పిల్లలకు రెండు కట్టెలిచ్చి మధ్యలో ఒక కప్పను కట్టి డప్పులు వాయించుకుంటూ, వర్షాలు పడాలని కోరుకుంటూ మొత్తం ఊరంతా ఊరేగింపు చేస్తూ చాలా హడావుడి చేస్తారు. అలాంటి పండగలకు మమ్ములను రమ్మని ఊర్ల నుంచి ఫోన్లు చేస్తున్నారు. కప్పతల్లి ఆట ఆడుతున్నాం సార్, ఎమ్మెల్యేగారు మీరు రావాలని వారు అడిగినప్పుడు – నేను వారికి చెప్పాను, అయ్యా! నేను కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేను. అసెంబ్లీలో వుంటే కొద్దిగా నేర్చుకోవడానికి అవకాశం వుంటుంది కాబట్టి నేను ఇక్కడే వుంటానని చెబితే వాళ్లు నాతో సూటిగా అన్నారు సార్. మీరు ఎమ్మెల్యేగా కొత్తగా గెలిచినా ఏమి లాభం సార్, అక్కడ మీకు స్పీకర్‌గారు మైకు ఇవ్వరు, ఆర్థిక మంత్రిగారు ఎమ్మెల్యే నిధులు ఇవ్వరు అని వాళ్లు డైరెక్ట్‌గా అంటే ....

MR. SPEAKER : Mr. Ramarao garu, you should maintain some restraint while talking. You cannot talk like that.

శ్రీ కె. టి. రామారావు : సార్, నేను వాళ్లకు చెప్పాను . స్పీకర్‌గారు చాలా మంచివారు, నాకు మైకు ఇస్తున్నారు, ఆర్థికమంత్రిగారే ఎమ్మెల్యే నిధులు ఇవ్వడం లేదని చెప్పాను. స్పీకర్‌గారు చాలా మంచివారని వాళ్లకు చెప్పాను సార్.

మిస్టర్ స్పీకర్ : నేను మంచివాడినా లేక చెడ్డ వాడినా అన్నది కాదు. ప్రజలు మీకిచ్చిన అవకాశాన్ని బట్టి నేను మీకు సమయానుసారంగా మైకు ఇవ్వడం జరుగుతుంది. దయచేసి మీకిచ్చిన సమయంలోగా పూర్తి చేయండి.

శ్రీ కె.టి. రామారావు : స్పీకర్‌గారు చాలా మంచివారని నేను వాళ్లకు చెప్పాను సార్. వర్షాలు రాకపోవడానికి కారణం ప్రభుత్వమేనని మేము అనడం లేదు సార్. ఎందుకంటే ప్రకృతి ఎవరి చేతిలోనూ ఉండదు. కానీ వర్షాలు పడినప్పుడు మాత్రం మా ఘనతేనని, వర్షాలు పడనప్పుడు మాత్రం దేశమంతా దుర్భిక్ష పరిస్థితులున్నాయి కాబట్టి ఇక్కడ కుడా ఏర్పడ్డాయని అనడం మాత్రం సబబు కాదు సార్. ఎందుకంటే పోయిన సీజన్లో వర్షాలు బాగా పడినప్పుడు ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిగారు ఒక ప్రకటన ఇచ్చారు. అందులో ఆయన చెప్పారు – వరుణ దేవుడు కాంగ్రెస్ పార్టీలో వున్నారు కాబట్టి నాలుగైదు

సంవత్సరాలు మేము అధికారంలో వున్నంత కాలం వర్షాలు బ్రహ్మాండంగా పడ్డాయని సియం గారు ఒక ప్రకటన ఇచ్చారు. ఆయన ప్రకటన ఇవ్వడంలో మాకెటువంటి అభ్యంతరం లేదు సార్.

మ. 12.10

ఆయన ప్రకటన ఇవ్వడంలో మాకేమి అభ్యంతరం లేదు. కాని మొన్నీమధ్య ఒక ఊరికి వెళితే ఒక అవ్వ అడిగింది. అయ్యా, మన రాజశేఖర్ రెడ్డిగారు చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి, వాన దేవుడిని వారి పార్టీలో చేర్చుకున్నారు కాబట్టి వాన దేవుడితో మాట్లాడి వర్షాలు తెప్పించిన వ్యక్తి కాబట్టి పప్పు దేవుడితో మాట్లాడి పప్పు ధరలు తగ్గించవచ్చు కదా అని అడిగితే సమాదానం చెప్పలేని స్థితి నాకు కలిగింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోట్‌లో గ్రామీణ నీటిసరఫరా కోసం రు.10 కోట్లు పట్టణ ప్రాంతాల కోసం మరొక రు.10కోట్లు కేటాయించామని అన్నారు. రు.10 కోట్లు కేటాయించామని అనగానే జిల్లాకా, రాష్ట్రానికా అని నా సహచర శాసనసభ్యుడు అడగడం జరిగింది. రు. 10 కోట్లు ఏ మూలకూ సరిపోదు. డిఆర్‌సి మీటింగుకు వెళ్లాను. ఏపార్టీ అని కాకుండా జిల్లాకు రు.10 కోట్లు త్రాగునీటికి కేటాయించాలనేది అందరి డిమాండ్. ప్రభుత్వం ఈ పరిస్థితులలో పత్రికలలో ప్రకటన విడుదలకు డబ్బులున్నాయి కాని త్రాగునీటి సమస్యకు డబ్బులు లేవని అంటున్నారు. 9వ తేది రోజున పత్రికలో వచ్చిన అడ్వర్టయిజ్‌మెంట్ ఇది. రెండు ఫుల్ పేజీల ప్రకటన (పేపర్ సభలో చూపించారు.) ఇదొక మచ్చుతునక మాత్రమే. ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు కాని త్రాగునీటి కోసం డబ్బులు ఖర్చు పెట్టకపోవడం శోచనీయం .

కరువును నిర్వచించాలంటే వర్షాభావం, పడిన వానల మధ్య వ్యవధి, సాగు విస్తీర్ణం, పంట నష్టం, త్రాగునీటి ఎద్దడి, పశుగ్రాసం లభ్యత మొదలైన వాటిని పరిగణనలోనికి తీసుకోవాలి. నెల రోజుల ముందే రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించవలసి ఉంది. 50 సంవత్సరాలలోనే అతి పెద్ద కరువు అని చెప్పారు. రైతులకు రుణాల విషయంలో ఇబ్బంది అవుతుందని ఈ స్టేట్‌మెంట్ డిలే చేశామని ముఖ్యమంత్రిగారు అన్నారు. మన కంటే ముందు 8 రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా రాష్ట్రం మొత్తాన్ని ప్రకటించాయి. జార్ఖండ్ రాష్ట్రంలో ఉన్న 22 జిల్లాలను, అస్సాంలోని ఏడు జిల్లాలను, మణిపూర్‌లోని 9 జిల్లాలను, నాగాల్యాండ్‌లోని 11 జిల్లాలను, హిమాచల్‌ప్రదేశ్‌లోని 12 జిల్లాలను కరువు రాష్ట్రాలుగా ప్రకటించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని 71 జిల్లాలలో 58 జిల్లాలను, బీహార్‌లోని 38 జిల్లాల్లో 26 జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించడం జరిగింది. కర్నాటకలో 380 ఫిర్కాలను (మండలాలను) కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. రు.400కోట్లు తక్షణ సహాయం క్రింద విడుదల చేశారు. కరువు ప్రాంతాలను డిక్లేర్ చేయండి. వెంటనే కేంద్ర బృందం వస్తుంది. వారు కూడా అధ్యయనం చేస్తారు. కరువు నిమిత్తం నిధులు విడుదల చేస్తారు. కాబట్టి వెంటనే ప్రకటన చేయాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

ఇటువంటి దుర్భిక్ష పరిస్థితులు వచ్చినప్పుడు అన్ని పార్టీల వారు ఏక కంఠంతో మాట్లాడాలని కేశవ్‌గారు చెప్పారు. ప్రభుత్వ పెద్దలలో సమన్వయం లేదు. రెవిన్యూ మంత్రి ఒక మాట మాట్లాడితే, ఛీఫ్ సెక్రటరీ అదే ప్రాంతంలో ఇంకో మాట మాట్లాడుతారు. ఆ విధంగా సమన్వయం లోపం లేకుండా మాట్లాడాలి. గవర్నమెంట్ దీనిని సీరియస్‌గా తీసుకోవాలి. ఆ మూడ్‌ను క్రియేట్ చేయాలి. నిన్న గవర్నమెంట్ ఇచ్చిన నోట్‌లో డ్రౌట్‌గురించి నాలుగు అంశాల గురించి చెప్పారు. పశుగ్రాసం, కరెంట్ సరఫరా, ఉపాధికల్పన, త్రాగునీరు గురించి మాత్రమే చెప్పారు. కాని అసలైన రెండు ప్రధాన విషయాలను విస్మరించారు. 40

రోజులలో 70 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా దాని గురించి ప్రస్తావించకపోవడం శోచనీయం . దుర్భిక్ష పరిస్థితులలో ఉన్నప్పుడు రకరకాల జ్వరాలు, అంటువ్యాధులు, మలేరియాలాంటివి వస్తాయి. వాటి గురించి మెన్షన్ చేయలేదు. ఇటువంటి పరిస్థితులలో ముఖ్యమంత్రిగారు అందరిని కాన్ఫిడెన్సులోకి తీసుకోవాలి. అసెంబ్లీలో కరువు గురించి చర్చ జరుగుతుందని ప్రజలందరూ బయట ఎదురు చూస్తున్నారు. మనకేదో ఒక సహాయం అందుతుందని వారు నమ్మకంతో ఉన్నారు. పార్టీ రహితంగా అన్ని పార్టీలను కాన్ఫిడెన్సులోకి తీసుకొని, మూడ్ క్రియేట్ చేయవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని మీద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

రాష్ట్ర ప్రభుత్వానికి మూడు లేక నాలుగు విషయాలు సూచించదలచాము. నిన్న ఇచ్చిన నోట్‌లో కేంద్రం నుండి రు.2000కోట్లు కావాలని, 500 మెగావాట్స్ విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. దీనిని పూర్తిగా సమర్థిస్తున్నాను. ఇటువంటి దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవడానికి మనందరం కలసికట్టుగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి. పంట నష్ట పరిహారం గురించి చెప్పలేదు. పర్‌క్యాపిటా ఇన్‌కమ్ పెరిగిందని, రెవిన్యూ సర్‌ప్లస్‌లో ఉన్నామని రోశయ్యగారు బడ్జెట్‌లో చెప్పారు. లక్ష కోట్ల బడ్జెట్ అని బల్లగుద్ది చెప్పారు రోశయ్యగారు. మీ అందరికీ ఎంత ఆవేదన ఉందో మా ఒక్కరికే అంత ఆవేదన ఉందని ముఖ్యమంత్రిగారు చెప్పారు. రైతులు ఎంత పెట్టుబడి పెట్టారో అంత నష్టపరిహారం వారికి ఇవ్వాలి. లక్ష కోట్ల బడ్జెట్ కాబట్టి పంట నష్ట పరిహారం పూర్తి స్థాయిలో ఇచ్చే సత్తా మీకుందని అనుకుంటున్నాము. కుదిరితే వ్యవసాయ రుణాలను వెంటనే మాఫీ చేయండి. లేదంటే రీషెడ్యూల్ చేయండి. నిన్న ప్రకటన చేసిన విధంగా అనుత్పాదక రంగంలో ఐదారు శాతం కోత విధించి త్రాగునీరు, సాగునీరు, ఉద్యాన వనాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రు.63 కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పారు. అది ఏమాత్రం సరిపోదు. రు.2వేల కోట్లు లేక రు.4 వేల కోట్లు విడుదల చేసి ఇంపార్టెంట్ సెక్టార్సుకు డ్రౌట్ ఎఫెక్టెడ్ ఏరియాలో నీడ్ బేస్ అలకేషన్ చేయాలని కోరుతున్నాము.

త్రాగునీటికి రు.10 కోట్లు ఏమాత్రం సరిపోదు. చాలా ఇబ్బందులలో ఉన్నాము. కొత్తగా గెలిచిన శాసనసభ్యులము. మా ఊర్లలో అందరూ అడుగుతున్నారు. మా ఊరిలో బోర్ వెల్ లేదు, బోర్ వెల్ వేయించమని, ఒక హ్యాండ్ పంప్‌సెట్ వేయించమని అడుగుతున్నారు. రు.3లక్షల వరకు పనులున్నాయి. కాబట్టి గ్రామీణ నీటిసరఫరాకు రు.10 కోట్లు, పట్టణ నీటి సరఫరాకు రు.10 కోట్లు సరిపోదు. కాబట్టి జిల్లాకు రు.10 కోట్లు కేటాయించాలని కోరుతున్నాను. ప్రకటనలో కలెక్టరుగారు ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని డ్రౌట్ రిలీఫ్‌కు పెడతామని అన్నారు. వారితోపాటు మాకు కూడా అందులో భాగస్వామ్యం కల్పిస్తే బాగుంటుంది. ప్రజలు అధికారుల వద్దకు వెళ్లరు. కాబట్టి ప్రజాప్రతినిధులమైన మా దగ్గరకు వస్తారు. మేము ఊర్లలో తిరుగుతాము కాబట్టి మాకు భాగస్వామ్యం కల్పిస్తే బాగుంటుంది. మాకెలాగు నిధులు ఇవ్వడం లేదు కాబట్టి ఆ విధంగా చేస్తేనైనా మాకు పరపతి మిగులుతుంది లేదంటే మాకు చాలా ఇబ్బందులొస్తాయి. కాంగ్రెసు పార్టీవారు వెనకాల బెంచీలలో కూర్చున్న శాసనసభ్యులు కూడా అదే భావన వ్యక్తం చేశారు.

మేఘమదనం గురించి మా పార్టీ నుండి హరీష్‌రావుగారు మాట్లాడారు. మేఘమదనంలో వర్షాలు పడడం లేదు కాని కాంట్రాక్టర్సుకు కాసుల వర్షం కురుస్తుంది.దీనిపై ఈ రోజు ప్రశ్న కూడా ఉంది.కాని దురదృష్టవశాత్తు ప్రశ్న రాలేదు. 6 సంవత్సరాలుగా మేఘమదనం చేస్తున్నారు. మేఘమదనం చేసిన తరువాత ఎంత వర్షపాతం నమోదయిందో స్పష్టమైన ప్రకటన చేయాలి. దానికి సంబంధించి ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కోరుతున్నాము.

మ 12.20

ఎందుకంటే వర్షాలు పడ్డప్పుడు మాత్రమే విమానాలు గాలిలో ఎగురుతున్నాయి తప్ప వర్షం పడన ప్పుడు ఏమి చెబుతున్నారంటే మధించడానికి అవసరమైన మేఘాలు లేవని చెబుతున్నారు. ఇది ఎంతవరకూ సబబో ఆలోచించవలసిన అవసరం వుంది. ఉపాధి కల్పనకు సంబంధించి ఇందాక కేశవ్ గారు చెప్పినట్లు సర్వరో గనివారిణి జిందా తిలిస్మాత్ అన్నట్లు ఈ రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడితే ఉపాధి కల్పన గురించి, ఉపాధి హామీ పథకం గురించి మాట్లాడుతుంది తప్ప ఇంక దేని గురించి మాట్లాడడం లేదు. మీద్వారా ప్రభుత్వాన్ని సూటిగా అడుగుతున్నాను. రైతు కూలీలు అయితే కూలీకి వెళతారు కానీ చిన్న,సన్నకారు రైతుల పరిస్థితి ఈ రోజు వారు అభిమానం చంపుకొని కూలీకి వెళ్లవలసిన పరిస్థితి వుంది. ఇందాక కేశవ్ గారు చెప్పినట్లు ఒకనాడు రాష్ట్రంలో రైతే రాజు అనే నినాదం వుండేది. ఈ రోజు రైతే కూలీగా మారిపోయిన అవస్థ వుంది. రైతుల పరిస్థితి అట్లా పెడితే ఈ రోజున పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లు, గ్రాడ్యుయేట్స్ కూడా మాకు ఉపాధి కల్పించండి మొర్రో అంటే మీరు కూడా కూలీకి పొండి నాయనా అని చెప్పే దురవస్థ ఈ రోజు రాష్ట్రంలో వచ్చింది. కాబట్టి దయచేసి ముఖ్యమంత్రి గారికి, ప్రభుత్వానికి మేము సూచించేదేమంటే కేవలం ఉపాధి హామీ పథకం గురించి గొప్ప చెప్పడం కాదు, అది మంచి పథకమే. మేము కూడా ఒప్పుకుంటాము. అది ఒక్కటే సరిపోదు. ఇంకా ప్రత్యామ్నాయాలు కూడా అన్వేషించవలసిన అవసరం వుందని చెప్పి మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో కూడా ఉపాధి ఎవరైతే పొందుతున్నారో వారికి కూడా ఈరోజు మీరిచ్చే కూలీ రేటు ఏదైతే వుందో 120 రూపాయలు కావచ్చు, నూరు రూపాయలు కావచ్చు ఏ మూలకు కూడా సరిపోదు. ఎందుకంటే కందిపప్పు రేటు గానీ, ఇతర నిత్యావసర వస్తువుల రేట్లు గానీ ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో అవసరమైతే కూలీ రేట్లు పెంచమని కూడా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కరువు ఈ సీజన్‌లో వచ్చింది కాబట్టి అతి తొందరలోనే మళ్లీ నిత్యావసరాల మీద వచ్చే సెషన్‌లో మళ్లీ చర్చ జరగవలసిన పరిస్థితి వస్తుంది. అప్పుడు కూడా మళ్లీ ఇదే విధమైన సమాధానాలు వస్తాయి కాబట్టి ఇప్పుడే ప్రభుత్వం కొంత అప్రమత్తమై వెంటనే విజిలెన్స్ డిపార్టుమెంట్‌ను స్ట్రెంగ్తెన్ చేసి తప్పకుండా దాడులు విరివిగా చేస్తే కూడా ఎప్పటికప్పుడు ఆహార ధాన్యాలు ఎవరు నిల్వవుంచుకున్నా వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని, నిత్యావసర వస్తువుల రేట్లు తగ్గించడానికి అవసరమైతే బేషజాలకు పోకుండా ఒక మార్కెట్ ఇంటర్వేషనల్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని మీద్వారా గవర్నమెంటును కోరుతున్నాను. ఇది మాత్రమే కాదు. పంట నష్టం భీమా గురించి మాట్లాడతాము. పంట నష్టం, పంట వేసి నష్టపోతే కొంచెం భీమా వస్తుంది తప్ప ఈ రోజు ప్రస్తుతం వున్న పరిస్థితులలో చాలా లక్షల ఎకరాలలో విత్తనాలు మొలకెత్తనే లేదు. కాబట్టి వారందరికీ కూడా చాలా ఇబ్బందులు వుండే పరిస్థితి వుంది. మీద్వారా నేను ప్రభుత్వానికి సూచించేదేమంటే వాతావరణ భీమా అంటే ప్రకృతి అనుకూలించనప్పుడు, అసలు ప్రకృతి మనకు సహకరించనప్పుడు మనకు క్రాప్ ఇన్సూరెన్స్ మాత్రమే కాదు, వెదర్ ఇన్సూరెన్స్ కూడా, క్లైమేట్ ఇన్సూరెన్స్ కూడా చేసుకొనే పరిస్థితి వుంటుంది. కొన్ని రాష్ట్రాలలో ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా కూడా చెబుతు న్నారు. వాతావరణ భీమాకు కూడా ప్రాచుర్యం కల్పించాలని మీద్వారా గవర్నమెంటును నేను కోరుతున్నాను. అంటురోగాలకు సంబంధించి, డిసీజెస్‌కు సంబంధించి ఎందుకంటే దుర్భిక్ష ప్రాంతాలు చాలా వున్నాయి. కాబట్టి ఈ సంవత్సరంలోనే అతిసారం లాంటి, మలేరియాలాంటి వ్యాధులు కూడా విరివిగా వచ్చే అవకాశం వుంది. ఈ విషయంలో కూడా గవర్నమెంటు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నాను. అదే విధంగా క్యాటిల్ క్యాంప్స్ గురించి చెప్పారు. తెలంగాణాలో పది జిల్లాలు వుంటే మూడు జిల్లాలలో మెదక్, నల్గొండ, వరంగల్‌లో మేము క్యాటిల్ క్యాంప్స్ ఏర్పాటుచేస్తున్నాము. పశుగ్రాసం, త్రాగునీరు అక్కడే సరఫరా చేస్తు న్నామని చెప్పారు. ఇది నిజానికి ఇక్కడ కూడా సరిపోదు. ఎందుకంటే పాలమూరు తీసుకుంటే అక్కడ లక్షల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. కాబట్టి తెలంగాణాలోని 9 జిల్లాలలో కూడా మీరు దయచేసి

మీద్వారా మేము ప్రభుత్వాన్ని కోరేదేమంటే క్యాటిల్ క్యాంప్స్ ఏర్పాటు చేయండి, కుదిరితే ప్రతి మండలంలోనూ ఏర్పాటు చేయండి. ప్రతి జిల్లాకు ఒక క్యాటిల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి అక్కడ త్రాగునీరు, పశుగ్రాసం కూడా అందించాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. విద్యుత్ విషయానికి వస్తే నిన్నగాక మొన్న పేపర్లో ఒక ఐటెం చూశాము. అందులో ఏముందంటే ప్రధానంగా కరీంనగర్ జిల్లాలోని నేదులూరు వద్ద గవర్నమెంటు ఒక గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామనే ప్రతిపాదన గవర్నమెంటు దగ్గర వుంది. ఏపి జెన్‌కో ఆధ్వర్యంలో. కానీ నిన్నగాక మొన్న పేపర్లో వచ్చింది ఏమంటే ఆ ప్రాజెక్టు గ్యాస్ ఇవ్వరు, బొగ్గు మాత్రమే ఇస్తారని చెప్పి వుంది. రాబోయే రోజులలో ఎందుకంటే విరివిగా చాలా పెద్దయెత్తున మన దగ్గర తెలంగాణా ప్రాంతంలో ప్రధానంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వస్తున్నాయి కాబట్టి కేవలం బొగ్గు ఆధారితంగా పరిశ్రమలు నెలకొల్పితే చాలా ఇబ్బంది అవుతుంది కాబట్టి ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం కెజి బేసిన్ గ్యాస్ విషయంలో కూడా సీరియస్ పోరాటం చేస్తుంది. మేము కూడా మీద్వారా ప్రభుత్వానికి సూచించేదేమంటే తెలంగాణాలో కూడా ఇక గ్యాస్ ఆధారిత పరిశ్రమలు పెట్టండి. కరీంనగర్‌లో వుండే నేదులూరు ప్రాజెక్టు కూడా గ్యాస్ ఆధారిత కేంద్రంగా, విద్యుత్ కేంద్రంగా దానిని కూడా నెలకొల్పాలని కోరుతున్నాము. ఇక ముగించేముందు మీ అందరికీ కూడా నేను ఒక ప్రకటన ముఖ్యమంత్రి గారిది గుర్తుచేయదలచుకున్నాను. ఎలక్షన్ టైంలో చాలా విరివిగా రాష్ట్ర ప్రజలు మొత్తం కూడా చూశారు. టివిలలో ప్రకటనలు, ఎట్లాంటి ప్రకటన అంటే ఒక ఎండిపోయిన పొలం వుంటుంది, దాని మీద రాజశేఖరరెడ్డి గారు అడుగుపెట్టిన ప్రతి అడుగూ కూడా వెనకాల వెంటనే మొత్తం పచ్చగా మారిపోతూ బ్రహ్మాండముగా మొత్తం రెండవ హరిత విప్లవం మాదిరిగా బ్రహ్మాండముగా వచ్చింది. మీద్వారా నేను గవర్నమెంటును కోరేది ఒక్కటే. మన ముఖ్యమంత్రి గారి కాలి అడుగులకే మొత్తం, రాష్ట్రం మొత్తం పచ్చగా మారిపోయే పరిస్థితి వుంది, మాకేమీ అభ్యంతరం లేదు. 1022 కరువు మండలాలు వున్నాయి. ఆ 1022 కరువు మండలాలలో వారు కనుక సిద్ధపడి కాలి నడకన మళ్లీ వారు ఒకసారి పర్యటిస్తా మంటే మేమందరమూ కూడా ఇక్కడ కూర్చొని నైతిక మద్దతు కూడా ఇస్తాము. తప్పకుండా ముఖ్యమంత్రి గారు రాష్ట్రం మొత్తం కాలినడకన పర్యటించి రాష్ట్రం మొత్తంలో రెండవ హరిత విప్లవం తీసుకురావాలని కోరు కుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు మళ్లీ ఒకసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ జి. శ్రీకాంత రెడ్డి (రాయచోటి): థ్యాంక్యూ అధ్యక్షా, మొట్టమొదటగా ఈ కరువు పైన నాకు అవ కాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రిగారికి, మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. కరువు లేదని ప్రభుత్వం గానీ, మన నాయకుడు గానీ ఎవరూ చెప్పడం లేదు. 15 రోజుల నుండి ఎన్నో పోరాటాలు చేస్తుంటే ఈరోజు కరువు పైన చర్చకు అనుమతించారని చెబుతున్నారు. అది వాస్తవం కాదు. ముఖ్యమంత్రి గారు గతంలో ఒక స్టేట్ మెంట్ ఇచ్చారు, కానీ మళ్లీ కరువు పైన చర్చకు అవకాశం ఇచ్చినందుకు మీకు, ఆయనకు ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నాను. అవును, మనం అనుకోలేదు ప్రకృతి ఈ విధంగా వుంటుందనేది ముందు నుండి కూడా ఎవరూ ఊహించలేదు. అనుకోకుండా కరువు రావడం జరిగింది. దీనికి సంబంధించి ఆల్టర్‌నేట్ చర్యలు ఏ విధంగా తీసుకోవాలి? రైతుల ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రం ఎంత దుర్భిక్షంలో వుంది? దీని పైన ఏ విధంగా చేయాలని ప్రతి నిమిషం కూడా ప్రభుత్వ అధికారులు స్పందిస్తున్నారు. ముఖ్యంగా ఈ రోజు ఖరీఫ్‌కు రెండు నెలలు ఆలస్యం అవడం వాస్తవమే. ఇక్కడ దీనికి ఆల్టర్‌నేట్ అరేంజ్‌మెంట్స్ అంటే ప్రత్యామ్నాయ పంటలు ఏ విధంగా చేయాలి, ఏ విధంగా రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వ్యవసాయ శాఖ తీవ్రంగా చర్యలు తీసు కుంటుంది. వాళ్ల సలహాలు కూడా స్వీకరించడానికి సిద్ధంగా కూడా వుంది. ఇంతకు ముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడారు. అదేదో నాకు తెలియదు. పేపర్లు, తీసుకువచ్చి పేపర్ కటింగ్స్ అన్నీ చూపిస్తున్నారు. అది కాదు, మేము కూడా ఒక రైతు కుటుంబంలోనే అనునిత్యం రైతులతోనే వుంటాము. పల్లెల్లోనే బ్రతుకుతాము. రైతులు

ఏ విధంగా స్పందిస్తారు, వాళ్లకు ఏ విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలో మాకు తెలుసు. నిజంగా చెబుతున్నాను. ఈ రోజు కరువు పరిస్థితి ఏదైతే వుందో దానికి ఏమి చేయాలి, ఎట్లా చేస్తే బెటర్ అన్న ఉద్దేశ్యంతో మనం సలహాలు ఇవ్వాలి కానీ ఊరికూరికే ఈ రోజు పేపర్లు, టివిలో చూస్తుంటే నాకు కూడా బాధగా వుంటుంది. ఎందుకంటే కొన్ని విషయాలు మీరు ఆలోచించండి. కరువు వుంది, వాళ్లకు నైతిక స్థైర్యం నింపాలి. ఏ విధంగా మనం దీనిని ఎదుర్కోవాలి, ఏ విధంగా మేము మీకు మద్దతుగా వుంటామనేది చెప్పండి. కరువు వల్ల కొంతమంది చచ్చిపోతున్నారు. చెప్పండి, అంత మంది చచ్చిపోతున్నారు, పల్లెలు కన్నీరు కారుస్తున్నాయి. ఇంకా కొన్ని రోజులు వుంటే అందరూ చచ్చిపోతారు. మీరు ఈ విధంగా చేస్తుంటే రైతులకు వున్న ధైర్యం కూడా పోగొట్టుకుంటారు, అది మంచి పద్ధతి కాదు. వారిలో ధైర్యం నింపే ప్రయత్నం చేయాలి కానీ ఈ విధంగా వారిని నిరాశపర్చడం చాలా తప్పు. ఈ రోజు ప్రతి ఒక్క మండలంలో, మా కడప జిల్లాలో అత్యంత డ్రౌట్ అయిన ప్రదేశం రాయచోటి. ఆ నియోజకవర్గంలో కనుక మనం పర్యటిస్తే ప్రతి మండలంలో కూడా 4 నుండి 5 వేల మంది కూలీలు పనిచేస్తున్నారు. వాళ్లకు ఎంత సంతోషంగా వుందంటే ఇంతకు ముందు 80 రూపాయల కూలీ వచ్చేది. ప్రతి ఒక్క కూలీతో మాట్లాడితే వంద రూపాయలు, రెండు వందల రూపాయలు కూలీ వస్తుందని చెబుతున్నారు. 120 రూపాయల కూలీ గిట్టుబాటవుతుంది. వాళ్లకు మూడు పూటలా తినడానికి అది సరిపోతుంది. అయితే ఇంకా ఏమైనా అరేంజ్‌మెంట్స్ చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా వుంది. ఇంకా కొన్ని పాయింట్స్ తీసుకుంటే వాళ్లు ఎప్పుడూ నిత్యావసరాలు పెరుగుతున్నాయి, అవి పెరుగుతున్నాయని అంటున్నారు, ఏ విధంగా అధ్యక్షా? కూరగాయలు కూడా ఇప్పుడు మాగ్జిమం కంట్రోల్‌కు వచ్చాయి. రెండు, మూడు కూరగాయలు కొంచెం రేటు వున్న పరిస్థితి వాస్తవమే. దానికి కూడా గవర్నమెంటు అన్ని విధాలా చర్యలు తీసుకుంటుంది. గత రెండు నెలల నుండి మీరు కూడా అబ్జర్వ్ చేస్తున్నారు విజిలెన్స్ ఎంత చక్కగా పని చేస్తుందో, ఎక్కడ చూసినా గోడౌన్‌లు సాధ్యమైనంత వరకూ స్వాధీనం చేసుకుంటుంది. దానిని కంట్రోల్ చేయడానికి అనునిత్యం ప్రయత్నం చేస్తుంది. ఇంకా ముఖ్యంగా పశువులు కబేళాలకు పోతున్నాయి, వీటి గురించి ఎంతో వుందన్నారు. దానికి సంబంధించి నాలుగు రోజుల క్రితం నేను ముఖ్యమంత్రి గారిని అడిగాను. పశుగ్రాసం సప్లయ్ చేయడానికి అవకాశాలు ఏమైనా వున్నాయా అని అడిగాను. ప్రాక్టికల్‌గా థింక్ చేయాలి మనం. అన్ని విధాలుగా కాన్సన్‌ట్రేట్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా వుంది. అయితే మనకు అవసరమైన మెటీరియల్ మనం ప్రొక్యూర్ చేసుకోవాలి. ఇవన్నీ ఆలోచించుకోండి. ఏదేదో మాట్లాడుతుంటే ఎట్లా? మనం ఇప్పుడు క్యాటిల్ క్యాంప్స్ కూడా కండక్ట్ చేసి ఎక్కడైతే వాటర్ వుంటుందో అక్కడ క్యాంప్స్ పెడతాము. దానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ చేస్తున్నామని ముఖ్యమంత్రి గారు చెబుతున్నారు, ఇది చాలా సంతోషదాయకము. ఎందుకంటే నిరాశా, నిస్పృహలకు గురిచేయకుండా చర్యలు తీసుకోడానికి ప్రయత్నం చేయాలి.

( అంతరాయం )

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని విధాల రైతులను ఆదుకుంటుందో మీరు చూడండి. ఈ ఖరీఫ్ టైంలో రైతులకు చేయవలసింది ఏమిటి? వాళ్లకు సకాలంలో రుణాలు అందించడంలో ముందున్నాము. గతంలో చూడండి, ఇప్పుడు చూడండి. రైతులకు ప్రతి ఒక్కరికీ రుణాలు అందించడానికి ప్రయత్నం చేస్తుంది.

మ.12.30

గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు రుణాలు ఇస్తున్నారు. వ్యవసాయ మంత్రి గారు చెప్పినట్లు రెండున్నర లక్షల మందికి రుణాలు ఇవ్వడానికి ప్రణాళికలను రూపొందించడం జరిగింది. మూడు లక్షల మంది రైతులు రుణాల నిమిత్తం అప్లై చేయగా, వారందరికీ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ

మంచి ఉద్దేశ్యాలు కాదా? రైతులకు ఏదో చెయ్యాలి అనే ఉద్దేశ్యంతో ఇవన్నీ చేస్తున్నాము. రైతులకు విలువ కల్పించింది రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం. రైతుల గురించి ఆలోచించే వ్యక్తి ఎవరంటే రాజశేఖర రెడ్డి గారని కళ్లు మూసుకొని చెబుతారు. వాళ్లకేమి తెలుసు. పొలాల్లో తిరిగేది మేము. మాకు తెలుసు. కొన్ని ప్రాంతాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించాలని వాళ్ల ఉద్దేశ్యాన్ని కూడా సరిగ్గా చెప్పలేకపోతున్నారు. అది కూడా పచ్చ పేపర్‌లో రాసుకొచ్చి, రాజకీయం చేస్తున్నారు. అనునిత్యం రాజకీయం చేయడమే వీళ్ల ఉద్దేశ్యం తప్ప మంచి పద్ధతిలో మంచి అట్మాస్ఫియర్‌లో పని చేద్దామని లేదు. మాజీ ముఖ్యమంత్రి గారు అమెరికా అని ఏవేవో చెబుతున్నారు. హైటెక్ ముఖ్యమంత్రి గారు.

మిస్టర్ స్పీకర్: మీరు డ్రౌట్ పైన కాన్సన్‌ట్రేట్ చేయండి.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, ఫ్రూట్‌ఫుల్‌గా ఉండాలనే ఆలోచన వాళ్లకు లేదు. ఎలక్షన్స్ అయిన తరువాత అన్ని పార్టీలు కలిసి మంచి కలిసి మంచి పనులు చేయడానికి ముందుకు వస్తాయి. ఇక్కడ అట్లా కాదు. ఎలక్షన్ అయిన తరువాత, కౌంటింగ్ అయిన మరుసటి రోజు నుండే రాజకీయాలు చేస్తారు. ఇది ఎంతవరకూ మేలు చేకూరుతుంది? హార్టికల్చర్‌కి, డ్రిప్ ఇరిగేషన్‌కి 90 శాతం సబ్సిడీ ఇవ్వడం, ఇవన్నీ ఎంత మంచి పథకాలో ఒక్కసారి ఆలోచించమనండి. గతంలో ఎప్పుడైనా ఇట్లాంటివి చేశారా? ఒక్క మంచి కార్యక్రమం అయినా చేశారా? అవన్నీ లేవు, ఊరికే మాట్లాడుతుంటారు. డ్రింకింగ్ వాటర్ సమస్యలున్నాయి. ఏ నియోజకవర్గంలోని సమస్యలు ఆ నియోజకవర్గంలోని ఎం.ఎల్.ఏలకే తెలుస్తాయి. మా సమస్యల గురించి ముఖ్యమంత్రి గారికి చెబితే, హ్యాండ్ పంప్స్‌కి వెంటనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అదే విధంగా డీపెనింగ్ బోర్‌వెల్స్‌కి, ఫ్లషింగ్ వంటివి చేయడానికి ముఖ్యమంత్రి గారు సిద్ధంగా ఉన్నారు. కొన్ని గ్రామాలలోని పంచాయతీ సర్పంచ్ హ్యాండోవర్‌లో ఉన్న మోటర్స్ రిపేర్ చేయలేకుండా ఉన్నాయి, వాటిని పరిశీలించి చేయడానికి సిద్ధంగా ఈ ప్రభుత్వం ఉందని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, జలయజ్ఞం కాన్సెప్ట్ చాలా మంచిది. ఒక్క చుక్క నీరు కూడా వేస్ట్ కాకుండా, సముద్రం పాలు కాకుండా ప్రతి నీటిచుక్కనీ ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో జలయజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే అయిదేళ్లలో దాని రిజల్ట్ గురించి తెలుస్తుంది. అప్పుడు జై రాజశేఖర రెడ్డి అంటారు.

(ట్రెజరీ బెంచెస్ నుండి హర్షధ్వానాలు)

ఇటువంటివి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేస్తుంది. జలయజ్ఞం, సబ్సిడీ, లోన్స్ వంటివి ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఈ కరవును ఎదుర్కోడానికి ఎవ్వరూ అడగకుండానే ఈ విధంగా చేద్దామని మంచి స్టేట్‌మెంట్ కూడా మంత్రి గారు ఇచ్చారు. హైడల్ పవర్ టోటల్‌గా నిలిచిపోయినా థర్మల్ ఎలక్ట్రిసిటీని తెచ్చుకుంటున్నాము. దీని పైన ప్రభుత్వం నిర్ణయం తీసుకొని రైతులకు ఏడు గంటల విద్యుత్ ఇస్తుంది అవసరమైతే దానిని 9 గంటలకు పెంచడానికి కూడా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుంది. ఏ ప్రోగ్రామ్‌ని తీసుకున్నా పబ్లిక్‌కి మేలు చేసే విధంగా ఉంటుంది. అటువంటి ప్రభుత్వం మాది. పై పై డ్రామాలుగా చేయడం లేదు. ఊరికే పబ్లిసిటీ కోసంచేయడం లేదు. కరవు ఉంది. దానిని తీవ్రతరం చేసి డిస్అపాయింట్ కాకుండా, మేము కూడా మీ వెంట ఉంటామని చెప్పి ముందుకు రావాలి. ఈ ప్రభుత్వం దేనికైనా సిద్ధం. చర్చా కార్యక్రమానికి కూడా ఈ ప్రభుత్వం ఓ.కే అంది. గతంలో వాళ్ల మాదిరి తప్పించుకొనే కార్యక్రమం ఎప్పుడూ చేయలేదు రాజశేఖరరెడ్డి గారు. చర్చల ద్వారా పరిష్కరించుకున్నాము. అందరికీ మేలు చేద్దామని రాజశేఖర

రెడ్డి గారు అనుకున్నారు. మంచి సలహాలు ఇవ్వాలి. కరవు ఉంది. దానికి మేము కూడా బాధ పడుతున్నాము. కరవు సమయంలో ఏ విధంగా అండగా ఉంటామో తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. సాంబశివరావు(కొత్తగూడెం): అధ్యక్షా, ఈనాడు ఈ కరవు పరిస్థితి పై అన్ని పార్టీల సభ్యులు మాట్లాడారు. దురదృష్టం ఏమిటంటే, మేము రైతు కుటుంబం నుండి వచ్చామని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. కరవు పరిస్థితి గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ మీ దగ్గర నుండి మేము పాఠాలు నేర్చుకోవలసిన అవసరం లేదని హరీష్‌రావు గారికి చెప్పారు. ఎవరు మాట్లాడినా కరవు ప్రాంతాల నుండి వచ్చామని, రైతు కుటుంబాల నుండి వచ్చామని ఇదే భాషలో మాట్లాడుతున్నారు. ఈ 62 సంవత్సరాల నుండి రైతు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఇప్పుడు ఒకవైపు ఆర్థిక మాంద్యం మరొక వైపు కరవు పరిస్థితి. ఈ కరవుపరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలో ఆలోచించాలి. ప్రకృతి వైపరీత్యాలు మనకి చెప్పి రావు. అవి వస్తాయనే ఊహతో ప్రభుత్వంలో ఉన్నటువంటి వారు తగిన ప్రత్యామ్నాయ ప్రణాళికను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఆ విషయంలో మన రాష్ట్రప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని నా అభిప్రాయాన్ని తెలియపరుస్తున్నాను. వ్యవసాయానికి సంబంధించి రెండు ప్రణాళికలు ప్రభుత్వం దగ్గర ఉండాలి. వర్షాలు పడినప్పుడు సజావుగా కాలం కొనసాగుతున్న ప్రణాళిక ఒకటి అయితే , వర్షాలు పడని ఎడల కరవు పరిస్థితి తలెత్తినప్పుడు, ఎదుర్కోడానికి అవసరమైనటువంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రభుత్వం దగ్గర ఉండాలి. ప్రభుత్వం దగ్గర అటువంటి ప్రణాళిక లేదని చెప్పడానికి నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. అటువంటి ప్రణాళికలు లేవు కనుక, దప్పిక ఎప్పుడైతే అప్పుడు బావులు తవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ విధంగా ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఆ ప్రత్యేక ప్రణాళిక ఉన్నట్లయితే, షార్ట్ టర్మ్ పంటలు ఏవైతే ఉన్నాయో, దానికి సంబంధించి రైతులకు విత్తనాలను సరఫరా చేసేవారు. అదే విధంగా దానికి అవసరమైన రుణసౌకర్యం కల్పించేవారు. అవన్నీ చేయలేదు. సెప్టెంబరు నెలకు ఖరీఫ్ సీజన్ అయిపోతుంది. కరవు అని ప్రకటించడానికి ఇంతవరకూ ప్రభుత్వం ఆలోచించలేదు. ఇప్పటికిప్పుడు ఏమి చేస్తారు? ఒక వేళ ఇప్పుడు వర్షాలు పడినా కూడా రైతులకు ఏ విధమైన ఉపయోగం జరుగుతుందో ఆలోచించాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారు మొన్న ఖమ్మం వచ్చినప్పుడు ఒక మాట చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఖమ్మం జిల్లాను కరవు ప్రాంతంగా ఎందుకు ప్రకటించలేదో అని ఆయన గిల్టీగా ఫీల్ అయి ఉంటారని నేను భావిస్తున్నాను. సకాలంలో మా ఆంధ్రప్రదేశ్‌లో కరవు నెలకొందని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, తద్వారా కేంద్రప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి కరవు ప్రాంతంగా ప్రకటించుకోవడంలో వైఫల్యం చెందారనే భావన ఆయనకున్నట్లు మేము భావించాము. ఖమ్మం జిల్లాను వాస్తవంగా ఎప్పుడో కరవుప్రాంతంగా ప్రకటించాలి. కరవు ప్రాంతంగా ప్రకటిస్తే రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వవనే ఉద్దేశ్యంతో కరవు ప్రాంతంగా ప్రకటించలేదని చెప్పారు. బ్యాంకులనేవి ఇండిపెండెంట్‌గా నడవు, బ్యాంకుల్లో రాష్ట్రం వాటా కొంత, కేంద్రం వాటా కొంత ఉంటుందని వారే చెప్పారు. బ్యాంకులను నియంత్రణ చేయలేమా అని అడుగుతున్నాను. రుణాలు ఇవ్వలేవనే పేరుతో, కరవు తలెత్తినా సరే కరవు ప్రాంతాలుగా ఎందుకు ప్రకటించలేదని అడుగుతున్నాను. మనతోబాటు ఇతర రాష్ట్రాలలో కూడా కరవు వచ్చింది. రాజస్థాన్, ఛత్తిస్‌ఘడ్, బీహార్ వంటి రాష్ట్రాలన్నీ ముందే కరవు ప్రాంతాలుగా ప్రకటించుకొని, కేంద్రప్రభుత్వం వద్దకు వెళ్లి తగిన సహాయం తీసుకున్నారు. ఆయా రాష్ట్రాలలో కరవు సహాయక చర్యలు ఇప్పటికే మొదలయ్యాయి. ఈ రాష్ట్రంలో కరవు ఉందని గుర్తించడంలో రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వం వైఫల్యం చెందిందని చెబుతున్నాను. మన్మోహన్ సింగ్ గారు ఒక ప్రకటన చేశారు. దేశంలోని రాష్ట్రాలలో కరవు పరిస్థితి ఉన్నప్పుడు ఎందుకు ముందుకు రావడం లేదని అడుగుతున్నాను. కరవు పరిస్థితిని తెలియజేస్తే సహాయం చేయడానికి మేము ముందు ఉన్నామని చెప్పినప్పటికీ కూడా ముందుకు వెళ్లడం లేదు.

వారి చెప్పిన విషయాలు మన దృష్టికి రాకపోవడం విచారకరం. శరత్‌పవార్ గారు కూడా ఆంధ్రప్రదేశ్‌లో కరవు లేదని చెప్పారు. ఎందుకంటే, ముఖ్యమంత్రి గారు కరవుపరిస్థితులకు సంబంధించి ఎటువంటి ప్రకటనలు చేయలేదు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉందనే భావనతో కేంద్రప్రభుత్వం ఉంది. దీని వల్ల చాలా నష్టం జరగబోతుందని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను. కరవు ప్రాంతంగా ప్రకటన చేసినా కూడా ఏమి ఉపయోగం ఉండదు. మనకు లభించే కరవు సాయం అత్యల్పంగా ఉంటుందని మనవిచేస్తున్నాను.
మ.12.40

2004వ సంవత్సరంలో 1800 కోట్ల రూపాయల కరవు సహాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేవలం వంద కోట్ల చిల్లర మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. అదే పరిస్థితి తిరిగి తలెత్తింది కావున రాష్ట్రాన్ని ఎలా కాపాడతారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మీద్వారా కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారి గుండె ధైర్యాన్ని నేను అప్రిషియేట్ చేస్తున్నాను. దేనినైనా గానీ వారు ఛాలెంజ్‌గా తీసుకుంటారు. అదే పద్ధతిలో ప్రకృతి పైన కూడా ఛాలెంజ్‌గా తీసుకోవాలనే భావన నాకుంది. ఆయన ఈ రాష్ట్రం అంతా బాగానే ఉందని, నా కాలంలో అంతా బాగుందని భారతదేశంలో అందరూ చెప్పుకోవాలని ఉంది, కానీ, ఇక్కడ కరవు ఉందని చెబితే మరలా ఇబ్బందులు వస్తాయని అనుకుంటున్నారు. అంతకు ముందు వాన దేవుడు మాతో ఉన్నాడని, మేం చాలా పుణ్యాలు చేశామని, అంతా బాగానే ఉందని చెప్పుకున్నారు. తెలుగుదేశం పార్టీ పాపాలు చేసింది కాబట్టే వానదేవుడు అప్పుడు కరుణించలేదు, అందుకే కరవు వచ్చిందని, మా పరిపాలనలో కరవు ఉండదని రాజశేఖరరెడ్డిగారు చెప్పుకున్నారు. కానీ ఇపుడు రాష్ట్రంలో కరవు పరిస్థితి ఉందని చెబితే ఇబ్బందులు వస్తాయని ఆయన కేంద్రానికి చెప్పకుండా ఉండి ఉండాలి. లేకపోతే దూరదృష్టిలేక ముందు చూపు లేక నడిచేది నడుస్తుందని అనుకుంటున్నారని భావించాలి. అంతా మంచిగా నడిస్తే నా ఘన కార్యం, బాగా నడవకపోతే ప్రతిపక్షాల మీద తప్పు నెట్టడం, లేకపోతే ప్రకృతిమీద నెపం వేయవచ్చని అనుకుంటున్నారు. వరుణయాగాలు, హోమాలు ఈ రాష్ట్రాన్ని కాపాడతాయా అని నేను ప్రశ్నిస్తున్నాను.

రాజశేఖరరెడ్డిగారు డాక్టరుగారు. చిన్నప్పుడే ఆయన డాక్టరు అయ్యారు. ఆయన సైంటిఫిక్ అవగాహనతో ఈ రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలి తప్పితే ప్రభుత్వ ఖర్చుతో హోమాలు, యాగాలు, యజ్ఞాలు చేయడం ఏమిటని మీద్వారా ప్రశ్నిస్తున్నాను. ఇవన్నీ చేయడమేనా! పరిపాలనలో మీ బాధ్యత లేదా? మీకు సంబంధం లేదా? వానలు బాగా పడి కాలం బాగా నడిస్తే పంటలు పండితే మీ గొప్పా! లేక వానలు పడకపోతే దేవుడిమీద భారం వేస్తారా? చుక్కాని లేని నావ సముద్రంలో పయనిస్తూ దైవం అనుకూలిస్తే, కనికరిస్తే ఒడ్డుకు చేరితే నా ఘన కార్యం, చేరకపోతే దేవుడిమీద భారమనే పద్ధతిలో ఈ రాష్ట్రాన్ని పరిపాలించడం రాష్ట్రానికి మంచి జరగదని నా అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాను. ముందస్తు ప్రణాళిక లేకుండా, ముందు చూపు లేకుండా ఈ ప్రభుత్వం పనిచేస్తున్నది. గత ప్రభుత్వం చేపట్టిన ఇంకుడు గుంతల గురించి కాంగ్రెస్ పార్టీ ఎగతాళి చేసింది. పెద్దలు రోశయ్యగారు ఇపుడు సభలో ఉన్నారు. రోశయ్యగారూ, పాత కాలాన్ని గుర్తు తెచ్చుకోండి. రాష్ట్రంలో ఇన్ని ప్రాజెక్టులు లేనపుడు కూడా వాతావరణం సజావుగా ఎక్కువ కాలం ఉండేది. ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు ఉండేవి. గత ప్రభుత్వ హయాంలో వర్షాలు తక్కువగా ఉండడంతో చంద్రబాబునాయుడుగారు ఇంకుడు గుంటలు తవ్వించి ఉండవచ్చు. కానీ ప్రతి గ్రామంలో చిన్న చిన్న నీటి వనరులు ఉండేవి. ఇపుడు మీరు చిన్న నీటి వనరులపైన ఏమైనా దృష్టి సారిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాను. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వ నిధులన్నీ వాటికే కేటాయిస్తున్నారు కానీ ఆ ప్రాజెక్టుల ఫలితాలు ఎపుడు వస్తాయో తెలియదు. భవిష్యత్తులో రాబోయే దానికోసం ఈవేళ నిర్లక్ష్యం చేయడం తెలివికలిగిన పనా అని అడుగుతున్నాను.

(అధికార పక్ష సభ్యులనుంచి అంతరాయం)

మిత్రులారా దయచేసి ఆగండి. మీరు..............

MR.SPEAKER : Please keep quiet. Please let the member finish.

శ్రీ కె.సాంబశివరావు : అధ్యక్షా, మీరు ఇప్పటికి అయిదు సంవత్సరాలకు పైగా రాష్ట్రాన్ని పరిపాలించారు. అంతకంటె ముందు చంద్రబాబు నాయుడు పరిపాలన ముగిసింది. ఇప్పుడు కూడా ఆ పేరు పెట్టుకొని మీరు పరిపాలన చేయవద్దు. ఇపుడు పరిపాలనలో ఉన్నది మీరు. ఇపుడు మీ పరిపాలన ఆరవ సంవత్సరంలోకి వచ్చింది. మేమడిగిన దానికి మీరేమి సమాధానం చెబుతున్నారు? ఈ విషయంతో తెలుగుదేశం పార్టీకి సంబంధం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి దాదాపు అరవై సంవత్సరాలు అయింది. అరవై సంవత్సరాల కాలంలో దాదాపు నలభై సంవత్సరాలు మీరే పరిపాలించారు. సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీ మీద ఉంది.

(ప్రతిపక్ష సభ్యులనుంచి చప్పట్లు)

చెక్‌డ్యాంలు, వాటర్‌షెడ్ పథకాలు ఏమైనాయి? చిన్న చెరువులు, కుంటలు ఏమైనాయి? వాననీటి సంరక్షణ పథకాలు ఏమైనాయి? వాటిని మీరు సక్రమంగా చేపట్టి ఉండి ఉంటే ఈవేళ భూగర్భ జల నీటిమట్టం సరైన పద్ధతిలో ఉండేది కాదా అని ప్రశ్నిస్తున్నాను. మంచినీటి కోసం అప్పటికప్పుడు బావులు తవ్వుకుంటే ఎట్లా ఉంటుంది. ఆ పద్ధతిలో ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని నేను భావిస్తున్నాను. ఈనాడు గ్రామాల్లో మంచినీరు లేని పరిస్థితి తలెత్తింది. సుజలాం, సుఫలాం అంటారు కానీ తాగడానికి మాత్రం మంచినీరు లేదు. బోరు బావులద్వారా కొద్దో గొప్పో వెలికితీసి తాగినవారిలో అనేకమంది విష జలాల కారణంగా చనిపోతున్న పరిస్థితులు చూస్తున్నాం. దయచేసి ఆ విషయాలపై ప్రభుత్వం కొంచెం శ్రద్ధ పెట్టాలని నేను కోరుతున్నాను. ఎకలాజికల్ బ్యాలెన్స్‌కు సంబంధించి ఈ ప్రభుత్వం ఏమైనా శ్రద్ధ చూపిందా? వానదేవుడు దయతలిస్తే వర్షాలు వస్తాయి. వానదేవుడు దయతలచడానికి అవసరమైన ప్రాతిపదిక మీరెందుకు తయారుచేయలేదు? ఎకలాజికల్ బ్యాలెన్స్‌కు సంబంధించిన చర్యలు ఏమైనా చేపట్టారా? అడవులు అంతరిస్తున్నాయి. ఎంత విస్తీర్ణంలో అడవి తగ్గిపోతే అంతే విస్తీర్ణంలో తిరిగి అడవిని పెంచడానికి మనం ప్రణాళిక తయారుచేయాలి. అదే విధంగా విస్తీర్ణాన్నిబట్టి, జనాభానుబట్టి అవసరమైన విస్తీర్ణంలో అడవి ఉండేలా ప్రణాళిక తయారుచేసుకోవాలి. కానీ ఆ విషయంలో అన్ని విధాలా నిర్లక్ష్యం చేస్తున్నారు. అటవీశాఖలోని అనేకమంది ఉన్నతాధికారులతో మాట్లాడినపుడు వారు చెప్పేవారు. అడవులు లేకపోవడం, చెట్లు, పచ్చదనం లేకపోవడంతో ప్రకృతి ఎలా అనుకూలంగా ఉంటుంది? వర్షాలు ఎలా వస్తాయో ఆలోచన చేయాలి.

వ్యవసాయ రంగానికి ఈవేళ చేసిన కేటాయింపులు చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఈ రంగం పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుంది. పెద్దలు రోశయ్యగారు ఈ సంవత్సరానికి బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. ఈ దేశంలో నూటికి డెబ్బై శాతం వ్యవసాయ రంగంమీద ఆధారపడి జీవిస్తుంటే ఆ రంగంలో వృద్ధి రేటు కేవలం 3.5 శాతం మాత్రమే ఉంటే ఈ దేశం ముందుకు ఎలా వెళుతుంది? ఈ సభలోని ప్రతి ఒక్కరూ గ్రామాలనుంచి వచ్చామని, రైతు కుటుంబాలనుంచి వచ్చామని, రైతుల ఆకలి బాధలు తెలుసని చెబుతున్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు తెలుసు కానీ ఆచరణలో మాత్రం చేసింది శూన్యం . రైతు మూగజీవి మరియు వెన్నెముక లేని రైతు. రైతు దేశానికే వెన్నెముక కానీ రైతుకు మాత్రం వెన్నెముక లేదు. వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ చూస్తే ఏమనిపిస్తుందంటే వారికి ఎలాగూ వెన్నెముక లేదు కాబట్టి నిర్లక్ష్యంతో ఆవిధంగా తక్కువ కేటాయింపులు

చేస్తున్నట్లు తెలుస్తుంది. దాని ఫలితమే రాష్ట్రంలో కరవు పరిస్థితి నెలకొని ఉందని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. ఇప్పటికి కూడా ఈ సంవత్సరం బడ్జెట్ పూర్తిగా ఆమోదం పొందలేదు కాబట్టి వ్యవసాయ రంగానికి అవసరమైన అదనపు బడ్జెట్‌ను కేటాయించేందుకు శ్రద్ధ చూపాలని ఆర్థిక మంత్రి రోశయ్యగారిని కోరుతున్నాను.

అధిక ధరలను నియంత్రించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు మాట్లాడుతూ ఇక్కడనుంచి బియ్యం ఇతర రాష్ట్రాలకు స్మగుల్ అవుతున్నదంటే అక్కడ రేట్లు ఎక్కువ ఉండబట్టే కదా, మన రాష్ట్రంలో రేట్లు తక్కువ ఉండబట్టే కదా అని అంటున్నారు. అదంతా తన ఘన కార్యంగా ముఖ్యమంత్రిగారు సెలవిచ్చారు. మన రాష్ట్రంనుంచి ఏ బియ్యం స్మగుల్ అవుతున్నాయి ఎక్కడికి వెళుతున్నాయో ఆలోచించండి. 2500 కోట్ల రూపాయల బియ్యం కుంభకోణం జరిగిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంనుంచి ఎక్కువ బియ్యం ఇతర రాష్ట్రాలకు దొంగ రవాణా అవుతుందని ఔట్‌లుక్ పత్రికలో వచ్చింది. రెండు రూపాయల కిలో బియ్యాన్నే ఈ విధంగా రాష్ట్రంనుంచి తరలిస్తున్నందున, ఈ విషయంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో బియ్యం ధర నలభై రూపాయలండీ! మన రాష్ట్రంలో లక్షా ఇరవై వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయితే మన రాష్ట్ర అవసరాలకు అరవై లక్షల మెట్రిక్ టన్నులు అవసరమయితే మన రాష్ట్రంలోనే బియ్యం ధర నలభై రూపాయలకు కొనుక్కునే దుస్థితి ఈ రాష్ట్ర ప్రజానీకానికి ఎందుకు వచ్చిందని మీకు మీరు సద్విమర్శ చేసుకోవాలని కోరుతున్నాను.

అంతే కాకుండా ఈవేళ మన మిత్రులు చెప్పారు. నల్లబజారుకు తరలిస్తున్నవారి మీద విరుచుకపడుతున్నాం, అవినీతిపరులను, అక్రమార్కులను పట్టుకుంటామని చెబుతున్నారు. ఎవరిని పట్టుకుంటారు, ఎవరిమీద కేసులు పెడుతున్నారు? ఇప్పటివరకు ఎంతమంది మీద కేసులు పెట్టారో చెప్పండి? ఎంతమందికి శిక్షలు వేయించారో చెప్పండి? ఎవరిమీద కేసులు పెడుతున్నారంటే – సీపీఐ, సీపీఐ(యం) పార్టీలు అయిన కమ్యూనిస్టు పార్టీలకు చెందినవారిమీద మాత్రమే కేసులు పెడుతున్నారు. అక్రమంగా నిల్వచేసిన గోదాములలో ఉన్న సరుకును వెలికి తీయడానికి వెళ్లినవారిమీద కేసులు పెడతారు. మా పార్టీ నాయకులు నారాయణగారి మీద కేసులు మాత్రం పెడతారు. స్పీకర్ గారూ, మీ జిల్లాలోని మదనపల్లెలో గోడౌన్లలో అక్రమంగా దాచిన నిల్వలను వెలికితీయడానికి ప్రయత్నం చేస్తే పోలీసులు, వ్యాపారస్తులు మా వాళ్లమీద దాడిచేశారు. పట్టువిడవక ప్రయత్నించి మరుసటి రోజు అక్రమ నిల్వలను పట్టిస్తే అక్రమంగా దాచినవారిమీద కాకుండా మాపార్టీ వాళ్ల మీద కేసులు పెట్టారు. ఈ పద్ధతుల్లో అధిక ధరలను మీరెలా నియంత్రిస్తారో చెప్పండి.

ఈ రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని సవినయంగా మనవిచేస్తున్నాను. చంద్రబాబు నాయుడు కాలంలో రూ.5.25 పైసలు చేస్తే ఆయనమీద దుమ్మెత్తి పోశారు. మీరు చేసింది ఎంత? కేజీకి రెండు రూపాయలు అంటే తెలియని ప్రజలు చాలా సంతోషపడుతున్నారు. లెక్కల్లోకి రండి. కేజీ బియ్యం మీద.......

మిస్టర్ స్పీకర్ : సాంబశివరావుగారూ, తొందరగా ముగించండి. సమయం అయిపోతున్నది. తొందరగా ముగించండి.

మ.12.50

శ్రీ కె.సాంబశివరావు : రెండు నిమిషాల్లో ముగిస్తాను సార్. కేజీ బియ్యం పైన.......

(అంతరాయం)

ఎత్తేయండి. మేము కోరేదేమంటే బిచ్చగాళ్లలాగా చేయవద్దు. రెండు రూపాయలకి కేజీ బియ్యం మీరు తీసివేసినా పరవాలేదు. ప్రతి పేద రైతుకు రెండున్నర ఎకరాల భూమి ఇవ్వండి. రెండున్నర ఎకరాల భూమి పంపిణీ చేయండి. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడతారు. వాళ్లను బిచ్చగాళ్ల మాదిరిగా చేసి మీరిచ్చేది ఎంతయ్యా అంటే, 20 కేజీల బియ్యం ఇస్తే రు.65 మాత్రమే వాళ్లకు మిగులుతుంది. ఇంతకు ముందు కేజీ బియ్యం రు.5.25 కిస్తే, ఇప్పుడు మీరు కేజీ బియ్యం రెండు రూపాయలకిస్తున్నారు. అంటే కేజీ బియ్యానికి రు.3.25 మాత్రమే వాళ్లకు మిగులుతుంది. 20 కేజీల వలన రు.65 మాత్రమే వాళ్లకు నెలకు మిగులుతున్నది. అంటే ఇంకొక వైపు కందిపప్పు కేజీ కొంటే అక్కడే రు.100 అయిపోతుంది. అందువలన మీరు మొత్తం ఇస్తున్నది 20 కేజీల బియ్యం, కేజీ పంచదార....

(అధికార పక్షం నుంచి అంతరాయం)

MR.SPEAKER : Let him give his opinion. Please have constraint.

శ్రీ కె.సాంబశివరావు : ఒక కేజీ పామోలిన్ ఆయిల్, అర కేజీ కందిపప్పు, మూడు లీటర్ల కిరోసిన్ ఈ మొత్తం కలిపినా రు.200 ల కంటే ఎక్కువ బెనిఫిట్ రాదు ఆ రైతుకి. అందువలన మీరు గానీ, ఇంకొకరు గానీ జనాలను మోసం చేయడానికి ప్రయత్నం చేయవద్దు అని నేను సవినయంగా మనవి చేస్తున్నాను. అందువల్ల ఈ సిస్టమ్ వద్దని నేను అనను. కానీ ఈ సిస్టమ్‌తో పాటు వాళ్లు బ్రతకడానికి వాళ్ల సొంత కాళ్ల మీద వాళ్లు బ్రతకడానికి అవసరమైన ప్రాతిపదికను ఏర్పాటు చేయమని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా దయచేసి పోలికలు పెట్టుకోకండి. పోలికలు పెట్టుకొని ఇంకా..... ఇవాళ మీరు ప్రతిపక్షంలో లేరు. మీరు అధికార పక్షంలో ఉన్నారు. అధికార పక్షంలో మీరు ఉన్నారు కాబట్టి మేము తెలుగుదేశం వారిని అడగం, లేకపోతే ఇంకొకర్ని అడగం. మాకు అవసరం లేదు. పరిపాలన చేయడానికి ఉన్నది మీరు. మిమ్మల్నే మేము అడుగుతాం. అంటే స్పీకర్ గారి ద్వారా ప్రభుత్వాన్ని మేము అడుగుతాం. బాధ్యత మీదే. తప్పైనా మీరే కాచుకోవాలి. ఒప్పైనా మీరే కాచుకోవాలి. అందువల్ల ఆ తప్పుల్ని ఎత్తిచూపించాల్సిన బాధ్యత మాపైన ఉంది. కాబట్టి మీరు దయచేసి అది అర్థం చేసుకోవాలి. అట్లా కాకుండా ఎప్పుడో దిగిపోయినటువంటి వాళ్లు, ఇంకా వాళ్లపైనే మీరు రాళ్లేద్దామనుకుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. అది ఆలోచన చేయవలసిందిగా కోరుతూ నేను ఒక్క నిమిషంలో ముగిస్తాను.

సలహాలకు సంబంధించి రెండు, మూడు అంశాలను మీ దృష్టికి తీసుకు వస్తాను. నేను మీ ద్వారా కోరేదేమంటే ధరల నియంత్రణకు, మార్కెట్ నియంత్రణకు ఇటువంటి ఆపత్కాలం వచ్చినప్పుడు ఖచ్చితంగా సహాయక నిధి ఒకటి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఖచ్చితంగా వెయ్యి కోట్లతో అటువంటి నిధిని ఏర్పాటు చేస్తే బ్యాలెన్స్ చేయడానికి ఉపయోగపడుతుందని మీ ద్వారా కోరుతున్నాను. అదే విధంగా అందరికీ పెన్షన్లు ఉన్నాయి. కానీ రైతుకు పెన్షన్ లేదు. అతనికి 60 ఏళ్లు నిండితే ఇంక పనికి రాడు. వ్యవసాయ కూలీకి పెన్షన్ లేదు. ఈ కరువు పేరుతో రు.100, రు.200 ల పెన్షన్ కాదు. ఖచ్చితంగా రు.1000/- అయినా సరే పెన్షన్ సౌకర్యం కల్పించండి. అప్పుడు అతను ప్రశాంతంగా గుండె మీద చెయ్యి వేసుకొని బ్రతుకుతాడని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. వీటితోబాటు ఇన్సూరెన్సు పథకం.... అందరికీ ఇన్సూరెన్సులు ఉన్నాయి. మోటర్ సైకిల్‌కి యాక్సిడెంట్ అయితే ఇన్సూరెన్సు ఉంటుంది. ట్రాక్టర్‌కి ఇన్సూరెన్సు ఉంటుంది. లేకపోతే చిన్న వ్యాపారస్తుడికి

ఏదన్నా దెబ్బ తింటే ఇన్సూరెన్సు ఉంటుంది. కానీ రైతుకు ఇన్సూరెన్సు ఇస్తున్నామంటున్నారు. నాకు తెలిసి ఇన్సూరెన్సు ఎక్కడ ఇస్తున్నారో, నాకు ఎక్కడా కనపడలేదు. దానికన్నింటికి లెక్కలు చెబుతున్నారు. అన్ని ఇస్తున్నట్లే ఇస్తున్నారు, పేపరు మీద చూపెడుతున్నారు. టివిల్లో చెబుతున్నారు. ఆచరణలోకి వచ్చేసరికి ఒక్క రైతుకు కూడా నేను ఛాలెంజ్ చేస్తున్నాను.... మా నియోజక వర్గానికి రండి పంటలు దెబ్బతిన్న వాళ్లకు ఎక్కడా ఇన్సూరెన్సు ఇవ్వలేదు. దేని లెక్కలు దానికి చెబుతున్నారు.

మిస్టర్ స్పీకర్ : కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ కె.సాంబశివరరావు : అన్ని పంటలను ఇన్సూరెన్సు కవరేజీలోకి తీసుకొని రండి. రైతు ప్రశాంతతో, భద్రతతో నిద్ర పోవాలి. చీడపురుగు వచ్చినా లేకపోతే ఇంకొకటి వచ్చినా వాడి పంట పోయి ఎప్పుడు ఏ నిమిషంలో ఆత్మహత్య చేసుకునే పరిస్థితి లేకుండా అతివృష్టైనా, అనావృష్టైనా ఏదైనా సరే నన్ను ప్రభుత్వం కాపాడుతుంది, నా పొలాలకు పంట దెబ్బతిన్నా సరే నేను ధైర్యంగా పండించవచ్చు, పంట దెబ్బతింటే ఇన్సూరెన్సు కవరేజీ ఉంటుందనే ఒక భద్రతా భావాన్ని తీసుకు రండి. ఆ విధంగా ఉన్నప్పుడు మీది నిజమైన రైతుల ప్రభుత్వం అవుతుంది తప్పితే రు.35 కోట్లు కేటాయించి ఈ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాం అంటున్నారు. రు.35 కోట్లంటే ఒక చిన్న బడ్డీ కొట్టు నడుపుకునే వాడు కూడా రు.35 కోట్లతో వ్యాపారం నడుపుతున్నాడు. దయచేసి ఇటువంటివి వద్దు. రైతులు పంటలు దెబ్బతిని ఉన్నారు. రెండు, మూడు సార్లు విత్తనాలు మార్చిడి చేశారు. ఎకరాకు రు.5 వేల నుంచి ..... ఆ పంట పోయిన శాతాన్ని పరిగణనలోకి తీసుకొని రు.5 వేల నుంచి రు.10 వేల వరకు ఎకరాకు నష్ట పరిహారం ఇవ్వండి. అది మేము కోరుకునేది. రాజశేఖర్‌రెడ్డి గారు లేచి కరువుపై ప్రకటన చేస్తున్నారంటే మేము ఎంతో ఉత్సుకతతో చూశాం, ఆయన ఎటువంటి ప్రకటన చేస్తారోనని. తీరా ఆ ప్రకటన అంతా చదివితే రు.35 కోట్లు సహాయం చేస్తున్నామన్నారు. దయచేసి అటువంటి చర్యలు వద్దు. పూర్తి స్థాయి సహాయాన్ని అందించాలని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ కె.రోశయ్య : సార్, సాంబశివరావు గారు చాలా మంచి ప్రసంగం చేశారు. మెయిడెన్ స్పీచ్ కాబట్టి వారిని అభినందిస్తున్నాను. వారు మరి ఆలోచించి చెప్పారో లేకపోతే ఆవేశంలో చెప్పారో నాకు తెలియదు. ''ఈ రాష్ట్రంలో ఆఫ్టాల్ రు.35 కోట్లంటే ఎంత? ఒక కిళ్లీ బంకు నడుపుకునే వారు కూడా రు.35 కోట్లతో వ్యాపారం చేస్తున్నారు'' వారు అన్నమాట. మరొకసారి ఈ రాష్ట్రం అంతా బిచ్చగాళ్లను చేస్తున్నారు అంటున్నారు. ఈ రెంటికీ పోలిక లేదు సాంబశివరావు గారూ ఆలోచించండి. మరొక మాట ఆవేశపూరితంగా మీరు (శ్రీ సాంబశివరావు) ఏమి చెబుతున్నారంటే ఏదో పోయిన ప్రభుత్వాన్ని మేము అంటున్నాం అని అంటున్నారు. మీకు రామాయణం, భారతాల మీద నమ్మకముండదు. దేవతల మీద మీకు నమ్మకముండదు. అది వ్యక్తిగతమైన విషయం. నాకు విశ్వాసముంటే అది నా వ్యక్తిగతం. ప్రభుత్వ పక్షాన కాదు.

(శ్రీ కె.సాంబశివరావు చే అంతరాయం)

మీకు తెలియక పోతే చెబుతున్నాను, దయచేసి వినండి. దేవస్థానాలు ఇండిపెండెంట్‌గా వారికున్న విశ్వాసాలను బట్టి వారు చేస్తున్నారు. తిరుపతి దేవస్థానం చేసింది. అది రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం కాదు. కేవలం పార్టిసిపేట్ చేసినంత మాత్రాన ప్రభుత్వ కార్యక్రమం కాదు. నేను ఒక మాట మనవి చేస్తున్నాను. రామాయణం మీద వారికి నమ్మకమున్నా లేకపోయినా రామాయణ ప్రస్తావన వస్తే రాముడి విషయం వస్తుంది, ఆటోమేటిక్‌గా రావణాసురుడి విషయం వస్తుందా? రాదా? లేదా మహాభారతం విషయానికొస్తే దాంట్లో కూడా వస్తాయా?

రావా? కనుక మీ సంగతి  కూడా మేమేమీ మరచి పోవడం లేదు.  ఒక 15, 20 జెండాలు ప్రతి ఆఫీసులో పెట్టుకుంటారు.  ఎక్కడన్నా ల్యాండులోకి వెళ్లి గుచ్చటం,అక్కడ నుంచి మళ్లా తీసుకుని చంకలో పెట్టుకోవటం ఇంకొక చోట గుచ్చటం.  మీ పని మాత్రం తక్కువా?

MR.SPEAKER  :  We will go into subject Sir.  Venkata Ramana Reddy garu,

శ్రీ జి.వెంకట రమణారెడ్డి  (భూపాలపల్లె):  అధ్యక్షా, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితిపైన చర్చలో పాల్గొనే అవకాశాన్ని కలుగ చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, సభాధ్యక్షులుగా మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈనాడు 5 సంవత్సరాల మంచి వర్షాలతో, మంచి పంటలతో రైతులంతా సుభిక్షంగా, సంతోషంగా ఉండే పరిస్దితి నుంచి మళ్లీ కొత్తగా ఏర్పడ్డ ఈ ప్రభుత్వం ఈసారి వర్షాలు ఆలస్యం కావడం, రైతుల యొక్క మనోధైర్యం దెబ్బతినే పరిస్థితుల్లో మొన్న మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు రాష్ట్రంలో జరుగుతున్న వర్షాభావ పరిస్దితుల పైన ప్రకటన చేసిన విషయం మనందరికీ తెలిసినదే.  ఈరోజు ప్రతిపక్ష పార్టీలు, మిగతా వాళ్లు మాట్లాడుతున్నారు. కరువు వస్తే ఈ ప్రభుత్వానికేదో సంతోషం ఉన్నట్లుగా, ఈ వర్షాభావ పరిస్దితుల పట్ల ఈ ప్రభుత్వానికేమీ తెలియనట్లుగా ఉందనే మాటలు మాట్లాడుతున్నారు.  ఇవి చాలా దురదృష్టకరమైన మాటలు. ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి గారు, తిరిగి ముఖ్యమంత్రి అయిన తరువాత వారి ముఖంలో ఆందోళన కనబడుతున్నది. ఈ రాష్ట్ర ప్రజలు నన్ను ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి గెలిపించారే, ఈరోజు వర్షాభావ పరిస్దితులు ఈ రకంగా ఉన్నాయి. ఎట్లా వీరిని ఆదుకోవాలి అనే ఆందోళన వారి (ముఖ్యమంత్రి) ముఖంలో కనపడుతున్నది.

(గౌరవ ఉపసభాపతి అధ్యక్ష స్ధానంలో ఉన్నారు)

కానీ  ఈరోజు ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు కేవలం రాజకీయం చేయాలి, పత్రికల్లో వచ్చే ప్రకటనలు చదివి వినిపించాలనే భావమే కనపడుతున్నది.  ఇంతకు ముందే మా గౌరవ సభ్యులు మాట్లాడుతూ చెప్పారు.  ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈరాష్ట్రంలో ఉండే రైతులను గానీ, ఈ రాష్ట్రంలో ఉన్న పేద ప్రజలను గానీ, రైతు కూలీలను గానీ ఆదుకోవడానికి ఎలాంటి బృహత్తర కార్యక్రమాలు తీసుకొని ముందుకు పోతుందో వారి మాటల్లో ప్రస్తావించడం జరిగింది.

మ. 1.00

ఈ రోజు రాష్ట్ర శాసన సభలో మాట్లాడినటువంటి సభ్యులు, రాష్ట్రంలో వుండేటువంటి రైతుల మనోభావాలు దెబ్బతినకూడదు.  ఎందుకంటే నేను కూడా ఒక రైతు కుటుంబం నుంచి వచ్చాను.  ఎందుకంటే, నేను గతంలో చిన్నగా వున్నప్పుడు, ఆ రోజు కూడా వర్షాభావ పరిస్థితులు వున్నపుడు  ఆ రోజు మా తండ్రితో మాట్లాడుతూ చెప్పినాడు ఆయన.  బిడ్డా! కరువు అనేది సంవత్సర కాలం వుంటుంది.  కాలం అనేది ఒక్క రోజు తలుచుకుంటే, తప్పకుండా వర్షాలు పడతాయి, మనము రైతు కుటుంబం నుంచి వచ్చాము,  గుండె ధైర్యంతో, మనో ధైర్యంతో వుండాలనేటువంటి మాట, వారు చెప్పినటువంటి మాట ఈ రోజుకు కూడా గుర్తు వుంది. కాబట్టి ఈ రోజు మనము రైతులకు మనోధైర్యం ఇవ్వాలంటే, ఇక్కడ కూర్చుని రైతుల ఆత్మహత్యల గురించి పదేపదే మాట్లాడితే, రైతుల యొక్క మనోధైర్యం పెరగదనే మాట చెబుతున్నాను.  దానికి కారణాలు..  ఈ రోజు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చిన తరువాత వ్యవసాయం ఎందుకు అనుకున్న రైతు, వ్యవసాయం చేస్తే ఏం మిగులుతుంది అనేటువంటి పరిస్థితి ఆనాడు ఆ పాలకుల (ప్రధాన ప్రతిపక్షం)  పరిపాలనలో వుంటే, ఈనాడు

ఈ ముఖ్యమంత్రి వచ్చిన తరువాత రైతులు చేసే వ్యవసాయం ఒక పండుగ అనేటువంటి పరిస్థితులలో ఈ 5 సంవత్సరాల నుంచి తీసుకువచ్చారా, లేదా అనేది మీరొక్కసారి ఆలోచన చేయాలి. ఈ రోజు రైతులు తీసుకున్నటువంటి విద్యుత్‌ను ఫ్రీగా ఇవ్వడంతోబాటు, ఈ రోజు రైతులు పండించేటువంటి ప్రత్తి పంట గురించి ఇంతకుముందు గౌరవ సభ్యులు మాట్లాడుతూ చెప్పారు. వరంగల్‌లో వుండే ప్రత్తి రైతుల యొక్క దీనగాథల గురించి మాట్లాడారు. ఈ రోజు ఈ 5 సంవత్సరాల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా, మా వరంగల్ జిల్లాలో వుండే ప్రత్తి రైతు ఆత్మస్థైర్యం పెరిగింది, మనోధైర్యం పెరిగింది. ఎందుకంటే, గతంలో కేంద్ర ప్రభుత్వం 3 వేల రూపాయలు ప్రత్తి ధర ప్రకటిస్తే, ఏ యొక్క ప్రత్తి రైతు కూడా కొనుగోలు చేయలేకపోతే, భారత ప్రభుత్వంతో మాట్లాడి ఈ రోజు రు. 3 వేలు ప్రత్తి ధరను చేయించడమే కాకుండా, సిసిఐ అనే కాటన్ కార్పోరేషన్ సంస్థ ద్వారా రు. 3 వేలు పెట్టి ఈ రోజు ప్రత్తిని కొనుగోలు చేయించడం ద్వారా రైతుల పక్షాన ఈ ప్రభుత్వం ఈ రకంగా పనిచేస్తుందనే విశ్వాసాన్ని కలిగించిందనే మాట తెలియజేస్తున్నాను. కాబట్టి ఏ ప్రభుత్వానికైనా, ఏ ముఖ్యమంత్రికైనా విశ్వాసం ఈనాడు రైతుల పట్ల వుందంటే, 50 ఏళ్ల చరిత్రలో రైతుల ముఖ్యమంత్రి అంటే అది కేవలం సాక్షాత్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారికే ఆ ఘనత దక్కిందనే మాట చెబుతున్నాను.

(ఈ సందర్భంలో తెలుగుదేశం పార్టీకి చెందిన గౌ. సభ్యురాలు శ్రీమతి సీతా దయాకర్ రెడ్డి గారు – అంటే యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎవరూ లేరా? అని అన్నారు)

అమ్మా! సీతక్కా, నువ్వు తరువాత మాట్లాడమ్మా. నేను మాట్లాడుతున్నప్పుడు ఎందుకమ్మా?... ఈ రకంగా రైతుల యొక్క మనోధైర్యాన్ని పెంచే విధంగా ఈ ముఖ్యమంత్రి గారు అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. అదేవిధంగా దురదృష్టవశాత్తూ వచ్చిన కరువును ఎదుర్కోవడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేకమైనటువంటి ప్రత్యామ్నాయాలను ఆలోచన చేస్తున్నది. అయినప్పటికీ కూడా అందరూ అంటున్నారు. కరువు ప్రకటనలు చేయడంలో అలస్యం చేస్తున్నదీ ప్రభుత్వం అనే మాట. ప్రభుత్వం ఈ రోజు రాష్ట్ర శాసన సభ జరుగుతూ వుంటే, ఎక్కడో కూర్చుని ప్రకటన చేయడం కాదు. నిజంగా సమగ్రంగా చర్చించి, రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి గౌరవ సభ్యుల నుంచి సూచనలు, సలహాలు తీసుకుని వాటిని స్వచ్ఛందంగా అమలుచేయాలనే ఉద్దేశంతో సాక్షాత్తూ, మన రెవిన్యూ మంత్రి గారు లేచి – అయ్యా! ప్రతిపక్ష పార్టీలూ.. కేవలం సమస్యలు ఎత్తిచూపెట్టడం కాదు, సలహాలు చెప్పండి – అనంటే కూడా దాని మీద కూడా చమత్కారంగా మాట్లాడే పరిస్థితుల్లో వాళ్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వానికి ఈ యొక్క రైతులను గాని, రైతు కూలీలను గాని, గ్రామీణ ప్రాంతాల్లో వుండే ప్రజలను గాని ఆదుకోవడానికి ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని అమలుచేయడంలో భారత దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేదు, ఒక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు తప్పకుండా చేస్తారనే విశ్వాసం ఈ రోజు ప్రజలకున్నది. ఎందుకంటే, 5 సంవత్సరాల క్రితం వారు ప్రతిపక్ష నాయకులుగా ఆనాడు పాదయాత్ర చేసినప్పుడు, పాదయాత్రలో వారి దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలించే వారు తీసుకున్న కార్యక్రమాలు అని చెప్పడంలో ఏ మాత్రం కూడా అనుమానం లేదు. అవి వృద్ధాప్య ఫించన్లు కావచ్చు, ఉపాధి హామీ కార్యక్రమం కావచ్చు. అదేవిధంగా రైతులకు సంబంధించిన రుణాల మాఫీ కావచ్చు. ఈ రకంగా రైతులకు రు. 5 వేల ప్రోత్సాహకాలు కావచ్చు. ఈ రకంగా అనేక కార్యక్రమాలు వారు 5 సంవత్సరాల్లో తీసుకున్న విషయం ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ కూడా తెలుసు. మరి ఆ పరిస్థితుల్లో ఈ రోజు దురదృష్టవశాత్తూ వర్షాభావం చాలా తక్కువగా వుంది. దానికి ప్రభుత్వం అనేకమైన ప్రత్యామ్నాయాలను ఆలోచనచేయాల్సిన అవసరం ఏర్పడిందనే మాట కూడా మీ ద్వారా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ

పరిస్థితి వచ్చినప్పుడు గతంలో ఒకసారి వ్యవసాయ శాఖామంత్రిగా వున్నటువంటి రఘువీరారెడ్డి గారు రైతుల యొక్క బోరు బావుల ద్వారా వరి పంట పండించడం తక్కువ చేయండి అని, అది చేస్తే ఇబ్బంది వుంటుందనే మాట చెబితే, వారు ఏ ఉద్దేశంతో మాట్లాడారో గాని మరి ఆనాడు దాన్ని కూడా రాజకీయం చేసారు. నేను ఈనాడు ఈ సభలో కోరుతున్నాను. ఈ రోజు చాలీచాలని వర్షాభావంతో వరి పంటవేయడం కంటే, ఈ రోజు వున్నటువంటి నీరుతో కమర్షియల్ క్రాప్స్, లేకపోతే తక్కువ నీటితో వ్యవసాయం వచ్చే పంటలపైనో ప్రధానమైనటువంటి దృష్టి పెట్టవలసిన అవసరాన్ని ఈ సభ ద్వారా మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఎందుకంటే, భూమిలో వున్నటువంటి నీళ్లు తక్కువగా వుండడం వల్ల, వున్నటువంటి నీళ్లతో ఒక 20 గుంటలో, 10 గుంటలో వరి పండించడం కంటే, ఇక్కడ వుండేటువంటి ప్రత్తో, ప్రొద్దు తిరుగుడో, మొక్కజొన్నో, పల్లీ కాయలో పండించినట్లైతే, రైతులకు ఒక రకమైనటువంటి మంచి ఆదాయం వచ్చే పరిస్థితి వుంటుంది కాబట్టి ఆ దిశలో ఈ యొక్క శాసనసభ ద్వారానే ఒక సమగ్రమైన చట్టాన్నో, లేకపోతే ఒక మ్యాన్‌డేటరీగా చేయవలసిన అవసరం వుంది. ఎందుకంటే ఇది గనుక చేయలేకపోయినట్లైతే, భవిష్యత్తులో తక్కువ నీటితో, కరెంటు కూడా ఎక్కువ వాడే అవకాశం వుంటుంది కాబట్టి, దీనిపైన కూడా ఆలోచన చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

అదేవిధంగా ఈరోజు మంచినీటికి కూడా చాలా తీవ్రమైన పరిస్థితి రాబోయే రోజులో వస్తుంది. కాబట్టి దానిపైన కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది అనేటువంటిదాంట్లో ఏ మాత్రం కూడా అనుమానం లేదు. ఎందుకంటే, ఇప్పటికే వారు చేసిన ప్రసంగంలో, వారి యొక్క స్పీచ్‌లో చెప్పారు. వారు చెప్పినప్పుడు, తక్కువగా ఇచ్చారనే మాట కాకుండా, ఎక్కడ అవసరమైతే అక్కడ గ్రామాల్లో గతంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం క్రొత్తగా ఏర్పడ్డప్పుడు, ఆనాడు వుండే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ఆనాడు గ్రామాల్లో శాసన సభ్యులందరూ, ప్రజా ప్రతినిధులందరూ కూడా పోయి ప్రజాపథం అనే కార్యక్రమం ఏ రకంగానైతే ఏర్పాటు చేసి, గ్రామాల్లోకి పోయి ప్రజలకు వుండే ఇబ్బందులను తెలుసుకొని, వారికి ఏ రకంగా మనోధైర్యాన్ని ఇచ్చారో, ఈ రకంగా కరువు వుండే పరిస్థితుల్లో కూడా అధికారులతో ప్రజాప్రతినిధులు అందరూ కూడా వెళ్లి ఆ గ్రామాల్లో వుండి, ఆ గ్రామాల్లో వుండే ప్రజలకు కూడా ఒక మనోధైర్యం ఇచ్చి, ప్రభుత్వం మీ వెనకాల వుందనే విశ్వాసాన్ని కల్పించాల్సినటువంటి అవసరం కూడ వుందనే మాట కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అందుకు, అక్కడ మంచినీటి సమస్య రావచ్చు, ఇంకా ఏమైనా సమస్యలు వుంటే, అక్కడికక్కడ వారికి ఒక రకమైనటువంటి ఇంప్రెషన్ క్రియేట్ చేయడానికి, ఈ రకంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగపడే విధంగా పోవాలనే మాట తెలియజేస్తూ ఈ రకంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వుండేటువంటి పరిస్థితుల్లో, పశువుల యొక్క పరిస్థితులపైన ఈ రోజు అందరూ కూడా మాట్లాడారు. ఈ రోజు వాస్తవాలు మాట్లాడుకోవాల్సిన పరిస్థితి వుంది. ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత, కేంద్రంలో వున్నటువంటి ప్రభుత్వం వచ్చిన తరువాత జాతీయ ఉపాధిహామీ పథకం రావడం, గ్రామాల్లో వ్యవసాయకూలీల కొరత ఏర్పడటం, తద్వారా గతంలో వరిని మనుషులు కోసే పరిస్థితి వుండేది. కానీ ఈనాడు మొత్తం మెషినరీ ద్వారా వరిని కోయడం వల్ల, మరి ఈ రోజు పశుగ్రాసాన్ని మనమందరం కూడా నిలువ చేయలేని పరిస్థితి ఏర్పడింది కాబట్టి, ఈ పశుగ్రాసాన్ని ఏర్పాటు చేయడం కొరకు, పశువులను రక్షించుకోవడం కొరకు ఈ రోజు గ్రామాల్లో వుండే చెరువులను అక్కడ మొక్కజొన్న వేయడమా, లేక పశుగ్రాసాన్ని పెంచుకోవడం కొరకు ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఎందుకంటే, మనుషులకైతే ఎక్కడ నుంచైనా తెచ్చి తినవచ్చు, కానీ, ఒకవేళ తీవ్రమైన ఇదే పరిస్థితి వచ్చినట్లైతే, పశుగ్రాసానికి కూడా ప్రత్యామ్నాయాల వైపు చూడాల్సిన పరిస్థితిని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, మరి అదేవిధంగా ఈ యొక్క కరువు వచ్చినపుడు, అనేకమైన సమస్యలు వస్తాయి. అందులో ఆరోగ్యం కూడా వస్తుంది కాబట్టి, ఇప్పటికే ఈ రాష్ట్ర ప్రభుత్వం

ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధతో ముందుకుపోతోంది. అయినప్పటికీ కూడా ఇంకేమైనా వచ్చేటువంటి వాటిపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టి, తప్పకుండా ప్రభుత్వం ఆలోచనతో ముందుకుపోతుందనే విశ్వాసం ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి గారు కల్పించారు.

ఈ రకంగా చెప్పుకుంటూ పోతే, ఈ రాష్ట్ర ప్రభుత్వం అనేకమైనటువంటి కరువు నివారణ చర్యలు తీసుకుంటునప్పటికీ ఇంకా తీసుకోవాల్సిన పరిస్థితి వున్నది. అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కటే మాట చెబుతున్నది.. ఎన్ఆర్ఇజిపి అనే మాట చెబుతున్నదని ప్రతిపక్ష పార్టీలు చెబుతున్నాయి. నేను ఒకటే అంటున్నాను. అయ్యా! మీరు వున్నప్పుడు కూడా కరువు వచ్చింది. మీరున్నప్పుడు కరువు వస్తే, కేంద్ర ప్రభుత్వం బియ్యమిస్తే, బియ్యం ఎటుపోయాయో, దానికి ప్రజలు, ఇప్పటికే గతంలోనే సాక్ష్యాలు కూడా వున్నాయి. పట్టుకున్నటువంటి బియ్యాన్ని ఒడ్లు చేసిన చరిత్ర మీ దగ్గరుంది. కానీ ఈ రోజు ఎన్ఆర్ఇజిపి ద్వారా కూలీ చేసిన కూలీలందరికీ కూడా డైరెక్ట్‌గా పోస్టాఫీసుల్లో డబ్బు వచ్చే విధంగా ఈ యొక్క చట్టం పనిచేస్తున్నది. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా చేయనటువంటి పారదర్శకతతో ఈ రోజు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నది. ఈ రోజు 100 రోజుల పని నుంచి, 150 రోజులు చేసారు. ఒకవేళ ఇదే పరిస్థితి వున్నట్లైతే, ఇంకా ఎక్కువగా చేసి రైతు కూలీలందరినీ కూడా ఆదుకోవాలి, రైతులు ఎవరైతే పనిచేస్తారో, వాళ్లందరినీ కూడా ఆదుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడే విధంగా చట్టం ద్వారా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరమున్నది. అదేవిధంగా, మరి ముఖ్యంగా మనం వాడుకునే నిత్యావసర వస్తువుల్లో ప్రధానమైనటువంటివి కూరగాయలు. ఈరోజు కూరగాయల పట్ల కూడా ప్రత్యేకమైన శ్రద్ధతో చూడాల్సిన పరిస్థితి వుంది. ఎందుకంటే నేను గ్రామీణ ప్రాంతంలో ఒక రైతు కుటుంబం నుంచి వచ్చిన వాణ్ణి. నేను చిన్నగా వున్నప్పుడు ఎవరింటికైనా పోతే, ఒక ఇంటికి పోయినప్పుడు, ఒక డాక్టరో లేకపోతే ఒక వెటర్నరీ డాక్టరో మా ఇంటికి వస్తే, వాళ్లకు కావాల్సినటువంటి కూరగాయలన్నీ కూడా ఆనాడు ఒక రైతు ఇచ్చే పరిస్థితి వుండేది. ఈ రోజు మారుతున్న వ్యవసాయ పరిస్థితుల వల్ల, ఏ ఒక్క రైతు కూడా కూరగాయలు పండించే పరిస్థితి లేదు. ఈ రోజు ముఖ్యంగా కరువు వచ్చింది కాబట్టి, గ్రామాల్లో వుండే రైతులకు గాని, ప్రజలందరికీ కూడా అవసరమయ్యే కూరగాయలను అక్కడే పండించుకోవడానికి ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైనటువంటి ఆలోచనతో ముందుకువస్తే, నిత్యావసర వస్తువుల్లో ప్రధానమైనటువంటి కూరగాయలు తప్పకుండా దొరుకుతాయి.

మ.1.10

అదేవిధంగా పాల విషయంలో ప్రత్యేకంగా ఇంతకుముందే మాట్లాడినప్పుడు, మరి ఈ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత, ప్రధానంగా అందరికి కూడా ఇచ్చినటువంటిది, ముఖ్యంగా కరువు జిల్లా అయినటువంటి వరంగల్‌గాని, తెలంగాణా జిల్లాల్లో అందరికీ కూడా పశువులను ఇస్తున్నది. ఆ రకంగా పాల ఉత్పత్తికి కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా మరి పాలకు ప్రత్యేకంగా దృష్టి పెట్టవలసిన పరిస్థితి ఉందని చెప్పి ఈ సందర్భంగా గుర్తుచేస్తూ, ఈరోజు ఎవరు ఏమి మాట్లాడినా రాజకీయం చేయకుండా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజలను ఆదుకోడం కొరకు అందరికీ ప్రత్యేకంగా ఒక సమగ్రమైన విధానంతోపోతే తప్ప, రైతుల యొక్క మనోధైర్యం పెరగదు, ప్రజల యొక్క విశ్వాసం పెరగదు ఆ రకంగా అందరం కూడా ఆలోచన చేయాలి. వాళ్లు 9 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు, వారి యొక్క పాలనలో కరువు వస్తే, ఆ రోజు ఏలాంటిది పట్టించుకోని వారు,

ఈరోజు కేవలం రాజకీయం చేయడానికి ఈ రకమైన మాటలు మాట్లాడుతుంటే, చాలా ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి ఇప్పటికైనా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు గాని మిగతా రాజకీయ పార్టీలు గాని, ఒక నిర్మాణాత్మకమైన సూచనలు చేయాలి, చేయడానికి ముందుకు రావాలి. ఈ రకంగా ముందుకు వచ్చినప్పుడు తప్పకుండా ముందుకు పోతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే బోర్ల విషయంలో గాని, మంచినీటి విషయంలోగాని, ఇవన్నీ కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అదేవిధంగా రైతులకు ఇచ్చే 7 గంటల కరెంటు విషయంలో ఒక ప్రక్క బోరు నీళ్లు లేవంటున్నారు, మరోప్రక్క కరెంటు చాలండంలేదంటున్నారు. కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే 500 మెగావాట్ల కరెంటును కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. అవసరమైతే, ఇంకొక 500 మెగావాట్లైనా తీసుకొని ఎక్కడ కరెంటు అవసరముంటే అక్కడ తప్పకుండా ఇచ్చి రైతులను గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలందరినీ ఆదుకోవడానికి తప్పకుండా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందనే విశ్వాసం, నమ్మకం ముఖ్యమంత్రిగారి పరిపాలన ద్వారా కలిగింది. ఈ ముఖ్యమంత్రిగారు ఏదైనా తీసుకుంటే, ఇంతకుముందు మా సీపీఐ శాసన సభ్యులు మాట్లాడినప్పుడు చెప్పారు. ఈ ముఖ్యమంత్రికి నమ్మకం ఎక్కువ, ఛాలెంజ్ ఎక్కువ అనే మాటను వారు మాట్లాడారు. ఇది వాస్తమైన విషయం. డా.వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారి ప్రభుత్వంలో ఏదైన ఒక కార్యక్రమం తీసుకుంటే, ఎప్పుడు కూడా మధ్యలో అపుచేయలేదు. తప్పకుండా ఈ కరువు నివారణ చర్యలు తీసుకోవడంలో, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు సఫలీకృతమవుతారు. ఇప్పటికే మాట్లాడిన పెద్దలు చెప్పారు. కరువు గురించి ప్రకటన చేయకపోవడం, కేంద్ర ప్రభుత్వం దగ్గర అడగకపోవడం మంచిది కాదు. మీకు సహకారంగా మేం వస్తాం అడుగుదాం, అనే మాటలు చెప్పారు. ఈరోజు ఎవరి సహకారం అవసరం లేకుండానే మన ముఖ్యమంత్రిగారు కేంద్రంతో మాట్లాడి ఒప్పించి, తెప్పించి, నిధులు తీసుకురావడంలో తప్పకుండా సఫలీ కృతమవుతారనే విశ్వాసం ప్రజలకున్నది, ఈ సభకున్నదనే మాటను తెలియజేస్తూ, తప్పకుండా కరువు నివారణ చర్యలతోబాటు ఇప్పటికి కూడా నమ్మకమున్నది, మరి భగవంతుని పట్ల వారికి నమ్మకం ఉన్నదో లేదోగాని (గౌరవ ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి) మాకు పూర్తిగా భగవంతుని పట్ల విశ్వాసం ఉంది. ఎందుకంటే, ఆగస్టు 15 తరువాత కూడా చరిత్ర చెబుతున్న విషయం చాలా సందర్భాలలో చెరువులు, కుంటలు నిండి, సమృద్ధిగా వర్షంవచ్చే పరిస్థితి ఉన్నది. ఇప్పటికి కూడా నమ్మకమున్నది వర్షాలు వస్తాయనే భావన కూడా మాకున్నది. రాజశేఖరరెడ్డిగారి 5 ఏళ్ల పాలనలో వర్షాలు పడ్డాయి. ఈ సంవత్సరం కూడా పడతాయనే నమ్మకం మాకుండటంలో తప్పులేదు. ఒకవేళ ఇదే పరిస్థితి ఉంటే, ఏమేమి ప్రత్యామ్నాయం చేయాల్నో, ఆయొక్క ఆలోచనలన్ని చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్నారు. రఘువీరా రెడ్డిగారి దగ్గరకు ఒకరోజు నేను పోయినప్పుడు వారు చెప్పారు, ఒక వేళ ఇదే పరిస్థితి వస్తే, ప్రత్యామ్నాయం, గింజల గురించి ఏపీ సీడ్ కార్పోరేషన్ వాళ్లతో ఆ రోజు మాట్లాడుతున్నారు. అంటే ప్రభుత్వానికి దూరదృష్టి ఉంది. ఈ యొక్క కరువు నివారణ చర్యలు ఆలోచించి ఎదుర్కోవడానికి అన్ని చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ముందుకు పోతుంది. కాబట్టి, దీని పైన ఎక్కువగా మాట్లాడకుండా మరి ప్రతిపక్ష పార్టీలు మిగతా అన్ని రాజకీయ పార్టీలు ఇక్కడ ఉండే పెద్దలందరూ కూడా రైతుల పక్షాన ప్రజల పక్షాన ఒక నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తూ, మరి ప్రభుత్వం చేసేటువంటి కార్యక్రమాలలో అందరం కూడా ముందుకు పోదాం. అదేవిధంగా, ఉపాధి హామీ చట్టం గురించి నేను మరోకసారి చెబుతున్నాను, ఇలాంటి కరువు వచ్చినపుడు గ్రామాలలో ఉండేవారికి తప్పకుండా శ్రీరామ రక్ష అవుతుందని, శ్రీరామ రక్ష కావాలని, అందరినీ అదుకోడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడాలని కోరుకుంటూ, నాకు ఈ అవకాశమిచ్చిన మీకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తూ, ముగిస్తున్నాను. జైహింద్..

MR.DEPUTY SPEAKER: From the BJP Kishan reddy garu.

(అంతరాయం)

(ఈ సందర్భంలో గౌరవ సభ్యులు శ్రీ నాగం జనార్ధన్ రెడ్డిగారు తమకు మాట్లాడటానికి అవకాశం కల్పించాల్సిందిగా గౌరవ ఉప-సభాపతిగారిని అభ్యర్థించసాగారు)

గౌరవ సభాపతిగారు చెప్పారు, కిషన్ రెడ్డిగారు మాట్లాడటం అయిపోయిన తరువాత మీకు అవకాశమిస్తాను. (ప్రధాన ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి)

శ్రీ జి.కిషన్ రెడ్డి : అధ్యక్షా, రాష్ట్రంలో కరువు చాలా తీవ్రంగా ఉంది, సభ్యుల యొక్క ఆందోళన ఇప్పటికే స్పష్టంగా ప్రభుత్వం అర్థంచేసుకుంది. ముఖ్యమంత్రిగారు కూడా నిన్న ఇచ్చిన నోట్‌లో కరువు చాలా తీవ్రంగా ఉన్నట్లు, సుమారు 1,028 మండల్లాల్లో అత్యల్ప వర్షపాతంగాని, లోటు వర్షపాతంగాని ఉన్నట్లు ప్రభుత్వమే లెక్కలు చెప్పడం జరిగింది. ఈరోజు కరువు కోరల్లో రైతులు విలవిలలాడుతున్నారు. వర్షాభావ పరిస్థితి పట్ల రైతులు కంటతడిపెడుతున్నారు. చినుకు జాడ లేక పోవడంతో అన్నదాతల పరిస్థితి చాలా అగమ్యగోచరంగా ఉంది. పశుగ్రాసం కొరతతో పశువులు కబేళాలకు సిద్దమవుతున్నాయి. కరువు అనగానే గుర్తుకు వచ్చే అనంతపురం, మహబూబ్‌నగర్ మిగతా రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లోని కరువు ప్రాంతాలలో పంటలతో కళకళలాడాల్సిన భూములు ఈరోజు బీడులుబారి ఎండకుఎండుతున్నాయి. కరెంటు సమస్య షరామామూలుగా ఉంది. కరెంటు ఎప్పుడు వస్తుంతో, ఎప్పుడు పోతుందో మరి మంత్రిగారికి కూడా తెలియదు. అదేవిధంగా ట్రాక్టర్లకు వాడే డీజిల్ గత 5 సంవత్సరాలలో తొమ్మిది సార్లు పెరగడంతో రైతులు ఎంతో నష్టపోతున్నారు. దీని కారణంగా వ్యవసాయ ఖర్చులు కూడా బాగా పెరిగిపోయాయి. నిత్యావసర వస్తువుల ధరలు చాలా పెరిగాయి. ఈ కరువు పరిస్థితి నేపథ్యంలో గ్రామీణ ప్రజల బ్రతుకులు చాలా అన్యాయంగా తయారైనాయి. అనేక ప్రాంతాలలో త్రాగటానికి నీళ్లు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగం చతికిల పడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ గిడ్డంగులలో ఆహార ధాన్యాలు చాలా ఉన్నాయి, ఉన్నప్పటికీ కూడా ప్రజలకు సకాలంలో ఆహార ధాన్యాలు అందడం లేదు. ఆహార ధాన్యాల పంపిణీ క్రమబద్దంగా జరగని కారణంగా వాటి ధరలు విపరీతంగా పెరిగేటువంటి పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కరువు పరిస్థితి ఏర్పడినప్పుడు తక్షణం సహాయం అందించడానికి ప్రభుత్వం తనకుతానుగా రూపొందించిన నిర్దేశాలు, మార్గదర్శకాలను అమలు చేయడం లేదు. కరువు ప్రాంతంగా ప్రకటిస్తే రైతులకు బ్యాంకులు రుణాలివ్వరనే కారణంతో వాయిదా వేస్తున్నట్లు ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రిగారు ఈమధ్య ఒక ప్రకటన చేశారు. నేను ఈ మధ్య జిల్లాల్లో తిరగడం లేదు, జిల్లాల్లో తిరిగినట్లయితే, అక్కడి ప్రజలు తమ బాధలు చెప్పుకుంటారు, నేను వారికి హామీలు ఇవ్వాల్సి వస్తుంది, హామీలు ఇవ్వాలంటే నిధులు కావాలి, నిధులు లేవు కనుక నేను హామీలు ఇవ్వకూడదు, నేను జిల్లాల్లో పర్యటించడం లేదని ముఖ్యమంత్రిగారు చెప్పారు. వారి మాటనే ఈరోజు మంత్రులు, అధికారులు పాటిస్తున్నట్లు ఉన్నది. ఈ రోజు కరువు ప్రాంతాల గురించి అనేక రకాలుగా పత్రికలలో గత 15 రోజులుగా వస్తున్నా, మనం స్వయంగా చూస్తున్నా, రైతుల నుంచి వార్తలు వస్తున్నా కూడా మంత్రులుగాని, ముఖ్యమంత్రిగారు గాని కరువు ప్రాంతాలలో పర్యటించకపోవడం చాలా అన్యాయం ముఖ్యమంత్రిగారి మాట జవ దాటకుండా, ఎవరూ కూడా మనం జిల్లాలకు పోవద్దూ.. జిల్లాలకు పోయినట్లయితే, ప్రజలు వారి బాధలు చెబుతారు, బాధలు చెప్పినట్లయితే నిధులివ్వాల్సి వస్తుంది. కాబట్టి, మేం పర్యటించడం లేదనే విధంగా ముఖ్యమంత్రిగారి ప్రకటనను, అధికారులు కూడా వేదంగా తీసుకున్నట్లు కనిపిస్తుంది. ఈరోజు గ్రామీణ ప్రజలు, రైతులు, రైతు కూలీలు కరువు కాటుకు గురై అల్లాడుతుంటే, ఆత్మహత్యలు చేసుకుంటుంటే, పటలు ఎండిపోయి, పశుగ్రాసం కొరతతో పశువులు కబేళాలకు వెళుతూ ఉంటే, మరి మీరు భయపడకండీ.. మీ కష్టాల్లో

మేం ఉన్నాం. మీరు ఆత్మహత్యలు చేసుకోకూడదు, మేం ఉన్నాం.. మిమ్ములను అన్ని రకాలుగా ఆదుకుంటాం, సహాయసహకారాలు అందిస్తామని చెప్పాల్సిన ప్రభుత్వం, ఈరోజు హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆపరేషన్ ఆకర్షణ పేరుతోటి క్రొత్త పథకాలు ప్రారంభించి అమలు చేస్తున్నారు తప్ప, నేను ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారిని కోరేది ఒక్కటే, ఆపరేషన్ ఆకర్షణను కొంత తాత్కాలికంగా వాయిదా వేసి, ప్రక్కన పెట్టి, ఆపరేషన్ కరువును తీసుకోవాల్సిందిగా నేను ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారికి మనవిచేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి ఒక స్పష్టమైన ఆదేశాలిచ్చి, ప్రతి అధికారి కూడ కరువు ప్రాంతాలలో పర్యటించేవిధంగా ప్రజలను ఆదుకునే విధంగా, వారికి అన్ని రకాలుగా ధైర్యం చెప్పేవిధంగా ప్రభుత్వ యంత్రాంగమంతా ముందుకు కదలాల్సిందిగా నేను తమరి ద్వారా కోరుతున్నాను. మంత్రులు, శాసనసభ్యులు అందరం కూడా కరువు ప్రాంతాలలో పర్యిటించవలసిన అవసరముంది.

అధ్యక్షా, తమరి ద్వారా ఒక చూచన చెబుతున్నాను. రేపటి నుంచి మూడు రోజులపాటు మన అసెంబ్లీకి సెలవులున్నాయి. అవసరమైతే, ఇంకో నాలుగైదు రోజులు కంటిన్యూ చేయండి, ఒక వారం రోజులపాటు ముఖ్యమంత్రిగారితో సహా, మంత్రులు, అధికారులు గ్రామీణ ప్రాంతాలలో పర్యటిద్దాం. ముఖ్యమంత్రిగారు కరువు ప్రాంతానికి సంబంధించిన సహాయక చర్యల గురించి నిన్న ఇచ్చిన నోట్‌లో స్పష్టంగా లేదు. మరింతగా కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఈ వారం రోజుల పాటు అన్ని జిల్లాలు, అన్ని మండలాలు పర్యిటించి, ఈ కరువు ప్రాంతాలకు సంబంధించిన రైతులకు మనం కాన్ఫిడెన్స్‌ను క్రియేట్ చేసేందుకు, ప్రభుత్వ యంత్రాంగమంతటినీ కూడా ఈ కరువు ప్రాంతాలలో నిమగ్నం అయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా నేను ప్రభుత్వానికి సూచన చేస్తున్నాను.
మ.1.20

అదే విధంగా ఈరోజు పశుగ్రాసం కొరత వలన పశువుల ప్రాణాలు పోతున్నాయి. ఇంతకు ముందు సభ్యులు చెప్పినట్లుగా ఏ నేషనల్ హైవే, స్టేట్ హైవే చూసినా పశువులు వందలు వేలుగా తరలి వెళ్లే పరిస్థితులు మనకు కనబడుతున్నాయి. ఎవరైనా అనుమానం వచ్చి ఇన్ని వందలు, వేల పశువులను ఎక్కడికి తరలిస్తున్నారని అడిగితే అవి కళేబాలకు పోతున్నాయని, ఎక్స్‌పోర్టు చేస్తున్నామని చెబుతున్నారు. వ్యవసాయం చేయాల్సిన పశువులు కరవు కారణంగా వాటిని చంపి, మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేసే పరిస్థితి ఏర్పడిందనే విషయాన్ని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను.

గతంలో కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇదే రాష్ట్రానికి అనేక రకాలైన రైళ్లను సమకూర్చి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద యెత్తున పశు గ్రాసాన్ని మన రాష్ట్రానికి తీసుకొచ్చిన విషయాన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. నేను ముఖ్యమంత్రి గారిని కోరేదేమంటే కరవు గురించి ఇంత వరకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించకపోతే మీరు జిల్లాలను ఎప్పుడు కరవు ప్రాంతాలుగా ప్రకటిస్తారు, ఎప్పుడు పశుగ్రాసాన్ని తెప్పిస్తారు, ఎప్పుడు ట్రైన్‌లను అడుగుతారు, ఎప్పుడు లారీల ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు పశుగ్రాసాన్ని అందజేస్తారనేది ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరమున్నది.

సర్వ రోగ నివారిణి(NREP) కార్యక్రమం గురించి నాలుగు వందల ఎనభై కోట్ల రూపాయలు వస్తుందన్నారు, ఇదేం కొత్త కార్యక్రమం కాదు. గతంలో కూడా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో పనికి ఆహారం పథకం క్రింద సుమారు అయిదు వేల కోట్ల రూపాయలకు పైగా బియ్యాన్ని పేద

ప్రజలకు అత్యవసర పరిస్థితులలో గ్రామీణ ప్రాంతాలలో కరవు వచ్చినప్పుడు వాడుకోవడానికి రాష్ట్రానికి వాజ్‌పేయ్ గారి ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని కూడా నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. గతంలో ఎన్నడూ లేనటువంటి విధానం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇచ్చినట్లు, ఈరోజు NREP చూపించి ప్రభుత్వం మొత్తానికే చేతులెత్తేసే విధంగా ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం బాధ్య నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక బడ్జెట్ నుండి ఏ మాత్రం నిధులు కేటాయించకుండా కరవు ప్రాంతాన్ని, అక్కడి ప్రజలను వారి మానాన వాళ్లను వదిలేసే విధంగా ఆలోచన చేస్తోంది. కాబట్టి, సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నాను.

గడచిన ఒక్క జూలై నెలలోనే రాష్ట్రంలో అరవై మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను సభ్యులు ఎవరూ వెళ్లి పరామర్శించిన సందర్భాలు లేవు. గ్రామీణ ప్రాంతాలను పర్యటించినట్లైతే రైతులలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది, వాళ్లలో నమ్మకాన్ని పెంపొందించాలి. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేకపోతున్నది. రైతుల ఆత్మహత్యలు ఒప్పుకుంటే వారికి ఎక్కడ కరవు ప్యాకేజీని ప్రకటించాల్సి వస్తుందోనని ప్రభుత్వం భావిస్తోంది. మరి గత ప్రభుత్వం కరవు పరిస్థితి ఏర్పడినప్పుడు ప్యాకేజీని ప్రకటించింది.

నేను ఆర్థిక మంత్రి గారిని అడిగేదేమిటంటే ఇప్పటికి కూడా ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ప్యాకేజీ అమలులో ఉన్నదా లేదా అనేది చెప్పాల్సిందిగా కోరుతున్నాను. టోల్ ఫ్రీ నంబరు చెప్పారు, ఆ టోల్‌ఫ్రీ నంబరు ప్రస్తుతం ఉందా? ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు టోల్‌ఫ్రీ, నోఫ్రీగా మారిపోయింది. మీరు టోల్‌ఫ్రీ పెట్టకపోయినా పరవాలేదు, రైతులు వాళ్ల స్వంత డబ్బుతోనే ఫోన్ చేస్తారు. కనీసం ఆ యొక్క రైతుల గోడు వినడం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదా అని కూడా మీ ద్వారా అడుగుతున్నాను.

జిల్లాల వారీగా సూచనలు చెబుతున్నాను. జిల్లాల వారీగా రైతు కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్న వివరాలు చెప్పండి. వారికి ఏ రకమైన సహాయం అందజేశారో చెప్పండి. ప్రభుత్వానికి నేను మరో సూచనను చేస్తున్నాను. అన్ని మండలాలలో, జిల్లాలలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలను కూడా కరవు సహాయ కార్యక్రమంలో భాగస్వాములను చేయండి. ఇది ఒక్క కాంగ్రెస్ పార్టీకో లేక మరొక పార్టీకో సంబంధించింది కాదు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే రైతులందరు కరవుతో అల్లాడిపోతున్నారు కాబట్టి అన్ని రాజకీయ పార్టీలను భాగస్వాములను చేసి కరవు సహాయ చర్యలో మీరు ముందుకెళ్లాలని కోరుతున్నాను.

రాష్ట్రంలో కరవు వచ్చినప్పుడు అన్ని రాజకీయ పార్టీల వారితో జిల్లావారి, మండలాల వారీ సమావేశాలు ఏర్పాటు చేసి అందరి సహాయ సహకారాలు తీసుకున్న ఉదాహరణలు మన రాష్ట్రంలో ఉన్నాయి కాబట్టి ఈరోజు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందుకు రావలసిందిగా అన్ని రాజకీయ పార్టీలను ఈ యొక్క కరవు సహాయక చర్యలలో భాగస్వాములను చేయాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో రైతులతోపాటు చేతి వృత్తుల వారైన చేనేత, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, విశ్వ బ్రాహ్మణ, నాయి బ్రాహ్మణ, యాదవ, కురుమ, మేరు, రజకులు అన్ని వర్గాలకు చెందిన కుల వృ

త్తులవారు ప్రభుత్వం నుండి ఏ రకమైన సహాయం లేక అల్లాడుతున్నారు. వృత్తులు కోల్పోయే దుస్థితి ఏర్పడుతోంది కనుక ప్రభుత్వం వీరి గురించి ఆలోచన చేయాలని కోరుతున్నాను.

అదే విధంగా కేంద్ర ప్రభుత్వం వారు మన రాష్ట్రంలోని కరవు పరిస్థితిని అంచనా వేయడానికి బృందాన్ని పంపించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బృందాన్ని రాష్ట్రాలకు పంపించడానికి ఇంతవరకు కూడా ఏ ఒక్క రాష్ట్రం నుంచైనా కరవు నివేదికలు రాలేదని వారు చెబుతున్నారు. అందువల్ల రెవెన్యూ మినిస్టర్ గారు వెంటనే స్పందించి కరవు జిల్లాలను, మండలాలను గుర్తించి ముఖ్యమంత్రి గారు చెప్పిన జిల్లాలను, మండలాలను వెంటనే ప్రకటించి, దానికి సంబంధించిన నివేదికను కేంద్రానికి పంపించి కేంద్ర బృందాలను రాష్ట్రానికి తీసుకురండి. గతంలో మాదిరిగా కేంద్ర బృందాలు రాష్ట్రానికి వచ్చి తూతూ మంత్రంగా చేస్తే లాభం లేదు. కేంద్రం నుంచి వచ్చిన బృందాలు ఖచ్చితంగా నివేదికలు తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే వరకు కూడా మీరు కేంద్ర ప్రభుత్వంతో ప్రయత్నం చేయండి.

మా పార్టీ జాతీయ ప్రతిపక్ష పార్టీగా ఢిల్లీలో ఉన్నాం కనుక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజల హక్కులు కాపాడటం కోసం భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వంతో పోరాటానికి, రాష్ట్ర ప్రభుత్వానికి సహాయం అందించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. గతంలో తుఫానులు వచ్చినా, వరదలు వచ్చినా, కరవు వచ్చినా ఏ విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం మనకు అన్యాయం చేసింది. కాబట్టి ఈసారి కూడా మీకు ఏ రకమైన సహాయ సహకారాలు కావాలన్నా ప్రతి పక్ష పార్టీలన్నీ కూడా సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. అందువల్ల దయచేసి మీరు వెంటనే ప్రభుత్వం కరవు ప్రాంతాలుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టుకోవడంలో ముందుకు రావలసిందిగా కోరుతున్నాను.

అదే విధంగా 1972 సంవత్సరంలో గంగా పరీవాహక ప్రాంతమైన డెల్టా కూడా ఎండిపోయిన పరిస్థితులు తెలుసు. ఈరోజు గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలు కూడా బీడువారిన పరిస్థితులు ఉన్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల మాదిరిగా సశ్య శ్యామలంగా ఉండే జిల్లాలు కూడా ప్రస్తుతం బీడు వారిన పరిస్థితులు మనకు కనిపిస్తున్నాయి. అందుకే భారతీయ జనతా పార్టీ తరఫున, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నదుల అనుసంధానం విషయంలో చెప్పడం జరిగింది. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నదుల అనుసంధానం ద్వారా ఈ రకమైన కరవు వచ్చినప్పుడు, కరవు రక్కసి రైతాంగాన్ని గ్రామీణ ప్రాంతాలను పట్టి పీడించినప్పుడు నదుల అనుసంధానం శాశ్వత పరిష్కారమవుతుంది. కాబట్టి ఆ విషయం కూడా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి ఆలోచన చేయాల్సిన అవసరమున్నదని నేను కోరుతున్నాను.

అదే విధంగా రైతులకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను వాటిని వెంటనే తిరిగి చెల్లించే అవసరం లేకుండా వాయిదా వేయాలి. పంటలు కోల్పోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నది. నీటి తీరువా, విద్యుత్ చార్జీలు, బ్యాంకుల బకాయిలు, ఇతరత్రా ప్రభుత్వ బకాయిలు కూడా వాయిదా వేయాలని నేను కోరుతున్నాను. అదే విధంగా పట్టాలవారీ అప్పులను రీ-షెడ్యూల్ చేసి రైతులకు వెంటనే అప్పులు ఇవ్వాల్సిందిగా, విత్తనాలను కూడా రైతులకు సకాలంలో అందించాల్సిందిగా కోరుతున్నాను.

అదే విధంగా, మంచి నీటి సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించాలి. అవసరమైన ప్రాంతాలలో మంచి నీటి సమస్యకు కొత్త బోర్లు వేయడం కొరకు కూడా నిధులు కేటాయించాలని నేను కోరుతున్నాను.

అనేక జిల్లాలలో పాత బోర్లను మరమ్మత్తులు చేయడం లేదు. కాబట్టి కరవును దృష్టిలో పెట్టుకొని జిల్లాలలో పాడైపోయిన పాత బోర్లను వెంటనే మరమ్మత్తులు చేయాలని కోరుతున్నాను.

ఈరోజు మాకు వచ్చిన సమాచారం ప్రకారం సుమారు నలభై మునిసిపాలిటీలలో కొన్ని వేలాది గ్రామాలలో మంచి నీటి ఎద్దడి ఏర్పడింది. అవసరమైన ప్రాంతాలలో ట్యాంకర్లను పెట్టైనా సరే గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రజలకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ఇక పశుగ్రాసం విషయంలో మన రాష్ట్రంలో కరవు నెలకొన్నందున కనీసం పక్క రాష్ట్రాలనుంచైనా ఎక్కడైతే పశుగ్రాసం సరిపడా లభించే అవకాశం ఉన్నదో అక్కడి నుంచి పశువులకు పశుగ్రాసాన్ని తీసుకొచ్చేందుకు వెంటనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని జోక్యం చేసుకోమని చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి రైళ్లను కూడా తీసుకొని పక్క రాష్ట్రాల నుంచి పశుగ్రాసాన్ని మన రాష్ట్రానికి తీసుకొచ్చి కళేబాలకు వెళ్లే పశువులను కాపాడాల్సిన అవసరముందని మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదే విధంగా వ్యవసాయధారులు వారి వ్యవసాయం కోసం ఉపయోగించే ట్రాక్టర్‌కు వాడే డీజిల్ మీద కూడా ప్రభుత్వం పన్ను వేసింది. కాబట్టి ప్రభుత్వం కరవును దృష్టిలో పెట్టుకొని తాత్కాలికంగానైనా డీజిల్‌పైన సబ్సిడీనిచ్చి వ్యవసాయదారులను ఆదుకోవాల్సిందిగా మీద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదే విధంగా పేదలకు కావలసిన వైద్య సహాయం కాని పోషకాహారం కాని ఏవైతే కరవు మార్గదర్శకాలున్నాయో వాటిల్లో ఈ విషయాలన్నీ ఉన్నాయి. కాబట్టి ఖచ్చితంగా పేదలకు పోషకాహారం, వైద్య సదుపాయం అందుబాటులోకి తీసుకురావలసిన అవసరమున్నది. ముఖ్యమంత్రి గారు, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు సభలో ఉన్నారు కనుక వారిని నేను కోరేదేమంటే మనందరం కలిసి రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం కరవు సహాయక చర్యల విషయంలో శాసనసభలో వివరంగా చర్చిస్తున్నాం. ఈరోజు ఈ యొక్క చర్చను ముగించి దీనికి సంబంధించి ముఖ్యమంత్రి గారు ఒక స్పష్టమైన విధానాన్ని పునరాలోచన చేసి, కరవు తీవ్రతను ఈరోజు కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులతో సహా అందరూ కరవు విషయం మీద చర్చించారు కాబట్టి కరవు తీవ్రతను గుర్తించి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కరవు ప్రాంతాలుగా ప్రకటించి రేపటి నుంచి కరవు సహాయక చర్యలు వెంటనే చేపట్టడం కోసం ప్రభుత్వ యంత్రాగం, మంత్రులు ముందుకు కదలాలి, ముఖ్యమంత్రి గారు కూడా కనీసం వారం రోజులపాటు శాసన సభ సమావేశాలను వాయిదా వేసైనా జిల్లాలలో పర్యటించాల్సిన అవసరమున్నది. ఎందుకంటే మూడు రోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నాయి కనుక ఇంకొక నాలుగు రోజులు కలుపుకొని జిల్లాలలో పర్యటనను కొనసాగించినట్లైతే కనీసం మొత్తం ఏడు రోజులు జిల్లాలలో పర్యటించి కరవు ప్రాంతాలలో ఉన్న రైతుల కోసం, వారిని ఆదుకోవడం కోసం ముందుకొచ్చినట్లైతే రైతుల ప్రాణాలు బ్రతికించవచ్చు, వారి ఆత్మహత్యలను ఆపవచ్చును. పశుగ్రాసం కోసం కళేబాలకు తరళిస్తున్న పశువులను చంపకుండా ఆపడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి ఆపరేషన్ ఆకర్ష్‌ను వాయిదా వేసి, ఆపరేషన్ కరవు అని తీసుకుందాం, అన్ని పార్టీల వాళ్లం ఒక్కటే అజెండాను పెట్టుకుందాం, ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రక్కకు పెట్టి ఆపరేషన్ కరవుగా మనందరం తీసుకొని ముందుకెళ్దామని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను.

MR.DY.SPEAKER:- The House is adjourned to meet again at 08.30 A.M on Monday, the 17th August, 2009.

(The House then adjourned at 1.31 P.M to meet again at 08.30 A.M on Monday, the 17th August, 2009)